# కథ: తెలంగాణ ప్రాంతీయతావాదం

*పరిశోధన*

**భూక్య తిరుపతి**

*పర్యవేక్షణ*

**పిల్లలమర్రి రాములు**

*హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టాకోసం*
*సమర్పించిన సిద్ధాంత వ్యాసం*

**జూన్ 2009**

# KATHA: TELANGAANA PRAANTHEEYATHAA VAADAM

*Doctor of Philosophy in Telugu*

*Research by*

**Bhukya Thirupathi**

*Supervisor*

**Pillalamarri Ramulu**

***Thesis submitted to the University of Hyderabad for the Award of Ph.D. Degree In Telugu***

**June 2009**

# *CERTIFICATE*

**BHUKYA THIRUPATHI**
Ph.D. Student
Department of Telugu
University of Hyderabad
Hyderabad

This is to certify that I Bhukya Thirupati have carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D. ordinances of the University of Hyderabad. My topic of the Ph.D. Programme is *"kata: telaṅgāṇa prāntīytāvādam"*

I declare to the best of my knowledge that no part of this thesis was earlier submitted for the awarded of Ph.D. Degree of any University.

**PILLALAMARRI RAMULU**
Research Supervisor

**BHUKYA THIRUPATHI**
05HTPH12

**Dean**
School of Humanities

**Bethavolu Ramabrahmam**
Head, Department of Telugu

# నమస్సుమనస్సులు

నన్ను ఒక ఉన్నతస్థానంలో చూడాలని బ్రతికినన్నాళ్ళు తపించి నా లక్ష్యసాధనను చూడకుండానే లోకాన్ని వదిలివెళ్ళిన నా తండ్రి భూక్య సోమ్లాకు ప్రతి అక్షరం సమర్పణం.

నా చదువులో తన కలలన్నీ పండించుకున్న మా అమ్మ లక్ష్మికి...

స్వంత తమ్ముడిలా ఆదరించి తగిన సలహాలిచ్చి నా పరిశోధన పూర్తవడానికి చేయూతనిచ్చిన పర్యవేక్షకులు గురువులు డా॥ పిల్లలమర్రి రాములు గారికి...

పరిశోధనకు అవకాశం కల్పించిన తెలుగు శాఖాధ్యక్షులు బేతవోలు రామబ్రహ్మంగారికి, నాకు ఎమ్.ఏ., ఎమ్.ఫిల్‌లో పాఠాలు బోధించిన అధ్యాపకులు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య, ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు, ఆచార్య పరిమి రామనరసింహం, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి, ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు, ఆచార్య తుమ్మల రామకృష్ణ, డా॥ జి. అరుణకుమారి, ఆచార్య చేకూరి రామారావు, ఆచార్య ఎస్.వి.రామారావుగార్లకు...

ఇతర అధ్యాపకులు డా॥ రామకృష్ణశాస్త్రి, డా॥ దార్ల వెంకటేశ్వరరావు, డా॥ పమ్మిపవన్ కుమార్, డా॥ డి. విజయలక్ష్మి, డా॥ భుజంగరెడ్డి, డా॥ అద్దంకి శ్రీనివాస్‌గార్లకు..,

నన్ను ఒక అధ్యాపకుడిగా నిలిపిన ద్రావిడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారికి, ప్రస్తుత ఉపాధ్యక్షులు ఆచార్య కడప రమణయ్యగారికి, పూర్వ కులసచివులు ఆచార్య పుత్తా రాజశేఖరరెడ్డిగారికి, ప్రస్తుత కులసచివులు శ్రీ కె.రామదాస్‌గారికి...

పరిశోధనా వ్యాస రూపరచనకు సహకరించిన ఆత్మీయురాలు డా॥ జె.వి. సత్యవాణిగారికి

పరిశోధనలో తగు సలహాలందించిన సహృదయులు డా॥ బి. తిరుపతిరావు, డా॥సీతారామ్, డా॥ జిలుకర శ్రీనివాస్, పగడాల గోపాల కృష్ణగార్లకు...

ద్రావిడ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ సహ అధ్యాపకులు డా॥ బూదాటి వెంకటేశ్వర్లు, డా॥ శ్రీదేవి, డా॥ చిన్నరెడ్డయ్య, డా॥ ఎ.కె. వేణుగోపాలరెడ్డి, డా॥ పళనిగార్లకు...

నా మిత్రులు డా॥ కనకరత్నం, డా॥ పెంచలయ్య, హర్షవర్ధన్, డా॥ బాలగణపతి, డా॥ఎల్.కె.మల్లేశ్వరరావు, కిరణ్‌కుమార్ మరియు ఇతర ఆత్మీయ మిత్రులకు...

నా సహాధ్యాయులు వెంకట్రామయ్య, శిరీషలకు...

నా కుటుంబ సభ్యులు భూక్య దేవులా, హరి, కిషన్, చెల్లి, బావ, మేనల్లుడు ఇతర బంధువులకు...

భూక్య విజయ్‌కుమార్, భరత్, పసునూరి రవీంద్ర ఇతర మిత్రులు సీనియర్స్, జూనియర్స్, సబ్‌జూనియర్స్ అందరికి...

నా ప్రియతమ సహధర్మచారిణి శ్రీమతి కవితకు, నా కలల సాకారం నా కొడుకుకు

డి.టి.పి. చేసిన వెంకటస్వామిగారికి.

నాకు తోడ్పడిన అందరికీ....

నమస్సుమనస్సులతో

**భూక్య తిరుపతి**

# ముందుమాట

తెలంగాణ వాసిగా తెలంగాణ జీవితాన్ని మూడుపదుల వయస్సుదాక రుచి చూసిన నాకు నా భూమి మీద మమకారం ఉండటం సహజమే. ఆ కారణంగానే సిద్ధాంత వ్యాసానికి అంశాన్ని ఎన్నుకునేటప్పుడు మా ఆత్మీయ గురువు డా. పిల్లలమర్రి రాములుగారితో సంప్రదించి నా ఆసక్తిని వివరించినప్పుడు ఆనందంగా తెలంగాణ మీద అంశాన్ని ఎన్నుకోవడానికి సహకరించారు. ఆ సహకరణ ఫలంగానే ***కథ: తెలంగాణ ప్రాంతీయతావాదం*** అనే అంశం నిర్ణయమైంది. ఆ మేరకు నా పరిశోధన ప్రారంభమైంది.

ఎం.ఫిల్‌లో లఘుసిద్ధాంత వ్యాసానికి **లంబాడీ *భాషా సాహిత్యాల పై తెలుగు భాషా ప్రభావం*** ఎన్నుకున్నది నా మాతృభాషమీద ప్రేమతో ప్రస్తుతం సిద్ధాంత వ్యాసానికి అంశం ఎన్నుకున్న ప్రాంతీయాభిమానంతో చేస్తున్న ప్రయత్నం.

పరిశోధన సిద్ధాంత అంశాన్ని రాసే ప్రక్రియలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కో వలసి వచ్చింది. ప్రతి సందర్భంలోను వెన్ను తట్టి నన్ను ప్రోత్సహించి పరిశోధన సిద్ధాంత రూపకల్పనకు దారి చూపిస్తూనే నేను చేసిన తప్పులను సరిదిద్దిన మా గురువు పిల్లలమర్రి రాములుగారి సూచనల మేరకు ఈ సిద్ధాంత వ్యాసం రూపుదిద్దుకుంది. ఈ సిద్ధాంత వ్యాసం రూపకల్పనలో నాకు తగిన సలహాలను ఇచ్చిన వారు డా॥ జె.వి. సత్యవాణిగారు.

ఈ అంశంమీద నాకు ఆసక్తి కలిగినప్పుడు ఈ సిద్ధాంత వ్యాస విషయంలో నేను చేసిన ప్రయత్నాలలో మొదటిది విషయ సేకరణ. తెలంగాణ కథల మీద సిద్ధాంత వ్యాసమంటే అంత తేలికగా అనిపించలేదు. ఎందుకంటే ఇప్పటి దాకా వెలువడ్డ తెలంగాణ కథలు వేల సంఖ్యలో ఉన్నాయి. ***కథ: తెలంగాణ ప్రాంతీయతా వాదం*** అన్నప్పుడు ఏ కథను ఏ కథకుడ్ని తీసుకోవాలి? ఎవర్ని విడిచిపెట్టాలి అన్నది నాకు అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది. ఆ విషయంలోనే పైన సూచించిన వారి సలహాలు నాకు తోడ్పడ్డాయి. నేను పరిశీలించిన కథాసంపుటాలు విడిగాపేర్కొన్నాను. కాలాభావం పరిశోధనల నియమావళిని బట్టి నా పరిశోధనను ఈ సంపుటాలకు పరిమితం చేసుకున్నాను.

ఈ సిద్ధాంత వ్యాసం 6 అధ్యాయాలుగా విభజించబడింది. తొలి అధ్యాయం **సాహిత్య చరిత్ర-ఉద్యమం**లో సాహిత్యం ఉద్యమస్ఫూర్తి పొందే విధానం. ఉద్యమ లక్షణాలు, తెలుగు సాహిత్యంలో ఆరంభకాలం నుంచి నేటిదాక వచ్చిన వివిధ సాహిత్య ఉద్యమాల పరిచయం వైదిక మతవాదం, మార్గ-దేశి వాదం, భక్తిఉద్యమం, వాగ్గేయకారులు - సామాజిక చైతన్యం, (1) మధురభక్తి, (2) ఆధ్యాత్మికత, (3) భక్తితత్త్వం, (4) రాజనిరసన 'సంప్రదాయకవిత్వం - ప్రాంతీయత, శతక కర్తలు ప్రాంతీయత, స్థలమహాత్మ్యాలు ఆధునిక సాహిత్యంలో ఉద్యమాలు - నవ్యకవిత్వ లక్షణాలు, ఖండకావ్య ప్రక్రియ, ఆత్మాశ్రయ రీతి, వస్తునవ్యత, భావ నవ్యత, పద ప్రయోగం, ప్రక్రియా బాహుళ్యం, కవిత్వశాఖలు, భావ కవిత్వం, ప్రణయ కవిత్వం దేశభక్తి కవిత్వం, ప్రకృతి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, భక్తి కవిత్వం, స్మృతి కావ్యాలు, అభ్యుదయ కవిత్వం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం మొదలైనవి చోటు చేసుకున్నాయి.

రెండవ అధ్యాయంలో ***కథ-తెలంగాణ కథ***లో ప్రపంచ సాహిత్యంలో కథకున్న స్థానం, తెలుగు భాషలో కథ ప్రారంభ దశ, కథలోని పోకడలు, తెలంగాణ కథ, తొలితరం కథ విశ్లేషణ, తొలితరం కథ భాష, డిటెక్టివ్ కథ, వస్తువు, తొలి దళిత కథ, సంఘసంస్కరణ కథ ఉద్యమాల ప్రభావం, సాహిత్య సంస్థలు, మొదటి కథల సంపుటి - జాతీయోద్యమ కథ, సైన్సుకథ తెలంగాణ కథకులు మొదలైనవి చర్చించబడ్డాయి.

***కథ-తెలంగాణ రాజకీయోద్యమం*** మూడవ అధ్యాయంగా తీసుకోబడింది. ప్రాంతీయ ఉద్యమ స్ఫూర్తి కథను ఎలా ప్రభావితం చేసిందనేది ఇందులో ప్రధాన అంశం. తెలంగాణ పోరాటం, అప్పటి రాజకీయ పరిస్థితులు, మహాసభ, గ్రంథాల యోద్యమం, ఆంధ్ర జన కేంద్ర సంఘం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, విద్యార్థుల వందేమాతరం ఉద్యమం, రైతాంగ పోరాటం, భారతీయ స్వాతంత్ర్య పోరాటం, సాయుధ పోరాటం, తెలంగాణ విముక్తి. అందులోని వివిధ దశలు, తెలంగాణ పోరాట సాహిత్యం, పోరాట సాహిత్యంలో కథల పాత్ర, పోరాట కథల విభజన, విశ్లేషణ, నక్సలిజం, 1970 తరువాత తెలంగాణ కథ మొదలైనవన్నీ వివరించబడ్డాయి.

నాలుగవ అధ్యాయం ***తెలంగాణ కథ విభిన్నత - ప్రాంతీయవాద చిత్రణ***లో ప్రాంతీయత, లక్షణం, వివరణ, విభిన్నత, సుజాత పత్రిక - చలం కథ, ఆంధ్రకేసరి, స్థానికత, తెలంగాణ కథ - విశ్లేషణ, తెలంగాణ గ్రామీణ జీవితం, తెలంగాణ కథ ప్రాంతీయవాద లక్షణాలు, నిబద్ధత-నిమగ్నత, భాషా దృష్టి, సామెతలు, తెలంగాణ మాండలిక పదాలు, బూతులు - తిట్లు మోటు పదాలు, ప్రామాణికం, పొరపాట్లు, భావార్థకం, ఉచ్చారణలో మార్పు, శిల్పవైవిధ్యం, మొదలైన అంశాలు విశ్లేషించబడ్డాయి.

***తెలంగాణ కథాశిల్పం*** ఈ పరిశోధన వ్యాసంలో అయిదవ అధ్యాయం. కథాశిల్పం-లక్షణాలు, లక్షణ సమన్వయం - క్లుప్తత, సంఘటన సంవిధానం, అనుభూతి, సంఘర్షణ; శిల్పం, వస్తు విన్యాస శిల్పం, పాత్ర చిత్రణ శిల్పం; కథన శిల్పం - సామాన్య కథనం, పాత్రల కథనం, ఉత్తమ పురుష కథనం, ప్రథమ పురుష కథనం; సంఘర్షణ - పాత్రల మానసిక సంఘర్షణ; శీర్షిక; వస్తువు-సాంఘికం -స్త్రీ దళిత, మైనారిటీ వాదాలు; ఆర్థికం-బాలకార్మికులు; రాజకీయం-కులం రాజకీయాలు; రాజకీయాలు; ప్రాంతీయం - లక్షణాలు - లక్షణ సమన్వయం చేసే కథలు. తెలంగాణ భాష, భాషాభేదాలు, గ్రాంథికం, వ్యాకరణం, మాండలికం, ప్రాంతీయ మాండలికం వర్గమాండలికాలు, మిశ్రమం వంటి అంశాలు పరిశీలించబడ్డాయి.

ఉపసంహారంలో ఐదు అధ్యాయాలలోని విశేషాలు సాహిత్యంలోని ఉద్యమాలు కథావైశిష్ట్యత తెలంగాణ కథ విభిన్నత, తెలంగాణ సాహిత్యానికి దారితీసిన రాజకీయ నేపథ్యం, తెలంగాణ కథలో కనిపించే విభిన్న పోకడలు, ప్రాంతీయత వాద చిత్రణ, తెలంగాణ ప్రాంత కథలోని శిల్పవైవిధ్యం కథానిక లక్షణాలు, వస్తువు, శీర్షిక ప్రాంతీయత, భాష, ఇత్యాదుల్లోని విశేషాంశాలు పొందుపరచబడ్డాయి.

**భూక్య తిరుపతి**

# విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పుట నెం. |
|---|---|---|
| | నమస్సుమనస్సులు | i-ii |
| | ముందుమాట | iii-v |
| **1.** | **సాహిత్య చరిత్ర - ఉద్యమం** | **1-44** |
| | 1.0 పరిచయం | 1 |
| | 1.1 ఉద్యమం | 1 |
| | 1.2.0 ఉద్యమ లక్షణాలు | 3 |
| | 1.2.1 భాష | 4 |
| | 1.2.2 భావం | 4 |
| | 1.2.3 ప్రక్రియ | 4 |
| | 1.2.4 ఛందస్సు | 4 |
| | 1.2.5 అనుకరణ | 5 |
| | 1.2.6 స్వతంత్ర రచన | 5 |
| | 1.3.0 ఉద్యమ వర్గీకరణ | 5 |
| | 1.3.1 వైదిక మతవాదం | 6 |
| | 1.3.2 మార్గదేశివాదం | 10 |
| | 1.3.3 భక్తి ఉద్యమం | 12 |
| | 1.3.4 వాగ్గేయ కారులు - సామాజిక చైతన్యం | 15 |
| | 1.3.4.1 మధురభక్తి | 16 |

1.3.4.2 ఆధ్యాత్మికత 16

1.3.4.3 భక్తి తత్త్వం 17

1.3.4.4 రాజనిరసన 17

1.3.5 సంప్రదాయ కవిత్వం - ప్రాంతీయత 18

1.3.6 శతక కర్తలూ - ప్రాంతీయత 20

1.3.7 స్థల మహాత్మ్యాలు 20

1.4.0 ఆధునిక సాహిత్యం - ఉద్యమాలు 21

1.4.1 నవ్య కవిత్వ లక్షణాలు 22

1.4.1.1 ఖండకావ్య ప్రక్రియ 22

1.4.1.2 ఆత్మాశ్రయరీతి 23

1.4.1.3 వస్తునవ్యత 23

1.4.1.4 భావ నవ్యత 24

1.4.1.5 పదప్రయోగం 24

1.4.1.6 ప్రక్రియ బాహుళ్యం 25

1.4.2 కవిత్వ శాఖలు 25

1.4.2.1 భావ కవిత్వం 26

1.4.2.2 ప్రణయ కవిత్వం 27

1.4.2.3 దేశభక్తి కవిత్వం 28

1.4.2.4 ప్రకృతి కవిత్వం 29

1.4.2.5 సంఘసంస్కరణ కవిత్వం 29

| | | |
|---|---|---|
| | 1.4.2.6 భక్తి కవిత్వం | 29 |
| | 1.4.2.7 స్మృతి కావ్యాలు | 30 |
| | 1.5 అభ్యుదయ కవిత్వం | 31 |
| | 1.6 స్త్రీవాదం | 32 |
| | 1.7 దళితవాదం | 36 |
| | 1.8 మైనారిటీ వాదం | 41 |
| **2.** | **కథ - తెలంగాణ కథ** | **45-65** |
| | 2.0 కథ | 45 |
| | 2.1 తొలి తెలంగాణ కథ | 49 |
| | 2.2 తొలితరం కథ విశ్లేషణ | 52 |
| | 2.3 డిటెక్టివ్ కథ | 53 |
| | 2.4 తొలితరం కథ - భాష | 53 |
| | 2.5 వస్తువు | 54 |
| | 2.6 తొలి దళిత కథ | 55 |
| | 2.7 సంఘసంస్కరణ కథ | 56 |
| | 2.8 ఉద్యమాల ప్రభావం | 58 |
| | 2.9 సాహిత్య సంస్థలు | 59 |
| | 2.10 మొదటి కథల సంపుటి | 61 |
| | 2.11 జాతీయోద్యమ కథ | 62 |
| | 2.12 సైన్సు కథ | 63 |

| | | |
|---|---|---|
| | 2.13 తెలంగాణ కథకులు | 63 |
| **3.** | **కథ - తెలంగాణ రాజకీయోద్యమం** | **66-107** |
| | 3.0 నిజాంపరిపాలన | 66 |
| | 3.1 మహాసభ | 70 |
| | 3.2 గ్రంథాలయోద్యమం | 70 |
| | 3.3 ఆంధ్ర జనసంఘం | 70 |
| | 3.4 నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం | 71 |
| | 3.5 ఆంధ్ర జనకేంద్ర సంఘం | 71 |
| | 3.6 హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ | 72 |
| | 3.7 విద్యార్థుల వందేమాతర ఉద్యమం | 73 |
| | 3.8 రైతాంగ పోరాటం | 73 |
| | 3.9 భారత స్వాతంత్ర ప్రకటన | 74 |
| | 3.10 సాయుధ పోరాటం | 74 |
| | 3.11 తెలంగాణ విముక్తి | 75 |
| | 3.12.1 ప్రారంభ దశ (1921-30) | 76 |
| | 3.12.2 భూస్వామ్య నిరసన (1932-46) | 76 |
| | 3.12.3 నిజాం ప్రభుత్వం పై వ్యతిరేకత (1946-48) | 76 |
| | 3.12.4 సాయుధ పోరాటం (1948-51) | 76 |
| | 3.13 తెలంగాణా పోరాట సాహిత్యం | 76 |
| | 3.14 పోరాట సాహిత్యం కథల పాత్ర | 77 |

3.15 పోరాట కథల విభజన 78

3.16 పోరాట కథలు విశ్లేషణ 78

3.17 నక్సలిజం 98

3.18 1970 తరువాత తెలంగాణ కథ 100

**4. తెలంగాణ కథ విభిన్నత - ప్రాంతీయవాద చిత్రణ 108-133**

4.0 ప్రాంతీయత 108

4.1 విభిన్నత 110

4.2 సుజాత పత్రిక - చలం కథ 111

4.3 ఆంధ్ర కేసరి సంఘం 113

4.4 స్థానికత 114

4.5 తెలంగాణ కథ విశ్లేషణ 116

4.6 తెలంగాణ - గ్రామీణ జీవితం 120

4.7 తెలంగాణ కథ - ప్రాంతీయ వాద చిత్రీకరణ 121

4.7.1 ప్రాంతీయవాద లక్షణాలు 122

4.8 నిబద్ధత - నిమగ్నత 124

4.9 భాషా దృష్టి 127

4.9.1 సామెతలు 129

4.9.2 తెలంగాణ మాండలిక పదాలు 130

4.9.3 బూతులు, తిట్లు, మోటు పదాలు 130

4.9.4 ప్రామాణికం 130

| | | |
|---|---|---|
| | 4.9.5 పొరపాట్లు | 131 |
| | 4.9.6 భావార్థకం | 131 |
| | 4.9.7 ఉచ్చారణలో మార్పు | 131 |
| | 4.10 శిల్పవైవిధ్యం | 132 |
| **5.** | **తెలంగాణ కథాశిల్పం** | **134-173** |
| | 5.0 పరిచయం | 134 |
| | 5.1 లక్షణాలు | 134 |
| | 5.2 లక్షణ సమన్వయం | 135 |
| | 5.2.1 క్లుప్తత | 135 |
| | 5.2.2 సంఘటన సంవిధానం | 136 |
| | 5.2.3 అనుభూతి | 137 |
| | 5.2.4 సంఘర్షణ | 138 |
| | 5.3.0 శిల్పం | 140 |
| | 5.3.1 వస్తు విన్యాస శిల్పం | 141 |
| | 5.3.2 పాత్ర చిత్రణ శిల్పం | 141 |
| | 5.3.3 కథన శిల్పం | 142 |
| | 5.3.3.1 సామాన్య కథనం | 143 |
| | 5.3.3.2 పాత్రల కథనం | 143 |
| | 5.3.3.3 ఉత్తమ పురుష కథనం | 144 |
| | 5.3.3.4 ప్రథమ పురుష కథనం | 145 |

5.3.4 సంఘర్షణ 145

5.3.4.1 పాత్రల మానసిక సంఘర్షణ 145

5.3.5 శీర్షిక 146

5.3.5.1 చీకటి మంట 147

5.3.5.2 సావుదప్పు 147

5.3.5.3 నిత్యగాయాలనది 147

5.4 వస్తువు 148

5.4.0 సాంఘికం 150

5.4.1.1 స్త్రీవాదం 150

5.4.1.2 దళితవాదం 151

5.4.1.3 మైనారిటీ వాదం 152

5.4.2 ఆర్థికం 152

5.4.2.1 బాలకార్మికులు 153

5.4.3.0 రాజకీయం 154

5.4.3.1 కుల రాజకీయాలు 154

5.4.3.2 రాజకీయాలు 154

5.4.4.0 ప్రాంతీయం 155

5.4.4.1 ప్రాంతీయ లక్షణం 156

5.4.4.2 గొల్ల రామవ్వ 157

5.4.4.3 ఊరుమ్మడి బతుకులు 157

5.4.4.4 దొరమల్లా వచ్చిండు 158

5.4.4.5 నిత్యగాయాల నది 159

5.4.4.6 ఎల్లమ్మ 160

5.5.0 తెలంగాణ భాష 163

5.5.1 తెలంగాణ భాషాభేదాలు 163

5.5.2 గ్రాంథికం 165

5.5.3 వ్యావహారికం 166

5.5.4 మాండలికం 167

5.5.4.1 ప్రాంతీయ మాండలికం 167

5.5.4.2 వర్గమాండలికాలు 168

5.5.5 మిశ్రమం 172

5.5.5.1 గ్రాంథికం + వ్యావహారికం 172

5.5.5.2 గ్రాంథికం + మాండలికం 172

5.5.5.3 వ్యావహారికం + మాండలికం 173

**6. ఉపసంహారం 174-186**

**అనుబంధం**

పరిశీలించిన కథా సంపుటాలు 187-189

పరిశీలించిన త్రైమాసిక పత్రికలు 190

ఉపయుక్త గ్రంథసూచి 191-196

# కథ: తెలంగాణ ప్రాంతీయతావాదం

కథాసాహిత్యం మీద ఇటీవల పరిశోధనలు ఎక్కువగానే జరుగుతున్నాయి. కథలోని వివిధ కోణాలగురించి పరిశోధన ముందంజలో ఉంది. సాహిత్యంలో ఎన్నో వాదాలు ప్రతిఫలిస్తుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా ప్రాంతీయతావాదం లేదా స్థానికవాదం ప్రాధాన్యతను సంతరించుకొంటోంది. ప్రాంతీయతావాదం కవితలో కన్న కథలో మరింత ఎక్కువ చోటుచేసుకుంటుంది. ఈ నేపథ్యంలో తెలుగు కథల్లో ప్రాంతీయతా వాదం ఎలా కనిపిస్తుందని పరిశీలించటం తగిన అంశంగా తోచింది. అందులోను తెలంగాణ ప్రాంతవాసినైన నేను తెలంగాణ ప్రాంతీయతా వాదం కథలో ప్రతిఫలించిన తీరు చూడాలనే ఆసక్తి సహజంగానే కలిగింది. అందువల్ల పరిశోధనాంశంగా నేను ఎన్నుకున్నది "*కథ: తెలంగాణ ప్రాంతీయతావాదం*".

ఈ పరిశోధనాంశం ఆరు అధ్యాయాలుగా విభజింపబడింది. ఒకటి నుంచి అయిదు దాక ఉన్న అధ్యాయాలలోని విశేష అంశాలు పరిశోధన ఫలితాలు ఉపసంహారంగా కూర్చబడ్డాయి. తెలంగాణ కథ అన్నదాన్ని తెలంగాణ ప్రాంతీయులు - తెలంగాణ ప్రాంత కథకులు రాసిన కథాసంపుటాలు మాత్రమే పరిశోధనను తీసుకోబడ్డాయి. తీసుకోబడ్డ పుస్తకాల పట్టిక అనుబంధంగా ఇవ్వబడింది.

ఈ పరిశోధన వ్యాసంలో మొదటి అధ్యాయం *సాహిత్య చరిత్ర - ఉద్యమం*, తెలుగు సాహిత్యంలో ఈ నాటిదాక వచ్చిన ఉద్యమాలను స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. ఇందులో ఉద్యమ వివరణ లక్ష్యం ఉన్నాయి. ఒకానొక కాలఘట్టంలో భావ పరిణామాలు ఏర్పడతాయి. ఆ పరిణామ దశే ఉద్యమం. ఉద్యమం వస్తువులోనే కాక భాష, భావం, ప్రక్రియ, ఛందస్సు వంటి వాటిల్లో ప్రతిఫలిస్తుంది. సాహిత్యంలో స్వతంత్ర రచనలతోపాటు అనుకరణలు, అనువాదాలుకూడా కనిపిస్తాయి. ఉద్యమ వర్గీకరణ, భావజాలాన్ని అనుసరించి ఉంటుంది.

తెలుగు సాహిత్యం ఆరంభకాలంలో దొరుకుతున్న తొలికావ్యాన్ని బట్టి చూస్తే 'తన కుల బ్రాహ్మణుడు' వైదిక మతానుయాయి వంటి ప్రయోగాలను బట్టి చూస్తే చాళుక్యుల యుగం నాటికి హైందవ మౌలిక ధర్మాలకు ఆపద వాటిల్లినదని వైదిక మత పునరుద్ధరణే ధ్యేయంగా ఆ రచన సాగిందని చెప్పవచ్చు. కుల ధర్మం, బ్రాహ్మణ కులధర్మం, రాజులు విష్ణు అంశాలుగా పూజింపబడడం, క్షత్రియులను ఎదిరించి యాదవులు రాజ్యాలను నెలకొల్పడం మాతృస్వామ్య వ్యవస్థ పితృస్వామ్య వ్యవస్థగా రూపాంతరీకరణ చెందడం వంటి ఎన్నో భారత రచనలో భాగాలైనాయి. ఈ క్రమంలో ఏర్పడ్డ వివిధ శాఖలలో చీలికలు, గొడవలు, తిక్కన హరిహర మత పునరుద్ధరణకు తెర తీసేలా చేశాడు. ఈ మత పునరుద్ధరణ మత రాజకీయ పరమైనదైతే కథాకావ్య సృష్టి సాహిత్య సామాజిక పరమైనది. నన్నయ, తిక్కనల నడిమి కాలంలో పొరుగున కర్ణాటక నుండి ప్రసరించిన వీరశైవ మత ప్రభావం తెలుగులో శైవ మత సంబంధిత రచనలకే కాకుండా పూర్తిగా వస్తువు, భాష, ఛందస్సు, దేశీయమవడానికి కూడా కారణమైంది. దక్షిణాత్య కానుకగా భక్తి ఉద్యమం భారతీయ సంస్కృతిని సాహిత్య రచనను ఎంతో ప్రభావితం చేసింది. హృదయకుహరంలో భక్తి ఆధ్యాత్మిక సువాసనలను ఈనువు సాహిత్యాన్ని మాధ్యమంగా చేసుకొని సమాజాన్ని సంఘటిత పరచడమే భక్తి ఉద్యమం. ఇది దక్షిణ దేశం నుంచి పాకి భారత దేశమంతటా వ్యాపించింది. ఈ భక్తి సంప్రదాయానికి వాగ్గేయకారులు పట్టుకొమ్మలు. భక్తి సాహిత్యం ఆధ్యాత్మిక ఎల్లల్ని మోసుకుంటు ప్రజల జీవితాల్లోకి నడిచివెళ్ళడానికి ఆనాటి కవులు ఎన్నుకున్న మాధ్యమమే వాగ్గేయం. ఆర్థిక, రాజకీయ, మత, అసమానతల్ని ప్రశ్నించిన తొలి సామాజిక కవులు వీరే. సాంప్రదాయ కవిత్వం, సాంప్రదాయకవులు ప్రాంతీయాభి మానానికి దూరమైన వారేమి కాదు. శతకాలు, స్థలపురాణాలు ఆయా ప్రాంతాల ప్రాధాన్యతను చాటేవే. ఒక స్థానికమైన దైవానికి సంబంధించిన కథ తప్పకుండా ఈ తరహా రచనల్లో చోటు చేసుకుంటుంది. అంతటితో ఆగకుండ ప్రాచీన రచనల్లో స్థలం, రాజ్యం, క్షేత్రం, నది వంటి విషయాల ప్రసక్తి వచ్చినప్పుడల్లా కవులు తమ ప్రాంతీయాభిమానానికే చాటుకున్నారు. నన్నయ శ్రీనాథులు

వర్ణించిన గోదావరి, రామకృష్ణుడు వర్ణించిన తుంగభద్ర అలాంటివే. ఆధునిక సాహిత్యంలో పాశ్చాత్య ప్రభావాల వల్ల ఎన్నో 'ఇజా'లు సాహిత్యంలో ఎన్నో కొత్త ప్రక్రియలకు వస్తువైవిధ్యాలకు చోటు ఇచ్చాయి. భావకవిత్వ శాఖపై పరిఢవిల్లిన దేశభక్తి, భక్తి ప్రణయకవిత్వం, ప్రకృతి కవిత్వం వంటివన్ని వివిధ వాదాల నుంచి ఏర్పడ్డవి. అభ్యుదయ విప్లవాది కవిత్వాలు కూడా పాతబడ్డాక ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తున్న వాదాలు స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాదాలు. ఈ మూడు కూడా మళ్ళీ ప్రాంతీయమైన వస్తువుతోను, భాషతోను ముడిపడి ఉన్నాయి.

ఈ సిద్ధాంత వ్యాసంలో రెండవ అధ్యాయం *"కథ-తెలంగాణ కథ"*. పాశ్చత్య సాహిత్య ప్రభావంతో భారతీయ భాషలో ప్రవేశించిన ప్రక్రియలో ఒకటి కథానిక. కాని, కథ భారతీయ సాహిత్యానికేమి కొత్తకాదు. పురాణేతిహాసలలోని ఉపాఖ్యానాలన్నీ కథలే. తెలుగులో తొలి కథ వెలువడిననాటి నుంచి నేటిదాక కథలో ఎన్నో వైవిధ్యాలు చోటుచేసుకున్నాయి. 1910లోనే కొమర్రాజు వెంకట లక్ష్మణరావు రాసిన *ఏబఁది బేరము* తొలి తెలంగాణ కథగా గుర్తించవచ్చు. కథ సంఘసంస్కరణోద్యమ మాధ్యమంగా ఉద్దేశించబడటంవల్ల కోస్తాంధ్రలో వెలువడ్డంతగా ఈ కథాసాహిత్యం తెలంగాణలో రాలేదు. మరో ముఖ్య కారణం తెలంగాణలో మధ్య తరగతి జీవనం తక్కువగా ఉండటం. ఉర్దూ సాహిత్య ప్రభావం ఎక్కువగా ఉన్న నిజాం రాష్ట్రంలో కోస్తాలో కన్న కథా సాహిత్యం 1940ల దాక మందకొడిగానే సాగింది. కాని, ఆ తరువాత తెలంగాణ రాజకీయోద్యమ ఫలితంగా ఆ ఉద్యమ ప్రభావంతో ఎన్నో కథలు పుట్టుకొచ్చాయి. తొలి తరం కథలో గ్రాంథిక భాషా ఛాయలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. తెలంగాణ సామాజిక సమస్యే కథ వస్తువైంది. సంఘసంస్కరణల ప్రభావం ఉద్యమ ప్రభావంతో ఉద్యమ ఫలితంగా వెట్టి వంటివి కథల్లో చోటు చేసుకున్నాయి. తెలంగాణలో ప్రారంభమైన సాహిత్య సంస్థలు ఈ కథల్లో రచయితలను ఆదరించి ప్రాధాన్యత సంతరించు కోవడానికి అవకాశాన్ని కలిగించాయి.

మూడవ అధ్యాయమైన *"కథ-తెలంగాణ రాజకీయోద్యమం"*. నిజాం నవాబు ఖజానాకు చేరే అధికశాతం ఆధాయం భూమిశిస్తు. అత్యధికశాతం ప్రజలు భూమి మీదే ఆధారపడి బ్రతికేవారు. తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థకు ప్రత్యక్ష సాక్షి వెట్టి. తెలంగాణ భూములను లోబర్చుకున్న భూకామందులు, స్థానిక జాతులను, గిరిజనులను 'వెట్టి'గా మార్చి వేశారు. దేశంలో జరుగుతున్న మత సంబంధమైన ఘర్షణలతో ఏ మాత్రం సంబంధం లేకుండా తెలంగాణ ఉద్యమం స్త్రీ, పురుష భేదం లేకుండ ముందుకు సాగింది. గ్రంథాలయాలు, జన సంఘాలు ఈ ఉద్యమాన్ని పెంచి పోషించాయి. భారత స్వాతంత్ర ప్రకటనానంతరం తెలంగాణ ఉద్యమం సాయుధ పోరాటంగా మార్పు చెందింది. చివరకు తెలంగాణ నిజాం పాలన నుండి విముక్తి పొంది భారత రాజ్యాంగంలో భాగమైంది. ఈ పోరాటం పలు జానపద కళారూపాల ప్రదర్శనల వల్ల ప్రజల మధ్యకు వేగంగా వెళ్ళి చేరింది. బుర్రకథ, ఒగ్గుకథ వంటి కళారూపాలు మాత్రమే కాకుండ, గేయం, కథ కూడ తెలంగాణ పోరాటానికి అద్దం పట్టాయి. తెలంగాణ ఉద్యమ ప్రారంభదశలో వెలువడ్డ కథలు, నిజాం ప్రభుత్వం మీద నిరసన ఉద్యమ స్థాయి సాయుధ పోరాటం, తెలంగాణ విముక్తి వంటి ప్రతి ఘట్టం కథా సాహిత్యంలో తనవంతు స్థానాన్ని సంపాదించుకున్నాయి. కాళోజి, ఆవుల పిచ్చయ్య, సురవరం ప్రతాపరెడ్డి వట్టికోట ఆళ్వారుస్వామి, పి.వి. నర్సింహారావు వంటి కథకులు తెలంగాణ ఉద్యమాన్ని చక్కగా చిత్రించారు. తరువాత కాలంలో నక్సలిజం, రైతాంగ పోరాటం కార్మిక జీవనం వంటివి తెలంగాణ కథలో ప్రధాన స్థానాన్ని పొంది రాజకీయోద్యమాన్ని చిత్రించి చూపించాయి.

నాలుగవ అధ్యాయం *"తెలంగాణ కథ విభిన్నత ప్రాంతీయ వాద చిత్రణ"*. ఒక భౌగోళిక ప్రాంతంలో ప్రత్యేకమైన సంస్కృతి ఆచార వ్యవహారాలు భాష జనజీవనం మొదలైన భిన్నమైన వైవిధ్యభరితమైన అంశంగా మారినపుడు అది ఆ ప్రాంతానికి లేదా స్థానికతకు సంబంధించినదై ఉంటుంది. తెలంగాణ కథలో ప్రాంతీయ వైవిధ్యమే కాకుండా భాషా సంబంధి అర్థఛాయలు సాంస్కృతికం కూడా అయిన విభిన్నత కనిపిస్తుంది. విశాలాంధ్ర

వాదం ఎక్కువ ఉండటం ప్రాంతీయ విభేదాలను విస్మరించి సాహిత్య చరిత్రకు అలవాటు పడిన వాళ్ళు ప్రత్యేకంగా తెలంగాణ సాహిత్యాన్ని గుర్తించలేదు. కాని, నిజాం ప్రభుత్వానికి కప్పం చెల్లించే సామంతులుగా ఉండే బ్రిటిషు వాళ్ళు హైదరాబాద్ రాజ్య స్వాతంత్ర్యాన్ని హరించి తమ ప్రత్యక్షపాలనలోకి తీసుకోవడం ఆంధ్ర, తెలంగాణ మధ్య అసమానత పెరిగింది. కాని, ఆ భేదాన్ని కళల పరంగా కనిపించనీయలేదు. ఈ విభిన్నత కానరాకుండపోయిన రంగాలలో సాహిత్యం ఒకటి. అటువంటి పరిస్థితులలో సుజాత తెలంగాణ ప్రాంత కథ రచయితలకు ఒక ముఖ్య వేదికగా మారింది. గ్రాంధిక వ్యావహారిక బాషా విభేదాలు. స్త్రీ పురుష జీవన చర్చలు వేటిని లెక్కలోకి తీసుకోకుండా సుజాత పత్రిక అన్ని రకాల రచనలకు తావు ఇచ్చింది. తెలంగాణ కథ ఉద్యమంతో మమేకం చెందటమే దాని విభిన్నతకు మొదటి కారణం. తెలంగాణ తెలుగు సమాజం పురోగామి మార్గం వేసిన మొదటి అడుగే గ్రంథాలయోద్యమం. తెలంగాణ కథ.

ఏకాంత ప్రక్రియ కన్న సంయుక్త సామూహిక కర్తృత్వానికి ప్రతీకగా నిలవటం తెలంగాణ కథ విభిన్నతకు మరో ముఖ్యకారణం అయ్యింది. స్థానిక అవసరాల ఒత్తిడి తెలంగాణ కథకు తొలి తరంలో అంత ఊపిరిపోసుకోకపోయినా ఉద్యమ స్వరూప స్వభావాలతో నిండిన తరువాత స్థానికతకు మారుపేరుగా నిల్చింది. చదివే కథకు వినే కథకు చాలా తేడా ఉంటుంది. తెలంగాణలో కథకు పాఠకుల సంఖ్య పరిమితమైన శ్రోతల సంఖ్య అపరిమితమే. తెలంగాణ కథలోని ప్రధానమైన విభిన్నత ఇదే. తెలంగాణ కథకు ఏర్పడ్డ ప్రతికూల వాతావరణంలో మధ్య తరగతి జీవన, పాఠక లోపం ఒకటి. సమాజంలోని ఉన్నత స్థాయి జీవితాలు కాని, బడుగు జీవితాలు కాని, కథకు ఉత్తమ వస్తువులను అందించలేవు. ఉత్తమ రచన వస్తువును అందించగల మధ్య తరగతి కుటుంబ జీవనం తెలంగాణలో తక్కువే. చిన్నదైన తెలంగాణ కథ దీపం స్థాయిలో మిన్నదే. తెలంగాణ కథలో దాదాపు 75% గ్రామీణ జీవితాన్నే ఆధారం చేసుకున్నవే. అస్తిత్వవాద ఉద్యమ ఫలితంగా స్థానికతకు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని దానికి

ప్రధాన స్రవంతిలో తగిన ప్రాధాన్యతను ఇవ్వాలన్న అంశాన్ని ఆధారం చేసుకొని ప్రాంతీయవాదం బలపడసాగింది. ఒక ప్రాంతపు స్వరూప స్వభావాలపై స్పష్టమైన అవగాహన లేకుండా ప్రాంతీయ రచన సాధ్యంకాదు. భాష-సంస్కృతులకే కాక, రాజకీయ, సామాజిక సమస్యలు, వివక్ష, వనరుల దోపిడి, వంటి వస్తువు మాత్రమే కాదు. అభివ్యక్తి లోను భేదం కనిపించాలి. తెలంగాణ కథలోని ప్రధానమైన విభిన్నత అది ఉద్యమ స్ఫూర్తితో వెలువడడమే.

అయిదవ అధ్యాయం *"తెలంగాణ కథాశిల్పం"*. భారత కథ ప్రాచీనత, ఆధునిక కథా లక్షణాలు సమన్వయ పరచింది తెలుగు కథ అనవచ్చు. క్లుప్తత, సంఘటన సంవిధానం, అనుభూతి, సంఘర్షణ కథకు ప్రధాన లక్షణాలు. ఈ నాలుగింటిని సాధించడం దాదాపు ఏ కథకు సాధ్యంకాదు అనే చెప్పాలి. ఏ ఒక్కదాన్ని సాధించిన అది మంచి కథ అవుతుంది. ఏ రెండు లక్షణాలు తోడైన అది ఉత్తమ కథ అవుతుంది. కథా శిల్పం కథకు ప్రాణమనవచ్చు. కథకు, కావ్యానికి స్థూలంగా చూస్తే భేదం లేదు. కథలో కనిపించే శిల్పవైవిధ్యం వస్తువిన్యాస శిల్పం, పాత్రచిత్రణ శిల్పం, కథన శిల్పం, సంఘటన శిల్పం, సంఘటనోత్పాదక శిల్పం, సన్నివేశ కల్పన శిల్పం, వర్ణన శిల్పం, శీర్షిక శిల్పం అంటూ విమర్శకులు 8 రకాలుగా చెబుతున్నారు. తెలంగాణ కథల్లోఈ శిల్ప వైవిధ్యాలన్నీ అగుపడుతున్నాయి. కథనశిల్పంలో సామాన్యకథనం అంటూ రచయిత కథను నడపడం, పాత్రల కథనం పేరిట పాత్రల చేత కథను నడిపించడం. ఆ పాత్రలలోను ప్రధాన పాత్ర ప్రథమ పురుషగానో, ఉత్తమ పురుషగానో ఉండి కథను నడిపించడం చూడవచ్చు. సంఘర్షణ పాత్రల మానసిక సంఘర్షణగాని, సన్నివేశాల మధ్య సంఘర్షణగాని అయ్యి ఎదురుచూడని మలుపుతో కథకు కొత్త సొగసును చేకూరుస్తుంది. కథా రచయిత చూపెట్టే శిల్ప వైవిధ్య నేర్పంతా శీర్షిక ప్రకటనా నైపుణ్యంలో ఉంటుంది. 'నిత్యగాయాల నది' ఆ నేర్పుకు ఒక మచ్చు తునక. భౌగోళిక సంపద ఎడతెగని భూమి తల్లి మానవ సంకుచిత మనోభావాల వల్ల పడుతున్న వేదనే ఈ శీర్షికకు ప్రాణం పోసింది. కథకు వస్తువు రూపం లాంటిది. ఈ వస్తువు సాంఘికమైనదే - స్త్రీ వాదాన్ని ప్రతికరించే పెనుగులాట, దళితవాదాన్ని చిత్రించే వర్గమూలాలు, మైనారిటీ వాదాన్ని

నిరూపించే జిద్దుకథలు ఉండవచ్చు. ఆర్థిక అసమానతలు కూడా కథావస్తువులవుతున్నాయి. పక్షులెగిరిపోయిన తోట, అమ్మను జూడలే వంటివి ఉదాహరణలు. కులరాజకీయాలు, రాజకీయాలు, మానవ జీవిత ఆదర్శాల మేలిముసుగులకు ఉదాహరణప్రాయాలైన రచనలు. ప్రాంతీయ లక్షణాలను నింపుకొన్న గొల్లరామవ్వ, ఊరుమ్మడి బతుకులు, దొరమల్లా వచ్చిండు, ఎల్లమ్మ, నిత్యగాయాలనది వంటివి తెలంగాణ ఆర్థిక సామాజిక అంశాలకు, భాషా సంస్కృతులకు అద్దం పడుతున్నాయి. తెలంగాణ భాష విశేషమైంది. ఉర్దూ భాషా ప్రభావం దీని మీద ఎక్కువగా కనిపిస్తుంది. భాషా విషయకంగా తెలంగాణ కథలను గ్రాంథికం, వ్యావహారికం, మాండలికం, మిశ్రమం అంటూ నాలుగు ప్రధాన విభాగాలుగా చూపించవచ్చు. మిశ్రమంలో గ్రాంథిక వ్యావహారికాలు, వ్యావహారిక మాండలికాలు, గ్రాంథిక మాండలికాలు, అంటూ భేదాలు కనిపిస్తాయి. ధ్వని మార్పుల నుంచి పదబంధాలదాక భాషలో విభిన్నత గుర్తింపబడుతుంది.

ఆరో అధ్యాయం తొలి అయిదు అధ్యాయాలలో విభజించి విశ్లేషించిన విశిష్టమైన భాగాలను తనలో పొందు పర్చుకున్న *ఉపసంహారం.*

# 1. సాహిత్య చరిత్ర - ఉద్యమం

## 1.0 పరిచయం

ఒక జాతి వైశిష్ట్యాన్ని, సంస్కృతిని అక్షర బద్ధం చేస్తే అది సాహిత్య మవుతుంది. హితాన్ని కలిగిఉండేదే సాహిత్య మన్నది చాలా పాత నిర్వచనం. హితాహితాలతో సంబంధం లేకుండా జాతి సాంస్కృతిక విశేషాల్ని వివరించి, ముందు తరాల కందించేది సాహిత్యం. తెలుగు సాహిత్య చరిత్రకారులందరూ, చాలావరకు కవుల్నీ, పోషకుల్నీ కాలక్రమాన్ననుసరించి కూర్చుకుంటూ వచ్చి సాహిత్య చరిత్ర అన్నారు. కానీ, సాహిత్యం ఎలా సామాజిక జీవితం మీద ప్రభావం చూపిందో అర్థం చేసుకోవడానికి సహాయకారి కావాలి, సాహిత్య చరిత్ర.

ఒక భాషా వర్గం సృష్టించుకున్న సృజనాత్మక రచనల సమాహారం సాహిత్యమైతే, కాలానుగుణంగా ఆ రచనల్లో ఏర్పడ్డ భావావేశాల మార్పు, దానికిగల కారణాలను వివరించేది సాహిత్య చరిత్ర. ఒక జాతి సృజనాత్మక రచనల ప్రారంభ కాలంనుంచి నేటిదాకా పొందిన వైవిధ్యం సాహిత్య చరిత్రకు సామాగ్రి అవుతుంది. ఆ రచనలు చేపట్టిన ఉద్యమాన్ని సామాజిక దృక్కోణంలో ఏర్పడ్డ కాలానుగత మార్పును కథనం చేసేదే, సాహిత్య చరిత్ర. చరిత్ర అంటే, కేవలం ఆంగ్ల పదమైన హిస్టరీకి సమానార్థకం కాదు. చరిత్ర అంటే, గతి, నడక, ఒక వ్యక్తి లేదా సమాజ స్వభావం అని అర్థం. సమాజస్వభావం తెలియాలంటే ఉద్యమాల పుట్టుక పరిణామం తెలియాలి.

## 1.1 ఉద్యమం

చరిత్ర అనేది కాలక్రమంలో ఒక అంశం పొందే వికాసాన్ని చెప్పేదే అయినా, ప్రతిరోజూ, ప్రతి అంశం ముఖ్యంకాదు. ఆ అంశం నడచే తీరులో మలుపులు సృష్టించేటటువంటి కీలకాంశాలూ, రచనలూ, వ్యక్తులూ, భావజాలాలూ ముఖ్యస్థానం వహిస్తాయి. ఇవన్నీ విడివిడిగా కన్పించినప్పటికీ ఒకానొక కాలఘట్టంలో ఏర్పడే భావ పరిణామంలో భాగాలవుతాయి. ఈ పరిణామాన్ని తెచ్చే దశనే భావ పరిణామ స్థితి అంటాం. ఆ దశనే

ఉద్యమం అంటాం. అది కాలం సృష్టించే ఒక కదలిక. కాల కదలికలో కలిగే మలుపే ఉద్యమం.

చరిత్ర మానవ జీవన పరిణామంలో ఏర్పడే ఘట్టాలన్నిటినీ నమోదు చేస్తుంది. అయితే, ప్రతీ సంఘటనా చారిత్రక ఘట్టం కాలేదు. ప్రతి వ్యక్తి చారిత్రక పురుషుడు కాలేడు. ప్రతీ రచనా సాహిత్య గతిని మార్చేదిగా ఉండదు. అలాంటప్పుడు ఆ భావజాలంలో ఏర్పడ్డ మార్పు ఎప్పుడైతే ఒక మలుపును ఏర్పరుస్తుందో అప్పుడది ఉద్యమ స్ఫూర్తిని పొందుతుంది. ఉద్యమాలన్నీ కూడా సాధారణంగా భావావేశపు స్థితికి ప్రతీకలవుతాయి. వ్యక్తిగత భావావేశం హృదయస్పందనైతే, ఒక జాతిని ప్రేరేపితం చేసే భావావేశం ఉద్యమ రూపం దాలుస్తుంది. కానీ, ఏ ఉద్యమం కలకాలం నిలవదు. ఆయా కాలాన్నీ అనుసరించి, ఏర్పడే భావ ప్రేరణ ఆ కాలానికే పరిమితమవుతుంది. ఆ స్ఫూర్తి ఎన్నాళ్ళుంటుంది అంటే, సామాజికంగా మరొక ఆవశ్యకత ఏర్పడి, ఒక కొత్త భావజాలం జాతిని సమూలంగా మార్చినపుడు మరో కొత్త ఉద్యమం పుడుతుంది. అది ఒక స్పష్టమైన కాలఘట్టం. ఒక స్పష్టమైన సామాజిక నిర్దిష్టత అందులో ఉంటుంది. ఒక జాతి చరిత్రలో ఎన్నో వేదనల గాథలు దాగిఉంటాయి. ఆవేదనలు ప్రచలిత రూపం పొంది, ఎన్నో ఉద్యమాలకు కారణం కావచ్చు. ఒక చరిత్ర వేదనా ప్రసవం, ఉద్యమం అనే మాటలకు వివరణనివ్వాలంటే, చరిత్రలో మానవ సమాజ వేదన అంతర్లీనంగా నినదిస్తూనే ఉంటుంది. కాలాన్ననుసరించి అది వర్ణ, వర్గ భేదాలు కావచ్చు. లింగ, ప్రాంతీయ భేదాలు కావచ్చు. అటువంటి భేదాలు రచయితల రచనల్లో ప్రతిఫలించక మానవు. "Man is social animal" అన్న మాట అక్షర సత్యం. వ్యక్తిగత అనుభవాల్ని దాటి, సామాజిక స్థితి గతులు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. భారతీయ సాహిత్యాన్నే ఉదాహరణగా తీసుకుంటే చారిత్రక నేపథ్యాన్ని ప్రతిఫలిస్తూ వచ్చిన మార్పులెన్నో!

“తొలినాటి భారతీయ సాహిత్యం ప్రాకృతికమైందే! ప్రాకృత భాషలో వెలువడ్డదే అయి ఉండాలి. ప్రాకృత భాష సుసంస్కృతమై వైదిక సాహిత్యంగా వెల్వడి ఉంటుంది. మళ్ళీ

బౌద్ధం, జైనాలు వేళ్ళూనిన తర్వాత ప్రాకృతం మళ్ళీ ఒక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఈ దశల్లోని మార్పు వైదిక సంస్కృతికీ, బౌద్ధ, జైన మత ప్రభావానికీ సుస్పష్టమైన ఉదాహరణలు.'' (సత్యవాణి, జె.వి.2009 పుట ) వైదిక వాఙ్మయం రూపుదాల్చటానికి ముందే ఆ సంస్కృతి సముచిత స్థానాన్ని పొంది ఉండాలి. అందువల్లే ఆ రచనలు వెల్వడ్డాయి. దానికి భిన్నమైన మరొక సంస్కృతి తలెత్తి, అహింస, సామాజిక సమతలు దాని ప్రధాన వాహికలైనపుడు వేరొక సంస్కృతి రూపుదాల్చింది. ఇవన్నీ వివిధ ఉద్యమాల ప్రతీకలే! తెలుగు సాహిత్యాన్ని దీనిని ఆధారంగా తీసుకుంటే తెలుగు సాహిత్యంలోని పలుయుగాలు ఉద్యమ ప్రతీకలన్నది స్పష్టమవుతుంది. సాహిత్యం ఉద్యమం రెండూ ఒకదానికొకటి తోడు. ఉద్యమం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది. సాహిత్యం ఉద్యమాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మాటల్లో చెప్పాలంటే, ''సాహిత్యం ఉద్యమం నుండి ఊపిరి తీసుకుంటుంది. బదులుగా వివిధ రూపాల్లో ఉద్యమవ్యాప్తికి ఊపిరిపోస్తుంది''. ఉద్యమం సమాజంలో రూపుదిద్దుకుని, చైతన్యవంతమై వివిధ దశల్లోకి ఎగబాకి, ఎందరినో ప్రభావితం చేసి, ఏ కవి ఎదనో తడుతుంది. లేదా ఆ ఉద్యమంలో ఆసక్తి ఉన్న వాళ్ళల్లో ఎవరికో కవితాస్ఫూర్తి కలుగుతుంది. అప్పుడు ఉద్యమం కవిత్వంలోకి ప్రవేశిస్తుంది. ఏ ఉద్యమమైనా సాహిత్యంలో ప్రవేశించే తొలినాళ్ళల్లో సాహిత్యం ఒక వాహిక అవుతుంది. అదే, వాహిక కాస్తా ఎదిగి ఎదిగి పలుగురు రచనల్ని ప్రభావితంచేసి, ఆదిశలో పలు రచనలు వెలువడగానే అది సాహిత్యోద్యమంగా రూపుదిద్దుకుంటుంది.

ఏదైనా తయారయ్యే దాకా దాని ప్రత్యక్ష లక్షణాలంటూ ఏవీ తయారుకావు. అయితే ఒక పరిపూర్ణమైన లక్షణం తయారు కాగానే దాని లక్షణాలు గుర్తించడం సుసాధ్యమవుతుంది.

### 1.2.0 ఉద్యమలక్షణాలు

ఉద్యమానికి స్పష్టమైన భావజాలం ఉండాలి.

భావజాలమంటే నిర్ణీతమైనటువంటి నిర్మాణాన్ని నిర్దేశించే తీరే, నిర్మాణానికి సంబంధించిన సూత్రాల తాత్త్వికత.

నిర్ణీతమైన నిర్మాణాన్ని సూత్రీకరించే తాత్త్వికతల సమాహారం, దాంట్లో భావజాలంలో దిశానిర్దేశం ఉండాలి. స్వచ్ఛంద ప్రేరణ (self automation), ఆత్మచలనం (dynamic philosophy) కలగాలి. మార్గాలు, లక్ష్యాలు, అనుసరించే విధానాలు అనుక్రమాలు, దాని దశ గురించిన ఊహలూ చాలా స్పష్టంగా ఉండాలి.

### 1.2.1 భాష

సాహిత్యంలో వచ్చే నూతన ప్రతిపాదనలకు అనుకూలమైన, సమాజ స్థితిగతులకు తగినటువంటి భాషను కవులు వాడటం భాషాపరమైన సాహిత్య లక్షణం. జానుతెనుగు, అచ్చతెనుగు, వ్యావహారిక భాషోద్యమం లాంటివి దీనికుదాహరణలు.

### 1.2.2. భావం

భావచలనం సామాజిక స్థితిని బట్టి ఉంటుంది. ఒక కాలంలోని భావజాలం ఎల్ల కాలాలకూ సరికాదు. భావజాలంలో వచ్చే మార్పు భావ విప్లవంగా పరిణమిస్తుంది. నాయిక సౌందర్యవర్ణన ఆమె భావజాలానికి ప్రాధాన్యంగా మారడం ఓ ఉదాహరణ.

### 1.2.3. ప్రక్రియ

కాలానుగుణమైన మార్పుల్లో ప్రక్రియ కూడా ఒకటి. కవి తన కాల సామాజికావసరాన్ని బట్టి ఆయా కాలాల సాహిత్య ఉద్యమాన్ని బట్టి ఏర్పడుతూ ఉంటుంది. ఒక కవి ప్రవేశపెట్టిన ప్రక్రియ తరువాత కవులకి మార్గదర్శకత్వం అవుతుంది. ఆ విధంగానే సాహిత్యంలో వివిధ ప్రక్రియలు చోటుచేసుకుంటాయి. తెలుగు సాహిత్యంలో ప్రబంధం, యక్షగానం, వచన కవిత్వం వంటివి అలా ఏర్పడినవే.

### 1.2.4 ఛందస్సు

ఛందస్సు సాహిత్యానికి ఒక రూపం మాత్రమే వివిధ ఛందస్సులు కాలగతినిబట్టి సాహిత్యంలో పొడచూపుతుంటాయి. దేశీయ ఛందస్సుతోపాటు సంస్కృత గణ అక్షర ఛందస్సు శాసనాల నుంచి తెలుగులో చోటుచేసుకుంది. మధ్యలో శివకవులు దేశీయ ఛందస్సుకు

పెద్దపీట వేశారు. ఆధునిక కాల రచయితలు ఛందస్సు వద్దంటూనే మాత్రాగణ ఛందస్సు నవలంభిస్తున్నారు.

### 1.2.5 అనుకరణ

అనుకరణ సాహిత్య లక్షణాలలో ఒకటి, ఇతర భాషా సాహిత్య ఛందోలక్షణాలను అనుకరించటం ప్రతిభాషలోనూ సాధారణ విషయం. ఈవిధంగా చూస్తే ఆరంభకాలంలో సంస్కృత ప్రాకృత ప్రభావం చాలా ఎక్కువ. ఆధునిక యుగ సాహిత్యానికి వస్తే ఆంగ్ల, వంగ భాషల ప్రభావం ఎక్కువ అని చెప్పుకోవచ్చు.

### 1.2.6 స్వతంత్రరచన

అనుకరణలు, అనువాదాలు సాహిత్యంలో సహజమైన ఒక భాష మాట్లాడే ఆ జాతి ప్రజల రుచిని, సౌందర్యాన్ని ఇతరులకు అందించేది స్వంతరచనలే. అందుకే నన్నయాది కవుల రచనలు సంస్కృత అనువాదాలైన స్వతంత్ర రచనల్లాగా శోభిల్లినాయి. శివకవి యుగం, ప్రబంధ యుగం సంపూర్ణంగా నూతన రచనల్ని ఆవిష్కరిస్తే కథా కావ్యరచనా పరంపరకు శ్రీకారం చుట్టించిన కవి బ్రహ్మ ఈ రకమైన సాహిత్య సృష్టికి ప్రాణం పోశాడు.

### 1.3.0 ఉద్యమ వర్గీకరణ

ఉద్యమాలన్నీ, అన్ని కాలాల్లోనూ ఒకటిగానే ఉండవు. కాలాన్ని, భావజాలాన్ని బట్టి ఉద్యమంలో మార్పులుంటాయి. ఉద్యమాల్ని వర్గీకరించవచ్చు. అవి ముఖ్యంగా ప్రాంతీయ ఉద్యమాలనీ, సామాజిక వర్గ ఉద్యమాలనీ చెప్పవచ్చు. ఈనాటి సీమ, తెలంగాణా ఉద్యమాలు ప్రాంతీయతకు ఉదాహరణలైతే, సామాజిక వర్గ ఉద్యమాలకు ఉదాహరణంగా స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాదకవిత్వాలను చెప్పుకోవాలి.

ఈ వర్గీకరణ ఆధునిక సాహిత్యానికి సరిపోవచ్చు. కానీ, పూర్వయుగ సాహిత్యంలో ఇటువంటి వర్గీకరణ సరిపోదు. అక్కడ కన్పించే ఉద్యమాలన్నీ సామాజిక ధోరణులే అయినా, అవి వివిధ దశలకూ, భావజాలాలకూ ఉదాహరణ ప్రాయంగా నిలిచాయి. తెలుగు సాహిత్య

చరిత్రను పరిశీలిస్తే ఇలాటి ఉద్యమాలు ప్రతియుగంలోనూ కన్పిస్తాయి. నిజానికి, యుగాలన్నీ కూడా ఒక ఉద్యమ స్ఫూర్తిని కలిగించిన కవినో, రచనా రీతినో ఆధారం చేసుకుని చేయబడ్డవే అనవచ్చు. ఆ భావజాలం నిర్ణయించిన తీరువల్లే నిర్మాణంలో మార్పు రావటం.

నన్నయతో ప్రారంభమైన తెలుగు కవిత్వోద్యమం చిన్నయ వచనంతో సరికొత్త మలుపు తిరిగిందని చెప్పవచ్చు. ఈ మధ్య కాలంలోని వేయేళ్ళ తెలుగు సాహిత్యం పోయిన పలుపోకడలు పలు ఉద్యమాలకు, కొత్త కొత్త భావజాలానికీ ప్రతీకలే!

### 1.3.1 వైదిక మతవాదం

తెలుగు సాహిత్యం ప్రారంభమయిందే నన్నయతో అంటే నన్నయ ఆ రచనను చేపట్టడానికి కారణంగా చెప్పింది - వైదిక వాఙ్మయ సారాంశాన్ని తెలుగులోకి తేవాలంటే, అది పంచమ వేదానుకరణవల్లే సాధ్యమవుతుందన్నందువల్లే.

సీ॥ తన కుల బ్రాహ్మణుననురక్తునవిరళ జపహోమతత్పరు విపుల శబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతు
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర జాతుసద్వినుతావదాత చరితు
లోకజ్ఞునుభయభాషాకావ్యరచనాభిశోభితు సత్ప్రతిభాభియోగ్యు

ఆ॥ నిత్యసత్యవచను మత్యమరాధిపాచార్యుసుజను నన్నపార్యుఁజూచి
పరమధర్మవిదుఁడు వరచాళుక్యాన్వయాభరణుడు (ఆది-1-9)

రాజులు పరమధర్మ విదులమని చెప్పుకునే రోజులవి. “నా విష్ణు పృథ్వీపతి” అనే సూక్తి నెలకొనబడ్డకాలమది. వైదికమతం వేళ్ళూని, చాతుర్వర్ణ్య వ్యవస్థ స్థిరపడిన తర్వాత తొలిమూడు వర్ణాలు తగిన ప్రాధాన్యాన్ని పొందాయి. కళలు, సంస్కృతి, ఆర్థికరాజకీయాది విషయాలన్నీ ఆ మూడు వర్ణాల వారికి ప్రాముఖ్యత నిచ్చాయి. వైదికాచారాలు క్రమేపీ మార్పుచెందటం, వర్ణప్రాముఖ్యత కారణాలుగా సమాజంలో ఆధిపత్యవర్ణాలు వృద్ధిచెందటం ప్రారంభించాయి. వైదిక మతాచారాలవల్ల విసిగిన ఎందరో జైన బౌద్ధాలవైపు మొగ్గు చూపారు.

జైన బౌద్ధాలు ఎదిగి, వాటిలో కూడా శాఖలు విడివడి భేదాలూ, వర్ణవర్గ విభేదాలూ తలెత్తిన తర్వాత, కొద్దికొద్దిగా వాటిమీద నుంచి ప్రజల దృష్టి మరలసాగింది. అయితే, దాదాపు 7-8 శతాబ్దాల మధ్యకాలంలో పల్లవుల పరిపాలనలో మళ్ళీ వైదిక మతానికి ప్రాముఖ్యత వచ్చింది. రాజులు దైవాంశసంభూతులని చెప్పి, ఒప్పించగలిగే బ్రాహ్మణవర్ణానికి ప్రాధాన్యత హెచ్చింది. పురాణ పఠనాలకు ప్రాధాన్యత వచ్చింది. రాజులు పురాణ కాలక్షేపాలు చేయించేవారు. గుడిలో పురాణ పఠనం చేసేవారికి దానాలివ్వబడ్డాయి. క్రమక్రమంగా ఈ విధానం స్థిరపడుతూ వచ్చింది. దక్షిణ భారత దేశంలోని రాజులు తమ వంశాలను సూర్య చంద్రవంశ రాజులతో కలుపుకోవడం మొదలు పెట్టారు.

పంప పొన్నలు తమరాజులకు అర్జున, భీములతో అభేదత్వం ఆపాదించినా, నన్నయ భారతంలో రాజరాజనరేంద్రుని చంద్రవంశపు రాజన్నా ఈ కారణాల వల్లే జరిగింది. పూర్వ పశ్చిమ చాళుక్యులిద్దరూ కూడా వైదికమతాన్ని ఆదరించటం మొదలుపెట్టాక మళ్ళీ యజ్ఞయాగాదులకు ప్రాముఖ్యత హెచ్చింది. ఆ కారణంగానే నన్నయ తన గురించి రాజరాజ నరేంద్రుడు చెప్తున్నట్లు రాసిన దాంట్లో, 'తనకుల బ్రాహ్మణుడు', 'అవిరళ జపహోమ తత్పరుడు', 'సంహితాభ్యాసుడు', 'బ్రాహ్మాండాది నానాపురాణ విజ్ఞుడు' వంటి విశేషణాల్ని పేర్కొన్నాడు. ఈ విశేషణాలన్నీ కూడా ఆకాలంలో వైదిక మతానికీ, వైదిక మతావలంబులకూ ఉన్న గౌరవ ప్రపత్తుల్ని చెప్తున్నాయి. అలాగే ధర్మ నిరతుడనైన తాను భారతంలోని ధర్మాచార పారాయణతఉన్న కథల్ని వినగోరుతున్నానని చెప్పాడు. అంటే, ఇక్కడ ధర్మమంటే యథావిధిలోకధర్మం కాదు, వైదిక విహిత కర్మాచరణమనే అర్థం.

క్రీ.శ. 9-10 శతాబ్దాల మధ్యకాలం నాటికి ఈ మార్పు దక్షిణభారత మంతటా చోటుచేసుకుంది. బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ, వైశ్యులకూ అంటూ విడివిడిగా విధులు ఏర్పడ్డాయి. ఒక కాలంలో సహజమైన మద్యమాంసాలు ఈ కాలానికి దోషంగా భావింప బడ్డాయి. అందుకే వ్యాసభారతంలో 'అయిణ' మాంసంతో రాజసూయ యాగానంతరం బ్రాహ్మణులకు విందుపెట్టిన ధర్మరాజు చేత, ఆంధ్ర మహాభారత కర్త నన్నయ సభాపర్వంలో

రాజసూయానంతరం పాయసాది సాత్వికాహారాన్ని పెట్టించాడు.

ఈ కాలానికి బ్రాహ్మణులు సాత్వికాహారాన్ని గ్రహించడం మొదలు పెట్టారని అనిపిస్తుంది. కొద్ది శతాబ్దాల కాలంలో జరిగిన ప్రధానమైన మార్పుల్లో ఇదీ ఒకటి. శిశుపాలవధ ఘట్టంలో విజ్ఞులు, బ్రాహ్మణులు, క్షత్రియులు ఉన్న సభలో ఒక యాదవుణ్ణి పూజించటం అసమంజసమంటూ శిశుపాలుడు పల్కిన పల్కులు.

అవనీనాథులనేకులుండగ విశిష్టారాధ్యులార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వురుండగ ధరిత్రీనాథ గాంగేయుదు
ర్వ్యవసాయంబుఁ గృష్ణు గష్టచరితున్ వార్ష్ణేయుబూజించినీ
యవివేకంబెఱింగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుడే. (సభా 2-8)
''యాదవుల్ రాజులే యవని మీద'' (సభా-2-11)

ఇందుకుగొప్ప ఉదాహరణలు. బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు వైదిక మత సంస్కృతిలో ప్రాధాన్యత హెచ్చు. ఒకరు యాజ్ఞయాగాదులు నిర్వహించేవారు. మరొకరు యజ్ఞయాగాదులు నిర్వహించడానికి తగిన సాధన సామాగ్రి, సంపదను కూర్చగలిగేవారు. వీరే పాలకులై యావజ్జాతినీ పాలించారు. బుద్ధిబలంతో తోడ్పడే వారొకరైతే, కండబలంతో లొంగదీసుకునే వారొకరు. ఇవే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పశుపోషణ ప్రధానవృత్తిగా కలిగి ఉన్న యాదవులు అప్పుడప్పుడే ప్రాధాన్యతను పొందాలని యత్నిస్తున్నారు. తమకంటూ ఓ అస్తిత్వాన్ని ఏర్పరచుకుని, రాజ్యాలను నెలకొల్పుకోవాలని ప్రయత్నంచేస్తున్నారు. దాన్ని కొందరు క్షత్రియులు సహించలేకపోతున్నారు. అన్న దానికి నిదర్శనమే ఈ ఘట్టం.

తిక్కన వైదిక మతావలంబిమాత్రమే కాదు. స్వయాన సోమయాజికూడా. అతడు తన తండ్రి కలలో కన్పించి ఆజ్ఞాపించిన విధంగా తన కావ్యాన్ని హరిహరనాథుడికి అంకితం చేశాడు. వైదిక మతావలంబులకున్న ప్రధాన శాఖల్లో శైవ వైష్ణవాలు చాలా ప్రాముఖ్యాన్ని పొందాయి. ఆ ప్రాముఖ్యత సాహిత్య, రాజకీయాల్లోకి కూడా పాకింది. మెల్లగా ఆ మతావలంబులమధ్య వైవిధ్యం వైరుధ్యానికి కారణమయింది. ఆ వైరుధ్యం వైషమ్యాలకు

దారితీసింది. మతకలహాలు రాజకీయ పోరాటాలకు కారణమయ్యాయి. ఆంధ్ర దేశపు స్థానిక భారతంగా పేరొందిన పలనాటి వీర చరిత్రకు ఇదే ఆధారం. శైవ వైష్ణవాల మధ్య తలెత్తిన విభేదాల్లో ఎన్నో వేల మంది ప్రాణాలు హరించుకు పోయాయి. అందువల్ల ఆకాలంలో ఒక కొత్త మతం కావాల్సి వచ్చింది. రెండింటికీ సామరస్యం కూర్చడం అవసరమయింది. అప్పుడే, హరిహర రూపం స్థానం సంపాదించుకుంది. తిక్కన, అతన్ననుసరించి నాచన సోమనలిద్దరు తమ రచనల్ని హరిహరనాథునికే అంకితం చేయటం ఈ చారిత్రక సత్యానికి నిలువెత్తు సాక్ష్యం. తిక్కన గారి హరిహరనాథస్తుతి దీనిని చాటుతుంది.

"కరుణారసము వొంగి తొరగెడు చాడ్పున, శశిరేఖ నమృతంబుజాలువాఱ
హరినీల పాత్రిక సురభి చందనమున్న, గతి నాభిధవళ పంకజము మెఱయ
గుఱియైన చెలువున నెఱసిన లోకర, క్షణమనగరళంబు ఛాయదోప
ప్రమదాద్రిదోతెంచు భానుబింబమునాను, రమ్మున గౌస్తుభరత్నమొప్ప

సురనదియును గాళింది బెరసినట్లు
కాంతిపూరంబు శోభిల్ల శాంతమూర్తి
నామనంబునానందమగ్నముగ చేయ
నెలమిసన్నిధి సేసె సర్వేశ్వరుండు" (విరా-1-12)

ఎఱ్ఱన 'గాసటబీసటే గాథలు' తవ్వ కోవడం గురించి చేసిన వ్యంగ్య వ్యాఖ్యానం - వైదిక పురాణేతిహాసేతర కథల్ని సూచిస్తుంది. తెలుగు సాహిత్యంలో లభిస్తున్న తొలి రచన మహాభారతం అయినా, అలభ్యాలు ఎన్నో! ఉదా.కు సర్వదేవుడి ఆదిపురాణం. ఇది జైన ఆది తీర్థంకరుడైన ఋషభనాథుని జీవితం గురించిన రచన. ఈ సర్వదేవుడు తెలుగువాడనీ, తెలుగులో ఆది పురాణాన్ని రచించాడనీ, కన్నడంలో రాజాశ్రయంకోసం రచించిన వాడనీ, ధార్మిక కావ్యాలు రాయని కవిని ఆనాటి కన్నడ సంఘం అనుమతించేదికాదనీ, అందువల్ల లౌకిక ధార్మిక కావ్యాలు రాసేవారనీ ఆరుద్రగారు స్పష్టపరుస్తారు. అంటే, బౌద్ధ, జైన గాథలున్న

ఎన్నో రచనలు కాలగర్భంలో కలిసిపోయాయన్నమాట. దానికి వైదికమత పునరుద్ధరణ, మతఘర్షణలు కూడా కారణాలేమో?

కవిత్రయ కాలంనాటికి పూర్తిగా ఆంధ్రదేశంలో వైదిక మత ప్రభావం బాగా ఉందన్న మాట. రాజులను పొగిడి, వారిచే భూరిదానాలు పొందే బ్రహ్మణకవులు ఎక్కువవటాన్ని ఈ కాలం సూచిస్తుంది. ఆంధ్రదేశపు కవిత్వంలో చాలామేర ఆ స్థానాల్లో అభివృద్ధి పొందింది అనటంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. నన్నెచోడుడు దీనికిలా సాక్ష్యమిస్తాడు.

"మునుమార్గ కవితలోకం

బున వెలయగ దేశికవిత పుట్టించిరంధ్ర విషయంబున

జన చాళుక్యరాజు. . . . . " (నన్నెచోడుడు, కుమార సంభవం-అవ-23)

దేశికవిత్వాన్ని పుట్టించిన వాడు చాళుక్యరాజట.

### 1.3.2 మార్గ- దేశివాదం

క్రీ.పూ. 3వ శతాబ్దంనుంచి క్రీ.శ. 3వ శతాబ్దం దాకా తెలుగు నేలను ఏలిన శాతవాహనులదే మనకు తెలిసినంతవరకు తొలి సామ్రాజ్యం. అశోకుడి కాలంలో ప్రాముఖ్యం పొందిన బౌద్ధమతాన్ని ఆదరించిన వారే ఈ రాజులు కూడా! వీరి తొలికాలపు శాసనాలు ప్రాకృతంలో వెలువడ్డానికి కారణం వీరు మౌర్య సామంతులుగా ఉండి, స్వతంత్రతను ప్రకటించుకోవటమే! క్రమేపీ శాతవాహనుల శాసనాలు సంస్కృతంలో వెలువడ్డాయి. వాళ్ళు తమను పరమ మహేశ్వరులమని ప్రకటించుకొన్నారు. వైదిక మతం ప్రాధాన్యతను సంతరించుకొంటున్న కాలంలో సంస్కృత భాష ప్రాముఖ్యత పొందింది.

వైదిక లౌకిక సంస్కృతాలే విద్వజ్జనుల భాషలుగా చలామణి అవటం మొదలుపెట్టాయి. అంటే, పాలకుల మతాన్ననుసరించి భాషలు కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పాలితుల దేశీయ భాష ప్రజల నాలుకల మీదే మిగిలిపోయింది. అది కొందరి రచనలకు నోచుకున్నా రాజాదరణకు నోచుకోలేదు. ఆ కారణంగా నిలవలేదు. వెలువడ్డ రచనలన్నీ

పురిటిలోనే సంధికొట్టినట్లు అక్కడా ఇక్కడా కొన్ని పద్యాలు కన్పిస్తున్నా ఏ రచనా సంపూర్ణంగా లభించటంలేదు. అటువంటి, కాలఘట్టంలో వైదిక మత పునరుద్ధరణోద్ధేయంగా తెలుగులో మహాభారత రచనకు శ్రీకారం చుట్టాడు, రాజరాజనరేంద్రుడు. అతని కోరిక మేరకు ఆనాటి తెలుగులో నన్నయ ఈ రచన చేశాడు. అందుకు భూమికైనది, రేనాటి చోళుల కాలంలో శాసనాలకెక్కిన తెలుగుభాష. రాజులు తమమాతృభాషను అధికారభాషగా వాడటం మొదలు పెట్టాక ఈ శాసనం విడుదలైంది. తెలుగు రాజాస్థానాన్ని అలంకరించిన వచన, పద్య, చంపూ రచనారీతులు శాసనాల్లో చోటుచేసుకున్నాయి. ఆ శాసనాలు తెలుగులో సాహిత్యం వెలువడ్డానికి కారణాలయ్యాయి. ఆ పద్యశాసనాల్లో కన్పించే తొలి పద్యాలు దేశీయమైన ఛందస్సులో రచించబడ్డాయి.

దేశి-మార్గ అనే భేదాలు సాహిత్యంలో మాత్రమే కాదు, లలితకళల్లో కన్పిస్తున్నాయి. సంగీతంలో జానపదసంగీతం, శాస్త్రీయ సంగీతం అంటూ రెండు రకాలు కన్పిస్తున్నాయి. జానపదసంగీతం కాలక్రమేణా నిర్దుష్టమైన లక్షణాల్ని సంతరించుకుని, మానసికోల్లాసమే కాక, శాస్త్ర తత్వాన్ని ఏర్పరచుకున్నప్పుడు సంగీతశాస్త్రమయింది. కుండలమీద ఇంటి ముంగిలిలో, వాకిలిలో వెలసిన ముగ్గులూ, ప్రాక్తన మానవుడు గుహల్లో వేసిన చిత్రాలూ తొలినాటి చిత్రలేఖనాలకి ఉదాహరణలు అనవచ్చు. అయితే, ఆ రోజుల్లో వాడిన రంగులు, చెట్ల బెరడులు మున్నగు వాటితో తయారు చేసుకున్న రంగులు, వీటి రహస్యం తెలీకపోయినా, ఆ చిత్రాలే ఎల్లోరా గుహల్లో చిత్రాలకూ, ప్రాచీనాలయాల కప్పుల్లో కన్పించే వివిధమైన చిత్రాలకూ అవే ఆధార భూతాలనడం ఏం విశేషం కాదు. ప్రాక్తన మానవుడి గృహాది నిర్మాణ, కుండలు, బొమ్మలు ఇవన్నీ, కాలక్రమేణా పెరిగి ఆంధ్రుల శిల్పకళా విన్యాసానికి నిలువుటెత్తు ఉదాహరణలుగా చెప్పుకోదగ్గ లేపాక్షి దేవాలయాలవంటి వాటికి ఒరవడి దిద్దినవని చెప్పుకోవడానికి సందేహం అక్కర్లేదు. లయననుసరించి ఆరంభమైన నృత్తం, కాలక్రమేణా ఆంగికచలనంతోపాటు ముఖభావాలను కలగలపుకొని నృత్యంగా పరిణమించింది. ఏదైనా ఒక గేయానికీ, పదానికో వివరణను ఆహార్యాంగిక అభినయాలతో ఇవ్వటం నాట్యమనిపించు

కుంటుంది. అంటే దేశీనృత్య భంగిమలు, విలాసం సశాస్త్రీయతను సిద్ధించుకుని నాట్య శాస్త్రంగా మార్గరూపాన్ని పొందాయి.

ఈ అన్ని కళల్నీ కలుపుకునేది, అన్ని కళలకూ ఒక మాధ్యమంగా నిలిచేది కవిత్వం. కవిత్వంలో దేశి-మార్గభేదంఉందని తొలుత పేర్కొన్నవాడు నన్నెచోడుడు. మరి అతడు చెప్పిన మార్గ-దేశి విభేదాలంటే ఏంటి? నన్నెచోడుడి మతంలో సంస్కృత సాహిత్యయుత, మార్గ సాహిత్యం, దేశీయ భాషల్లో వెలువడ్డ సాహిత్యం అంతా దేశీయ సాహిత్యం. అయితే దేశీయమైన భాష, ఇతివృత్తం, ఛందస్సులను దేశీయంగా స్వీకరించి రచన చేయాలన్న భావం స్థిరపడింది. ఈ భావాన్ని ఒక ఉద్యమంగా తెలుగు సాహిత్యంలోకి తెచ్చిన వాళ్ళు శివకవులూముఖ్యంగా మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమనాథుడు. ఈరచనల ప్రభావంతో ఎన్నో రచనలు వెలువడ్డాయి. ఒక రకంగా చెప్పాలంటే పాల్కురికి సోమనాథుడి జానుతెనుగు, తర్వాతి కాలంలో వెలువడ్డ అచ్చ తెలుగు కావ్యాలకు నాంది పల్కిందని చెప్పవచ్చు. వాగ్గేయ కారుల రచనలన్నీ దేశీయ రచనారీతులకు ప్రబల సాక్ష్యం. ప్రబంధ యుగానంతరం కన్పించే దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం చాలా వరకు దేశీవాఙ్మయమే! అక్కడ పెద్ద చోటు సంపాదించుకొన్నదే యక్షగానం. సంగీత, సాహిత్య, నాట్యాలను సమ్మిళితం చేసుకున్న రూపకం యక్షగానం!

### 1.3.3 భక్తిఉద్యమం

భారతదేశ చరిత్రలో భక్తి చాలా ప్రధానమైన స్థానాన్ని పొందింది. భక్తి ఉద్యమంగా మొదలై సాహిత్యంలో ప్రధానమైన మలుపులకు కారణమైంది. పల్లవుల కాలంలోను. 7వ శతాబ్దంలో భక్తి ఒక ఉద్యమంగా పరిణమించింది. దాంట్లో శాఖలుగా శైవ, వైష్ణవ భక్తి సాహిత్యాలు వెలువడ్డాయి.

దాక్షిణాత్య భారతదేశంలో జైన, బౌద్ధ మతాలకు వ్యతిరిక్తంగా వైదిక మత వ్యాప్తిలో భాగంగానే శైవ, వైష్ణవ భక్తి సాహిత్యాలు వెలువడ్డాయి. ఒక ప్రక్క భక్తి సాహిత్యం ఒక

సంఘటిత శక్తిగా రూపాంతరం చెందింది. మరో ప్రక్క సాహిత్యంలో ఒక ప్రక్రియా వైవిధ్యంగా కూడా పరిణామం చెందింది.

"ఆ ఉన్నతమైన ప్రేమభావనే భక్తి ఉద్యమానికి నాంది అనవచ్చు. భక్తి అనే పదం సంస్కృత నుంచే ద్రావిడ భాషల్లోకి ప్రవేశించినా ఆ భావం ద్రావిడ సంస్కృతికి కొత్తది కాదు. భక్తిని సంకీర్తనల రూపంలో ప్రజల దగ్గరకు చేర్చారు. భక్త కవులు అయిన ఆళ్వార్లు, అన్నమయ్య భక్తినే తన ఊపిరిగా చేసుకుని వేంకటేశ్వరుని కీర్తించటంలో తరించాడు. వెంకటేశ్వరుని పేరు తలచినంత మాత్రనే నిలువెల్ల పులకించి భక్తి పారవశ్యంతో అనేక వేల కీర్తనల్ని ఆలపించి, ఆంధ్ర వాఙ్మయాకాశంలో ధ్రువతార అయ్యాడు."(సత్యవాణి, జె.వి. - 2009, పుట )

భక్తి సాహిత్యంలో శైవ సాహిత్యానికి చాలా ప్రముఖస్థానం ఉంది. ఈ భక్తి సాహిత్యం ఉద్యమంగా పరిణమించడానికి మొదటిదిగా మల్లికార్జున పండితారాధ్యుడి పద్యాన్ని చెప్పవచ్చు.

. . . .భక్తిమీదివలపు

బ్రాహ్మ్యంబుతో పొత్తు పాయలేను

నేను బసవలింగా. . . .! (మల్లికార్జున పండితారాధ్యుడు, శివతత్త్వసారము) ఈ పద్యం ఆనాటికి భక్తి. ఒక సంఘటిత శక్తిగా మార్పు చెందుతున్నా, ఇంకా మార్పు పూర్తికాలేదని సూచిస్తుంది. సమాజంలోని హెచ్చుతగ్గులూ, వర్ణ, వర్గ భేదాలూ కూడా కప్పబడిపోయిన ఉద్యమరూపాన్ని ఈ కాలానికింకా భక్తి ఉద్యమం రూపొందలేదు. అందువల్లే పండితుడిలో భక్తి మీద వలపున్నా, బ్రాహ్మణత్వం మీది అభిమానం పోలేదు. అదే పాల్కురికి సోమనాథుడి కాలానికి వస్తే, అతడి కృతుల్లో ప్రధానమైన బసవపురాణంలో అతడి కులగోత్రాలు సూచింపబడ్డాయి.

గొబ్బూరి మాదన్న కూరిమిశిష్య

గొబ్బూరి సంగ సద్గుణ సముత్తుంగ

. . . . . . . . . . . . . . . . . . . . .

సంగతసుఖసుధాశరధినిమగ్న

సుకృతాత్మ పాలుకురికి సోమనాథ (సోమనాథ పాల్కురికి, సుబ్రహ్మణ్యం, జి.వి. (సం.) 1969, పుట.260)

అయితే, అతడే తన పండితారాధ్యచరిత్రలో తన కులగోత్రాలను త్యజించి, బసవ గోత్రుడను, బసవ సూత్రుడననీ చెప్పుకున్నాడు.

బసవగోత్రుండను బసవని కరుణ

బసవేశుశ్రీపలిద పద్మసేవకుడ

బసవన్నపొగడ బాల్పడు కవీంద్రుడును

బసవన్న దూత, నేబసవన్నబంట (సోమన పాల్కురికి, నారాయణరావు, చిలుకూరి (సం.) 1990, పుట.4)

శైవమతంలో, ముఖ్యంగా పాల్కురికి సోమనాథుడు చేపట్టిన, తన సాహిత్య మాధ్యమంలో ప్రాచుర్యత సాధించిన వీరశైవ మత విశిష్టత ఇది. తుమ్మెద, ఏల పదాల రూపంలో శివుని పూజించడం లేదా కీర్తంచడం మాత్రమే ప్రధానాంశాలుగా ఈ సాహిత్యం సాగుతుంది. ఒకే పదాన్ని పలుసార్లు ఉచ్చరించటంవల్ల ఆ పదం లేదా నామం మంత్రమవుతుందన్న మంత్ర శాస్త్రి పరిజ్ఞానం కలిగిన వాడవటం వల్లో ఏమో పాల్కురికి సోమనాథుడు, పదే పదే శివనామాన్ని చెప్పి, దానిపట్ల అనురక్తి కలిగించాడు, శివభక్తి సామ్రాజ్యాన్ని ఆంధ్ర దేశంలో పునరుద్ధరించిన వాడీకవి.

నిజానికి, శివకవియుగం భక్తి సాహిత్యానికి నాంది మాత్రమే పలికిందనవచ్చు ఆ తర్వాత తెలుగు సాహిత్యంలో నిజానికి భక్తి సాహిత్యానికి పరాకాష్ట అనదగ్గరచన పోతన భాగవతం. నవరసాల్లో చోటుచేసుకోలేకపోయినా, తర్వాతి కాలంలో భక్తి ఒక రసంగా పరిణమించింది. ఆ రసాన్ని పోషించడంలో అందెవేసిన చేయి పోతనది. అయితే, పోతన రచనల్లో భక్తికున్న ప్రాధాన్యత మిగిలిన వాటికి లేదు. పోతన సృష్టించిన ఎన్నో పాత్రలు అతని భక్తి తత్పరత

ముందు నిలువలేదు. ప్రతి పాత్రా భక్తిని నోరారా శ్లాఘిస్తుంది. భక్తి విషయాలలో మహాభాగవతం నవవిధ భక్తి భావాల్ని చెప్పి చూపిస్తుంది.

భక్తిఉద్యమంలో ప్రధాన పాత్ర వాగ్గేయ కారులది. ఆ వాగ్గేయకారుల్లో భక్తిలో మరొక వైశిష్ట్యం కన్పిస్తుంది. వాగ్గేయకారుల రచనకేవలం భక్తిని మాత్రమే కాదు, మహాభాగవతం విత్తునాటిన మధురభక్తిని మరింత ముందుకు తీసుకెళ్ళింది. ఆ మధుర భక్తి రూపం వాగ్గేయకారుల్లో బాగా ప్రతిబింబిస్తుంది.

### 1.3.4 వాగ్గేయ కారులు - సామాజిక చైతన్యం

భక్తి సంప్రదాయానికి పట్టుకొమ్మలు మనవాగ్గేయకారులు. వాగ్గేయకారుల్లో ప్రధానంగా కనిపించే విషయాలురెండు. ఒకటి భక్తి దృక్పథం, రెండు సామాజిక దృక్పథం. భక్తిని మళ్ళీ విభాగించవచ్చు. నవవిధ భక్తుల మాటలా ఉండగా తమిళ భక్తి సంప్రదాయానన్నుసరించి తమిళంలో వైష్ణవ భక్తి సామ్రాజ్యానికి ప్రోదిచేసిన ఆళ్వారుల కవిత్వాన్ననుసరించి ఆ భక్తి కవిత్వపు పోకడలెన్నో అన్నమయ్య గ్రహించాడు.

నారాయణేతర విముఖత, సర్వమయత్వం, మేలుకొలుపు, సఖీవచనం, మానసిక ప్రబోధం, మంగళాశాసనం, మొదలైన భక్తితత్త్వ లక్షణాలను అన్నమయ్య ఆళ్వారులను అనుకరించి తెలుగులోను చేశాడు. ఆళ్వారుల పోలికలు అన్నమయ్యపై భక్తి విషయంలో, హరికీర్తనా విషయంలో సహజంగానే కనిపిస్తుంది. ఎందుకంటే దక్షిణ దేశంలో వైష్ణవాన్ని ప్రజల మధ్యకు వాళ్ళ మనస్సుల్లోకి తీసుకెళ్ళారు. ఆ ఉద్యమంలో, హరినామ సంకీర్తనా మృతాన్ని పదుగురికి పంచినవారే ఆళ్వారులూ, అన్నమయ్య కూడా. అయితే, పూర్వకవుల్లో మెచ్చదగ్గ భావాలూ, పదబంధాలు ఉంటే స్వీకరించటం కూడా అక్కడక్కడ గమనించవచ్చు. తమ భాషలోని కవుల్ని కావ్య సంప్రదాయాల్ని బాగా ఆకళించుకొని వాటిని ప్రయోగించటమే కష్టం. అటువంటిది ఇతర భాషా కావ్య సంప్రదాయాన్ని ఆకళించుకుని అత్యంత సహజంగా తన కీర్తనల్లో అన్నమయ్య చేసిన ప్రయోగాలు కొనియాడదగ్గవి'' (సత్యవాణి, జె.వి. 2009 పుట ).

ఈ మధురభక్తిలో నాయకుడు దైవం. నాయిక ప్రపంచంలోని ఏ జీవి అయినా సరే ఈ రచనల్లో కవి! దాన్ని పక్కకు పెడితే ఒక రకంగా, అప్పటి దాకా రాజాస్థానాల్లో ఉన్న కవితను ప్రజల మధ్యకు తీసుకువెళ్ళి, వాళ్ళ నోళ్ళలో నర్తనాలాడించి, ఆస్థాన సాహిత్యంగా విలసిల్లుతున్న తెలుగు సాహిత్యాన్ని ఆలయ సాహిత్యంగా మలచినవాళ్ళు వాగ్గేయకారులు. అదే ఒక గొప్ప ఉద్యమ సాహిత్యంగా అందరికీ అందుబాటులోకి వచ్చింది. శృంగార, ఆధ్యాత్మిక భక్తితత్వాలు ప్రజల హృదయాల్లోకి చాలా చిన్న చిన్న మాటలలో చేరాయి. ఒక్కో అనుభవానికీ ఒక్కో ఉదాహరణ.

### 1.3.4.1 మధురభక్తి

వదరకపోవే వాడేలవచ్చీని. . . .

ఈ మేనితో మొదటి పొందేచాలు. . . .

. . . . మువ్వగోపాలుడేలవచ్చీని.'' (క్షేత్రయ్య)

ఈ జన్మకు వాడితోటి మొదటిపొందేచాలన్నది వాచ్యార్థం. ధ్వనిగా చెప్పాలంటే ఎన్నోకోట్ల జీవరాసులున్న ఈ సువిశాల విశ్వంలో, భగవంతుడు మళ్ళీ మరొక్కసారి ప్రతి ఒక్కరు వంతుల వారిగా పల్కరిస్తూవస్తున్నావని అనుకుంటే, మరొక్కసారి మనదగ్గరకు వచ్చేసరికి ఎంతకాలంపడుతుంది? అసలు రెండోసారి రావాల్సిన అవసరం ఏముంది? ఒక్కసారి కన్నులారా కాంచి, మనసారా ఆ అనుభవాన్ని పంచుకున్నాక, అది అనుభూతిగా పరిణమించాక ఆపొందేచాలు. కన్నుమూసినా, భూమితో సంబంధం తీరిపోయినా! ఈఆత్మానుభూతిని, ఆత్మ సమర్పణా భావాన్ని చెప్పగలిగేది ఈ మధుర భక్తి మాత్రమే!

### 1.3.4.2 ఆధ్యాత్మికత

అన్ని నీవనుచూ అంతరంగమున. . . .

నిన్నెగాని ఒరుల ఎన్నజాలమదిని. . . . (త్యాగయ్య)

ఆ సర్వంతర్యామిత్వాన్ని దర్శించటమే భక్తి పరమావధి. ఆదర్శనం దొరికాక మరిక కోరేదీ, కోరదగ్గదీ ఏదీలేదు. అనన్యత సుఖంగా ప్రాప్తిస్తుంది.

### 1.3.4.3 భక్తితత్త్వం

శివదీక్షాపరురాలనురా

శివశివ. . . . శ్రీవైష్ణవుడంటే కూడనురా! (శీనయ్య, ఘనం)

దైవానురాగం ఇలాంటిది. ఇతర దైవతాలమీద విముఖత, ఇష్టదైవం పట్ల అత్యంతనురక్తి ఈ భక్తిభావలక్షణాలు. సరిగా చెప్పాలంటే అన్యవిముఖత శివ. విష్ణుభక్తుల నడుమ ప్రారంభమైనదే, పెరిగి, రాజ్యాలు కబళించి, చరిత్రలో ఒక మచ్చగా కూడా మిగిలిపోయింది.

### 1.3.4.4 రాజనిరసన

''హరిపుట్టించిన దేహం హరినేకొలవక

నరుల కొలుచుట అన్యాయమయ్య'' (ఆధ్యా-8-67) (అన్నమయ్య)

హరిని కీర్తించే తానితరులను కీర్తించనని అన్నమయ్య అనడానికి, చెప్పబడ్డ కారణాలు ఎన్నున్నా ఎలా ఉన్నా సరే, వానికున్న సరైన లక్షణం, నిజంగా ఇవ్వాల్సిన వివరణా ఇవి అనటంలో అతిశయోక్తిలేదు. ఆనాటిదాకా కవిత్వాన్నిపోషించింది రాజులు, రాజులను పొగడుతూ, వారి వంశాలకు సూర్య చంద్ర వంశ మర్యాదల్ని ఆపాదిస్తూ, కవులు వాళ్ళ కీర్తిని గానం చేశారు. ఇది ఉభయకుశలోపరి అయిన విధానం అయితే, ఇంతటితో అయిపోలేదు. ప్రతీకవీ తన కవిత్వాన్ని రాజులకిచ్చి, ఆ ధన సంపత్తులతో ఉన్నతంగా జీవించాలని కోరుకోలేదు. పోతన, కేవలం తన భక్తిని చాటుకోవడానికి 'పలికించెడి వాడు రామభద్రుండు' (పోతన)అని తాను 'పలికిన భవహరమగునట' అన్న దాన్ని నమ్మి రచించాడు. అందుకే ''నిన్ను నాకటికింగొనిపోయి అల్ల కర్ణాట కరాటకీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ముభారతీ!'' (పోతన) అన్నాడు. ఈ విధంగా కవిత్వం ఆస్థానాలనుంచి బయటకొచ్చింది ఆలయాన్ని ఆలవాలంగా చేసుకుని ఎదిగినదే వాగ్గేయకారుల కవిత్వం. అవి ఆలయాల్లో

సంకీర్తనలరూపంలోనూ, నాట్యోప భోగాల్లోనూ వాడబడ్డాయి.

"అలరులు కురియనాడెనదే

అలకులకులుకుల అలమేల్మంగా" (అన్నమయ్య)

అదే అన్నమయ్య భగవత్సృష్టిలో హెచ్చు తగ్గుల్లేవని గానం చేశాడు.

'మెండైనరాజునిద్ర అదియునొకటే

అండనే బంటునిద్ర నదియూనొకటే

మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమియొకటే

చండాలుండేటి సరిభూమి ఒకటే" (అన్నమయ్య)

చరాచరసృష్టి చేసే ఆ భగవంతుడి దృష్టిలో అన్నీ ఒక్కటేనంటూ సర్వసమత్వాన్ని చాటాడు.

### 1.3.5 సంప్రదాయ కవిత్వం - ప్రాంతీయత

మాండలికం, స్థానికం, ప్రాంతీయతా భేదాలు నిజానికి భాషకు సంబంధించినవి. సంప్రదాయ కవిత్వంలో వీటి గురించి చెప్పాలంటే, నన్నయ నన్నెచోడులే ప్రధానోదాహరణాలు. నన్నయ రచనలో వాఁడు, వీఁడు, వీఁగు వంటి ప్రయోగాలుంటే, నన్నెచోడుడు పూర్ణానుస్వారంతో వాండు, వీండు, వీంగు వంటి ప్రయోగాలు చేశాడు. ఇది మాండలికభేదం. దీనినే ఆధునికంగా ప్రాంతీయభేదం అంటున్నాం. ఈ ప్రాంతీయత అన్నదాన్ని కవికి తాను నివసించే, ముఖ్యంగా జన్మస్థానం మీదా, స్వభాషమీద ఉండే అభిమానంగా నిర్వచించవచ్చు.

(అ) నన్నయ భారతంలో రెండు మూడు స్థలాల్లో వేంగి మీది అభిమానాన్ని వాచ్యం చేయడం కన్పిస్తుంది. అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళాడు. అప్పుడు, చూసిన ఆంధ్ర దేశాన్ని కూడా నన్నయ వర్ణించాడు.

అనఘమై శిష్టాగ్రహార భూయిష్టమై

ధరణీసురోత్తమాధ్వరవిధాన

పుణ్య సమృద్ధమై పొలుచు వేగిదేశ

విభవంబు చూచుచు (ఆది-8-139)

సహదేవుడు దక్షిణదేశ దిగ్విజయ యాత్రకు వెళ్ళాడు. అలా వెళ్ళి చాలామంది రాజులను గెలిచాడు. అయితే, నన్నయగారి దేశాభిమానం ఎంతటిదంటే అందులో ఆంధ్రదేశం, రాజమహేంద్రవర ప్రసక్తిలేదు.

నన్నెచోడుడు ఉరయూరు గురించి ప్రసక్తితేవడమేకాదు తన ప్రాంతీయ భాషను కూడా వాడాడు. (నన్నెచోడుడు, కుమారసంభవం)

పాల్కురికి సోమనను చెప్పాల్సిన పనిలేదు. అతని రచనలనిండా స్థానిక భక్తులకథలే! ప్రాంతాలననుసరించి భాషనూ వాడాడు. పండితారాధ్య చరిత్రలో పర్వత ప్రకరణంలో వివిధ ప్రాంతాలవాడు శ్రీపర్వత సందర్శనానికి వచ్చినప్పుడు, ఎవరెవరి వేష భాషలెలా ఉన్నాయని వర్ణిస్తాడు. ప్రాంతీయతారచనకిది చక్కటి తార్కాణం!

తిక్కన భాషే అతని ప్రాంతీయతకు నిదర్శనం. అది చక్కటి చిక్కటి తేట తెలుగు. ఎఱ్ఱన వర్ణించిన వలస అతని ప్రాంతానిదే తప్ప వేరుకాదు. పోతన హాలికుడు. మట్టివాసనా, మీగడపెరుగూ, మాగాయపచ్చడీ అతని ప్రాంతీయతకు ప్రత్యక్షసాక్ష్యాలు. పెద్దన వర్ణించిన ప్రవరుడు పెరిటికల్పతరువు, వేలుపుగిడ్డికాపు. ఇవన్నీ ఆనాటి విజయనగరంలోని బ్రాహ్మణులకు అక్షరరూపాలే! ఆనాటి గృహస్థ ధర్మాన్ని చక్కగా ఆవిష్కరించాడు. తెనాలి రామలింగడి తుంగభద్ర వర్ణన, ప్రశంసా ప్రాంతీయాభిమానానికి నిదర్శనలు.

గంగాసంగ మిచ్చగించునె మదిన్ గావేరిదేవిరిగా

నంగీకారమొనర్చునే యమునతో నానందముంబొందునే!

రంగత్తుంగ తరంగ హస్తముల నారత్నాక రౌద్రుండునీ

యంగంబంటి సుఖించునేని గుణభద్రా! తుంగభద్రానదీ!

(రామకృష్ణుడు, తెనాలి పాండురంగమహాత్మ్యం, పుట 139)

దక్షిణాంధ్ర వాఙ్మయంలో తరచి చూస్తే, వెలువడ్డ రచనల్లో చాలావరకు యక్షగానాలూ, నాటకాలూ, విలాసాలూ, అభ్యుదయ కావ్యాలును! వీటిలో ఎన్నో తమరాజుల్నీ, రాజధానుల్నీ పేర్కొంటాయి. ఉదా- తంజాపురాన్నదాన మహానాటకం, రఘునాథ నాయకాభ్యుదయం, మన్నారుదాస విలాసం, హాలాస్య మాహాత్మ్యం అన్నీ రాజు, రాజధాని, క్షేత్రం ఏదైనా కానీ ఆయాప్రాంతాలలోని విశేషాంశాలే!

### 1.3.6 శతకకర్తలూ - ప్రాంతీయత

శతకం అనగానే సంఖ్యానియమం, మకుటనియమం వీటితోపాటు భక్తికి సంబంధించిన శతకాలన్నీ అవి స్తుతులైనా, వ్యాజ్యనిందాస్తుతులైనా సరే ఆయా ప్రాంతాల్లో వెలసిన దైవాన్ని కీర్తించేవే! అంటే ఆ స్థల మాహాత్మ్యం అంతో ఇంతో ప్రసక్తమవుతుంది. ఆ ప్రసక్తి చేసిన కొందరు శతక కర్తలు-శతకాలు:

(అ) అన్నమయ్య

(ఆ) రామదాసు

(ఇ) ధూర్జటి

(ఈ) సింహాద్రి నారసింహ శతకం

(ఉ) ఆంధ్ర విష్ణుశతకం

### 1.3.7 స్థలమహాత్మ్యాలు

స్థల మాహాత్మ్యాలన్నీ ఈ కోవకు చెందినవే! నిజానికి చెప్పాలంటే శ్రీనాథుడి రచనల్లో చాలావరకు స్థలమాహాత్మ్యాలే!

(అ) భీమఖండం

(ఆ) కాశీఖండం

(ఇ) క్రీడాభిరామం

(ఈ) కాళహస్తీశ్వర మహాత్మ్యం

(ఉ) పాండురంగమహాత్మ్యం

(ఊ) హాలాస్యపురాణం

ఇవన్నీ ఆయా స్థలాల్లో వెలసిన దైవాల్ని, ప్రాంతీయకథల ఉపపత్తులతో కీర్తించేవే!

సాంప్రదాయ కవిత్వంలో ఇన్ని రకాల వివిధ రచనల్లో వివిధ దశల్లో ప్రాంతీయత ఏదో ఒక రకంగా చోటు చేసుకుంది. ఆధునిక యుగంలో ఈ విషయాలపట్ల అవగాహనా ఆవశ్యకత కూడా పెరిగాయి. అందువల్ల ప్రాంతీయత ఆధునికయుగ రచనల్లో మరింత ఎక్కువ.

### 1.4 ఆధునిక సాహిత్యం - ఉద్యమాలు

భారతదేశం అన్యాక్రాంతమైన తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభమయిన వేళ, దేశభాషల్లో దేశభక్తి ప్రేరకాలైన రచనల అవసరం ఏర్పడింది. ఆంగ్ల కవిత్వ కాల్పనికోద్యమం ప్రపంచభాషల్లో ఒక కొత్త రచనారీతికి నాంది పలికింది. ఆ ఉద్యమ ప్రభావంతో పాశ్చాత్య సాహిత్యంతో కొద్దోగొప్పో సంబంధం కలిగిన వారందరూ ఆ సరికొత్త రచనారీతిని తమ భాషలోకి తేవాలని యత్నించారు. దాని ఫలితంగా వచనకవిత్వం ఉద్భవించింది.

“ఏ తరంలోని సాహిత్యమైనా తనకాలపు ఆలోచనల స్వభావాదులను ప్రతిబింబిస్తుంది. ఒక యుగం వెనుకటి యుగపు సాహిత్య ప్రమాణాలను గుడ్డిగా అనుకరించదు, అది వర్తమాన కాలంనుంచి ఆవేశాన్ని పొందుతుంది. విషయ స్వీకరణలో, భావవ్యక్తీకరణలో రెండింటా తన లక్ష్యం జీవితవిమర్శే కానీ, నిర్జీవ పదార్థవిమర్శ కానేకాదని ఉద్ఘాటిస్తుంది. (నారాయణరెడ్డి, సి. 1977, పు.160)

స్వేచ్ఛాప్రియత్వం, ఆధునికత మీద ఆసక్తి పలుపోకడలకు కారణమయ్యాయి.

స్వాతంత్ర్యోద్యమం, సమీకృత శక్తి, స్వదేశీవస్తు నిరాకరణ, 'వందేమాతరం' అనే నినాదం దిక్కుల్ని ఏకం చేశాయి. భారతదేశమంతటా ఒకేరకమైన ఉద్రిక్త, ఉద్యమ వాతావరణం నెలకొంది. భాషాభిమానం, భాషాభివృద్ధికి తగిన యత్నాలు, ఈకాలంలో ప్రతిభాషకు సహజమయ్యాయి. సంక్షిప్త శైలి, నూత్నగంభీరభావాలు, నూతన సంప్రదాయాలు అపరిచిత వస్తు సామగ్రి ఆశాభరితాలైన రచనలు కొత్తగా వస్తున్నాయి. ఆ భావ పరంపరకు కొత్తయుగం నాంది పలికింది.

క్షీణయుగం అంటూ సాహిత్య చరిత్రకారులు పేర్కొన్న కాలం నిజానికి సంధియుగం. కొత్తగా నిఘంటునిర్మాణం, సాహిత్య చరిత్రల ఆవశ్యకత, గద్య రచనారీతి ప్రారంభ మయ్యాయి. తెలుగు ప్రాచీన కావ్యాలసేకరణ అనతికాలంలోనే ప్రారంభమయింది. వచన రచనలకు కొద్దికొద్దిగా ప్రాముఖ్యత ఎక్కువ కాసాగింది. ఆధునిక సాహిత్య యుగారంభంలోనే ఇద్దరు యుగకర్తలు లభించటం తెలుగు కవిత్వం చేసుకొన్న అదృష్టం.

### 1.4.1 నవ్యకవిత్వ లక్షణాలు

"నవీన గుణములు కల్గిన సమస్తాదునిక కవిత్వమునకు ఈ మూడు (నవ్యకవిత్వం) సరిపడును.చిన్న కథతో, ఒకటి రెండు పాత్రలతో, కొన్ని సన్నివేశములతో, ఆధునిక కవులు రచించిన లఘుకావ్యములకు భావకవిత్వము, లిరికల్ పొయిట్రీ అన్నమాటలు సరిపోవును." (నారాయణరెడ్డి, సి. 1977, పుట.163)

ఆధునిక సాహిత్య చరిత్రలో నవ్యకవిత్వం ప్రత్యేకతను సంతరించుకొంది.

#### 1.4.1.1 ఖండకావ్య ప్రక్రియ

అగ్రహారాదులిచ్చి పోషించే రసజ్ఞులైన రాజశేఖరులచే కవిత పోషింపబడిన కాలం అంతరించిపోయింది. ఆలయప్రాకారంలో భగవదంకిత చర్యగా కీర్తించిన కవిత్వం వెనుక ముఖం పట్టింది. తక్కువకాలంలో, తక్కువ విషయాన్ని చదివి ఆనందించే రకమైన సాహిత్యం ఆవశ్యకమైంది. అంతటితో చిన్న పరిధిని స్పష్టీకరిస్తూ, తక్కువ వ్యవధిలో భావాన్ని పరిమిత

విధానంలో వ్యక్తపరచడం ఈ యుగలక్షణమైంది. పాశ్చాత్య ఖండకావ్య రచనలు కవుల్ని ఆకట్టుకున్నాయి. ఖండకావ్యాలు అన్ని భాషల్లో వెలువడ్డం ప్రారంభమయింది. ఈ రచనలు ఎందరినో ఆకట్టుకున్నాయి. మహాకావ్యాల్లో రసవద్ఘట్టాలుగాని, ఏకపాత్రల అభివ్యక్తి రూపాలుగాని, కొన్ని పద్యాలుకాని రాసినప్పుడు అవి చక్కటి ఖండకావ్యాలవుతున్నాయి. రాయప్రోలు వారి తృణకంకణం, గురజాడవారి పూర్ణిమ, కన్యక వంటివి చక్కటి ఖండకావ్యాలు.

### 1.4.1.2 ఆత్మాశ్రయరీతి

కవిత్వం వస్త్వాశ్రయం, ఆత్మాశ్రయం అంటూ రెండు విధాలు. వస్త్వాశ్రయ కవిత్వంలో నాయికా నాయకులద్వారా కవి తన అభిప్రాయాలు ప్రకటిస్తాడు. ఈ నాయికా నాయకులు దివ్యాదివ్యులు, అదివ్యులు, దివ్యులని మూడు రకాలు. ప్రాచీన సాహిత్యంలో శతక కర్తలందరూ ఆత్మాశ్రయ కవిత్వ రీతిలో రచించినవారే!

ఆత్మాశ్రయ కవితలో కవి ఎప్పుడూ తన్ను ఉన్నతుడిగా, సంస్కార వంతుడిగానే భావించి రచించాల్సిన అవసరం లేదు. పాపిగా, పకీరుగా, పాదుషాగా, వర్తకుడుగా, రాయిగా, రత్నంగా ఉన్నతంగానో, అతి తేలికగానో ఎలాగైనా ఊహించుకోవచ్చు. అందుకే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. . "ఉత్తమమైన ఆత్మపరమైన కావ్యంలో ఉన్నత కవిత్వలావణ్యం మరొక కావ్యంలో ఉండదు. ఊపినచోట అది ఊపినంత మరొకటి ఊపదు" (నారాయణరెడ్డి, సి. ఆధునికాంధ్రకవిత్వం - సంప్రదాయాలు ప్రయోగాలు, 1977, పుట.169) అంటారు.

### 1.4.1.3 వస్తునవ్యత

ప్రాచీన కావ్యములలోని పాత్రలు గంధర్వాది దేవ జాతులకు చెందినవో, లేక ఉత్తమ కులజులవో అయి ఉంటాయి. ఎక్కడో అక్కడక్కడ, ఇతరుల గురించిన ప్రసక్తి ఉండేది అంతే! అయితే, ఆధునిక కవిత్వంలో విషయానికెవరైనా నాయికానాయకులు కావచ్చు.

"కుక్కపిల్లా అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా - కాదేదీ కవితకనర్హం" (శ్రీశ్రీ, మహాప్రస్థానం) ఎంకిపాటల్లో చోటుచేసుకొన్న జానపద జీవితమే అయినా, మధురగంభీర భావనలు, తాత్త్వికత, జీవన విధానం వాటిని జానపద గేయాల స్థానాన్నుంచి కావ్యగౌరవాన్ని కల్పించాయి. ఇటువంటి రచనలు జాతిజీవనానికి ప్రతిబింబాలూ, పట్టుకొమ్మలూ (సత్యవాణి, జె.వి. ఎంకి-నాయుడుబావ, అముద్రితవ్యాసం) ఆధునిక కవిత్వంలో కన్పించే మరో ముఖ్యమైన మార్పు స్త్రీవర్ణన. ప్రాచీన కావ్యాల్లో స్త్రీ అంగాంగ వర్ణన అధికంగా ఉండేది. నఖశిఖ పర్యంత వర్ణనలో కవులు పోటీ పడ్డారు. ఆధునిక యుగంలో కన్యకాసౌందర్యం ఏదో తాత్త్వికతతో ముడివడింది. అందుకు గురజాడ పూర్ణమ్మ నిలువెత్తు సాక్ష్యం.

### 1.4.1.4 భావనవ్యత

పురాణాదులు వస్తుప్రధానాలు. ప్రబంధాలు వర్ణనా ప్రధానాలు. కావ్యాలు రసప్రధానాలు. కథాప్రాధాన్యం కన్నా వర్ణనా ప్రాధాన్యం ఎక్కువయిన తర్వాత సాహిత్యంలో ఒకే విధమైన రచనలు రాసాగాయి. ఆధునిక యుగంలో భావాల్లో మార్పు కన్పిస్తోంది. ఊహల డోలికల్లో ఉర్రూతలూగించడం మానివేశారు. అష్టాదశ వర్ణనల నిబంధనలు తొలగిపోయాయి. కవి సమయాలు చాలావరకు తగ్గిపోయాయి. అర్ధరాత్రియమున నల్లగానే ఉంది. ఇసుక తిన్నెలు తెల్లగానే కన్పిస్తుంటే, మింట చుక్కలు మినుకుమినుకు మంటుంటే, గాలిమాత్రం ఎక్కడి వేణునాదాన్నో మోసుకొస్తుంటే ఆనందనందనుణ్ణి అన్వేషించే గోపిక చూసిన ప్రకృతి వర్ణనలోని సహజత్వం భావనవ్యత మానసిక ఉద్వేగాలకు ప్రాముఖ్యతనిచ్చాయి.

### 1.4.1.5 పదప్రయోగం

ఆధునిక కాలపుకవులు కొత్త పదజాలాన్ని వాడటం మొదలుపెట్టారు. కుమ్మరి కుండలు చేసినట్లు కొత్త పదాలనెవరూ సృష్టించరు. భాషలోని పదాల్ని భావాలకనుగుణంగా భావ వైవిధ్యానికి తగినట్టుగా కొన్నిసార్లు పదాలపరికల్పన చేస్తుంటారు. ఆధునిక కవిత్వంలోనూ ఆరంభకాలంలో గణపూరణ కోసం పదాలు వాడబడ్డ తర్వాత కవిత వచన కవితా రూపాన్ని

సంతరించుకున్నాక, లయకే తప్ప గణాలకు ప్రాముఖ్యత తగ్గాక ఈ వ్యర్థ పద ప్రయోగావసరం చాలా వరకు తగ్గిపోయింది. గిడుగువారి ఉద్యమం తర్వాత గురజాడ వారి స్ఫూర్తితో వ్యావహారిక భాషకు కావ్యత్వం సిద్ధించింది. ఆ వ్యావహారిక భాషా ధోరణివల్లే మాండలిక, స్థానిక, ప్రాంతీయ భాషలకు రచనల్లో చోటు స్థిరపడింది. ఒక రకంగా చెప్పాలంటే ఈ భాషా వాదమే ప్రాంతీయవాదానికి మూల మంత్రమయింది. మరోరకంగా చెప్పాలంటే ఆధునిక కాలంలో 'దేశికవిత'కు నిజమైన స్థానం లభించింది.

### 1.4.1.6 ప్రక్రియా బాహుళ్యం

ఒకప్పుడు గణిత, వైద్య, రత్న, అశ్వ, గజ, శస్త్ర, సస్య శాస్త్రాలకు కూడా పద్యమే మాధ్యమంగా ఉండేది. నాటక లక్షణాలున్న కావ్యాలుకూడా చాలావరకు తెలుగులో పద్యంలోనే నడిచాయి. ఆధునిక కవిత్వంలో ఎన్నో ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. రూపవైవిధ్యమే కాదు. వస్తు వైవిధ్యం కూడా ప్రక్రియా బాహుళ్యానికి దోహదం చేసింది. ఒక్క భావకవిత్వంలోనే ప్రకృతి కవిత్వం, పల్లీజనకవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, భక్తి కవిత్వం, కథాకవిత్వం, స్మృతి గేయాలు, బాల గేయాలు అంటూ ఎన్నో శాఖలు ఉద్భవించాయి. విప్లవ, అభ్యుదయ, దిగంబర, మైనారిటీ, స్త్రీవాద, దళితవాద, ప్రాంతీయవాదాలు కూడా కవిత్వంలో వచ్చిన శాఖలే!

### 1.4.2 కవిత్వ శాఖలు

ఆంగ్ల సాహిత్యాదుల సంపర్కంతో, పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో భారతీయ భాషల్లో వివిధ కవిత్వ శాఖలు పుట్టాయి. కాల్పనికోద్యమం రూసో ప్రభావం వల్ల ప్రపంచభాషల్లో చోటుచేసుకుంది. ఇతడు మానవతావాదాన్ని ప్రతిపాదించాడు. రూసో తన సిద్ధాంతాన్ని క్లుప్తంగా ఇలా అందించాడు. "The worth and dignity of man as man, and the power of natural scenary to respond to his needs (The age of Wordsworth, p.16) మానవత్వపు గుణాలు, ప్రేమ, దేశభక్తి, ప్రకృతి ఆరాధన ఈ రకం రచనల్లో ప్రధాన స్థానాన్ని పొందాయి. (నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వం- సంప్రదాయాలు - ప్రయోగాలు, 1977, పుట.186)

### 1.4.2.1 భావకవిత్వం

భావకవిత్వం, గురజాడ, రాయప్రోలు వారిద్దరూ తెలుగు సాహిత్యానికి నాటిన కొత్త పైరు. శ్రీ.శ్రీ కూడా తొలికాలంలో భావకవిత్వం రాసినవైనం ఈ కవిత్వ శాఖ ప్రాబల్యాన్ని చాటుతోంది. విశ్వనాథ, వెంకటపార్వతీశకవులు, కృష్ణశాస్త్రి, దువ్వూరి, బసవరాజు, నాయిని, పింగళి, కాటూరి, జాషువా, తుమ్మల, బాపిరాజు, తల్లావజ్ఝల, కరుణశ్రీ అంటూ ఈ పట్టికలో చేరే కవులకు లెక్కలేదు.

రాయప్రోలు వారు 'భావపదము', 'భావగీతము' అనే పదాలు వాడారు. విశ్వనాథ వారి గిరికుమార ప్రేమగీతాలలో, కృష్ణశాస్త్రి వారి ఊర్వశిలలో 'భావగీతము' అనే పదం కన్పిస్తుంది. తృణకంకణంలోని ప్రకాశకుల విజ్ఞప్తిలో తొట్టతొలిసారిగా గాడిచర్ల వారు 'భావకవిత్వ' మనే పదాన్ని వాడారు. ఈ కవులు రూపంకూడా మార్చుకున్నారు. భావకవిత్వానికెన్నో నిర్వచనాలున్నా విశ్వనాథవారి నిర్వచనం గణనీయం. "కవియొక్క ఒక అవిస్పష్టవాంఛాంకురము, ఒక అంతర్నిగూఢతాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడిన"చో అది భావకవిత్వమన్నారు. ఇది ఆంగ్లంలోని lyric poetry కి చాలా దగ్గరగా ఉంది.

"The lyric has the function of revealing, in terms of pure art, the secrets of the inner life, its hopes, its fantastic joys, it sorrows its delirium" (నారాయణ రెడ్డి, సి. 1997 పుట 303)

భావకవిత్వంలో కథ తప్పకుండా ఉండాలని లేదు. కథావస్తువులేని శతకాలు, గాథాసప్తశతులు వంటి రచనల్లాంటివి సుందర కవితకు నిదర్శనాలే! రసం కవిత్వానికి అతి ముఖ్యమైనా, వస్త్వాశ్రయం కాని రచనల్లో రసాస్వాదన అంతసులభం కాదు. అయితే, ఒక్కొక్క భావ వివరణలో రససిద్ధి కలుగుతుంది. కొన్ని వాక్యసముదాయాలు రసస్ఫూర్తిని కలిగించ వచ్చు. భాగవతంలోని గోపిక కల్గించే రససిద్ధి కథాపూర్ణకంగా కాకుండా చదివినా సిద్ధిస్తుందికదా! అలాగే, ఖండకావ్యాల్లోని కొన్ని పద్యాలు లేదా పాదాలు రససిద్ధిని కలిగించవచ్చు.

కలువలచేరెను కన్నుల కాంతులు

హంసల చేరెను నడకల బెడుగులు

దుర్గను చేరెను పూర్ణమ్మ (గురజాడ, పూర్ణమ్మ) అన్న కొన్ని పాదాలే శోకరసస్ఫూర్తినే కాదు సిద్ధినికూడా కల్గిస్తున్నాయికదా!

కొద్దికాలం తర్వాత భావకవిత్వమంత నిందకు, హేళనకు గురైన కవిత్వోద్యమం మరొకటి లేదనవచ్చు. ఉమాకాంతం పండితులు, అనంతపంతుల రామలింగస్వామి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, ముఖ్యంగా భావకవిత్వంగురించి వ్యతిరేకంగా మాట్లాడారు. అందులో 'శబ్దవాచ్యత' ఎక్కువని వ్యంగ్యంగా అన్నారు. భావకవిత్వాన్ని 'బావ' కవిత్వమనీ, భావంలేని కవిత్వమనీ విమర్శించినవాళ్ళున్నారు. అధికసంఖ్యాకులైన ఆధునిక కవులు ఆదరించిన ఈ కవిత్వశాఖ అనుకరణవల్లా, అందరూ రాయడానికి యత్నించినందువల్లా కూడా విమర్శకు గురియిందని చెప్పవచ్చు.

### 1.4.2.2 ప్రణయ కవిత్వం

భావకవిత్వం రాసిన వాళ్ళల్లో చాలా మంది ఆంగ్ల విద్యాభ్యాసం చేసినవాళ్ళే! వాళ్ళంతా ఆంగ్లసాహిత్యంలోని భావకవుల ప్రేమగీతాల వల్ల ప్రభావితమైన వాళ్ళే! ప్రేమించటం చాలా ఉదాత్తమైనదిగా భావించేవాళ్ళే! అయితే, ఈ భావకవుల్లో చాలామంది ఊహానాయికలతో ప్రణయాన్ని, అందులోనూ ముఖ్యంగా వియోగశృంగారాన్ని వర్ణించిన వాళ్ళే! స్త్రీవిద్యావశ్యకత గుర్తించి ఆమె మానసిక ఇబ్బందుల్ని ఏదోరకంగా వర్ణించారు.

ఈ ప్రణయ కవిత్వం రెండు రకాలు. 1. వస్త్వాశ్రయరీతి (objective trend) 2.ఆత్మాశ్రయరీతి (Subjective trend) మొదటి రీతికి అబ్బూరి వారి 'మల్లికాంబ', దువ్వూరివారి 'కడపటి వీడ్కోలు', వెంకటపార్వతీశ్వరుల 'జలమాలిక' మొదలైనవి ఉదాహరణలు, రెండవరీతి స్వచ్ఛంద ప్రేమను వర్ణిస్తుంది. ప్రేమ ప్రకృతి సహజమనిపిస్తుంది.

'సౌరభములేలచిమ్ముపుష్పవ్రజంబు

చంద్రికనేలవెదజల్లు చందమామ

ఏలసలిలంబుపాఋ? గాడ్పేల విసురు?

ఏల నా హృదయంబు ప్రేమించునిన్ను" (కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం)

ఈ రెండోరీతిలో పూర్వరాగం, సంయోగదశ, ఆశాభంగం విప్రలంభం, విషాదస్థితి, నిరాశావాదం, విషాధ మాధురి, కులపాలికా ప్రణయం వంటి భేదాలు చూపట్టాయి. ఆధునిక సాహిత్యంలో ఏకవీ ఈ రకం రచనల్ని చేయకుండా ఉండలేదనటం అతిశయోక్తి కాదేమో!

### 1.4.2.3 దేశభక్తి కవిత్వం

భావకవిత్వశాఖలో అత్యంత ప్రాముఖ్యం వహించిన శాఖల్లో అగ్రగణ్యంగా ఎన్నవలసింది దేశభక్తికవిత్వాన్నే! భారతదేశ స్వాతంత్ర్యానికి ఈ కవిత్వం దోహదకారి అయింది. నిజానికి 1905కు ముందు భారతదేశంలో స్వాతంత్ర్య దాహం, జాతీయోద్యమం బలపడలేదు. 1905 వంగదేశం రెండు ముక్కలవటంతో ఉద్యమం భగ్గుమంది. భారతీయుల గుండెలమంట చిచ్చుగా మారింది. భారతదేశంలోని ప్రజలందరి గుండెల్లో రేగిన ఆ మంటలకు జవాబుగా ప్రతిభాషా కవి లేఖినీ దేశభక్తి కవిత్వాన్ని జాలువార్చింది. 1906లో రాజమహేంద్రవరంలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసం విని ఉద్రిక్తులైన చిలకమర్తి వారి పద్యం ఆనాడు ఆంధ్ర దేశమంతటా మారుమోగింది. స్వాతంత్ర్యపోరాటంలో భాగమైన ప్రతి ఉద్యమం, ప్రతి సంఘటన కవితాగానానికి నాంది పలికాయి. ప్రతి ప్రక్రియలోకీ ఈ దేశభక్తి పారింది. నవలల్లోని పాత్రలుకూడా దేశభక్తి గేయాలు ఆలపించారు. ప్రతి భారతీయుడినీ ఉద్రూతలూగించిన, ఆంగ్ల సామ్రాజ్యాధికారుల గుండెల్లో నిద్రించిన 'వందేమాతరం' బంకించంద్ ఛటర్జీ రాసిన ఆనందమఠ్ అనే నవలలోదే!

చిలకమర్తివారి భరతఖండంబు, మంగిపూడి వెంకటశర్మగారి ఆంధ్రభారతి, రాయప్రోలు వారి ఆంధ్రావళి ఈ రీతి రచనల్లో ప్రధానంగా పేర్కొనదగ్గవి. నాయకుల ప్రశస్తికోసం, నాయకుల స్మృతితో రచించిన రచనలే కాకుండా ప్రచారగీతాలు, పూర్వ చరిత్ర ఘటనలూ, శౌర్యప్రశస్తి, ఐశ్వర్య, కళాప్రశస్తి, దేశాభిమానం, నదీ ప్రశస్తి అంటూ ప్రారంభమయి ఆంధ్ర

ప్రశస్తి, ఆంధ్ర నదుల ప్రశస్తి ఎక్కువయి, చివరకు అభిమానం దురభిమానమై ఇతర భాషా ప్రాంతాలను తిరస్కరించే స్థితికి వచ్చింది.

### 1.4.2.4 ప్రకృతి కవిత్వం

ప్రకృతిలో భాగం మానవుడు. పంచభూతాత్మకమైన ప్రకృతిని భారతీయులు వేదకాలంనుంచి కూడా ఆరాధిస్తూనే ఉన్నారు. చెట్లు, నదులు, కొండలు దైవ స్వరూపాలుగా కొలవబడ్డాయి. ఆధునిక కవులకు ప్రబంధకవులు చాలాదూరం. వీరి దృష్టిలో చాలామార్పు వచ్చింది. ప్రకృతిని స్వీయసుఖదుఃఖ ప్రకటనకూ, ఆత్మానుభూతి సమున్మీల స్థితికి ఆలంబనగానూ చేసుకున్నారు. పంచేద్రియాల్లోని భౌతిక చర్మచక్షువుల్ని దాటి ప్రకృతి ఆధునిక కవుల అంతర్నేత్రాల్లోకి ప్రవేశించింది.

ఆంగ్ల సాహిత్యంలోని కాల్పనిక కవితా సంప్రదాయంలో ప్రకృతి ప్రీతి, ప్రకృతిమీది ఆరాధన చాలా ప్రాధాన్యాన్ని పొందాయి. ప్రకృతి భౌతికానందం, అంతర్ముఖానందం, తాదాత్మ్యం, పారమార్థికత, బాల్య ప్రకృతి, అనే భేదాలేకాకుండా పల్లీ జన ప్రకృతి, వివిధ వృత్తుల వారి జీవితాలు కూడా ఈ రకం రచనల్లో చోటుచేసుకున్నాయి.

### 1.4.2.5 సంఘసంస్కరణ కవిత్వం

ఆంధ్రదేశంలో 19వ శతాబ్దంలోనే వీరేశలింగం పంతులుగారు సంఘసంస్కరణం ప్రారంభించారు. ఈ ఉద్యమంలో రఘుపతివేంకటరత్నంగారు కుడిభుజంగానిలిస్తే, భాషాసాహిత్యరంగాల్లో గిడుగు, గురజాడలు సాధించిన విషయాల్లోనేకాక ఉద్యమంలోనూ సూర్య చంద్రులుగా వెలిశారు. సంఘసంస్కరణ రచనల్లో కొన్ని అంశాలు ప్రధానంగా చోటుచేసుకున్నాయి. అవి- దురాచార నిరసనం, వర్ణవ్యవస్థా నిరసనం, సంఘ వ్యవస్థా నిరసనం, గాంధేయ దృక్పథం మొదలైనవి.

### 1.4.2.6 భక్తి కవిత్వం

భావకవిత్వశాఖల్లో భక్తికవిత్వం ఒక ముఖ్యమైన శాఖ. ఆధునిక కవి సృష్టి అంతా

ఒక్కటే! పరమేశ్వరుడొక్కడే, తాపత్రాయలలో దహించుకుపోతున్న ఈ లోకానికి భగవంతుడొక్కడే శరణ్యమని గ్రహించాడు. ప్రకృతి అంతా ఆ భగవంతుడి ఆనంద హాసలేశంగానే భావించాడు. ప్రతి పువ్వు భావకవికి భగవంతుడికి రాయబడ్డ ప్రణయ లేఖగానే భాసించింది. మధుర భక్తి కవిత్వానికి ఈ కాలంలో పెద్ద పీట వేశారు. ఎందరో భావకవులు ఈ మధురభక్తి కవిత్వాన్ని రాశారు. భగవంతుడొక్కడే నాయకుడు ప్రకృతి సమస్తం నాయికలుగా భావించటం ఇటువంటి రచనల్లో సర్వ సాధారణం. ఈ కవిత్వ పాయమళ్ళీ రెండుపాయలుగా సాగింది. రాధాకృష్ణుల, గోపికా కృష్ణుల సంయోగ వియోగాలు, ఆనందం విషాధం. ఆయా పాత్రలపై ఆశ్రయించుకోవటం. నాయికా నాయకుల ఆత్మానుభూతి చిత్రణకు ప్రసక్తి ఉండదు. కృష్ణవేదనలో దహించుకొనిపోయే ఆ వియోగస్థితిలో తన బాధల్ని మధుర వేదనా శీలమైన గాథను వెళ్ళబుచ్చుకోవటం అందులోని రెండవపాయ. ఇది ఆత్మాశ్రయరీతికి చెందినది.

తాత్త్విక కవిత్వంలో కవితన్ను ప్రేయసిగానూ, మృత్యువు ప్రియుడనీ తమ వివాహానంతరం తాను ఇల్లు వదిలిపోయి తన నిజమైన ప్రభువును కలుసుకుంటానని భావిస్తాడు. మృత్యువుని ప్రభువు దూతగా భావించటంలో ఎంతో తాత్త్విక దృక్పథం ఉంది.

ఉమర్ ఖయ్యామ్ 'రుబాయి'లకు ప్రభావితమై తెలుగులో 'మదిరాతత్త్వం'లో రాయప్రోలువారి మధుకలశం, దువ్వూరివారి పానశాల, మాధవపెద్దివారి ఉమరుఖయ్యాం, రామచరిత్ర అప్పారావుగారి అమరుల్, అనేవి ప్రధానమైనవి. ఈ మదిర కవిత్వం హిందీలో బచ్చన్ అనే మహాకవి 'హాలవాద' శాఖను ఆవిష్కరించడానికి కారణమయింది.

### 1.4.2.7 స్మృతికావ్యాలు

ఆంగ్లంలో Elegy గా పిలువబడుతున్న ఈ రచనలు ఒక వ్యక్తి మరణానంతరం ఆ వ్యక్తి జ్ఞాపకాలను, గొప్పదనాన్ని గుణగణాల్ని వివరిస్తూ రాసినవి. ఈ రచనల్లో దేశనాయకులు, సతి, చోటు చేసుకున్నారు. సతీస్మృతి రాసిన కవుల్లో పేరెన్నికగన్నవారు విశ్వనాథ, దువ్వూరి,

బాలాంత్రపు వెంకటరావుగారలు. సుతాదిక, ఆప్త స్మృతి కావ్యాలు కూడా అక్కడక్కడ అగుపిస్తాయి.

భావకవిత్వ శాఖలన్నీ కూడా రచనారీతి, పద ప్రయోగం, భావ నవ్యతలకు దారిచ్చాయి.

## 1.5 అభ్యుదయ కవిత్వం

పాశ్చాత్య కవిత్వంలోని కొత్త ధోరణులు చాలా మందిని ఆకట్టుకోసాగాయి. భవిష్యత్తు గురించి ఆలోచించి ఏదోమంచి జరగాలన్న ఆశతో రచనలు రావటం ప్రారంభమయింది. ప్రపంచ సంగ్రామ ఫలితంగా పుట్టుకొచ్చిన డాడాయిజం (విధ్వంస వాదం) అధివాస్తవికత, భావ చిత్రవాదం, ప్రతీకవాదం, వామపక్షవాదం లాంటి ప్రతిశాఖ తెలుగు సాహిత్యంలో కాలూనింది.

శ్రీశ్రీ, శ్లిష్ట్లా, నారాయణబాబు, పఠాభి వంటి కవులు భావ కవిత్వానికి నిరసనగా తిరుగుబాటు కవిత్వం రచించారు. మార్క్సిజం ప్రభావం ఈ కవుల మీద ఎక్కువ. శ్లిష్ట్లా *విష్ణుధేనువు, పఠాభి 'ఫిడేలు రాగాల డజన్'* ప్రత్యేకదారులు ఏర్పరచుకున్నాయి. శ్రీశ్రీతో సమాన ప్రతిభకలవాడు నారాయణబాబు.

1930లో శ్రీశ్రీ టైఫాయిడు జ్వరంతో మంచం పట్టాడు. ఆ అనారోగ్యంలో అతనిలో ఆకలి కవిమేల్కొన్నాడు. స్వరాజ్యశంఖధ్వనులు ఒక పక్క, పీడిత ప్రజాలోకం మరో పక్కా అతని హృదయంలో అడుగుపెట్టి అంతరాళాల్లో నిద్రిస్తున్న చైతన్యాన్ని మేల్కొల్పాయి. అతనిలోని ప్రచండ మథనానికి బదులుగా 'జయభేరి' వెలువడింది. ఆ తర్వాత చుట్టూ ఉన్న సమాజంలోని, అందులో నిత్యం నివసించే వివిధ ప్రజల జీవితాల్లోంచి కవిత్వ వస్తువును తీసుకున్నాడు. మానవజాతి చరిత్ర సమస్తం వర్గ సంఘర్షణల ఫలితమేననీ మార్క్సు సిద్ధాంతాన్ని నమ్మి తన రచనల్లో ప్రతిఫలించిన కవి శ్రీశ్రీ.

అభ్యుదయ కవిత్వం ఉద్యమ రూపం దాల్చింది. శ్రీశ్రీని అనుకరించిన వారు

లేరనవచ్చు. అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. సమాజంలోని అసమానతల్ని రచనల్లో చిత్రించే స్థితి వచ్చింది. అయితే ఈ సంఘర్షణల చిత్రణ శ్రుతిమించి రాగాన పడి దిగంబర కవిత్వంగా పరిణమించింది.

ఆ తర్వాత కాలంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రధానమైన ధోరణులు మూడు అవి - 1. స్త్రీవాదం, 2. దళితవాదం, 3. మైనారిటీవాదం.

## 1.6 స్త్రీవాదం

క్రీ.శ. 15వ శతాబ్దిలో తాళ్ళపాక తిమ్మక్క మొదలుకొని క్రీ.శ. 20వ శతాబ్దం వరకు స్త్రీలు చెదురుమదురుగా రచనలు చేస్తూనే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక యుగంలో వివిధ ఉద్యమాలు వెలువడ్డాయి. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో వెలువడిన ఉద్యమాల్లో - ఒక్కొక్క ఉద్యమం ఒక్కొక్క ప్రత్యేకతను చాటుకుంది. అటువంటి ఉద్యమాల్లో స్త్రీవాదం ఒకటని చెప్పవచ్చు. ఈ విషయాన్ని ''తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ, కాల్పనిక అభ్యుదయ, విప్లవ - కవిత్వోద్యమాల తరువాత అత్యంత ప్రభావం చూపిన ఉద్యమం స్త్రీవాద కవిత్వోద్యమం. 1975 తరువాత రూపుదిద్దుకొని, 1984 నుంచి స్థిరపడి క్రమంగా అన్ని ప్రక్రియలకూ విస్తరించిన ఉద్యమం'' (మృణాళిని 2004, పుట 184) అని తన అభిప్రాయాన్ని పేర్కొన్నారు.

స్త్రీవాదం అనే భావన ఎప్పటి నుండో ఉన్నప్పటికీ అది ఒక వాదంగా ఉద్యమంగా ఏర్పడటం 1980 తరువాతనేనని చెప్పవచ్చు. తెలుగులో స్త్రీవాదం 1980లో వచ్చినప్పటికి ప్రపంచ వ్యాప్తంగా 200 సంవత్సరాల పూర్వమే మొదలైంది. 1789 ఫ్రెంచి విప్లవం, 1870 రష్యన్ విప్లవం, 1889 పారిస్ సమాన హక్కుల విప్లవం, 1911 చైనా విప్లవం, 1841 అమెరికా విప్లవం తరువాత 1970లో అమెరికాలో స్త్రీవాదం ఒక ఉద్యమరూపం దాల్చిందని చెప్పవచ్చు. అయితే ఈ ఉద్యమానికి బీజం 1789లోనే పడింది. సుదీర్ఘ పోరాటానంతరం ఇది ఒక ఉద్యమ రూపం దాల్చింది.

ఆధునిక యుగ ప్రభావ ఫలితంగా ఆంగ్ల విద్యావిధానం వల్ల స్త్రీలు విద్యావంతులైనారు. వారు తమను పురుషాధిక్య సమాజం ఏ విధంగా అణచివేస్తున్నదో వ్యక్తి స్వేచ్ఛలో భాగంగా తమ ఉనికిని, తమ అస్తిత్వాన్ని చాటుకోవడానికి తమదైన శైలిలో రచనలు చేశారు. స్త్రీని ఇంటికి పరిమితం చేయడం కట్టుబాట్ల పేర్లతో హింసించడం, శరీరపరమైన కారణాల వల్ల స్త్రీని కొన్నింటికే పరిమితం చేయడం తరతరాలుగా తమపై జరుగుతున్న అత్యాచారాలకు అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడి తమ అస్తిత్వాన్ని నిరూపించుకోవాలని ఆరాటపడుతూ సాహిత్య రచనలు చైతన్యవంతంగా చేసి స్త్రీవాద ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. అయితే 1960-80ల మధ్యలో వచ్చి సాహిత్యం స్త్రీవాదాన్ని ఒక ఉద్యమంగా నిలపలేక పోయింది. 1980 తరువాతనే ఇది ఒక ఉద్యమంగా రూపొందింది.

ఆధునిక యుగ ఆవిర్భావంలో స్త్రీలకు సంబంధించిన సాహిత్యం సంఘ సంస్కరణో ద్యమం తెలుగులో కందుకూరి, గురజాడ నుండి మొదలైందని చెప్పవచ్చు. తరువాత చలం స్త్రీలపై పేర్చిన ఇనుప వస్త్రాలను ఛేదించడానికి తనవంతు కృషి చేశారు. చలం సాహిత్యం ముఖ్యంగా మధ్య తరగతి స్త్రీల మీద ఆధారపడింది. చలం తరువాత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి బ్రాహ్మణ కుటుంబాల్లోని బాల వితంతుల సమస్యలను వస్తువుగా తీసుకొని కథలు రాశారు. కొడవటిగంటి కుటుంబరావు - బాల్య వివాహాలు, వితంతు వివాహాలను, వేశ్యల జీవితాలను, వరకట్న సమస్యలను, పాతివ్రత్య భావనను, భర్తల ధాష్టికాలను చర్చించారు. అయితే ఇదంతా స్త్రీలకోసం - పురుషులు నిర్వహించిన ఉద్యమమని చెప్పవచ్చు.

1972లో 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' అన్న కవిత రాసి స్త్రీవాద సాహిత్యానికి పునాది వేశారు. రేవతిదేవి 'శిలాలోలిత' స్త్రీవాద సాహిత్యానికి బలమైన నేపథ్యాన్ని కూర్చింది. ఈ విషయాన్నే "స్త్రీల జీవితాన్ని నియంత్రిస్తున్న పితృస్వామ్య భావజాల సంస్కృతిని, అది కల్పించిన మాయను, సృష్టించిన భాషా పరిమితులను, భ్రమలను భిన్న కోణాల నుండి విశ్లేషించటానికి, లైంగిక వివక్షా స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి స్త్రీలు అస్తిత్వ స్పృహతో పూనుకోవటంతో తెలుగు సాహిత్యంలో అసలైన అర్థంలో స్త్రీవాద సాహిత్యోద్యమం మొదలైంది. సావిత్రి

వ్రాసిన బందిపోట్లు - కవిత అందుకు నాంది పలికింది.

'పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని

పంతులుగారన్నప్పుడే భయం వేసింది

. . . . . . . . . . . . . . . . . . . . .

మమ్మల్ని విభజించి పాలిస్తోందని.'

స్త్రీల జీవితానికి పెళ్ళిని లక్ష్యంగా చేసిన పితృస్వామిక సమాజం అందులో ఇమిడి పోవటానికి స్త్రీకి పుట్టినప్పటి నుండి ఎంతో శిక్షణనిస్తుంది.'' (కాత్యాయని విద్మహే 2006, పుట42) అని అంటారు.

వారు ముఖ్యంగా తమ రచనల్లోకి తెచ్చిన వస్తువు మాతృత్వ సమస్య, గర్భధారణం, ప్రసవం, స్త్రీ అంటే శరీరం తప్ప మరేమి కాని స్థితి. శరీరం కూడా తనకోసం కాదని పురుషుడి అనుభవంకోసం అని లింగ వివక్ష, వంటిల్లు మొదలైన వాటిని వస్తువులుగా స్వీకరించారని చెప్పవచ్చు. స్త్రీవాద సాహిత్యోద్యమాన్ని జీవితంలోని వివిధ పార్శ్వాలను విస్తరింపజేస్తున్న కవయిత్రి కొండేపూడి నిర్మల - తను రాసిన 'నడిచే గాయాలు' స్త్రీల జీవితంలో పెళ్ళి, దాంపత్య సంబంధాలు, కుటుంబ కట్టుబాట్లు, సంస్కృతి పట్ల ఆందోళన ఆమె కవిత్వంలో కనిపిస్తుంది. 'బాధాశప్తనది' లైంగిక పీడనకు సంబంధించినది. వసంత కన్నాభిరాన్ - 'శరీరం', ఓల్గా - 'అద్వైతం', పద్మావతి - 'గుక్క పట్టిన బాల్యం' లలో లింగ వివక్ష గురించి ప్రస్తావించారు. విమల - 'వంటిల్లు కవిత'లో స్త్రీల జీవితాన్ని వంటింటికే కుదించి వేసే పితృస్వామిక సంస్కృతి స్వభావాలు గురించి వివరించినది.

స్త్రీవాద ఉద్యమ కవిత్వం తరువాత కథ కూడా చెప్పుకునే స్థాయిలోనే వెలువడి తన ప్రత్యేకతను చాటింది. స్త్రీవాద ఉద్యమంలో మొదట చెప్పుకోదగ్గ సంఖ్యలో రచయితలు ఉన్నారు. అందరూ చైతన్యవంతమైన రచనలు చేయలేక పోయిన తమ జీవితంలోని అసంతృప్తి, అశాంతిని తన స్వంత అనుభవం నుంచి తమ తమ రచనల్లో భాగంగా చేస్తూనే వచ్చారు. 1980 నాటికి ఆంధ్ర రాష్ట్రమంత స్త్రీవాద కవిత్వం బలం పుంజుకుంది. ఇదే

విషయాన్ని "1980 తరువాత ఆంధ్ర దేశంలో నానాటికి బలం పుంజుకొంటున్న స్త్రీవాదోద్యమం సృష్టించిన కొత్త వాతావరణంలో స్త్రీవాద సాహిత్యోద్యమం కవిత్వం నుండి కథకు, నవలకు కూడా విస్తరించింది. పి. సత్యవతి, ఓల్గా, కుప్పిలి పద్మ, కొండేపూడి నిర్మల, సి.సుజాత, పాటిబండ్ల రజని, సి, రేణుకాదేవి, పి. శేషులత మొదలైన వాళ్ళు కథా రంగంలో స్త్రీవాద ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు. (కాత్యాయనీ విద్మహే 2006 పుట.52-53) అని అంటారు.

సత్యవతి 'ఇల్లలకగానే' అన్న కథలో పరాయీకరణకు గురైన స్త్రీల గురించి, సత్యవతి 'తిమింగాల స్వర్గం' అనే కథలో కొత్త ఆలోచనలు, కొత్త భావాలు మెదడులో రానీయకుండా సంప్రదాయాల ముసుగులో కప్పి వేస్తున్న వైఖరిని నిలువుటద్దంగా ఊహించి రాసిన కథ ఇది.

ఓల్గా ముఖ్యంగా రాజకీయ కథలు, లైంగిక పరమైన విషయాలు, స్త్రీల శరీరాలపై పురుషుల ఆధిపత్యం, స్త్రీల కేశాలంకరణ, ఆడపిల్లల అందం మొదలైన అంశాలమీద వివిధ కోణాల్లో రచనలు చేసింది. సుజాత కథల్లో స్త్రీలు పని చేసే చోట స్త్రీల శరీరం, ఆశలు, ఆకాంక్షలు నియంత్రణకు గురవుతున్న విషయాలను చిత్రించింది. శేషులత కథల్లో స్త్రీల జీవితంలో హింస కనిపించని స్థాయిలో ఉన్నట్లు చిత్రించింది. ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్త్రీల జీవిత దౌర్భాగ్యాన్ని ఉద్యోగాలు చేస్తున్న తాము సంపాదించిన డబ్బు పై తమకే మాత్రం అధికారం లేని దయనీయ స్థితికి పాటిబండ్ల రజని తన కథల్లో ప్రతిబింబించింది. ఈ విధంగా కవిత్వం తరువాత కథ స్త్రీవాద సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించిందని చెప్పవచ్చు.

స్త్రీవాద సాహిత్యంలో కథా సాహిత్యం వెలువడినంత గొప్పగా నవలా సాహిత్యం వెలువడలేదు. నవల రచనల్లో రంగనాయకమ్మ తరువాత స్త్రీవాద నవలను రాసిన రచయిత్రి ఓల్గా. తమ అభిరుచులకు, ఆదర్శాలకు అనుగుణమైన సామాజిక జీవితాన్ని నిర్మించుకోవాలనుకునే స్త్రీలు కుటుంబాధికారాన్ని ఎలా ఎదుర్కోవలసి వస్తుందో ఓల్గా 'స్వేచ్ఛ'

నవలల్లో చూపింది. 'కన్నీటి కెరటాలు', 'వెన్నెల', 'మానవి' నవలల్లో స్త్రీ శరీరం మీద లైంగికత మీద స్త్రీల కుండే హక్కులు మొదలైన అంశాలను చూపించారు. 'ఆకాశంలో సగం' స్త్రీల సమస్యల పరిష్కారానికి ప్రతిపత్తి సంఘాల ఆవశ్యకత నిరూపించడానికి ఉద్దేశించబడింది. ఓల్గా తరువాత కుప్పిలి పద్మ 'అహల్య' అనే నవల ఒంటరి స్త్రీ జీవితాన్ని ఇతివృత్తంగా చేసి రాసింది. ఈ విధంగా స్త్రీవాద ఉద్యమం ఆధునిక కాలంలో కవిత్వ పరంగానూ, కథాపరంగాను నవలా పరంగాను తన ప్రత్యేకతను చాటుకొన్నది.

## 1.7 దళిత వాదం

భారతదేశం వర్గ వైరుధ్యాల వల్ల సంక్లిష్ట సమాజంగా ఏర్పడింది. కర్మ సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని కొందరు మానవుల జన్మ తక్కువదని ఎప్పుడో ఒక సంఘ నియమాన్ని ఏర్పర్చారు. కాని, సంఘ సంస్కరణోద్యమానికి ముందే దళిత సాహిత్యం ప్రారంభమైందని చెప్పవచ్చు. 1909లో 'ఆంధ్రభారతి'లోని 'మాలవాండ్ర పాట' సాహిత్యం దీనికి ఉదాహరణ. గురజాడ రచనల్లో కూడా దళిత ప్రస్థానం ఉందనవచ్చు. తొలితరంలో దళితుల గురించి రాయబడినదంతా దళిత సాహిత్యమంటే, కొంతకాలం తరువాత దళితులచేత రాయబడ్డదే దళితసాహిత్యం అనే భావన రూపుదిద్దుకొంది. నిజానికి దళిత వాదమంటే దళితుల దీన, హీన జీవితాలను ప్రతిఫలించే సాహితీ వ్యాసంగం అనవచ్చు. ఈ సాహిత్యం ఊపందుకొని కాలక్రమేణ ఉద్యమ రూపం దాల్చింది. తాత్త్విక దృక్పథం, ఆశలు, ఆశయాలు మొదలైన వాటిని కలిగి ఉండేదే వాదం. ఒక జాతి గురించి ఒక సామూహిక చైతన్యానికి ప్రతీకగా దళితవాదం తమ అస్థిత్వాన్ని గుర్తించమని అసమానతల్ని తొలగించమని గొంతు ఎత్తింది.

తెలుగు సాహిత్యంలో ఈ దళితవాదం కవిత్వ, కథ, నవల అనే విభాగాలుగా ప్రచారంలోకి వచ్చింది. దళితుల మధ్య అనైక్యత, దళితుల మతాంతరీకరణ ఆధారంగా శ్రీపాద వారి 'పుల్లంరాజు', 'సాగర సంగమం,' వంటి రచనలు 1925-34ల మధ్య వెలువడినాయి. చలం హరిజన సమస్య, మాదిగ అమ్మాయి, అడవి బాపిరాజు నర్సన్న, పాపాయి మొదలైనవి దళితకథలుగా చెప్పవచ్చు. అస్పృశ్యత, నీటి సమస్య, రాజకీయ

అధికారం, చైతన్యం, విద్య, వృత్తి, వృత్తుల ద్వారా సంక్రమించే అనారోగ్యం, విద్యార్హత ఉన్న సమాజంలో మాసిపోని అసమానతల వంటి సమస్యల మీద రచనలు ఎక్కువగా వెలువడటం ప్రారంభించాయి. అంటే దళితవాద రచనలు పీడితవర్గ భావజాలాన్ని వారి జీవన దౌర్బల్యాన్ని ఆధారం చేసుకొని వెలువడటం ప్రారంభించి, ఒక ఉద్యమ రూపాన్ని ఏర్పర్చుకొందని చెప్పవచ్చు. 1969 నుంచి 1980 దాక మాల,మాదిగల మధ్య సమిష్టి పోరాట స్థాయి లేదు. వారి మధ్య సమైక్య స్థితి రావాలని నక్సల్ బరి పోరాటాలు వచ్చినా రచయితలు వీటి సంగతి పట్టించుకోలేదని నిఖిలేశ్వర్ తన తెలుగు కథ దళితవాదంలో అన్నారు. 1990-1995ల మధ్య జరిగిన బహిష్కరణ ఊచకోతల వల్ల దళిత చైతన్యం ఉద్యమంగా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకొంది. ఎండ్లూరి సుధాకర్ - మల్లెమొగ్గల గొడుగు మాదిగకతలు, సుందరరాజుగారి మాదిగోడు, కథల్లో మాదిగ జీవితాలలోని అనేక కోణాలు వర్ణింపబడ్డాయి. 'తాకట్టు', 'కులవృత్తి', 'గొడ్ల దొంగ', 'ఊరబావి' వంటి కథలతో కొలకలూరి ఇనాక్ దళిత సాహిత్యానికి ఒక తాత్త్విక దృక్కోణాన్ని సమకూర్చారు. కాని, ఆయన రాసిన కులవృత్తి కథలో మిగిలిన అన్ని కులాల వృత్తులు గౌరవస్థానాన్ని సంపాదించుకున్న మాదిగ కులవృత్తికి మాత్రం ఆ గౌరవం దక్కలేదనే ఆవేదన ప్రతిబింబిస్తుంది. దీన్ని బట్టి చూస్తే దళితవాద రచనలకు తాత్త్విక దృక్కోణాన్ని కూర్చిన ఇనాక్ గారే మాల-మాదిగ వర్గ విభేదాల్ని సమర్థిస్తున్నారోలేదో అర్థంకాదు. అంటే ఉద్యమస్థాయిలో వచ్చే సరికి అన్ని వర్గాలు ఒక్కటేనా మరి వాళ్ళలో వర్గాలు ఉన్నాయా? ఇంక స్పష్టపడని విషయం.

తల్లి మాట స్వామి, సింగమనేని నారాయణ మకర ముఖంవంటి రచనలు దళితులు తమ కులంగురించే ప్రస్తావించటానికే వెనుకాడుతుంటారని నిరూపిస్తున్నాయి. పైడి తెరేష్ బాబు కథ అనుబంధ ప్రశ్న అగ్రవర్ణాలవారు దళితుల్ని విడగొట్టటానికే వర్గీకరణ సమస్యను లేవనెత్తారని సూచిస్తుంది. ఈ నేపథ్యంలో చాలా రచనలే వచ్చాయి. 'జూపాక సుభద్ర', గోగుశ్యామల, 'నల్లరేగటిసాల్లు' కథానిక సంపుటిలో దళిత సమస్యలే కాకుండా దళిత స్త్రీ సమస్యలు వివరింపబడ్డాయి. కొందరు కథకులు దళితుల మతాంతరీకరణ, వారు ఆర్థిక

సామాజిక వెనుకబాటుతనం అణిచివేతల వల్ల ఇతర మతాల పట్ల ఆకర్షితులై మారటం ఎక్కువగా కథావస్తువైంది. ధారాగోపి, 'గుడిసే ఎసొపు', కథల్లో మతాంతరీకరణ పేరుతో క్రైస్తవులు, దళితుల్ని దోచుకుతింటున్న వైనాన్ని చిత్రించారు. దేవపుత్ర బందీ' కథ క్రైస్తవమతం ఆ మతం పట్ల గౌరవ ప్రపత్తులు లేని ఆ మతాంతరీకరణకి అంగీకరించని, క్రైస్తవ మతాన్ని వ్యతిరేకించే దళితుల పట్ల చూపిస్తున్న వైఖరి గురించి సూక్ష్మప్రాయంగా తెలియచేస్తూ ఆవేశంతో ఆలోచించవలసిన ఆవశ్యకతను ప్రస్ఫుటంగా చెప్పి చూపిస్తుంది. బంచరాయి, ఇంకానా ఇకపై సాగదు వంటి కథలు భూమిసమస్య, సమ్మె మొదలైన ఆర్థిక సమస్యల్ని ఆధారంగా చేసుకొని దళితుల జీవన విధానాల్ని వర్ణించాయి. దళిత కథల్లో దళిత వాదం తొంగిచూస్తున్న ఆర్థిక, సామాజిక అసమానతల్ని గర్హిస్తూ రచనలు వచ్చిన స్త్రీ జీవితం గురించి తక్కువ రచనలే వచ్చాయని చెప్పవచ్చు. దళిత స్త్రీ జీవితం గురించి కాకుండా ఉద్యోగినిగా స్త్రీ ఎదురుకొంటున్న మానసిక హింస వెనుక కులాధిపత్య భావజాలం ఉందని శరత్‌జ్యోత్స్నారాణి నీకూ నాకూ నడుమ, వెండి కిరీటం, కథా సంపుటాల్లో చూడవచ్చు. డా.వి. చంద్రశేఖర్ - నలుపు, సదానంద శారద ఉప్పునీళ్ళు, స్వామి, హెచ్. సరస్వతి వంటి కథల్లో విద్యాలయాల్లో ఉద్యోగం చేసే స్థలాల్లో స్త్రీలకు జరిగే ముఖ్యంగా దళిత బాలికలకు స్త్రీలకు, ఏర్పడే అవమానాల గురించి వివరిస్తాయి. అస్పృశ్యత, మానసికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వీరు అనుభవిస్తున్న దైనిక స్థితిని వివరించడం ఇలాంటి కథల్లో చూడవచ్చు.

ఆర్థిక, సామాజిక అసమానతలవల్ల స్త్రీ, పురుష విభేదాల్ని, వర్గ విభేదాల్ని కాకుండా ఒక సామాజిక చైతన్యస్ఫూర్తితో దళిత రచనల్ని పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. తమ కులం పేరు కూడా చెప్పుకోవడానికి సిగ్గుపడే స్థితి నుంచి ఎదగాలంటే వారి మానసిక స్థితిని ఆకళించుకొని తగిన విధంగా దాన్ని చిత్రించే రచనలు రావడం ఎంతైనా అవసరం. దళితుల ఆర్థిక సామాజిక స్థితుల్నే కాకుండ మానసిక స్థితిని తగిన కోణంలో మరింత లోతుగా అధ్యయనానికి అవకాశం ఇచ్చే రచన, విమర్శ సాగవలసిన అవసరం ఎంతైనా ఉంది. దళితవాద రచనల్లో ఇతివృత్తంలో ఎంతో వైవిధ్యం కనిపిస్తున్న సాంస్కృతిక ఆర్థిక

కోణాలపై వెలువడ్డంతగా మానసిక కోణంపై అధికంగా రచనలు వెలువడలేదు. ఈ రకం రచనల్లో తాత్త్విక కోణం ఉన్న సాంస్కృతిక త్యాగ కోణాలు పరిశీలింపబడటం న్యాయం. ఇటీవల దళితులు ప్రాంతీయతవాదం వల్ల అనుభవిస్తున్న సమస్యలు కూడా దళిత రచనల్లో చోటుచేసుకోవడం ప్రారంభించాయి. దళిత రిజర్వేషన్ పొందిన, పొందని కులాల మధ్య సంఘర్షణ గ్రామీణ, పట్టణ ప్రాంతాల వల్ల వచ్చే సమస్యలు చదువుకున్న, చదువుకోని తరాల మధ్య అంతరాలు ఇవన్ని ఈవాద రచనల్లో ప్రముఖ స్థానాన్ని పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధునిక యుగంలో సాహిత్యంలో వచ్చిన ఉద్యమాల్లో దళితవాదం ఒకటి.

మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనేయగుదున్.

గురజాడ వారి ఈ వాక్యాలలో కుల వివక్ష నీచమని అస్పృశ్యత నిరాకరించదగిందని చాటి చెబుతాయి. గరిమెళ్ళ

''అస్పృశ్యులని, అసదృశ్యంబగు జాతి
నాదరింపక బయటి కంపినాము.
తలచుకొను కొద్ది హృదయములో దగ్ధమగును''

అంటూ అస్పృశ్యత పేరుతో కొందరు ప్రజలను హింసించటం 1926లో వ్యక్తీకరించాడు. గుఱ్ఱం జాషువా అస్పృశ్యత తాలుకు విరాట్ స్వరూపాన్ని ఆవిష్కరిస్తూ రైల్లో తనకెదురైన తన అనుభవాన్ని ఎంతో ఆర్తితో ఆవేదనతో వ్యక్తీకరించాడు.

''నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపురే
ఖాకమనీయ వైఖరులగాంచి భళిభళి యన్నవాడె, నీ

దేకులమన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచి పోవుచో

బాకున గ్రుమ్మినట్లగును పార్థివ చంద్రవచింప సిగ్గగున్''

1920-30ల కాలంలో దళితులు తమను ఆది ఆంధ్రులుగా పిలుచుకోవడం ప్రారంభించారు. 1930 ప్రాంతానికే హరిజనులు తమను ఆ పేరుతో కాకుండ వేరే పేరుతో పిలుచుకోవాలనుకున్న భావన వ్యక్తమవుతుంది. ఆది హిందు, ఆది ఆంధ్ర పేర్లు హరిజనులకు మారుగా వాడబడ్డాయి. వర్ణ పోరాట దృష్టితో ఏర్పడిన ఉద్యమం ఫలించి సమసమాజ స్థాపన జరిగితే కులసమస్య తనంతట తానే సమసిపోతుందన్న భావం కనపడేది. 'ఒక జననం వాయిదా కవితలో సతీష్ చందర్

''నా చరిత్రను నా చేతనే తుడిపించడానికి

నా వెనకెవరో చీపురుకడుతున్నట్లే భ్రమించి. . . .

రిజర్వేషన్ గాళ్ళకి పౌరుషాలు కూడానా! అని పై అధికారులు ప్రశ్నించినపుడు భూతకాల వర్తమానాన్ని మింగలేక గుటకలు వేస్తాను.'' దళితులు తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం పడుతున్న ఆవేదన, ఆత్మగౌరవ పోరాటంలో పడుతున్న బాధలు మానసిక ఘర్షణలకు పై వాక్యాలు ప్రతీకలు.

పురాణాలలో శంభూకుడు, ఏకలవ్యుడు వంటి పాత్రలు దళితోద్యమ కవులు పునర్వ్యాఖ్యానించటానికి ప్రయత్నించారు. రాజమండ్రిలో కొందరు దళిత విద్యార్థులు కులపరమైన అవమానాన్ని భరించలేక ఆత్మ హత్య చేసుకోవడాన్ని నిరసిస్తు సతీష్ చందర్ పంచమవేదంలో

''నిజం చెప్పండి

పంచముడంటే ఐదోవేలు లేనివాడనే నా అర్థం?''

వంటి ప్రశ్నలు తలెత్తాయి. ఎండ్లూరి సుధాకర్ దళిత రాజ్యాధికార స్థాపనాన్ని శంభూకుడి పట్టాభిషేకంతో సాకారం చేసుకొన్నాడు. శివసాగర్ వంటి కవులు పురాణ పాత్రలను అణగ

దొక్కినట్లు రచనలు చేసి తృప్తి పడ్డారు. దళిత స్త్రీవాదం, దళితకళాతత్త్వం, భాషా విప్లవం దళిత ప్రేమ కవిత్వం అంటూ వివిధ రకాలు కనిపిస్తున్న మద్దూరి నగేష్‌బాబు ఉపకులాల మధ్య ప్రేమానుబంధాన్ని కాంక్షిస్తూ -

ఓనా అరుంధతీ - రా

గాయాల మధ్యకూడా

గోడలు కట్టిన ఈ కులం గుండెలపై నిలబడి

నువ్వు నాకు దండెయ్యి

మాలపల్లె ఉంగరాన్ని నేను మాదిగ గూడెం వేలికి

తొడుగుతా అన్నాడు.

దళిత కవిత్వంలో దీర్ఘ కవితలు కూడా వెలువడ్డాయి. జాషువ గబ్బిలం వంటి రచనలు కావ్య ఖండికలకు ప్రేరణ. దళిత కవిత్వం వచ్చిన కొత్తలో అనుభవాలలాగే మాదిగల అనుభవాలను విడిగా రాయడం ప్రారంభించారు.

''ఇక వాడలోని అంటరాని వాళ్ల (ఎస్సీలు) అనుభవాల విషయానికొస్తే అవి అగ్ర హారానికి ఎంత దూరమో, బి.సి.ల పేటలకూ అంతే దూరం. వెన్నుతట్టే వెనకటి కాలపుహరిజనోద్ధరణ కవిత్వం మళ్ళీ పిలుపుచాలవని బి.సి. కవులు రాయనవసరం లేదు''. (సత్యనారాయణ ఎస్వీ, పుట.75) అని అంటారు.

## 1.8 మైనారిటీ వాదం

తెలుగు సాహిత్యంలో వచ్చిన వివిధ ఉద్యమాలలో మైనారిటీవాద ఉద్యమం ఒకటి. గణతంత్ర భారతదేశంలో సమాన సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్న ముస్లిం కవులు సాంస్కృతిక విలువలకే ప్రాధాన్యత ఇస్తూ మెజారిటీ భాషను వ్యక్తీకరణ సాధనంగా తీసుకొని తమది కాని భాష మాధ్యమంలో కళాసాహిత్య రూపాలలో ఒదిగి పోయారు. ఈ సర్దుబాటు వల్ల చాలా వరకు ముస్లిం కవుల కవిత్వం స్థలకాల నిబద్ధతకు

గుర్తైంది. వాళ్ళు వాడే భాష, పత్రికలు పదబంధాలు జనజీవనంలోంచే వచ్చిన వ్యక్తీకరణ క్రమాన్ని పునర్నిర్మించుకునే దశలోనే ఆ స్థానిక నేపథ్యమే మైనారిటీ కవులు సామాజిక నేపథ్యంగా పరిణమించింది. నిర్దిష్టత మైనారిటీ వాద కవిత్వానికి మూల విజయం. డిసెంబర్ 6 తరువాత తెలుగు ముస్లిం కవుల్లో స్థిరపడిన మెజారిటీ కవుల భావం బ్రద్దలై తాము తమది కాని భాషని మాట్లాడుతున్నామని గుర్తించారు. అదే మైనారిటీ వాద కవిత్వానికి దారితీసింది.

మైనారిటీ సాహిత్యాన్ని తెలుగులో ప్రధానంగా అనువాద సాహిత్యం, స్వతంత్ర సృజనాత్మక సాహిత్యం అని రెండు రకాలని చెప్పవచ్చు. అనువాదంలో ఇస్లాం ధార్మిక సాహిత్యానికే పెద్ద పీట. ఉమర్ అలీషా, మహమ్మద్ ఖాసింఖాన్ మొదలైన వారు ఇందులో ఎక్కువగా కనిపిస్తారు. ఉమర్ఖయ్యాం రుబాయిలు ఎంతో మంది తెలుగు కవుల్ని ఆకర్షించాయి. బాల సాహిత్యం ప్రధానంగా మైనారిటీ సాహిత్యంలో అనువాదానికి దారితీసింది.

మైనారిటీ వాద సాహిత్యంలో నాటికలు, హరికథలు చోటుచేసుకోవటం ఆశ్చర్యకరమైన విషయమే! ముఖ్యంగా హరికథ రచన మాత్రమే కాకుండ ప్రవచనంగా స్వీకరించిన వారు ఉన్నారు. ఖాదర్ సాహెబ్, హుస్సేన్, షేక్ బడే ప్రభృతులు స్వాతంత్ర్య పోరాటానికి పూర్వం హరికథలంటే పౌరాణిక గాథల పరిచయం. కాని స్వాతంత్ర్య పోరాట కాలంలో నాయకుల కథలు చోటుచేసుకోవటం మొదలు పెట్టాయి. ఇదే వారికి ప్రేరణ అయింది.

మహమ్మద్ ఖాసింఖాన్ రాయబారం పేరుతో కృష్ణరాయబారాన్ని రాస్తే బాపు కలం పేరుతో షేక్ మహబుబ్ సాహేబ్ శ్రీశైల క్షేత్ర మాహాత్మ్యంను రచించారు. రచయిత విశాల దృక్పథానికి ఇది సాక్ష్యం. వజీర్ రహమాన్ గుడిపాటి వెంకటచలం గురించి అతని రచనలు గురించి గద్య కావ్యం రాశాడు.

మైనారిటీ వాద కవుల రచనల్లో ఛందోబద్ధకవిత్వం, పురాణాలు, చారిత్రకాలు, సాంఘికాలు, పారమార్థికాలు ఖండకావ్యాలు, జీవిత చరిత్రలు, శతకాలు, చోటుచేసు

కున్నాయి. సాహిత్య పరమైన రచనల్లో భాగ్యవతి కులీకుతుబ్‌షాల ప్రణయాన్ని హిందూ ముస్లింల సఖ్యతకు సంస్కృతికి ఉదాహరణ ప్రాయంగా చిత్రించారు.

భాగ్యమతి కులీఖుత్బుషా ప్రణయ భావనలు
హైందవిస్లాము సంస్కృతి మథనంబు
హైదరాబాదు నేటికి నటులె తెలుగు
పారశీకంపుగళల విభాసమగును."

"హిందు ముస్లింల కలహాలకు వెఱచి, పైశాచిక చర్యలకు తల్లడిల్లి.
అజ్ఞానంబున ప్రగ్గి సోదరులు నన్యాయంబుగా జంపయేలా?"

సంఘంలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాలను, దురాచారాలను ఖండిస్తూ హేతుబద్ధమైన రచనలు వెలువడ్డాయి. సమాజంలో కవి, కవిలో సమాజం ప్రతిబింబించడం చాలా సహజమైన విషయం. కవిమీద సమాజ ప్రభావాన్ని సులభంగా గుర్తించవచ్చు. సమాజాన్ని నిందిస్తూనో, పొగడుతోనో రాసే కవి దానిపై అంతో ఇంతో ప్రభావం చూపిస్తాడు. దానికి ఉదాహరణగా

"ఎన్నాళ్ళీ క్షోభ, కన్నీళ్ళు
నాకెన్నాళ్ళీ వెక్కిళ్ళు
ఎన్నాళ్ళీ చీకటి గుడారంలో
బతుకెన్నాళ్ళు. . . . "

దోపిడి వర్గాల దురన్యాయాలను ప్రజలంతా కలిసి ఎదుర్కొనే రోజును ప్రోత్సహిస్తూ రాసిన రచనలకు.

"కట్టండి పిడికిల్లు
కొట్టండి జేలు
అడుగులో అడుగేసి
కదలండి వేలు."

వాస్తవమైన సన్నివేశానికి కల్పనను జోడించి చిత్రించే చిన్ని సాహితీ ప్రక్రియ కథ. నిత్యజీవితంలోని ఒక సంఘటనను మాత్రం తీసుకొని కళ్లఎదుట జరుగుతున్నట్లుగా సృష్టించి పేరు ప్రఖ్యాతులు పొందిన మైనారిటీ కథలల్లో స్మైల్, గులామ్‌గౌష్, మహమ్మద్ గఫూర్ బేగ్, దౌత్ బేగం, దాదాహయాత్, ఎం.డి.సౌజన్య, మహమ్మద్ హంసుద్దీన్, సయ్యద్ దావూద్ షేక్ ఖాజామొహిద్దీన్, సలీం, ఖదీర్‌బాబు, ఖాజా శ్రీమతి షహనాజ్ మొదలైనవారు ముఖ్యులు. ముఖ్యంగా స్మైల్ గారి-ఖాళీ సీసాలు, వల, మహమ్మద్ గఫూర్ బేగ్ గారి -నిరపరాధులు, న్యాయం చచ్చింది, మనిషి మంచి పరిణామం, రాధామాధవులు, మరపురాని దీపావళి, నవ్విన వరదల చెమ్మ, దౌలత్‌బేగం గారి-అపోహ, తీరని కోరిక, తీరినకోరిక, వెలుగిచ్చిన చీకటి, మగువ మనసు, సయ్యద్ షేక్ హసన్‌గారి-ఆశాజీవి, ఒదినగారి ఔదార్యం, భారతి, గాలి తగిలిన దీపాలు, అవతార పురుషుడు, సయ్యద్ దావూద్‌గారి తీరని కోరికలు, ఎడారిలో వాన, పంజాబ్ కథలు, మరికొన్ని కాశ్మీర కథానికలకు తెలుగు అనువాదాలు, ఎం.డి. సౌజన్యగారి-నేరమూ-శిక్ష, దాదాహయత్‌గారి-అహింస శ్రీమతి షహనాజ్‌గారి-సజీవ శిల్పం, ఖదీర్‌బాబు-దావత్ కథ మొదలైన కథకులు మైనారిటీ వాద కథాసాహిత్యానికి గుర్తింపు తెచ్చారు.

ఎం.డి సౌజన్యగా పేరుపొందిన మహమ్మద్ నఫీజుద్దీన్, కౌముదిగా పేరుపొందిన మహమ్మద్ షంసుద్దీన్ ప్రఖ్యాత నవలా రచయితలు, విధి విన్యాసాలు, విముక్తి, మరో ధరిత్రి, ఈ చరిత్ర ఎవరు రాస్తారో, ఓ నోటి కథ, క్షణక్షణ మృత్యులోయ, ఈ తప్పు ఎవరిది వంటి నవలలు ఎం.డి. సౌజన్యకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. కళంకిని, విజయ, ధనవంచిత నల్ల బంగారం. కౌముదికి పేరు తెచ్చిపెడితే అజ్మతుల్లా, మణి, సుజాత, మహమ్మద్ యార్ తెలుగు నవల వికాసానికి దోహదం చేశాయి. హెచ్. ఖాజు, యస్.కె. వలి, షేక్ ఖాషింసాహేబ్ దౌలత్ బేగం, మైనారిటీ నవల రచయితల్లో పేరు పొందారు.

# 2. కథ - తెలంగాణ కథ

## 2.0 కథ

ప్రపంచ సాహిత్యంలో కనిపిస్తున్న కల్పనాత్మక చిన్న రచనలో కథ ఒకటి. కథాసాహిత్యం ఈనాటిది కాదు. భారతీయ సాహిత్యంలో వేదోపనిషత్తుల కాలంలో నుంచే కథ ఉంది. పురాణాలు కథనాత్మకాలే. ఇతిహాసాల్లో కథకు ఉపకథలెన్నో. కాని, ఆ కథకు ఆధునిక సాహిత్యంలో చోటు చేసుకున్న కథకు చాలా తేడా ఉంది. కల్పనాత్మక రచనల పరాకాష్టగా కథకు ప్రపంచ సాహిత్యంలో స్థానం ఏర్పడింది.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో భారతీయ భాషల్లో కథానిక ప్రవేశించింది. నిజానికి ప్రాచీనకాల కథకు, ఆధునిక కథకు వ్యత్యాసాలున్నా ఆధునిక కథా సాహిత్యంలో చోటు చేసుకున్న మార్పులు మాత్రం పాశ్చాత్య భాషల ప్రభావం వల్లనే అని చెప్పవచ్చు. తెలుగు నాడు కథకు కాణాచి, ఆంగ్ల భాషలో 'షార్ట్ స్టోరీ' అని పిలువబడుతున్న సాహిత్య ప్రక్రియనే తెలుగులో కథానిక అని పిలుస్తున్నాము. దీన్నే చిన్న కథ, సన్నకథ, చిట్టి కథ, పొట్టికథ అని అనవచ్చునని కొందరంటున్నారు. ప్రాచీన సాహిత్యంలో కథ, ఆఖ్యాయిక, ఖండకథ, పరికథ వంటి వివిధ రూపాలను సంతరించుకొందని పూరకాలను బట్టి చెప్పవచ్చు.

కాశీమజిలీ కథలు, విక్రమార్కుడి (భేతాళకథలు) కథలు, పంచతంత్ర కథలు, జాతక కథలు, చారిత్రకంగా చూస్తే తెనాలి రామన్న, మర్యాద రామన్న కథలు మొదలైనవి తెలుగునాటే కాక భారత దేశంలో ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో చాలా ప్రసిద్ధి పొందిన కథలు. చిన్నయసూరి, కందుకూరి రాసిన పంచతంత్ర కథలు, చాలా ప్రసిద్ధి పొందాయి.

తొలికాలపు తెలుగు కథలు భావజాలానికి భాషకన్న ప్రాముఖ్యతనిచ్చాయి. గురజాడ వారి దిద్దుబాటు, మీపేరేమిటి ఇందుకు మంచి ఉదాహరణలు గురజాడ రచనల్లో ఉత్తమమనదగింది పెద్ద మసీదు. 1912, 1914లో ఆంధ్ర భారతి, త్రిలింగ మాస పత్రికల్లో సువర్ణరేఖ కథలు, మద్రాసు కథలు, అచ్చు అయినవి. 1915లో ఆఖ్యాయిక మాసపత్రికలో

వెలువడ్డ కథలు తెలుగు కథా సాహిత్యానికి ఎంతో దోహదం చేశాయి. నవ్యసాహితి సమితి తెలుగు కథకు ఎంతో సహాయకారి అయింది. తంగిరాల శంకరప్ప *వడ్లగింజలు*, వేలూరి శివరామశాస్త్రి *డిప్రెషన్ చెంబు, పిత్తల్‌కా దర్వాజ*, తన్మయత పేరొందిన కథలు. మొక్కపాటి నరసింహశాస్త్రి *'పిలక'* అనే స్కెచ్ తెలుగులోని హాస్య రచనల్లో ప్రధానమైందే కాకుండా తొలిది కూడా *'మహత్తు', 'చిత్రం'* సభ *'చిత్తరువు', 'బిక్షువు'* కథకుడిగా ఆయనకు మంచి పేరు తెచ్చి పెట్టాయి.

సంప్రదాయ వాదానికి భిన్నంగా స్త్రీ,పురుష సంబంధాల పట్ల, కుటుంబ జీవనం పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలను కలిగినవాడు గుడిపాటి వెంకటచలం *'సీత తల్లి', 'జెలసి', 'ఓ పువ్వు పూసింది'* ప్రముఖ సాంప్రదాయవాది అయిన విశ్వనాథ సత్యనారాయణ కూడా మంచి కథకులుగా పేరు పొందారు. *'కుక్క', 'నా ఋణం తీర్చుకున్న'.*

కవిత్వంతోపాటు చిత్ర కళలలోకూడా ప్రసిద్ధుడైన అడవి బాపిరాజు కథలు మినియేచర్ కళాఖండాలని పోరంకి దక్షిణామూర్తిగారి కితాబు. ప్రఖ్యాత కవి పండితుడైన అబ్బూరి రామకృష్ణారావు, 'వీణ', *వసుబాలుడు, భోగిరీలోయ.* సూర్యరాజు కథలు రాశారు. *బాలనీతి కథావళి, మావూరు, ఓట్టు* విఖ్యాత కవయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ రచనలు. మధ్యతరగతి కుటుంబ జీవితానికి అద్దం పట్టే *కాంతమ్మ కథలు* మునిమాణిక్యం నర్సింహారావు సృష్టి. తెలుగు కథా సాహిత్యంలో తనకంటూ ఒక సొంత శైలిని సృష్టించుకొన్నవారు మల్లాది రామకృష్ణశాస్త్రి, *'వనమాల', 'చెంగల్వ', 'దొదమ్మి', 'అల్లోనేరేడు', 'వెలది వెన్నెల', 'సోహం'* మొదలైనవి పల్లెటూరి వాతావరణానికి పట్టుగొమ్మలు. తెలుగు కథకుల్లో సుప్రసిద్ధుడు కొడవటిగంటి కుటుంబరావు మధ్యతరగతి జీవుల మంచి చెడ్డల చిత్రణ నిరాడంబరమైన శైలిలో ఇతని రచనల్లో ప్రస్ఫుటిస్తుంది. *'ఒంటి స్తంభం మేడ', 'ఫాల్ అవుట్', 'లేచిపోయిన మనిషి'* ఇతని కథల్లో ప్రసిద్ధమైనవి. త్రిపురనేని గోపిచంద్ గొప్ప మానవతావాది నేను నా పాత్ర, పెద్దల సుద్దులు ఈనాడు ప్రసిద్ధికెక్కుతున్న గల్పికలవంటి హాస్య రసస్ఫోరకమైన కథలు. సాహిత్య శిల్ప మర్మజ్ఞత, *జేగంటలు* ఇతని రచనల్లో ప్రధానమైతే ఊదా బిందువులు కథకుడిగా పేరు తెచ్చి పెట్టింది.

విశ్వసాహిత్య రంగంలో తెలుగు కథకు ఉన్నత స్థానాన్ని సంపాదించి పెట్టిన *'గాలివాన'* కథ ప్రవర్తనావాదానికి ప్రఖ్యాత ఉదాహరణ. శిల్పానికి పడవ ప్రయాణం చక్కటి ఉదాహరణగా నిలిచింది. పాలగుమ్మి పద్మరాజుగారి ఈ రెండు కథలే చాలు తెలుగు కథా రంగంలో ఆయనకు అద్వితీయ స్థానాన్ని సంపాదించిపెట్టడానికి. కథాసాగరం పదమూడు అంటూ వివిధ సంపుటాలుగా వెలువడ్డ రాచకొండ విశ్వనాథశాస్త్రి కథలు చాలా విశిష్టమైనవి. ఇతని కథల్లో *'ఆరు సారాకథలు', 'కార్వర్ ట్రీట్',* ఉత్తమ కథకుడిగా రావిశాస్త్రిని నిలబెట్టినవి. కాళీ పట్నం రామారావు కథలో *చావు, భయం, యజ్ఞం* మొదలైనవి చెప్పవచ్చు. అదే విధంగా మధురాంతకం రాజారాంగారు అచ్చం తెలుగు కథకోసమే పుట్టిన రచయితలాకనిపిస్తాడు. ఆ కథల వెనుక ఆయన వ్యక్తిత్వం ఎంతో ఉన్నతంగా కనిపిస్తుంది. ఆయన నిండుకుండవంటి వాడు, రచనకూడా అంత నిజంగానూ ఉంటుంది. ఆయన రాసిన కొన్ని వందల కథల్లో ఏ ఒక్కటి తీసినా రాజారాం ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. "కుంపట్లో కుసుమం, కాటుక కంటినీరు, తాను వెలిగించిన దీపాలు, సర్కసుడేరా, వగపేటికి చల్లచిందినన్ మొదలైన ఎన్ని లేవు ఆయనకు చిరప్రతిష్ట చేకూర్చినవి!" (దక్షిణామూర్తి, పోరంకి 1975, పు.33), తెలుగు కథకు హాస్యాన్ని అద్దిన కథకుడు ముళ్ళపూడి వెంకట రమణ *జనతా ఎక్స్‌ప్రెస్, ఆకలి ఆనందరావు, కానుక* వంటివి ఇతని ప్రఖ్యాత రచనలు. శీలావీర్రాజు కవి, నవలా రచయిత, కథకుడు. *'పగమైనస్ ద్వేషం', 'పాడి మేఘం', 'పెనుగాలి'* వీరి ప్రసిద్ధ కథలు. ఈ తరం కథకుల్లో ఓల్గా, శ్రీరమణ, ఎర్రంశెట్టి సాయి, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వేంకటకృష్ణమూర్తి ముఖ్యులు.

తెలుగు సాహిత్యంలో కథ తొలినాళ్ళనుండి ఒక ప్రత్యేకస్థానాన్ని పొందింది. ఈ నాటిదాకా ఆ కథాస్రవంతి అలా కొనసాగుతూనే ఉంది. కథలను వాదనలను, మనస్తత్వ చిత్రణను, ప్రాంతాలను అనుసరించి విభాగాలుగా చేస్తున్నారు సాహితీ విమర్శకులు. అలాంటి విభాగాల్లో తెలంగాణ కథకు ఒక ప్రత్యేక స్థానం ఉంది.

సాహిత్యానికి సమాజానికి ఉన్న సంబంధం గురించి ఇవాళ కొత్తగా చెప్పవలసిన అవసరం

లేదు. సాహిత్యం ఆవిర్భవించిన కాలంనుంచి అది నిరంతరం సామాజిక సంపర్కంలో ఉంటూ వచ్చింది. ఒకరకంగా, సామాజికంగా సంభవించే సంఘర్షణలో ఇందులోని వైరుధ్యాలు ఆ వైరుధ్యాల పరిష్కరణ కోసం చేసే పోరాటాలు ఉద్యమాలు అన్ని కూడా సాహిత్యంలో అనివార్యంగా ప్రతిఫలిస్తూ వచ్చాయి. ఒక రకంగా వచన సాహిత్యం మొదలైన తరువాత ఈ ప్రతిఫలనం అలాగే సమాజానికి సాహిత్యానికి ఉన్న సంబంధం మరింత శక్తివంతంగా రుజువు చేయబడుతూ వచ్చింది. ఈ పై అభిప్రాయం స్థూలంగా తెలుగు సాహిత్యం మొత్తానికి సంబంధించిందిగా చెప్పటానికి సంశయమైతే ఉండనవసరం లేదు. కాని, దాన్ని కొంత లోతుగా పరిశీలించినట్లయితే ఈ సమస్త సాహిత్య ప్రతిఫలనాలు మొత్తం తెలుగు సమాజ జీవితాన్ని, అంటే తెలంగాణ రాయలసీమా, కోస్తాంధ్ర ఉత్తరాంధ్ర ప్రాంతాల జీవితాన్ని ప్రతిఫలించాయా? అని ప్రశ్న వేసుకుంటే సమాధానం లేదు అని చెప్పుకోవలసిఉంటుంది. ఇందుకు ప్రధాన కారణం అర్థం చేసుకోవటానికి సాహిత్య చరిత్రలో మరీ వెనుకకు వెళ్ళి చూడనవసరంలేదు. తెలుగు కథ ఆవిర్భావం నుంచి అంటే సుమారు ఒక వంద సంవత్సరాల కాలం నుంచి వెలువడ్డ కథా సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే విషయం చాలా సులభంగానే అవగతం అవుతుంది. గత వంద సంవత్సరాలలో నిర్దిష్టంగా చెప్పుకుంటే గురజాడ నుంచి వెలువడ్డ తెలుగు కథాసాహిత్యంలో ప్రతిఫలించింది, కోస్తాంధ్ర జీవితమే. రచయితలు కోస్తాంధ్ర వెలుపల ఉండికూడా తాము రాస్తున్న, ఉత్పత్తి చేస్తున్న సృజనాత్మక రచనలకు ముడిసరుకుని దాని వ్యక్తీకరణకు అవసరమైన భాషని ఎక్కువ సందర్భాలలో కోస్తాంధ్రా నుంచే తీసుకోవటం జరుగుతూ వచ్చింది. ఈ తరహా వ్యక్తీకరణకు వెలుపల మిగతా ప్రాంతాలలో కూడా ఆయా స్థానిక ప్రత్యేకతలను బట్టి ప్రాంతీయ నిర్దిష్టతలను అనుసరించి సాహిత్య ఉత్పాదన జరుగలేదు. అసలు అలా ప్రయత్నించే భావవాతావరణంకూడా కోస్తా జిల్లాల వెలుపల లేదు. విభిన్నంగా రాయటానికి చేసే ప్రయత్నంలో అసలు తమ రచనలకీ భావ వ్యక్తీకరణకీ ప్రాధాన్యత ఉండదనే భావించవలసిన పరిస్థితి ఈ మధ్య కాలందాకా విమర్శకులలోను సృజనాత్మక రచయితలలోను బలంగా ఉంది. దీన్ని ఛేదించుకొని రచన చేయటం కొంత

సాహసంతో కూడిన పనిగా కనిపించింది. అయినప్పటికి మిగతా ప్రాంతాలలో కొంత పరిగణింపదగిన సంఖ్యలోనే ఉంది. అయితే అసంఖ్యాకంగా ఉన్న కోస్తా ప్రాంత రచయితలు దాదాపు 7 దశాబ్దాల పాటు సాహిత్యాన్ని, మిగతా ప్రాంతాల సాహిత్యానికి చేతన పూరితంగానో అచేతనా పూరితంగానో నియంత్రించే పనికి పూనుకున్నారు. అయినప్పటికి చాలా మంది ప్రతిభావంతులయిన రచయితలు మిగతా ప్రాంతాల నుంచి కూడా రంగం మీదికి రావటం జరిగింది. ఈ నేపథ్యంలో వాళ్ళు కొన్ని శక్తివంతమైన రచనలను ముఖ్యంగా కాల్పనిక సాహిత్య రచనల్ని వెలువరించారు. అయితే సామాజికంగా ఒక ప్రాంతం మరొక ప్రాంతాలమధ్య ఉన్న స్పర్థలు, వివక్షతలు రెండో[ప్రాంత సాహిత్యాన్ని నిరాకరించక పోయినప్పటికి గుర్తించని స్థితి ఒకటి గత వంద సంవత్సరాలలో కనిపిస్తుంది. ఇది ముఖ్యంగా కోస్తా ఆంధ్ర రచయితలు తెలంగాణ రచయితల పట్ల తీసుకున్న వైఖరిలో కనిపిస్తుంది. తెలుగు సాహిత్యమంటే కోస్తా ఆంధ్రా సాహిత్యమే అనే ఒకానొక అసంబద్ధ ఆలోచన రూపుదిద్దుకోవటానికి కోస్తాంధ్ర రచయితల విమర్శకులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారకులైనారు. అయితే రెండు దశాబ్దాల కాలంలో తెలుగు దేశంలో రూపు దిద్దుకొని నడుస్తూ ఉన్న అస్తిత్వ ఉద్యమాల ప్రభావ ఫలితంగా మిగతా ప్రాంత సాహిత్యాలను వాటి శక్తిని గుర్తించక తప్పనిస్థితి ఒకటి ఇవ్వాళ నెలకొనిఉన్నది. ఈ స్థితి ఫలితంగా తెలంగాణ లాంటి నిరాదరణకు గురైన సాహిత్యాలు ఇవ్వాళ తమ ప్రత్యేకతను స్పష్టంగా ఆవిష్కరిస్తున్నాయి. ఈ ఆవిష్కరించే క్రమాన్ని తెలంగాణ ప్రాంతం చాలా శక్తివంతంగా చేయటం గమనార్హం.

### 2.1 తొలి తెలంగాణ కథ

తొలి తెలుగు కథ 1910లో వచ్చిందని గుర్తించినట్లయితే తొలి తెలంగాణ కథ కూడా 1910లో వచ్చింది. అది కొమర్రాజు వేంకట లక్ష్మణరావు *ఏఁబదివేల బేరము.* తెలుగు కథ ప్రారంభం సంఘసంస్కరణోద్యమంలో భాగంగా వెలువడటంవల్ల కథకి ఒక నిర్దిష్ట ప్రయోజనాన్ని ఆపాదించటం అనివార్యంఅయింది. అయితే ఈ సంస్కరణోద్యమ ప్రభావం కోస్తాంధ్ర ప్రాంతంలో తీవ్రంగా ఉండటం వలన దాన్ని ప్రచారానికి ఉద్దేశించిన కథా సాహిత్యం

కూడా కొంత ఎక్కువగా ఆ ప్రాంతంలో వెలువడటం అసహజ విషయమేమీకాదు. సంస్కరణోద్యమ ప్రభావం అంతగాలేని తెలంగాణ ప్రాంతంలో కథ కొంత మందకొడిగానే ఉంది. 1910 నుంచి 1944ల మధ్య వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంత మంది మాత్రమే కథకులు తెలంగాణ ప్రాంతంలో కనిపిస్తారు. అయితే 1944 తరువాత మాత్రమే కొంత ఎక్కువగా కనిపిస్తుంది. అసలు స్థూలంగా పరిశీలించినట్లయితే తెలుగు సమాజంలో బ్రిటిషువాళ్ళు పరిపాలించిన ప్రాంతంలో సాహిత్య ఉత్పాదన ఒకరకంగాను నైజాం ఆంధ్రలో మరొక రకంగాను ఉన్నట్లు తెలుస్తుంది. రెండు ప్రాంతాలకు చెందిన ప్రజల భావాలలో, ఆకాంక్షలలో ఉన్న వ్యత్యాసాలు విభిన్నతలు ఇందుకు కారణం కావచ్చు. ఈ రెండు ప్రాంతాల మధ్య ఆర్థికాభివృద్ధి వేగం ప్రాకృతిక వనరుల లభ్యంలో ఉన్న వ్యత్యాసం కూడా ఇందుకు కారణం కావచ్చు. కోస్తాంధ్రలోని కృష్ణా, గోదావరి నదులపై కట్టబడిన ఆనకట్టలు ఆ ప్రాంతాల ఆర్థిక సాంస్కృతిక స్వరూపాన్ని మౌలికంగా మార్చివేశాయి. ఆధునికత ఆవిర్భావం లేక దాని పరిణామపు వేగం కోస్తాంధ్రలో చాలా ఎక్కువగా ఉండటంవలన అది చాలా తక్కువ కాలంలోనే ఇటు బెంగాల్ సాహిత్య సాంస్కృతిక వాతావరణాన్ని అలాగే మిగతా ఐరోపాదేశాల నాగరికతను చాలా ముందుగా తెలుసుకోగలిగి వాటి ప్రేరణలోనించి తనదైన సాహిత్యాన్ని సృష్టించుకోగల్గింది. ఇందుకు భిన్నంగా నైజామాంధ్ర, ప్రధానంగా ముస్లీం ఉర్దూ పార్శీ సాహిత్య సంస్కృతుల ప్రభావానికి లొంగింది. తత్ఫలితంగా ఈ రెండు ప్రాంతాల సాహిత్య వ్యక్తీకరణలో తేడాని కొంత స్పష్టంగానే గమనించవచ్చు. ఈ తేడాని ఆధారం చేసుకొని రెండు సాహిత్యాలని పరిశీలించినట్లయితే తెలంగాణ సాహిత్య వ్యక్తీకరణలు తన ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టుకొన్న విషయం చాలా స్పష్టంగా అవగతం అవుతుంది. ఈ ప్రత్యేక అస్థిత్వ మనేది ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం 1956 ఏర్పడేవరకు కూడా కొనసాగినట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రత్యేకతని సాహిత్య చరిత్రలో ఎక్కడ కూడా రికార్డు చేయక పోవటం వలన తెలంగాణ ఆర్థికంగా వెనుకబడినట్లుగా సాహిత్య సాంస్కృతిక రంగాలలో కూడా వెనుకబడింది అనే ఒక అపప్రథ వచ్చింది. ఏ విమర్శకుడు, సాహిత్య చరిత్రకారుడు దీన్ని సవరించేందుకు ప్రయత్నించినట్లు కూడా

కనిపించదు. ఇంతకు ముందు చెప్పుకున్నట్లు దాఖలాలు లేవు. కాసుల ప్రతాపరెడ్డి అన్నట్లు "తెలుగు సాహిత్య చరిత్రల రచయితలు తెలంగాణవారు కాకపోవడం అందు ఒక కారణం కావచ్చు". (ప్రతాపరెడ్డి, కాసుల 'ఇరుసు' పుట.1) సమైక్యాంధ్రలో తెలంగాణ తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లే తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ సాహిత్యం అస్తిత్వాన్ని కోల్పోయింది.

పై నేపథ్యంలోనించే తెలంగాణ ఆవిర్భావాన్ని గురించి కొంత స్థూలంగా పరిశీలించటం ఈసందర్భంలో అవసరం. ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగ ఆంగ్లభాష సంస్కృతుల ప్రభావంతో మధ్య తరగతి వర్గం రూపు దిద్దుకోవటంతో ఆధునిక సాహిత్య ప్రక్రియ కథ కోస్తాంధ్రలో కొంత ముందుగానే ప్రవేశించింది. అలాగే చాలా ముందుగానే అక్కడ ప్రచురణ సంస్థలు ఏర్పడటం చదివే పాఠక వర్గం రూపొందడం లాంటివి చాలా త్వరితగతిని సంభవించాయి. ఈ వాతావరణం ఆనాటి తెలంగాణలో లేదు. తెలంగాణలో అప్పుడున్నది కేవలం భూస్వాములు, దొరలు, వాళ్ళ దగ్గర పనిచేసే అట్టడగు వర్గాలు. అందుకేనేమో అలాంటి తెలంగాణ కథ అట్టడగు వర్గ దృష్టికోణం నుంచి వెలువడింది. 1940లలో బూర్గుల రంగనాథరావు, గుండవరపు హనుమంతరావులు నెలకొల్పిన ఆంధ్రకేసరి గ్రంథమాల పేరుతో *"కమ్మ తెమ్మరలు"* అనే కథ సంకలనాన్ని ప్రచురించారు. ఆ తరువాత తెలంగాణ కథ ఉద్యమం కొంత ఉధృతంగానే సాగింది. ఈ ఉద్యమ పునాది 1910లోనే ఉన్నట్లు ముదిగొంటి సుజాతరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాసులు భావిస్తున్నారు. వారు "నైజాం రాజ్యం - అంటే తెలంగాణ గురించి ఏ విషయాన్నెత్తుకున్నా ఆంధ్ర పితామహుడు మాడపాటి హనుమంతరావు గారిని గురించి ముందు చెప్పవలసివచ్చినట్లుగానే కథా సాహిత్యంలో కూడా ఆయననే ముందుగా స్మరించవలసిఉంటుంది. మాడపాటి హనుమంతరావు *హృదయ శల్యము* కథ గురజాడ *దిద్దుబాటు* కథ అచ్చయిన ఆంధ్రభారతిలో 1912లో అచ్చయింది. మాడపాటి కన్నా ముందుగానే 1910 ఉగాది ఆంధ్ర పత్రిక సంచికలో అంటే మార్చి-ఏప్రిల్‌లో కొమర్రాజు కథ అచ్చయింది. గురజాడ దిద్దుబాటు 1910 ఫిబ్రవరిలో అచ్చయింది. అంటే ఆ కథ అచ్చయిన నెలా రెండు నెలలకే *"ఏఁబది వేల బేరము"* అచ్చయింది. దీన్ని బట్టి తెలంగాణలో కథా

ఉద్యమం 1910లోనే ఆరంభమైందని తెలుస్తుంది.'' (సుజాత రెడ్డి, ముదిగంటి- *తొలినాటి కతలు*, 2002 పుట.8)

## 2.2 తొలితరంకథ – విశ్లేషణ

ఈ పై క్రమాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగా తొలితరం తెలంగాణ కథలను విశ్లేషించటం ఇక్కడ అవసరం. 1910లో అచ్చయిన *'ఏబది వేల బేరము'* అనే కొమర్రాజు వెంకట లక్ష్మణరావు కథ చాలా సాదా సీద వర్ణనతో ఉన్న కథ. ఎంతో సరళంగా చాలా మామూలు విషయాన్ని ఎంతో ఆసక్తికరంగా కథనం చేయటం ఇందులో కనిపిస్తుంది. రవ్వల దొంగతనాన్ని చిత్రిస్తూ జమీందార్లు తమవైయక్తిక జీవితంలో దేశంకంటే దర్జాలకీ, దర్పాలకీ ఎంత ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారో తెలియచేసే కథ ఇది. సుజాతరెడ్డి, సంగిరెడ్డి శ్రీనివాస్‌లు సంకలనం చేసిన తొలినాటి కథల విశ్లేషణ అర్ధశతాబ్దపు తెలంగాణ కథ స్వరూప స్వభావాల్ని తెలియజేస్తుంది. బండారు శ్రీనివాసరావు రాసిన *రాజయ సోమయాజులు* సంస్కరణవాద ప్రేరణతో రాసిన కథ. 60 ఏండ్ల వృద్ధుడికి 8 ఏండ్ల బాలికకి జరిగిన వివాహంలో ఇంద్రియ పటుత్వం కోసం ఆ ముసలివాడు చేసే ప్రయత్నాలు అందుకు సహకరించిన మళయాళ వైద్యుడి కుయుక్తులు హాస్యభరితంగా ఉన్నాయి. అచ్చమైన వ్యవహారిక శైలిలో నడుపబడిన కథ ఇది. ఇదే సంస్కరణవాద ప్రేరణతో వెలువడిన మరొక కథ బాలిక విలాపం (1911) దీని రచయిత వెంకటరామనరసింహారావు. బాలవితంతువులను ఆత్మహత్యలనుంచి దేశభక్తుడు కాపాడిన వైనం ఈ కథలో కీలకాంశం. ఈ పై రెండు కథల లక్ష్యం ఒకటే అయినప్పటికి వాటిని సాధించేందుకు ఎంచుకున్న మార్గాలు భిన్నంగా ఉండటంకొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇద్దరి లక్ష్యం సామాజిక రుగ్మతలని నిర్మూలించి సమాజాన్ని సంస్కరించటమే అయినప్పటికి మొదటి కథ రాజయ సోమయాజులు రూపపరంగా చాలా సులువైన మార్గాన్ని ఎంచుకోగా రెండవ కథ బాలిక విలాపం శైలి గతంగా గ్రాంథిక భాషలో ఉండటం కఠినమైన పదాలు, సంస్కృత ఆర్యోక్తులతో నిండి ఉండటం కనిపిస్తుంది. ఈ తరములోనే *అడవిగాచిన వెన్నెల* (రామచంద్రుడు, మాడపాటి) కథ ఉంది. ధన సంపాదన

కన్నా పత్రిక వృత్తిలో ఉన్న ఆనందాన్ని సేవాతత్పరతను నొక్కి చెప్తూ రాయబడిన కథ ఇది. ఈ కథలో కూడా లక్ష్యం ఒకరకంగా సంఘ సంస్కరణ అయిన లేక నైతిక ప్రబోధమైన ఆ లక్షణ సాధనకు అవసరమైన సులభ శైలిని ఎంచుకోకపోవటం ప్రధానలోపంగా భావించవలసి ఉంటుంది. నిజానికి ఈ కథారచయిత కాంగ్రెసు జాతీయోద్యమ నాయకుడు, సంఘసంస్కర్త, పైగా రాజరామ్మోనరాయ్ స్ఫూర్తితో సంఘసంస్కరణకు నడుము బిగించిన వాడు, అయితే వ్యవహారిక భాషల్ని సాహిత్య భాషగా మార్చటం పట్ల ఆయన ఎందుకో ఆసక్తి ప్రదర్శించనట్లు కనిపిస్తుంది. కనీసం ఆయన కథ అడవిగాచిన వెన్నెలలో ఆ విషయం నిజం.

## 2.3 డిటెక్టివ్ కథ

1925లో *నీవేన* కథను సోమరాజు రామానుజరావు రచించెను. ఈ కథ ఒకరకంగా డిటెక్టివ్ కథలను తలపింపచేసే కథ. 1920లలోనే తెలంగాణలో డిటెక్టివ్ కథలు ప్రదర్శించిన వైచిత్రికి ఇదొక ఉదాహరణ. ఈ కథలని మాత్రమే దగ్గర పెట్టుకొని చూసిన ఒక దశాబ్దపున్నర కాలంలోనే తెలంగాణలో కథ ఏదో ఒక స్థాయిలో వస్తురూపపరంగా విస్తృతమవుతున్నట్లుగా తెలుస్తుంది. ఈ విషయంలో కోస్తాంధ్రలో వెలువడ్డ తొలి తెలుగు కథలకి అదేకాలంలో తెలంగాణలో వెలువడ్డ కథలకీ మౌలిక వ్యత్యాసమేమీలేదని తెలుస్తుంది.

## 2.4 తొలితరం కథ - భాష

1930ల నాటి తెలంగాణ కథనంలో కూడా గ్రాంథిక భాషాఛాయలు ఎక్కువగానే ఉన్నాయనే విషయం ఆనాటి కథల్ని రేఖామాత్రంగా పరిశీలించినా అవగతమవుతుంది. మాండలిక పదాలు అక్కడక్కడ కనిపించినప్పటికి కథా రచన మౌలికంగా గ్రాంథికభాషే ఊతంగా నడిచినట్లు తెలుస్తుంది. ఉదాహరణకి సోమరాజురామానుజరావు రాసిన 'నీవేనా' కథలోని ఈ వాక్యాలు పై అభిప్రాయానికి సాక్ష్యం" అమ్మా! మీరీయింటికే వచ్చితిరా? నేనును, మీవలె గొన్నాళ్ళ క్రిందట సౌందర్యవతినే నాకు గొంచెము డబ్బుండెను. ఆ డబ్బుహరించి, ఈ చీనావాడు, నన్నిందు జేర్చెను. నాకు వీడుబాగుగ నల్లమందు నభ్యాసము చేసి నా తెలివిని చంపివేసెను. నా రూపము విడుదలయ్యెను. క్రమముగ నల్లమందు నిచ్చుట

మానిరి. నా స్థితి మరొకసన్నమైనది. వీడు కొన్నినాళ్ళస్నేహము చేసినట్లే చేసి, నమ్మించి తుదకు వీరిని పిలిచి, ఇందు బంధించి చంపి వారియాస్తిని హరించారు. మీరును దీనినుండి బయటపడక పోయితిరా నావలెనే యగుదురు. అదిగో! ఆపరున్న యువతి నిన్ననే యిందు చిక్కుడునది' అని పలికెను. (తెలంగాణ కథలు: 2005 పుట.29) ఎక్కువ భాగం కథలు గ్రాంథిక భాష భావాలలో నడిచినప్పటికి స్థూలంగా అందులో ఉంది సరళగ్రాంథికమే అనే విషయం గ్రహించటం అంత కష్టమేమి కాదు. తొలితరం తెలంగాణ కథకుడు మాడపాటి హనుమంతరావు కథలలోగాని, ఆతరువాత 1940 వరకు ఉన్న కథకులలో కూడా మనకు కనిపించేది సరళ గ్రాంథికమే తప్ప! మితిమీరిన గ్రాంథికం ఎంతమాత్రంకాదు. కాళోజి, పొట్లపల్లి రామారావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, కాంచనపల్లి చిన వెంకటరామారావు, వెల్లూరి మాణిక్యరావు, భాస్కరభట్ల కృష్ణారావు, బూర్గుల రంగనాథరావు, నెల్లూరి కేతన స్వామిలాంటి కథకులు 1940కి లేక స్వాతంత్ర్యానికి ముందే రాసిన కథల్లో కూడా గ్రాంథిక భాష ఛాయలు చాలా స్వల్పం. వీళ్ళు తమ నిర్దిష్ట ప్రాంతంలో అమలులో ఉన్న, వ్యవహారిక భాషకి చాలా దగ్గరిగా ఉన్న భాషని ప్రామాణిక భాషగా గుర్తించి దాన్ని నమూనాగా తమ కథా భాషని రూపొందించుకోలేదు. అందువల్లే వాళ్ళ కథలలో తెలంగాణ భాషల్లో ఉన్న జవజీవాలు అక్కడి జీవితంలోని సహజత్వం అన్ని కూడా చాలా అద్భుతంగా వ్యక్తీకరణ పొందాయి. వీళ్ళు ఎవరు కూడా ఇతర ప్రాంతాల వారి మెప్పుకోసం తమదిగాని భాషని ఆశ్రయించలేదు. తమ జీవితానికి సాహిత్యానికి ప్రాంతీయమైన భాషని వాహిక చేసుకోవడం వల్ల వీళ్ళు ఎటువంటి భాషా సంబంధిత ఆత్మ న్యూనతకి లోనుకాకుండ రచన చేయగలిగారు.

## 2.5 వస్తువు

తెలంగాణ కథకులలో ఎప్పటికప్పుడు తమ కళ్ళముందు ఎదురవుతున్న సమస్యలకు కథారూపం ఇస్తూ తద్వారా ఆ సమస్యలకు స్పందనలు పరిష్కారాలను చూపిస్తూవచ్చారు. ఉదాహరణకి దళిత సమస్యని చాలా ముందుగానే గ్రహించి దాన్ని సాహిత్యంలో ప్రతిఫలించిన వైనం 1932లో వెంకట భాగ్యరెడ్డిమ్మ రాసిన వెట్టి మాదిగ కథ ద్వారా తెలుస్తుంది. ఈ కథ

భాగ్యనగర్ పత్రికలో అచ్చయింది. ఈ పత్రికలో అజ్ఞాతవాసి పేరుతో ఈ కథ అచ్చయింది. *వెట్టి మాదిగ* కథ మౌలికంగా కథాలక్షణాలు లేకపోయినప్పటికి దళితుల దీన స్థితిని చాలా చక్కగా ప్రతిఫలించిన కథ. పోలీస్ పటేల్ రామిరెడ్డి తన బంధువులకు కబురు చేసేందుకు ఊరి మాదిగను పిలుచుకురమ్మని తలారిని పంపుతాడు. మాదిగకు వ్యక్తిగతమైన పని ఉండటం వలన తలారితో రాలేనని చెబుతాడు. తలారి నుంచి ఈ విషయం తెలుసుకున్న రామిరెడ్డి కోపోద్రేకుడై తలారిని విపరీతంగా తిడతాడు. దాని ఫలితంగా తలారి మాదిగవాడ దారిపట్టి ఈ విధంగా అనుకుంటాడు... ఆ సందర్భంలో పటేల్ అన్న మాటలు ఆనాడు దళితుల పట్ల అగ్రవర్ణాలకు ఎటువంటి వైఖరి ఉందో అవగతం అవటమేకాక అది ఇవ్వాల్టికి కూడా ఎలా కొనసాగుతుందో తెలుస్తుంది. ఆయన ఇలా అంటాడు. "ఏమి, మాదిగ వాని కావశ్యక కార్యమా! ఇక్కడ సర్కారు పనినెవ్వరు చేతురని తలచెనో, నేడు రేపటి కాలమే మారినది. మాదిగలకు గూడ కన్నులు నెత్తికెక్కి క్రింది మీదు కానరాకుండనైనవి. రేపే వీరి పని పట్టించెదను. ఈ సారి వీరి మాన్యమును చేయించకున్న నేను రామిరెడ్డినేకానుఇపుడేమి విచిత్రకాలమో కాని సర్కారనిన అందరికి నిర్లక్ష్యమే కలిగినది. పాపము వారినెందుకు కష్టపెట్టవలెనని దయదలచిన వారు నెత్తికెక్కిపోవుచున్నారు. అందుకనే పెద్దలు చెప్పుతో నలుగరాచవలయునని చెప్పిరి. వెట్టంటే వీరికి కష్టమట. వీరిని ఊళ్ళో ఉండనిచ్చినందుకే, వీరికి రైతులతో బిచ్చము బలిపెట్టించే దెందుకో - ఇంట్లో కూర్చొని దొరలవలె తినుటకు కాబోలు. ఇక నా ప్రతాపమును చూపింతును. వీరల కొంపలు నాశనము చేతును ఎవ్వరడ్డము వచ్చెదరో చూచెదను కాక" (వెంకట భాగ్యరెడ్డివర్మ, మ్యాదరి 2005, పుట.51)

## 2.6 తొలిదళితకథ

తెలుగు కథ 1930నాటికి రూపపరంగా కూడా ఒక నిర్దిష్టతని కొంతవరకు సమగ్రతని సాధించటం జరిగింది. ముఖ్యంగా కోస్తాంధ్రలో అప్పటికే కథ ఒక పరిణితిని సాధించటం జరిగింది. ఇదే క్రమం కొంతవరకు తెలంగాణలో కూడా జరిగినప్పటికి ఆ పరిణితి పట్ల కొన్ని సందేహాలు రూపపరంగా *వెట్టిమాదిగ కథ* లాంటి కథల్లో కనిపిస్తాయి. ఈ కథ

వస్తుపరంగా చాలా ప్రాముఖ్యతగల్గిన విషయాన్ని సేకరించినప్పటికి శిల్పపరంగా చాలా అపరిణిత లక్షణాన్ని ప్రదర్శిస్తుంది. రచయిత ప్రత్యక్షంగా పాఠకులతో సంభాషించటం ఈ కథలోని మౌలికలోపం. కథ ముగింపులో రచయిత పాఠకుడ్ని ఈక్రింది విధంగా ప్రశ్నిస్తాడు. ''రామిరెడ్డి ఎంత కఠినాత్ముడో పాఠకులే గ్రహించవలెను. -ఇట్టి పటేండ్లు దేశము నందింకెంత మంది గలరో ఊహించుకొనుడు'' (భాగ్యరెడ్డి వర్మ, 2005, పుట.51) రచయిత పాఠకుడితో చేసే ఈ సంభాషణ కథలో రసాభాస కారణమవుతుంది. అయితే కొన్ని సందర్భాలలో కొన్ని వస్తువులను గురించి రాయటమే పురోగామి ఉద్యమానికి నాంది అవుతుంది. ఆ విధంగా చూసినప్పుడు ఈ కథ చాలా ముందుగానే దళిత సమస్యని చిత్రించి దళితుల పట్ల అగుపడ్డ దాష్ట్యాన్ని బహిర్గతం చేయటంలో చాలా ముందుంది. ఈ విషయంలో కోస్తాంధ్ర కతలతో పోల్చినపుడు తెలంగాణ కథ ఏమాత్రం వెనుకబడి లేదనే విషయం అవగతమవుతుంది. ముదిగంటి సుజాతారెడ్డి గుర్తించినట్లుగ దళితునిచే రాయబడిన మొదటి దళిత కథ ఇదే.

### 2.7 సంఘసంస్కరణ కథ

సంఘ సంస్కరణోద్యమం చాలా ఎక్కువ స్థాయిలో కోస్తాంధ్ర ప్రాంతాలలో జరిగినప్పటికి దానిని గురించి ఇప్పటికీ సాహిత్య ప్రతిఫలనాలు తెలంగాణ సాహిత్యంలోను ఎక్కువే ఉన్నాయి. గుండవరపు హనుమంతరావు రాసిన *టాకీలో సమావేశం* అనే కథ ఇందుకొక ఉదాహరణ. ఈ కథలో మధుసూదనరావు అనే యువకుడు కలకత్తాలో చదువుకుంటూ సెలవులకి తన సొంత ఊరు వచ్చి ఇక్కడ సినిమా హాలులో పరిచయమైన సరోజ అనే వేశ్య ప్రేమలో పడి ఆమెను భార్యగా స్వీకరించి తనతోపాటు తీసుకెళ్ళటానికి నిశ్చయించుకుంటాడు. తన నిశ్చయానికి చిహ్నంగా ఆమె చేతికొక ఉంగరాన్ని కూడా తొడుగుతాడు. వేశ్య వృత్తిలో జీవితపు అర్థాన్ని కోల్పోయిన సరోజను భార్యగా స్వీకరించి ఆమె జీవితానికో అర్థాన్ని కలిపించాలనే మధుసూదన సంస్కరణాభిలాషను చాలా సున్నితంగా ఈ కథ ప్రతిబింబిస్తుంది. ఆసంస్కరణాభిలాషలోనుంచే మధుసూదనరావు. ''నీ విచార ప్రపంచంలో నుంచి నన్ను వేరు చేసే ప్రయత్నం చేస్తానని'' సరోజతో అంటాడు. అందుకామె

ఆనందంగా అంగీకరిస్తుంది. ఈ కథలోని వస్తువు చాలా మామూలుగా ఉన్నప్పటికి ఆనాడు మిగతా ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉన్న సంస్కరణోద్యమ ప్రభావం ఇందులో ఆవిష్కృతమైంది. అంటే ఒకే రాష్ట్రంలో ఉన్న రెండు ప్రాంతాలుసామాజిక స్పందనల విషయంలో విభిన్నంగా ఉండజాలవు అని చెప్పేందుకు ఈ కథ ఒక సాక్ష్యం తెలుగు దేశంలో ప్రాంతాల వారిగా అనేక మాండలికాలున్నాయి. అందులో కోస్తాంధ్రా మాండలికం అనేక సాంస్కృతిక కారణాల రీత్యా ప్రామాణిక మైనదిగా ఈనాటికి పరిగణింపబడుతున్నది. అందువల్ల మిగతా మాండలికాలలో రాయటమనేది వెనుకబాటుతనం అనే ఒక తప్పుడు భావం ఇవ్వాళ కూడా ప్రచారంలో ఉంది. అచేతనంగానైనా కోస్తాంధ్రా రచయితలు ఈ భావ ప్రచారానికి కారకులైనారు. అయితే దీన్ని 1930లోనే సీతారామారావు లాంటి కథకులు *గరీబోణ్ణి* లాంటి కథలు రాయటాన్ని ధిక్కరించారు. 1939లో తెలుగు తల్లిలో ఈ కథ నల్లగొండ జిల్లా మాండలికంలో రాయబడిన మొదటి కథగా గుర్తింపబడింది. కథా ప్రారంభమే చాలా సజీవమైన మాండలికంలో ఉంటుంది. ఉదా॥ ఈ ప్రారంభ వాక్యాలు చూడండి "నీకెన్నేండ్లని దొరలడిగితే నాకేమి సెప్పస్తది. మా అయ్యనడిగినా తెలుస్తదో తెలవదో? మీరింతగా అడుగుతుంటే బుగులేస్తది. ఎన్నేండ్లు సెపితే యేమి తప్పోనని బాబూ దొరల పాదాల కాడ బతికేటోణ్ణి. ఏమన్నా ఎక్కువ తక్కువలుంటే భమించాలె గొప్పోండ్లు"- (సీతారామారావు, ఎం.బి. 2005, పుట.55) ఈ కథ వెలువడిన ఆరేడు దశాబ్దాల తరువాత కూడా మాండలికంలో రాయవచ్చా! అనే సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీతారామారావు సాహసాల్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఏ కథైనా కథకుడి అనుభవంలోనికి వచ్చిన నిర్దిష్ట వాస్తవికతకి ప్రతిఫలనంగా ఉంటుంది. ఈ ప్రతిఫలం సజీవంగా ఉండేందుకు సహకరించే అంశాలలో భాషకూడా ఒకటి. ఆ భాషను సజీవంగా ఆవిష్కరించేది దాని మాండలికం. ఏ శక్తివంతమైన రచన అయినా కూడా ఈ విషయాలకి వీలు ఉన్నంత దగ్గరగా ఉండటం ద్వారా మరింత మంచి సాహిత్యంగా గుర్తింపబడుతుంది. ఈ విషయాన్ని సీతారామారావు లాంటి రచయితలు చాలా ముందుగా గుర్తించి తమ స్వంత మాండలికంలో కథలు రాసి తమ మాండలికానికి సాహిత్య ప్రతిపత్తిని తద్వారా గౌరవాన్ని కలిగించాయి.

### 2.8 ఉద్యమాల ప్రభావం

పై కథల్ని వాటి వస్తు రూపాల్ని కొంతలోతుగా పరిశీలించినప్పుడు తెలంగాణ కథపై తెలుగు సమాజంలో ఆనాటికి నడిచిన అన్ని ఉద్యమాల భావాల ప్రభావం ఉందని ఏ విషయాన్ని గ్రహించటంలోను, తిరస్కరించటంలోను తెలంగాణ సాహిత్యవేత్తలు వెనుకబడిలేరని తెలుస్తుంది. అయితే తెలంగాణ కథకి మిగతా ప్రాంత కథకి కొంత వ్యత్యాసం ఉందనే విషయాన్ని అంగీకరింపక తప్పదు. ఈ సందర్భంలో సంగిశెట్టి అభిప్రాయాన్ని ఉదాహరించటం అవసరం. ఆయన ఇలా అంటారు "ఆనాటి నుంచి ఈనాటి వరకు తెలంగాణ కథ ఎప్పుడూ ఇక్కడి జీవితం, సంస్కృతి మాదిరిగా భిన్నమైనదే. మొత్తం తెలుగు కథానికలో ఎక్కడా పెనవేసుకోలేదు. కాకపోతే అక్కడక్కడా 'క్రాస్' అయింది. కోస్తాంధ్ర కథ పై ప్రారంభంలో బెంగాల్, ఇంగ్లీషు ప్రభావం ఉండేది. మాడపాటి హనుమంతరావు ప్రేమ్‌చంద్ కథలకు అనుసృజన చేస్తే, సురవరం ప్రతాపరెడ్డి ఏకంగా మొగలాయ్ కథలే వ్రాశాడు. నెల్లూరి కేశవస్వామి, ప్రేమ్‌చంద్, కిషన్ చందర్‌లాంటి ఉర్దూ రచయితల ప్రభావంతో కథలు రాశాడు. కులాలవారిగా చూసుకున్నా బేసేలు కథా రచనలో చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. వీరంతా తొలితరం అక్షరాస్యులు. పాఠకులు వీరే రచయితలు వీరే అని గమనించాలి. గ్రంథాలయోద్యమం. పత్రికోద్యమం, సేవా ఉద్యమాలు, ఆంధ్ర జనసంఘం, గ్రంథమాలలు, కుల సంఘాల చైతన్యాల ఇవన్నీ కథానిక రచనకు ప్రోత్సాహంగా నిలిచాయి" (శ్రీనివాస్, సంగిశెట్టి 2005, పుట.14).

ఏ భాషా సాహిత్యమైనా నిర్దిష్ట సామాజిక సాంస్కృతిక సంబంధాలను, సందర్భాలను బట్టి రూపొందుతుంది. వీటికి వెలుపల సాహిత్యం మనగల్గటం అనేది అసాధ్యం. అందువల్ల సాహిత్యానికి, సమాజానికి వ్యక్తీకరణ సాధ్యమైన భాషకు మధ్య అనివార్య సంబంధమనే విషయం ఇప్పటికీ నిరూపితమైన అంశం. ఒక వ్యక్తి స్వప్నాలు మాతృభాషలో మాత్రమే వచ్చినట్లు ఒక ప్రాంత జీవితం శక్తివంతంగా ఆ ప్రాంతపు మాతృభాషలోనే ఆవిష్కరించ బడుతుంది. ఇలా చూసినపుడు తెలంగాణ సాహిత్యం ఎక్కువకాలం తనది కానటువంటి

కోస్తాంధ్ర భాషని సాధనంగా చేసుకొని నడిచినట్లుగా తెలుస్తుంది. దానికి తోడు నిజాం పాలనలో ఉన్న తెలుగు వాళ్ళు 1947కి ముందు అంటే నైజాం సంస్థానం భారతదేశంలో కల్పటానికి ముందు ఎక్కువభాగం పరభాష ఆధీనంలో ఉండటం వలన తెలుగు సాహిత్య వికాసానికి ఆటంకం ఏర్పడింది. దానికి తోడు ఆ ప్రాంతవాసుల భావుకతని, భావాలను ఆ పరభాష నిర్దేశించింది. తత్ఫలితంగా తెలుగు సాహిత్యం తన స్వతంత్ర అస్థిత్వాన్ని నిలబెట్టుకొనటానికి తీవ్ర సంఘర్షణకి లోను కావాల్సివచ్చింది. ఈ సంఘర్షణలో కొంతమంది రచయితలు శక్తివంతమైన పాత్రని పోషించడం వల్ల నిర్దిష్టమైన సాహిత్యం తెలంగాణ మాండలికంలో రూపొందడానికి అపకారం కలిగింది.

ఒక రకంగా మిగతా ప్రాంతంలో జరుగుతున్న స్వతంత్రోద్యమానికి సంబంధించిన స్పృహ తెలంగాణ ప్రాంతీయులకు అందకుండా ఉంది. అయితే ఆ ప్రాంతంలో మొదలైన గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ పేరుతో మొదలైన సాంస్కృతికోద్యమం, ఈ రెండు కూడా తెలంగాణా ప్రాంతంలో ఒక స్పష్టమైన సాంస్కృతిక చైతన్యానికి అంకురార్పణ చేశాయి. ఈ సాంస్కృతిక చైతన్యమే తెలంగాణ విమోచనోద్యమానికి నైజాం వ్యతిరేక పోరాటానికి దోహదం చేసింది. జాగీర్దారుకు దేశీయులకు, దొరలకు వ్యతిరేకంగా సాగిన, భూపోరాటం ఆ పోరాటంతోపాటు వెలువడిన సాహిత్యం తెలంగాణలో ఆధునిక సాహిత్య ఆవిర్భావానికి కారణమైనాయి. ఈ సందర్భంలోనే ఒక రకంగా తెలంగాణలో ఆధునిక సాహిత్యానికి అంకురార్పణ జరిగింది. అభ్యుదయ స్పృహతో కూడిన ఒక కొత్త సాహిత్యం ప్రాచీన సాహిత్య పోకడల నుంచి బయటపడి యదార్థ జీవుల యదార్థ జీవితాన్ని సాహిత్యంలో ప్రతిఫలింప జేసింది.

## 2.9 సాహిత్య సంస్థలు

ఏ ఉద్యమ చరిత్రను పరిశీలించిన ఆ ఉద్యమ తొలినాళ్ళల్లో వెలువడే సాహిత్యం ఉద్యమ అవసరాల దృష్ట్యా నాటకం, కవిత్వంలాంటి రూపాలలో వెలువడటం చాలా

సర్వసాధారణ విషయం తెలంగాణలో తెలంగాణకి విమోచనోద్యమ కాలంలో వెలువడిన సాహిత్యానికి కూడా ఇదే వర్తిస్తుంది. పైమూడు రూపాలే ఆకాలంలో శక్తివంతమైన సాహిత్య రూపాలుగా ప్రజల ముందుకు వచ్చాయి. ప్రజలు వాటిని స్వంతం చేసుకున్నారు విద్యావంతులు కానటువంటి రచయితలు పాటని తమ భావ వ్యక్తీకరణ సాధనం చేసుకుంటే క్రమంగా విద్యావంతులైన రచయితలు కాల్పనిక సాహిత్యం, ముఖ్యంగా కథాసాహిత్య సృష్టికి పూనుకున్నారు. నైజాం వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొన్న కమ్యూనిష్టులతోపాటు ఏ కమ్యూనిష్టు భావ ప్రాభవం లేనటువంటి రచయితలు కూడా నైజాం వ్యతిరేక స్ఫూర్తిని తమ కథా సాహిత్యంలో వ్యక్తీకరించారు. ఆ కాలంలో చాలామంది వ్యక్తులు రాసిన కథలు లభ్యం కావడంలేదు. ఉదాహరణకు గొట్టిముక్కల కృష్ణమూర్తి గమా వరహారెడ్డి, పి.వి. నరసింహారావు, నొంగిరి వెంకటరావులాంటి వాళ్ళు రాసిన చాలా కథలు ఇవాళ దొరకటం లేదు అవి సంపుటాలకి ఎక్కకపోవటంవల్ల వాటిని ప్రచురించిన పత్రికలు కూడా లభ్యం కాకపోవటం వల్ల విలువైన తెలంగాణ కథా సాహిత్య సంపద చాలా వరకు కనుమరుగైనది. ఏమైనప్పటికి 1930 నుంచి 1950 వరకు ఉన్న కాలంలో తెలంగాణ 3 సాహిత్య సంస్థలు, (1) సాధన సమితి, (2) ఆంధ్రసారస్వత పరిషత్తు, (3) తెలంగాణ రచయితల సంఘం ఈ మూడు కూడా తెలంగాణాలో కథా సాహిత్యం విశేష ప్రాచుర్యాన్ని పొందటానికి ఇతోధికంగా దోహదం చేశాయి. ఈ మూడు సంస్థల గురించి ముదిగొండ సుజాతరెడ్డి అభిప్రాయాలను ఇక్కడ ఉదాహరించటం అవసరం. ఆమే ఇలా అంటారు. ''తెలంగాణాలో మూడు సాహిత్య సంస్థలు సాహిత్య కృషి చేశాయని చెప్పుకోవాలి. ఒకటి సాధన సమితి ఇది 1936లో ఏర్పడింది. రెండు ఆంధ్ర సారస్వత పరిషత్తు ఇది మొదట 1943లో నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తుగా సురవరం, మాటపాటిల సారధ్యంలో ఏర్పడింది. తరువాత 1948లో ఆంధ్ర సాహిత్య పరిషత్తుగా మారింది. మూడు తెలంగాణా రచయితల సంఘం. వీటిల్లో సాధన సమితి యువకుల చేత నడుపబడింది. ఇది కథల రచనల్లో ప్రచురణలో విశేషకృషి చేసిందని చెప్పవచ్చును. ఈ సమితిలోని సభ్యులు కవితలు, నాటికలు రేడియో నాటికలు గల్పికలే

కాక కథలను విశేషంగా రచించారు. కథల సంపుటాలను యీ సమితి అచ్చువేసింది. కథలెట్లా వ్రాయాలి అనే విషయాన్ని గురించి ఈ సమితి సభ్యుల్లో చర్చలు జరిగాయని బూర్గుల రంగనాథరావుగారిని కలిసినప్పుడు (మే-2002) చెప్పారు (సుజాతా రెడ్డి ముదిగంటి 2002 పుట.11)

## 2.10 మొదటి కథల సంపుటి

ఏమైనప్పటికి 1915లో మాడపాటి హనుమంతరావు "*మల్లికగుచ్ఛం*" అనే కథల సంపుటి వెలువడింది. ఇది తెలంగాణలో మొదటి కథల సంపుటిగా ముదిగంటి సుజాతారెడ్డి లాంటివాళ్ళు గుర్తిస్తున్నారు.

తరువాత ఆంధ్ర కేసరి గ్రంథమాల పేరుతో *కమ్మ తెమ్మరలు* అనే కథా సంకలనాన్ని ప్రచురించారు. తెలంగాణ మొదటి కథ 1910లో వెలువడితే అక్కడినుంచి 1950ల వరకు విస్తృతంగానే కథలు వెలువడ్డాయి. చారిత్రక అంశాల నుంచి సైన్సు సంబంధిత విషయాల వరకు తెలంగాణ కథకులు వస్తువులుగా స్వీకరించారు. వస్తు రూపాల విషయంలో ఈ కథలు మిగత తెలుగు మాండలికాలలో రాయబడిన ఏ కథలకు తక్కువ కాదు. మిగతా ప్రాంతాల రచయితల లాగా రాయాలని కొంతమంది ప్రయత్నించినప్పటికి ఎక్కువ భాగం కథకులు తెలంగాణ నిర్దిష్టజీవితాన్ని తెలంగాణకే పరిమితమైన ఉద్యమాలను కథా వస్తువులుగా చేసుకున్నారు. గురజాడ దిద్దుబాటు 1910లో వెలువడితే కొమ్మరాజు వేంకట లక్ష్మణరావు *ఏఁబదివేల బేరము* 1910లో వెలువడింది. తెలంగాణలో కూడా 1910లో కథా సాహిత్య రచనకు అంకురార్పణ జరిగింది. సంస్కరణాభిలాషతో కనీసం సాహిత్యానికి సంబంధించి మాడపాటి గురజాడకి ఏ మాత్రం తీసిపోరు. మాడపాటి కూడా స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ విద్యకు సామాజిక ఉద్యమాల్లో పాల్గొనడం ద్వారా విశేష కృషి చేశారు. "*హృదయశల్యం*", "*నేనే*" అనే మాడపాటి రెండు కథలు అయన సంఘసంస్కరణ అభిలాషకి సంకేతాలుగా నిలుస్తాయి. ఉద్యమాల్లో పాల్గొనటానికి అప్పుడప్పుడే ముందుకు వస్తున్న ఆడవాళ్ళను అవమానించే మగవాళ్ళ స్వభావాలను బహిర్గతం చేసే లక్ష్యంతో మాడపాటి హృదయశల్యమనే

కథ రాయటం జరిగింది. హృదయశల్యం అనే కథ చారిత్రక కథగా అనిపించిన (దీనికి కారణం రాణి రుద్రమదేవి పాత్రగా ఉండటం) సారాంశంలోనిది. సాంకేతికంగా సామాజిక సమస్యల్ని స్త్రీపురుషుల మనస్తత్వాలను, భార్యాభర్తల సంబంధాలలో ఉండే సంక్లిష్టతలను (అభిప్రాయాల పరంగా) ఈ కథ చిత్రిస్తుంది. అలాగే ఆయన రాసిన మరో కథ ''నేనే'' కథకూడా పురుషుడు పరస్త్రీ వ్యామోహాన్ని చర్చిస్తూ పురుషుడు మారాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిన మంచి సంస్కారవాదకథ.

## 2.11 జాతీయోద్యమ కథ

జాతీయోద్యమం కొనసాగుతున్న కాలంలో ముఖ్యంగా విదేశి వస్తువ్యామోహాన్ని ఖండిస్తూ విశేష భావ ప్రచారం జరుగుతూ ఉన్న నేపథ్యంలో తెలంగాణలో దానిని సమర్థిస్తూ మంచి కథలే వెలువడ్డాయి. రాఘవ రంగారావు రాసిన ''లండన్ విద్యార్థి'' 1927 అనే కథ ఒకటి. ఈ కథలో విదేశీ వస్తువ్యామోహాన్ని ఖండించటంతో పాటు ధనవంతుల దోపిడి తత్వాన్ని కూడా బహిర్గతం చేయటం జరిగింది. ఆ కథలో కొన్ని ఈ క్రింది వాక్యాలు రచయిత అనేక అంశాలను గురించి ముఖ్యంగా విదేశి భాషపట్ల, విదేశి వస్తువు పట్ల ఉండే కోరికను హేళన చేస్తూ రాయటం జరిగింది. ఆ కథల ఈ క్రింది వాక్యాలు ఆ హేళనను ప్రతిబింబిస్తాయి'' సర్వాలంకార భూషితయగు భార్య అగ్ని సాక్షిగా వివాహమాడిన  భార్య పడక గదిలోకి వచ్చి నిలిచెను. తుకారామామెను ఎగాదిగా చూచి "Who are you, please? అని ప్రశ్నించెను. అనగా నీవెవరివని అర్థము. ఆ తరువాత ముక్క తెలుగున అనలేకపోయెనా? నాలుగు సంవత్సరములకే తెలుగు బొత్తిగా మరిచెనా? మాతృభాషలో మాటలాడిన మానహానియా? విదేశమునకేగి వచ్చుట మన జన్మాంతర మంది వచ్చుట కాబోలు!'' (సుజాత రెడ్డి, ముదిగంటి 2002 పుట.12)

## 2.12 సైన్సు కథ

1927 సరుగూరి జయరావు రాసిన *''పరమాణువులో మేజువాణి''* కథా ఒక రకంగా తెలుగు భాషలోనే చాలా ముందుగా సైన్సు ఫిక్షన్‌గా పరిగణింపదగిన కథగా చూడవచ్చు.

రామన్ ఎఫెక్టును ఈకథలో కథకుడు ఉపయోగించడం విశేషం. అక్కడక్కడ పద్యాలను కూడా వాడుకుంటూ ఒక విశేష శిల్పంతో ఈ కథ రాయటం గమనార్హం.

## 2.13 తెలంగాణ కథకులు

ప్రపంచ సాహిత్య చరిత్రను పరిశీలిస్తే రాజకీయోద్యమాలు సాహిత్య ఉద్యమాలకు కారణం కావడం ప్రత్యక్ష రాజకీయ అంశాలు సాహిత్యానికి వస్తువులు కావడం చాలా సాధారణంగా కనిపించే అంశం మొదటి రష్యన్ విప్లవాన్నుంచి నిన్నమొన్నటి నక్సలైట్ ఉద్యమం వరకు ఇది వర్తిస్తుంది. 1940లో నైజాం నవాబుకి వ్యతిరేకంగా తెలంగాణ విమోచన దాని నేపథ్యంలో వెలువడ్డ సాహిత్య విషయాలలోను ఈ విషయం రుజువైంది. తెలంగాణ ఉద్యమానికి మౌలిక ప్రేరణ నైజాం కబంధహస్తాలనుంచి బయట పడటం అయినప్పటికి దాని వెనక ప్రజల సాంస్కృతిక ఆకాంక్షలు ఉన్నాయనేది కూడా విస్మరించ డానికి వీలులేదు. అంతకంటే ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం మనిషికి భూమికి ఉన్న సంబంధానికి మరింత లోతుగా ముందుకు తీసుకురావటం జరిగింది. ప్రజలు సమూహం కావడం వెనుక కేవలం దొరల దౌర్జన్యాలు రజాకార్ల ఆగడాలు నైజాం నిరంకుశోద్యమమేకాక, భూమి మీద ప్రజల కున్న ఆపేక్ష కూడా ఒక మౌలిక కారకం అనే విషయాన్ని కూడా మనం గుర్తించాలి. ఈ క్రమం మొత్తం సాహిత్యంలో ప్రతిఫలింపచేయడం అనేది అలవోకగా జరిగిన విషయం కాదు. కవులు కళాకారులు, కాల్పనిక సాహిత్య కారులు చాలా చేతన పూరితంగానే ప్రజల ఆకాంక్షలను, అస్తిత్వవేదనలను సాహితీకరించారు. కథ సాహిత్యానికి మాత్రమే పరిమితమై చూసినప్పుడు తెలంగాణ విమోచనోద్యమం అసంఖ్యాకమైన కథలు ముఖ్యంగా పోరాటకథలు రావటమనేది జరిగింది. ఇంతకు ముందు చూసినట్టుగా అనేకమంది సాహిత్యేతర రంగాలలో పనిచేస్తున్న వాళ్ళు ఉద్యమ ప్రేరణతో సాహిత్య రచనకి ముఖ్యంగా కథా రచనకి పూనుకున్నారు. ప్రముఖ చరిత్ర పరిశోధకుడు గోలకొండ పత్రికకు సంపాదకులు 'సురవరం ప్రతాపరెడ్డి కథా రచనకు పూనుకోవడం, ప్రతాపరెడ్డి కథలు, మొగలాయి కథలు అనే పేర్లతో

రెండు సంపుటాలకు సరిపోయే కథలు రాశారు . తెలంగాణ ప్రజల నమ్మకాలు, ఆచారవ్యవహారాలు, విశ్వాసాలు, కథలో ప్రధాన వస్తువులైనాయి. అలాగే, వట్టికోట ఆళ్వారు స్వామి కేవలం ఒక కథ రచయితగానే కాక దేశోద్ధారక గ్రంథమాల ప్రచురణకర్తగా తెలంగాణ సాహిత్యానికి విశేష కృషిచేశారు. నిజాం ప్రభుత్వం నిర్బంధానికి గురై జైలు జీవితం గడిపి జైలునుండి బయటికి వచ్చిన తరువాత "జైలులోపల" కథలు రాశారు. వాళ్ళిద్దరేకాక తెలంగాణ పోరాటాన్ని ఆనాటి సామాజిక స్థితిగతులను, సంక్షోభాలను పోరాటాన్ని చిత్రిస్తూ అనేకమంది చెప్పుకోవలసిన వాళ్ళు పి. వెంకటేశ్వరరావు, కాంచనపల్లి చినవెంకటరామారావు, ఆవుల పిచ్చయ్య, పర్చాదుర్గా ప్రసాదరావు, సి.వి. కృష్ణారావు, శారద, ప్రయోగ, తెన్నేటి సూరి, తుమ్మల వెంకట్రామయ్య, అట్లూరి పిచ్చేశ్వరరావు, లక్ష్మీకాంత మోహన్, రాంషా, కిరణ్ బి.ఎన్.రెడ్డి యం. వెంకట్రావ్ మరియు ఉప్పల లక్ష్మణరావు తెలంగాణా సాయుధ పోరాటకాలంలో జరిగిన ఉద్యమ ఉదంతాలను, మానవ సంబంధాలనూ, గెరిల్లా దళాల వీరోచిత గాథలను, చిరస్మరణీయమైన వారి లక్షణాలను చక్కని కథాకథన శిల్పంతో చిత్రించి భద్రపరిచారు.

ఆనాటి కథ రచయితల వస్తువుల్ని గురించి తెలంగాణ పోరాటం కథకులు ఇచ్చిన ప్రేరణ గురించి ప్రముఖ కథా సంకలన కర్త నవీన్ వాసిరెడ్డి ఇలా అంటారు. "సహజంగా ప్రజల పక్షాన నిలిచే రచయితలను ఈ పోరాట సంఘటనలు, వీరుల ఆత్మత్యాగాలు కదలించి వేశాయి. తెలుగు కథా సాహిత్యానికి వన్నెతెచ్చే కథలు వెలువడ్డాయి. జనగామ తాలుకా రేణికుంట పోరాటం పై వెలువడ్డ నవజాగృతి కథ, శారద రచించిన రెండు కథలు- కొత్తవార్త, గెరిల్లా గోవిందు, రాంషా కథ- మత్తానయ్య మరణం గెరిల్లా పోరాటాలకు దళ చర్యలకు ప్రతిబింబాలు. పోరాటంలో స్త్రీలు చూపించిన తెగువ, ధైర్యం పోరాటపటిమ, సహన శక్తి, ప్రతీకారవాంఛ, త్యాగశీలత రచయితలను కదిలించి వేశాయి. అందుకే ఈ వస్తువుతో ఎక్కువ కథలే వచ్చాయి. తుమ్మల వెంకట్రామయ్య గారి "మీరు గెలుస్తారు" చెప్పుకోతగిన కథ. ఇద్దరు స్త్రీ మూర్తుల పట్టుదల త్యాగశీలతలను ఇందులో చక్కగా

చిత్రించారు. నిజాం మిలిటరీ రజాకార్లు అటు తర్వాత నెహ్రూ సైన్యాలు కిరాతకులకు ముందుగా గురయ్యింది స్త్రీలే. వేలమంది చిత్రహింసలకు గురిచెయ్యబడ్డారు. వందలాది మంది అమానుషంగా చెరచబడ్డారు. ప్రతీకార వాంఛతో పగబట్టి నిజాం సైన్యానికి సింహస్వప్నమయిన రుద్రకథే తెన్నేటి సూరి *'సంధిలేదు'.* సహనశక్తి ప్రతిరూపంగా *'మహాశక్తి',* త్యాగనిరతికి పర్యాయపదంగా ఉండే *'విముక్తి',* ధైర్యానికి ప్రతిబింబమైన వడిశల - ఇవన్నీ మనల్ని ఉద్వేగభరితుల్ని చేసే కథలే''. (నవీన్ వాసిరెడ్డి 2008, పుట.13)

తెలుగు కథలో తెలంగాణ కథకు ఒక ప్రత్యేక స్థానం ఏర్పడిందనడానికి నవీన్ గారి మాటలే సాక్ష్యం. సాంస్కృతిక, రాజకీయ, ఆర్థికాది విషయాలే కాక తెలంగాణలోని భాషను కూడా తనలో ఇముడ్చుకున్న తెలంగాణ కథ కొద్దికాలంలోనే ప్రాముఖ్యతను సంతరించుకుంది.

# 3. కథ - తెలంగాణ రాజకీయోద్యమం

## 3.0 నిజాం పరిపాలన

మొగల్ సామ్రాజ్య పతనానంతరం ఆంగ్లేయులు భారతదేశమంతా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు. దేశంలో ఎక్కువభాగం వారి ప్రత్యక్ష పాలనలోకి వెళ్ళిపోయింది. నిజాం నవాబు పరిపాలనలో హైదరాబాద్ సంస్థానం ఉండేది నిజాం సంస్థానానికి స్వతంత్ర పరిపాలనా యంత్రాంగం ఉండేది. దీనికి స్వతంత్ర కరెన్సీ కష్టమ్స్, పోస్టల్ సర్వీసు వంటి అధికారాలుండేవి. దీనితోపాటు పోలీసుశాఖ, అటవీ శాఖ, అబ్కారిశాఖ మొదలైనవి ఉండేవి. ఇవేకాకుండా ప్రత్యేకమైన సైన్యంకూడా ఉండేది.

నిజాం నవాబు ఖజానాకు భూమిశిస్తుద్వారా అత్యధికమైన ఆదాయం వస్తూఉండేది. ఇతని రాజ్యంలో భూస్వాములు ఎక్కువగా ఉండేవారు. భూస్వాములకు భూమి మీదనేకాక ఆ భూమిని ఆశ్రయించుకొని బ్రతికే ప్రతి మనిషిమీద హక్కు ఉండేది. భూస్వాములు ప్రజలను అంటే స్త్రీ, పురుషులు, పిల్లలు అనే తేడా లేకుండా తమ స్వంత ఆస్తిగా భావించేవారు. ఈ విషయాన్ని "తెలంగాణలో ఫ్యూడల్ భూస్వామ్య సంబంధాలకు నగ్నమైన నిదర్శనం 'వెట్టి' విధానం, వెట్టి విధానమంటే నిర్బంధ చాకిరీ వసూళ్ళు ఆటవిక తెగల ప్రాంతానికి బాగా వెనుకబడిన కొన్ని సాంఘిక తెగలకు పరిమితమైందిగా భావించబడే ఈ వెట్టి విధానం తెలంగాణలో సమాజమంతా ఆవరించి ఉండేది. అన్ని వర్గాల ప్రజలకు తారతమ్యస్థాయిలో అది వర్తించేది. ప్రతి హరిజన కుటుంబం 'వెట్టి' చాకిరీ చేయడానికి కుటుంబంలోని వారినొకరిని కేటాయించవలసి ఉండేది. చిన్న పల్లెలలో ప్రతి ఇంటినుండి ఒక మనిషిని పంపడం జరిగేది. దేశ్‌ముఖులు, దొరల ఇండ్లలో, పటేలు, పట్వారి, మాలిపటెల్‌ల ఇండ్లలో 'ఊడుపు', 'చానిపి' మొదలైన గృహసంబంధమైన పనులుచేయడం మొదలుకొని పోలీసుస్టేషన్లకు తాలుకా ఆఫీసులకు రిపోర్టులు మోసుకెళ్ళడం గ్రామ కచేరికి బందెల దొడ్డికి కాపలాకాయడం వరకు రోజువారి పనిలో భాగమే." (వరవరరావు, 2007 పుట.26) అని అంటారు.

నిజాం ఆధీనంలో మహారాష్ట్రలోని మరట్వాడ, కర్ణాటకలోని కొంతభాగంతోపాటు తెలుగు మాట్లాడే 'తెలంగాణ'లోని జిల్లాలు అతని ఆధీనంలో ఉండేది. ఆనాడు నిజాం పాలకుల హింసల కారణంగా 'తెలంగాణ ఉద్యమం' 1940 సం॥లో మొదలైంది. ఈ ఉద్యమం ఆనాటి దొరలను, రజాకార్లను మట్టుపెట్టడానికి చేసిన ప్రయత్నం. ఆ తరువాత పోలీసు యాక్షన్ 1948 సం॥లో మిలటరీ చర్య తరువాత ఇది భారతదేశంలో విలీనమైనది.

తెలంగాణ ఉద్యమం భారతదేశంలోనే అసలు సిసలైన ప్రజాఉద్యమంగా మొదలైంది. దీనికి సరిపడే ఉద్యమం ఈ దేశ చరిత్రలోనే మరొకటి లేదని చెప్పవచ్చు. ఈ పోరాటంలోని ప్రత్యేకత ఏమిటంటే "ఉద్యమకారులు దుర్మార్గమైన దొరలవ్యవస్థ సమూలంగా పెకిలించి వేయాలని నిర్ణయించుకోవడం చాలామంది అభివర్ణిస్తున్నట్లు ఈ పోరాటం కేవలం భూమి కోసమో, భుక్తి కోసమో సాగింది కాదు. ఇది దోపిడి నీతికి వ్యతిరేకంగా దొరల పెత్తనానికి వారి సంస్కృతికి సామాజిక విధానాలకు వ్యతిరేకంగా సాగినపోరాటం. దొరల రాజ్యం స్థానంలో ప్రజారాజ్యాన్ని స్థాపించేందుకు సాగిన సంగ్రామం." (తిరుమల ఇనుకొండ 2008 పుట.2)

తెలంగాణ ప్రాంతంలో తూర్పున కోయవాళ్ళు, కొండరెడ్లు, దక్షిణాన చెంచులు; మైదాన ప్రాంతంలో లంబాడీలు, ఎరుకలు, వడ్డెరలు మొదలైన ఆదివాసులు, సంచార తెగలు నివసిస్తూ ఉండేవి. మధ్యయుగాల తెలుగు కాపులు, ముత్రాసి, మున్నూరుకాపు, తెలగ కులాల వాళ్ళు వ్యవసాయం చేసుకుంటుండేవారు. దాదాపు క్రీ.శ. 16వ శతాబ్దంలో ఆంధ్ర ప్రాంతము నుండి రెడ్డి రైతులు వలసవచ్చి, తెలంగాణ భూములను వ్యవసాయ సేద్యానికి అనువుగా మార్చుకోవడానికి, ఇక్కడ నివసిస్తున్న ఆదివాసులను వాడుకున్నారు. ఈ విధంగా జరిగిన ప్రయత్నాలు క్రీ.శ. 18వ శతాబ్దంలో ఉత్తరాది నుంచి మరట్వాడాలు, ఉత్తర ప్రదేశ్‌నుంచి ముస్లీంలు, దక్షిణాది నుంచి తమిళ బ్రాహ్మణులు రావడంతో మొదలైంది. ఆ సందర్భంలో వీరందరిరాక వలన తెలంగాణ ప్రాంతంలో వీళ్ళు ఒక శక్తివంతమైన పెత్తందారి వర్గంగా తయారయి వివిధ జాగీర్లను సృష్టించుకున్నారు. వీళ్ళు నిజాం పరిపాలనలో సంఘటితమై రాజకీయ వ్యవస్థలో, పాలనా యంత్రాంగంలో చోటు సంపాదించారు.

తెలంగాణాలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి కొన్ని గ్రామాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. గ్రామాన్ని ఏర్పాటు చేసేందుకు సప్తాంగాలు అవసరమని దాశరథిరంగాచార్య(1999)గారి అభిప్రాయం. సప్తాంగాలు అంటే ఏడు సేవాకులాలు అని అర్థం అని కుమ్మరి, కమ్మరి, వడ్ల కంచరి, మంగలి, మాల, మాదిగలు. తెలంగాణ ప్రాంతంలో ఈ కులాలు వాళ్ళులేని గ్రామం దాదాపు కనిపించదు.

18వ శతాబ్దంలో వలస వచ్చిన రెడ్లకు దిగువ స్థాయి సేవక కులాలవారికి మధ్య సరికొత్త అధికారిక పెత్తందారి సంబంధాలు ఏర్పడినాయి. 19వ శతాబ్దం మొదట్లో హైదరాబాద్‌పై బ్రిటీష్ ఇండియా ఆర్థిక విధానాల ప్రభావం ఫలితంగా పెత్తందారి రాజకీయంలో సేవలు జటిలంగా మారి సేవక కులాలకు బహిష్కృత కులాలకు చెందినవాళ్ళు 'వెట్టి' పనివాళ్ళుగా మార్చివేయబడ్డారు.

తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో చెదురుమదురు పోరాటాల రూపంలో ప్రారంభమైనదని చెప్పవచ్చు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఆహారధాన్యాల కొరతకు నిరసనగా 1938 సం॥లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. అదేకాలంలో ఉదార జాతీయ వాద మేధావులు 1930 సం॥లో స్థాపించిన (ఆంధ్ర మహాసభ) రాడికల్ వ్యవసాయ కార్యక్రమాల ఫలితంగా 1942 స॥ల నాటి వామపక్ష (కమ్యూనిస్టు) వేదికగా మారిపోయింది. ఆ తరువాత 1944 సం॥ నాటికి 'వెట్టి' వ్యతిరేక మహోద్యమంగా మారి దొరల పెత్తనాన్ని తీవ్రంగా ఎదుర్కొన్నది. అందువల్ల తెలంగాణా ఉద్యమం అధిక ప్రజానీకానికి చేరువ అయింది. నిరంతరం పోలీసు, మిలటరీ దాడులను ఎదుర్కొంటు ఈ ఉద్యమం ఆరు సంవత్సరాల పాటు సుదీర్ఘంగా నడిచింది. తెలంగాణ ఉద్యమం మొదట ఆనాటి నల్గొండలో ప్రారంభమై వరంగల్, కరీంనగర్ ఆ తరువాత కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంతాలకు విస్తరించింది. ఈ ఉద్యమం మూడువేల గ్రామాలకు వ్యాప్తి చెందింది. నిజాం ప్రభుత్వం వేలకు వేల జనాలను జైళ్ళలో, నిర్బంధ శిబిరాలలో బంధించింది. అప్పుడు

ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి గ్రామాలను రక్షించడానికి కొన్ని కమిటీలు ఏర్పడ్డాయి. "గ్రామకమిటీలను గ్రామరాజ్యకమిటీలను, రక్షించేందుకు పదివేలనుంచి పన్నెండువేల వరకు గెరిల్ల దళాలు, గ్రామ దళాలు ఏర్పడినాయి." (తిరుమల ఇనుకొండ, 2008 పుట 4) అని అంటారు.

తెలంగాణ ప్రజాఉద్యమంలో మరో ప్రత్యేకత ఏమిటంటే అదే సమయంలో దేశంలోను రాష్ట్రంలోను మతపరమైన ఘర్షణలు తీవ్రంగా జరుగుతున్నప్పటికి తెలంగాణ ఉద్యమం ఆ మత ప్రభావానికి గురికాలేదు. హిందు, ముస్లిం మతాలకు సంబంధించిన భేదభావాలు రాలేదు. "1940 సంవత్సరంలో అట్టడగు వర్గాల నుంచి ఆవిర్భవించిన ప్రజాఉద్యమం సంకుచిత మతం ఉచ్చులో ఇరుక్కుపోకుండా స్వతంత్రంగా ముందుకు సాగింది. ప్రజలు అప్పటికీ హిందు దొరలు, ముస్లిమ్ పోలీసులు అధికారులు అంత కట్టకట్టుకొని తమను అణచివేయడాన్ని ప్రజలు స్పష్టంగా గ్రహించారు. ప్రజల దృష్టిలో దొరలకు జాగీర్దార్లకు మధ్య ఎలాంటి తేడాలేదు. అందువల్ల వర్గ సమీకరణలు తెరమీదకు రాగల్గినవి. రజాకార్లలో అందరూ ముస్లిములే. తమ ముస్లిం రాజ్యాన్ని కాపాడుకోవడమే వారి ఏకైక లక్ష్యం. రజాకార్లు తెలంగాణ ప్రాంతంలోని భూస్వాములైన హిందు దొరల గడీల్లో తమ శిబిరాలను ఏర్పాటు చేసుకొనేవారు, దొరలు తమ పెత్తనాన్ని చెలాయించుకోవడం కోసం రజాకార్లకు గ్రామాల మీద దాడులు నిర్వహించేందుకు గ్రామాలలోని మిలిటెంట్ యువతను హతమార్చేందుకు సంపూర్ణ తోడ్పాటును అందించేవారు. దొరలు రజాకార్లను గ్రామాల్లోకి రప్పిస్తున్నది. గ్రామాల్లో ముస్లిం రాజ్యాన్ని స్థాపించేందుకు కాదు అని దొరలు తమ పెత్తనాన్ని రక్షించుకోవడానికేనని ప్రజలు గ్రహించారు. ప్రజల దృష్టిలో దొరలు జాగీర్దార్లు సంస్థానాధీశులు, పోలీసులు రెవెన్యూ అధికారులు, అటవీ అధికారులు అంతా ఒక్కటే. వాళ్ళే సర్కారు. వాళ్ళే తమ శత్రువులు." (తిరుమల ఇనుకొండ, 2008 పుట.7) ఈ విధంగా తెలంగాణ ఉద్యమం మతపరమైన మారణహోమానికి స్థానం ఇవ్వలేదు అని చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా పాల్గొనేవారు. వాళ్ళు దోపిడిదారులను ధైర్య సాహసాలతో

ఎదుర్కొన్నారు. పాత వ్యవస్థను నిర్మూలించి సరికొత్త వ్యవస్థను నెలకొల్పడానికి తమ వంతు సహకారాన్ని తెలంగాణ ఉద్యమంలో స్త్రీలుకూడా అందించారు.

### 3.1 మహాసభ

తెలంగాణాలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన మొట్టమొదటి ఉద్యమం సాంస్కృతికోద్యమం. మాతృభాషలో విద్యాబోధన కావాలన్న నినాదంతో హైదరాబాద్ విద్యావిషయక మహాసభ ఉద్యమాన్ని ప్రారంభించింది. 'లక్ష్మణరావు' ఈ ఉద్యమానికి ప్రేరణశక్తిగా నిలిచారు. హైదరాబాద్ ప్రజల విద్యావిషయక మహాసభ మొదటిసారిగా అమరావతిలో జరిపారు. ఎందుకంటే నిజాం రాష్ట్రంలో ఈ సభలకు అనుమతి లేదు. తరువాత ఈ మహాసభలు కాకినాడ, పూణెలో జరిగినయి.

### 3.2 గ్రంథాలయోద్యమం

మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావుల ఆధ్వర్యంలో తెలంగాణాలో గ్రంథాలయోద్యమం కొనసాగింది. మొదట ఈ గ్రంథాలయోద్యమ సభను ఖమ్మంలో జరపాలనుకొన్నారు. కానీ ప్రభుత్వం అనుమతి ఇవ్వనందున తరువాత దేవరకొండలో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన సభ జరపటానికి అనుమతినిచ్చి నిర్వాహకులు ప్రభుత్వానికి వెయ్యిరూపాయలు సెక్యూరిటీగా చెల్లించవల్సిందిగా కోరింది. ఆ సభలో రాజకీయపరమైన విషయాలు చర్చిస్తే ఆ డబ్బును జప్తుచేస్తామని ఆంక్షలు విధించింది.

### 3.3 ఆంధ్ర జన సంఘం

1921 సంవత్సరాన నవంబర్ 11, 12 తేదీలలో హైదరాబాద్‌లో మహారాష్ట్ర సంఘసేవకులు ఎస్.ఎస్.డి.టి. మహిళా విశ్వవిద్యాలయ సంస్థాపకులు మహర్షి 'కార్వే' అధ్యక్షతన నిజాం రాష్ట్ర సమాజ సంస్కార మహాసభలు జరిగినయి. ఇతని అధ్యక్ష ప్రసంగం ఎక్కువగా మరాఠీలోనూ కొంత ఆంగ్లంలోను జరిగింది. మహాసభ కార్యకలాపాలన్నీ ఆంగ్లం, మరాఠి ఉర్దూ భాషల్లోనే జరిగాయి. ఇది తెలంగాణా ప్రజలకు అసంతృప్తిని కలిగించింది.

హైదరాబాద్ ప్రముఖ న్యాయవాది 'ఆలంపల్లి వెంకటరామారావు' ఒక తీర్మానంపై తెలుగులో ప్రసంగించినపుడు సభలో చాలామంది అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'మహారాష్ట్రులు' తెలుగులో వినడానికి ఇష్టపడక గొడవ చేయడంతో 'ఆలంపల్లి వెంకటరామారావు' తన తీర్మాన ఉపన్యాసాన్ని మధ్యలోనే ఆపివేశారు. ఇది తెలుగు ప్రజలందరి మనస్సుకు బాధ కలిగించింది. స్థానికంగా అధిక సంఖ్యాకులుగా ఉన్న తెలుగు వాళ్ళు దీనిని అవమానంగా భావించి దాని పర్యవసానంగా ఆరాత్రే 'ఆంధ్రోద్యమం' ఆరంభించే సంకల్పంతో 'ఆంధ్రజన సంఘం' స్థాపించారు.

ఈ సంఘం 11మంది సభ్యులతో ఏర్పడింది. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందనరసింహారావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి ప్రముఖులు సంఘంలో ఉన్నారు.

## 3.4 నిజాంరాష్ట్ర ఆంధ్ర జనసంఘం

ఆంధ్ర జనసంఘం మొదట సమావేశం 14.02.1922నాడు కొండవెంకటరంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో సంస్థపేరు *'నిజాంరాష్ట్ర ఆంధ్ర జనసంఘం'*గా మారింది. దీనికి మొదటి కార్యదర్శి మాడపాటి హనుమంతరావు, తెలంగాణా సాంస్కృతికోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. "తెలంగాణాలోని ప్రజల సామాజిక ఆర్థిక సాంస్కృతిక చైతన్యాన్ని పదనుపెట్టడం ఆంధ్రుల శ్రేయస్సుకోసం సంఘాలను సంస్థలను స్థాపించడం సభలను సమావేశాలను ఏర్పాటు చేయడం ఆంధ్ర జనసంఘ ఆశయాలుగా ప్రకటించింది." (సత్యనారాయణ ఎస్.వి. 2008 పుట.14)

## 3.5 ఆంధ్ర జనకేంద్ర సంఘం

తెలంగాణాలోని వివిధ జిల్లాల సంఘాల కార్యక్రమాలను సమన్వయ పరచడానికి 1.4.1923న హన్మకొండ ఆంధ్ర జనకేంద్ర సంఘం ఏర్పడింది. దీని కార్యదర్శిగా 'మాడపాటి హనుమంతరావు' ఎన్నిక అయ్యారు. ఈ సంఘంలో వెట్టిచాకిరి వర్తక సంఘం వాటి

కరపత్రాలను ప్రచురించింది. అదేవిధంగా తెలుగు గ్రంథాలను ప్రచురించడం, పాఠశాలలు నెలకొల్పడం, చారిత్రాత్మక పరిశోధనలని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపట్టింది. దీని మొదటి మహాసభ 1930 సం॥లో 'జోగిపేట' మార్చి 3వ తేదిన 'సురవరం ప్రతాపరెడ్డి' అధ్యక్షతన జరిగింది. 'ఆంధ్రదేశపు మట్టి - అది మాకు కవనము' అనేప్రబోధగీతంతో ప్రారంభమైంది.

మొదటి మహిళా సభ శ్రీమతి 'నడింపల్లి సుందరమ్మ' అధ్యక్షతన జరిగింది. 1930-1946 వరకు అంటే 17 సం॥రాల కాలంలో 13 మహాసభలు జరిగినవి. సభాధ్యక్షులుగా సురవరం ప్రతాపరెడ్డి బూర్గుల రామకృష్ణారావు, పులిజాల వెంకట రంగారావు, మాడపాటి హనుమంతరావు, కొండవెంకట రంగారెడ్డి, నర్సింగరావు, రావి నారాయణరెడ్డి, మాదిరాజు రామకోటేశ్వరరావు, సర్దార్ జమాలాపురం కేశవరావు మొదలైన వారు ఉన్నారు. ఈ సభలు తెలంగాణాలోని వివిధ ప్రాంతాలలో జరిగాయి. తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రోద్యమ వ్యాప్తికి రాజకీయ చైతన్యానికి ప్రజలను ఉద్యమోన్ముఖులని చేయడానికి కృషిచేసింది.

## 3.6 హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్

1937 డిసెంబర్‌లో హరిపురం సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో ద్వితీయ సంస్థానాల తీర్మానాన్ని ఆమోదించారు. తత్ఫలితంగా 29.1.1938న హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపన జరిగింది. ఇందులో 10మంది సభ్యులుగా ఒక తాత్కాలిక కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఇందులో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణరెడ్డి వాళ్ళు ఉన్నారు. ఈ సమావేశంలో "జాతి, మత, వర్గ విచక్షణ లేకుండా హైదరాబాద్ సంస్థానం ప్రజలందరూ హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరి బాధ్యతాయుత ప్రభుత్వం స్థాపించాలనే ఉద్యమాన్ని బలపరచవల్సిందిగా ప్రజానీకాన్ని కోరుతూ ఒక కార్యవర్గం విజ్ఞప్తిని విడుదల చేసింది." (సత్యనారాయణ ఎస్వీ 2008 పుట.8)

9.9.1938 సం॥లో కాంగ్రెస్ సర్వసభ్యసమావేశం జరగవలసిఉండగా 7.9.1938నాడు నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ సంస్థను నిషేధించింది. అయినప్పటికి కాంగ్రెస్ కార్యకలాపాలు

ఆగిపోకుండా 24.10.1938 సం॥న సుల్తాన్ బజారు నుండి రావి నారాయణరెడ్డి, గోవిందరావు మరికొంతమంది కలసి సత్యాగ్రహం విజయయాత్రను ప్రారంభించి రెసిడెన్సీలోని బొమ్మల బావి వద్దకు చేరుకొన్నారు ఆ తరువాత సత్యాగ్రహ కార్యక్రమాన్ని హిందుమహాసభ, ఆర్యసమాజం సంస్థలు చేపట్టాయి. డిసెంబర్ 24న కాంగ్రెస్ సత్యాగ్రహం ఆగిపోయింది.

### 3.7 విద్యార్థుల వందేమాతర ఉద్యమం

ఆరోజుల్లో విద్యార్థుల కార్యక్రమాలపై అనేక ఆంక్షలు ఉండేవి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఒక ప్రవర్తనా నియమావళి ఉండేది. దాని ప్రకారం అధికారుల అనుమతిలేకుండా ఏ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంఘంలో చేరరాదు బహిరంగ వేదికల నుండి, ప్రసంగాలు చేయరాదు. అయినా పౌరహక్కుల అణిచివేతకు వ్యతిరేకంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు వందేమాతరం ఉద్యమాన్ని 1938 సం॥లో ప్రారంభించారు. ఇది విశ్వవిద్యాలయం మొత్తం వ్యాపించి ప్రభుత్వ గెజిట్ వరకు వెళ్ళి కోపాన్ని తెప్పించి, విద్యార్థులను బహిష్కరించింది. బహిష్కరణకు గురి అయిన విద్యార్థులు నాగపూర్ విశ్వవిద్యాలయానికి వెళ్ళిపోయారు.

ఈ వందేమాతరం ఉద్యమం గుల్బర్గా, నాందేడ్, బీదర్, మహబూబ్‌నగర్, ఔరంగబాద్ మొదలైన ప్రాంతాలకు పాకింది. నిజాం ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన విద్యార్థి సంఘాలు తెలంగాణ గ్రామాలలో రైతాంగ పోరాటాలను నిర్వహించగల నాయకులను తయారు చేసింది.

### 3.8 రైతాంగ పోరాటం

అక్రమ పన్నులకు వ్యతిరేకంగా 1925-32లో ఒకసారి, 1934-35 మధ్యకాలంలో రెండవసారి రైతులు తిరుగుబాటు చేశారు. అక్రమ పన్నుల రద్దు భూమిశిస్తు నిర్ణయం వెట్టి చాకిరి రద్దు మొదలైన అంశాలమీద పోరాటం చేశారు.

## 3.9 భారత స్వాతంత్ర ప్రకటన

దేశంలోని సంస్థానాలు అన్ని భారత యూనియన్‌లో చేరడానికి అంగీకరించినా, నిజాం సంస్థానం చేరడానికి నిరాకరించింది. నిజాం నవాబు హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర దేశంగా ఉంటుందని ప్రకటించాడు. ప్రజల స్వాతంత్ర్యాన్ని నిజాం నవాబు నిరాకరించాడు. భారత జాతీయ జెండాను నిషేధించాడు. హైదరాబాద్ 'స్టేట్ కాంగ్రెస్', 'స్టూడెంట్స్ యూనియన్' అన్నీ కూడా 'జాయిన్ ఇండియన్ యూనియన్' అంటూ ఉద్యమించాయి. యూనియన్ కార్యాలయం పై జాతీయ జెండా ఎగురవేశారు. మహిళలు యశోద బెహన్, బ్రిజ్ రాణి-గౌర్, విముబాయి, మేల్ కొటే, జ్ఞాన కుమారి హెడ్, అహల్యబాయి మొదలైనవారు వివిధ ప్రాంతాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తరువాత నిజాం సంస్థానంలోని అన్ని ప్రాంతాలలో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ పరిస్థితిని గమనించిన నిజాం నవాబు అణిచివేతను మరింత అధికం చేశాడు. దీనిలో రజాకార్లు కూడా ప్రముఖ పాత్ర పోషించారు. ''ఈ ప్రజా విలువను కేవలం పోలీసులతో అణచలేని నిజాం ప్రభుత్వం 'ఖాసీంరజ్వి' నాయకత్వాన పనిచేస్తున్న' 'మజ్లీస్ ఇత్తే హాధులైన ముసల్మీన్' కార్యకర్తలు అయిన రజాకార్లను గ్రామాలపైకి ఉసిగొల్పింది. సాయుధులైన రజాకార్లు నిజాం పోలీసులు గ్రామాలలో క్యాంపులు పెట్టారు. అనేక గ్రామాల మీద అమానుషమైన దాడులు, పాశవిక మానభంగాలు, ఆస్తులు దోచుకోవడం ఊళ్ళు తగలబెట్టడం మొదలైనవి చేపట్టారు'' (సత్యనారాయణ ఎస్వీ 2008, పుట.27).

## 3.10 సాయుధ పోరాటం

నిజాం సంస్థానంలోని ప్రజల మానప్రాణాలను కాపాడేందుకు నిజాం సైన్యానికి రజాకార్లను ఎదురించేందుకు సాయుధ ప్రతిఘటన అవసరమని అన్ని పార్టీల ప్రజలు అభిప్రాయపడినారు. 11.9.1947న ఆంధ్ర మహాసభ కమ్యూనిస్ట్ పార్టీలు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాయి. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మోహీయుద్దీన్ మొదలైన వారు పిలుపునిచ్చిన వారిలో ఉన్నారు. ఈ పిలుపులో 17 తీర్మానాలు చేస్తూ దానికి

అనుగుణంగా సాయుధ పోరాటం చేయాలని ప్రకటించారు. అందులో కొన్ని నిజాం ప్రభుత్వాన్ని కూలదోయటం పోరాట నిర్వహణకు సాయుధ పోరాట శిక్షణ ఇవ్వటం ఆయుధాలను, భూములను, స్వాధీనం చేసుకోవడం నిజాం కార్యకలాపాలను స్తంభింపజేయడం, ప్రభుత్వ రికార్డులను తగలబెట్టడం, భూమిశిస్తులను నిరాకరించడం బంజరు భూములను, అటవీ భూములను ప్రజలకు పంచడం, ఆఫీసులను, కోర్టులను, పాఠశాలలను, కాలేజీలను బహిష్కరించడం, కస్టమ్స్ ఔట్ పోస్టులను ధ్వంసం చేయడం, కార్మికులకు జీతాలను పెంచడం, ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి గ్రామ గ్రామాన జాతీయ జెండాలను ఆవిష్కరించడం మొదలైన అంశాలమీద సాయుధ పోరాటం చేయాలని నిర్ణయించారు.

### 3.11 తెలంగాణా విముక్తి

నిజాం సంస్థానంలో జరుగుతున్న అల్లకల్లోల పరిస్థితులను కె.యమ్. మున్షీ ఎప్పటికప్పుడు భారత ప్రధాని అయిన 'జవహర్‌లాల్ నెహ్రూ'కు హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు తెలియచేస్తూ ఉండేవాడు తెలంగాణా ప్రాంత పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. అని గ్రహించి 7.9.1948 నిజాం సంస్థానం భారతదేశంలో భాగమేనని పార్లమెంట్‌లో ప్రకటన చేశారు.

భారత ఉప ప్రధాని హోంశాఖ మంత్రి అయిన సర్ధార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్యకు ఆదేశించారు. మహారాజ్ శ్రీ రాజేంద్రసింగ్, *ఆపరేషన్ పోలో* పేరుతో సైనిక దాడికి దిగారు 13.9.1948 నాడు మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి నాయకత్వంలో 25వేల మంది భారత సైనికులు హైదరాబాద్ సంస్థానంలో అడుగు పెట్టారు. మూడు రోజుల యుద్ధం అనంతరం చివరికి నిజాం నవాబు 17.9.1948 నాడు సైనికులకు లొంగిపోయాడు. రజాకార్ల నాయకుడు 'ఖాసీం రజ్వి'ని భారత ప్రభుత్వానికి అప్పజెప్పారు. హైదరాబాద్ సంస్థానం నిరంకుశ నిజాం పరిపాలన నుండి విముక్తి పొంది భారత యూనియన్‌లో చేరింది. ఇంతటి సుదీర్ఘ సాయుధ పోరాటంలో ప్రధానంగా 4 దశలు ఉన్నాయి. అవి:

### 3.12.1 ప్రారంభదశ (1921-30)

దేశాభిమాన చైతన్యం వివిధ సంఘాల నిర్మాణం ప్రజలను సమీకరించడానికి జరిగిన కృషి ఈ దశలో ప్రధానమైనది.

### 3.12.2 భూస్వామ్య నిరసన (1932-1946)

అనేక గ్రామాలలో భూస్వామ్య పీడనకు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ప్రజలు పోరాట శీలాన్ని ప్రదర్శించిన దశ ఇది.

### 3.12.3 నిజాం ప్రభుత్వంపై వ్యతిరేకత - (1946-48)

ఒక వైపుభూస్వాముల దౌర్జన్యాలను ప్రతిఘటిస్తూనే మరోవైపు భూస్వాములకు, రజాకార్లకు, గుండాలకు అండగా నిలిచిన నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఆంధ్ర మహాసభ' నాయకత్వాన ప్రజలు తిరుగుబాట్లను తీవ్రతరంచేశారు. శత్రువులు ఎవరో తెలుసుకొని సమరశీల సంఘటిత పోరాటాలు నిర్వహించారు.

### 3.12.4 సాయుధ పోరాటం-(1948-51)

భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుగా ప్రారంభమైన పోరాటం పీడిత ప్రజల రాజ్య నిర్మాణ కాంక్షతో కొత్త మలుపు తిరిగింది. నిజాం రాజరిక పతనంతో ఆగక యూనియన్ సైన్యాల పాశవిక దాడులకు ఎదురు నిలిచింది. గ్రామాలను విముక్తం చేసింది. 'వెట్టి' చాకిరులను రద్దుచేసింది. దున్నేవాడికే భూమిని పంచింది. పాలక వర్గాలపై ఎదురుతిరిగి పోరాడే సమర మార్గాన్ని చూపించింది. తెలుగు జాతి ప్రతిఘటన చైతన్యాన్ని ప్రపంచానికి చాటింది''. (సత్యనారాయణ ఎస్వీ 2008 పుట.36)

## 3.13 తెలంగాణా పోరాట సాహిత్యం

అవిశ్రాంతంగా సాగిన తెలంగాణా పోరాటంలోకి గ్రామీణ ప్రజానీకాన్ని సమీకరించడానికి సాహిత్య ప్రక్రియలు, జానపద కళారూపాలు ఎంతగానో తోడ్పడినయి. ప్రజల నుండి కవులు, గాయకులు, బుర్రకథలు, ఒగ్గుకథలు, గొల్లసుద్దుల వాళ్ళు పుట్టుకొచ్చారు. ప్రజలు కదిలారు.

లాఠీలను, తూటాలను ఎదిరించారు. ప్రజాపోరాటాలు ఈ ఉద్యమకవులను ఉత్తేజపరిచాయి. మరిన్ని పోరాటగీతాలు పుట్టాయి. ప్రజలు పాడుకున్నారు. పాడుతూ పోరాడారు. ఈ పోరాట పాటలను ప్రజల సొంతం చేసుకున్నారు.

### 3.14 పోరాట సాహిత్యం-కథల పాత్ర

తెలంగాణ పోరాటం కథా రచయితలను, మేధావులనూ ఎంతగానో ఆకర్షించి, వారి ఆలోచనలపై బలమైన ప్రభావాన్ని చూపింది. నిజాం నిరంకుశ పాలన, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలు మొదలైన అంశాలు సాహిత్యాన్ని తట్టి లేపాయని చెప్పవచ్చు.

ఈ పోరాటం భూమినుండి పైకిపాకి సాహిత్యంలోని అన్ని ప్రక్రియలూ, పోరాట వస్తువులలో భాగమైనాయి. కథ, నవల, పాట, కవిత అన్నీ పోరాటాన్ని ప్రజల దగ్గరకు తీసుక పోయింది. తెలంగాణ పోరాటాన్ని చిత్రిస్తూ వందల పాటలు, కవితలు వందకు పైగా కథలు, కొన్ని నవలలు వెలువడినాయి. ఈ పోరాట ఇతివృత్తంగా వచ్చిన కవిత్వం కుందుర్తి *తెలంగాణ*, గంగినేని *ఉదయిని*, ఆరుద్ర *త్వమేవాహం* మొదలైన కవితా సంపుటాలు వెలువడినవని చెప్పవచ్చు. పోరాటానికి సంబంధించిన నవలల్లో *మృత్యుంజయులు*, *సింహగర్జన* తప్ప మిగిలిన నవలలు పోరాట విరమణ తరువాతనే వెలువడ్డాయి. *ప్రజల మనిషి*, *గంగు*, *ఓనమాలు*, *మృత్యువు నీడల్లో* మొదలైన నవలలు తెలంగాణా పోరాటాన్ని చక్కగా చిత్రించాయని చెప్పవచ్చు.

తెలంగాణ పోరాటాన్ని చిత్రించిన కథలు నాటి ప్రజా జీవితానికి, సంఘటనలకూ స్పందించి వెలువడిన కథలు, కథా సంపుటాలు కొన్ని చూడవచ్చు. ఈ కథలు ఆనాటి పత్రికల్లో అచ్చు అయినాయి. పోరాట విరమణ తరువాత పోరాట ప్రాంతంలో సంచరించి పోరాటంలో పాల్గొన్న వ్యక్తులను కలిసి వారినుండి సేకరించి పొందుపరుస్తూ రాసిన కథలు కొన్ని సంపుటాలుగా వెలువడినాయి. అవి గంగినేని *ఎర్రజెండాలు*, *ఆదర్శకుటుంబాలు*, ప్రజాశక్తి బుక్‌హౌస్ తెలంగాణా పోరాటంలో పాల్గొన్న కొందరు ప్రముఖుల నుండి వారి

అనుభవాలను సేకరించి *విప్లవ తెలంగాణ పోరాట వీరగాథలు* పేరుతో ఒక పుస్తకాన్ని అచ్చువేసింది. ఆ పోరాటంలో పాల్గొన్న స్త్రీల అనుభవాలను సేకరించి *'స్త్రీశక్తి సంఘటన'* పోరాటంలో పాల్గొన్న స్త్రీలను ప్రత్యక్షంగా కలిసి వారి అనుభవాలను వారి మాటల్లోనే రాసి *'మనకు తెలియని మన చరిత్ర'* అనే పేరుతో పుస్తకాన్ని అచ్చువేశారు.

సృజనాత్మక సాహిత్యంలో భాగంగా ఉన్న 'కథ'లు అనేకం వెలువడినాయి. ఒక విషయాన్ని యథాతథంగా చిత్రించడం కాక ఒక వాస్తవాన్ని గుర్తింపజేయడం కోసం విషయానికి కొంత కల్పనను జోడించి కథకుడు కథల్ని సృష్టిస్తాడు. సృజన శక్తితో, రచనా కౌశలంతో రచయిత తీర్చిదిద్దే సాహిత్య ప్రక్రియగా ఈ కథలు వెలువడ్డాయి. ఈ కథలు ఆనాటి పత్రికలైన 'మీజాన్', గోల్కొండ, కాకతీయ, ప్రజాశక్తి, విశాలాంధ్ర మొదలైన పత్రికలలో అచ్చైనయి.

అణాగ్రంథమాల *కాళోజీ కథలు* దేశోద్ధారక గ్రంథమాల *జైలులోపల, పరిసరాలు,* సారథి కార్యాలయం తెలంగాణ వీరగాథలు అరసం, *'మనఊళ్ళోకూడానా'* వరంగల్ కాంగ్రెస్ సమితి వారి *తెలంగాణ మంటల్లో అభ్యుదయ కథలు* మొదలైన సంపుటాల్లో తెలంగాణా పోరాటానికి సంబంధించిన కథలు లభిస్తున్నాయి.

### 3.15 పోరాట కథల విభజన

తెలంగాణ పోరాట కథలను మూడు దశలుగా విభజించవచ్చు మొదటి దశలో పోరాట పూర్వ కాలపు కథలు, పోరాట కాలపు కథలు, పోరాటానంతర కథలు మొదలైనవిగా చెప్పవచ్చు. ఈ కథలలో నాటి ప్రజా జనజీవనం ఆ పోరాటానికి ప్రజల్ని సన్నద్ధం చేసిన స్థితిగతులూ, గ్రామీణ జీవితాలకు అద్దం పట్టే విధంగా ఉన్నాయని చెప్పవచ్చు.

### 3.16 పోరాట కథలు విశ్లేషణ

1943లో కాళోజీ నారాయణరావు *'మనమే నయం'* అనే కథను రచించాడు. ఇది పోరాటానికి ముందు వచ్చిన కథ. ఈ కథలో సామాన్య ప్రజల జీవితాన్ని చిత్రించి వారి జీవితాలపై విమర్శనాత్మక వ్యాఖ్యానం చేస్తుంది. కవి రెండు ఎడ్ల పాత్రలు తీసుకొని అంటే

మానవేతర పాత్రల సంభాషణ ద్వారా మానవుల స్థితిగతులను తెలియచేశాడు. జంతువుల స్థితికన్న మానవుల స్థితి మరి హీనం అనే విధంగా చిత్రించాడు.

'జంతువుల మీద జరుగు అన్యాయ నిరోధక సంఘం' స్థానికంగా తమ సంస్థ వార్షికోత్సవాన్ని జరుపుతుంటే ఆ వార్షికోత్సవ సభా ప్రాంతానికి కొన్ని గుర్రాలను, ఆవులను, ఎడ్లను తీసుకొస్తారు. ఆ పశువులకు బుక్కాగులాలు, పూలదండలు, మొదలైన వాటితో అలంకరిస్తారు. ఇదంతా గమనించిన తెల్ల ఎద్దు ఆశ్చర్యంగా తనతో బండి లాగుతున్న నల్ల ఎద్దుతో మాట్లాడుతుంది. తమను ఇదే మనుషులు మిగతా రోజుల్లో ఎన్నెన్ని కష్టాలు పెడుతుంటారో గుర్తు చేసుకుంటుంది. అప్పుడు నల్ల ఎద్దు, "అంతావిని నిజమే చెప్పావు కానీ, మనల్ని ఇంత కష్టపెట్టే ఆ మనుష్యుల జీవితం మాత్రం ఏం బాగా లేదు. వారిలో చాలామంది జీవితం మనకన్నా అన్యాయం. కూటికీ, గూటికీ, గుడ్డకూ నోచుకోక కటిక దారిద్ర్యంతో మగ్గుతున్న ఈ ప్రజానీకపు స్థితికన్నా 'మనమే' నయమంటూ" తెల్లఎద్దుతో చెబుతుంది. అప్పుడు తెల్లఎద్దు తెల్లబోతుంది. ఈ పాత్రల ద్వారా రచయిత తన చుట్టూ ఉన్న ప్రజల జీవన స్థితిగతులను వాటి పట్ల తన స్పందనను ఆవేదనను వ్యక్తంచేశాడు.

'*పాడిఆవు*' అనే కథను 'వేనేపల్లి ఆంజనేయులు' 1946లో రాశాడు. ఇది 'మీజాన్' పత్రికలో అచ్చైంది. ఈ కథలో 'నర్సింగరావు' దొర దగ్గర 'పాలేరు'గా ఊహతెలిసిన దగ్గరనుండి 'చుక్కడు' పని చేస్తుంటాడు. కాని దొరలకు ఉండే కపటం కల్మషం రైతు కులాలకు ఉండేది కాదు. వాళ్ళకు చేసేపనిపట్ల అంకితభావం ఉండేది. ఆ అలవాటుగానే దొరగారి వ్యవసాయం, ఎద్దులను ఎంతో ప్రేమగా చూస్తూ ఉండేవాడు చుక్కడు. దొర 'లచ్చి'తో చుక్కనికి పెండ్లి చేస్తాడు. ముప్పై రూపాయల పెండ్లి ఖర్చు కూడా పెట్టాడు. పెండ్లి తరువాత లచ్చి కూడా నర్సింగరావు ఇంటి దగ్గరే పనిచేస్తూ ఉండేది.

కొన్నాళ్ళకి లచ్చి ప్రసవించి బాలెంత జబ్బు పడింది. అప్పుడప్పుడే కోలుకుంటున్న లచ్చి దగ్గర పాలులేవు. తన పుట్టినింటి వాళ్ళు ఇచ్చిన ఆవుపాలే పసిబిడ్డకు ఆధారం. దొరకన్ను

ఆవుమీద పడి ఆవును గడికి పంపించమన్నడు. లచ్చి విషయం తెలిసి ఒప్పుకోదు. ఇలాంటి సందర్భంలోనే బండి బోల్తాపడి చుక్కని కాలు విరిగింది. అతడు పనిలోనికి వెళ్ళలేని స్థితి. ఆవును పంపించలేదనే కక్షతో అప్పువడ్డీతోసహా చెల్లించమంటాడు. చుక్కడు దొరతో నా అవిటి తనాన్నైనా చూసి కనికరించు. కొంత గడువు ఇస్తే వడ్డీతో సహా ఇస్తాను.'' అని చుక్కడు అంటే ''నీ పొగరుబోతుతనం వలన కాలు విరిగింది. దానికి నేను బాధ్యుణ్ణి కాను. నా డబ్బులు నాకిచ్చెయి'' అని నర్సింగరావు ఖరాఖండిగా చెప్తాడు. చివరికి తన మనుషులను పంపి ఆవును తోలుకు రమ్మంటాడు. మూడు రోజుల తరువాత చుక్కని పసిబిడ్డ చనిపోయాడని కబురొస్తుంది. ఈ విషయం తెలిసిదొర పీడపోయిందని చిరునవ్వు నవ్వుతాడు.

ఈ కథలో రచయిత మనష్యులలో ఉన్న క్రూరత్వాన్ని తెలియజేశాడు. దొరల అహంకారానికీ, స్వార్థానికీ బలిపెట్టేందుకు పసిబిడ్డ ప్రాణం పోవలసివచ్చింది. ఈ కథలో చిన్నప్పటి నుండి దొరనే నమ్ముకున్న బానిసత్వంఉంది. లచ్చికి బయట ప్రపంచంలో ఉన్న సంబంధం వలన కొంత తిరుగుబాటుతనం కనిపిస్తుంది. అదే విషయాన్ని

''వెయ్యి చెప్పు ఆవును మాత్రం తోలుక పోనివ్వను'' లచ్చి అంటుంది

''అట్లయితే ఎట్లనే పోతే పోనియ్యి లేకపోతే ఈ వున్న కొద్ది గుడిసె పీకిస్తారు. ఈ ఆధారం కూడా లేకుండా!'' చుక్కడు ''ఏం పీకించనివ్వు. యేంచేస్తాం. ఈ రాకాసి పరిపాలనలో వున్న దానికంటే ఇంకో వూర్లో బిచ్చమెత్తుకుందాము. కాని పసికూనను చంపుకొని ఆవును తోల్పెట్టను'' అని అంటుంది లచ్చి. (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.29)

ఇందులో లచ్చికి తన భవిష్యత్ కన్నా పసిబిడ్డ ప్రాణం ముఖ్యం. అదే విధంగా చుక్కడు దొరతో ఒక స్థాయి వరకు అన్యాయమని చెప్తాడేగాని పూర్తిగా ఎదిరించలేని నిస్సహాయుడు.

'ఆవుల పిచ్చయ్య' 1946లో 'దొరా' అనే కథ రాశాడు. ఇది 'మీజాన్' పత్రికలో అచ్చైంది. పంటలు ఎండిపోయినందుకు 'లెవీ' మాఫీ చేయమని దరఖాస్తులు పెట్టుకున్న రైతుల

పొలాలు, చూడడానికి 'తహసీల్దారు' దౌరా వస్తున్నాడని కబురొస్తుంది. పోలీస్ పటేల్, మాలీపటేల్, పట్వారీలు కలిసి గ్రామంలోని వివిధ కుల వృత్తులవారిని పిలిచి 'దౌరా' వస్తున్న అధికారికి ఎవరేం సేవలు చేయాలో వివరించి వారిని అందులో నిమగ్నం కమ్మని చెప్తాడు.

'దౌరా' వచ్చే దారి వెంట రాళ్ళుపాతి సున్నం వేయాలి. ఆ వచ్చిన అధికారికి 'దొర' దావతు ఇస్తాడు. హరిజనులు వచ్చి చావడికి దడికట్టాలి. రైతులందరూ గుర్రాలకు చొప్ప ఇవ్వాలి. చావడి లోపల పర్దాలు కట్టడానికి చాకలివాళ్ళు దుప్పట్లు ఇవ్వాలి. మంగలివాళ్ళు కత్తులు నూరుకోవాలి. కుమ్మరివాళ్ళు కుండలు పంపించాలి. కోమట్లు సరైన సామాన్లు తెచ్చి సిద్ధంగా ఉండాలి. ఇలా ఊళ్ళోని సమస్త కులస్తులు తమకు కేటాయించిన పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలి. ఇదంతా 'వెట్టి' గానే చేయాలి.

"తహశీలుదారు వచ్చి మొదటి రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాడు. రెండవ రోజు జమీన్‌దారుగారి ఇంట్లో దావతుకు పోయినాడు. ఆ రోజు అంతా జమీన్‌దారుగారితో మాట్లాడుకుంటూ రాగాల పెట్టె (గ్రామ్‌ఫోన్) వినుకుంటూ వున్నాడు. అధికారికి మా బాధలు చెప్పుకొనుటకు లోనికి వెళ్ళనియ్యలేదు" (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.39).

ఇందులో 'లెవీ' మాఫీకి పెట్టుకున్న దరఖాస్తులు రైతుల భూములు సరిగా చూడకుండానే గ్రామాధికార్ల మాటల మేరకు మంచిగానే ఉన్నాయని 'లెవీ' కట్టమని ఆదేశిస్తాడు. దొర భూమిలో పంటలు పండలేదని' లెవీ మాఫీ చేయిస్తాడు అని ఓ రైతు రచయితతో ఈ విషయాన్ని చెప్పుకొని ఇలా అంటాడు. "వీరు ఈ మాదిరిగా చేస్తుంటే ప్రభుత్వం చూడదా" దీనికి సమాధానంగా "ఆ గుడ్డి కన్ను మూసినా ఒకటే, తెరిచినా ఒకటే" (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.40).

ఈ 'దౌరా' కేవలం గ్రామాల్లో ఉన్న పలుకుబడి ఉన్న దొరకలు, భూస్వాముల పక్షానే చేరుతారు. కాని, సామాన్య జనుల, రైతుల గురించి ఏ మాత్రం పట్టించుకోరనే విషయం ఈ కథద్వారా తెలుస్తుంది.

'కాంచనపల్లి చిన వెంకటరామారావు', *'మీటింగు ముగిసింది'* అనే కథను రాశాడు. హైదరాబాద్ సివిల్ సర్వీసుకు చెందిన అవ్వల్ తాలుక్దార్ (కలెక్టర్) తనకు మాంసాహారం ఏర్పాటు చేయనందుకు బావర్చిని తిట్టి చేయి చేసుకుంటాడు. అతడిని ఉద్యోగం నుండి తీసివేస్తాడు.

మాంసం ధర కంట్రోలు చేసిన సర్కారు, జంతువుల ధర కంట్రోలు చేయలేక పోయింది. గిట్టుబాటు గాక కసాయిలు మాంసం అమ్మకం మానుకున్నారు. మూడు రోజుల నుండి 'హడ్తాల్' సాగిస్తున్నారనే విషయం అధికారికి తరువాత తెలుస్తుంది. వెంటనే మాట్లాడేందుకు మీటింగు ఏర్పాటు చేస్తాడు. మీటింగ్‌లో వర్తకులు, ప్రతినిధులూ, పోలీసులు, అధికార్లు పరస్పర విరుద్ధమైన వాదనలు చేస్తారు. అందరి వాదనలు విని ఏ నిర్ణయం తీసుకోకుండానే మీటింగ్ ముగిసిందని వాయిదా వేస్తాడు. ఈ కథలో పోలీసుల ఆధిపత్యం, దౌర్జన్యం ద్వారా పనులు జరిపించే విధానం చూడవచ్చు. భూస్వాములు గ్రామీణులను దండిస్తుంటే అధికార్లు తమకింది ఉద్యోగులను శిక్షిస్తున్నారు అనే విషయాలు ఇందులో చూడవచ్చు.

*'రహీంబాయి'* అనే కథను 'పి.వెంకటేశ్వరరావు' రాశాడు. ఈ కథలో న్యాయం కోసం పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్న విషయం. ఇందులో 'పాపారావు' అనే దొరకి 'నలభై' ఊళ్ళు తన ఆధీనంలో ఉండేవి. అందులో 'సిరిపురం' ఒక ఊరు. ఆ సిరిపురంలో రెండు ముస్లిం కుటుంబాలుండేవి. 'రహీం' కుటుంబం ఒకటి. రహీం గ్రామంలోని వాళ్ళందరికి తలలో నాలుక లాంటివాడు. దొర సేరిదారు 'షరుఫుద్దేన్' సిరిపురంలో ఉండేవాడు. గ్రామస్తులందరికి అతనంటే భయం, సర్వాధికార నియంతగా గ్రామస్తులను శిక్షించగలడు. మతాన్ని ఆసరా చేసుకొని సేరిదారు మనం మనం ఒకటే కదా రైతుల తరుపున ఎందుకుంటావు రమ్మని ఆహ్వానిస్తాడు రహీంను.

రహీం ఎప్పుడు రైతుల పక్షపాతిగానే ఉంటుండేవాడు. అదే సమయంలో 'పాపారావు కూతురు పెండ్లి . . . . . ఎడ్లకు ఎడ్లే, బర్రెలకు బర్రలే జప్తు అవుతున్నాయి. షాదీ పట్టిక్రింద

రహీం వంతు వచ్చింది. తన ఎడ్లను తోలుకపోవడానికి వచ్చిన గుండాలకు ఎదురునిలబడి తనకొంకి కర్ర చూపించి నా ప్రాణాలు పోయే దాక దొడ్లో ఎడ్లను తోలుక పోనీలే అన్నాడు. దీనితో రహీం క్రమంగా ఆ గ్రామానికి నాయకుడైనాడు.

'వెనుక ఎప్పుడో రహీం పాలి వాళ్ళు ఈ ఊరు విడిచి పెట్టిపోగా వారి తాలుకు ఉన్న ఆస్తిని రహీం ఆక్రమించుకున్నాడని రహీం పొలమంతా అదేనని' నలుగురైదుగురు తన చేతిలోని కీలుబొమ్మల చేత దొర కేసుపెట్టించాడు. రహీందొరకు లొంగలేదు.

పన్నెండేళ్ళు చిన్న సద్దిమూట కట్టుకొని న్యాయంకోసం కోర్టు చుట్టూ తిరిగి, చివరికి ఆ భూమి రహీందేనని హైకోర్టు నుంచి న్యాయం పొందాడు.

ఓటమిని అంగీకరించలేక దొర రహీంను చంపేందుకు రౌడీలను పంపించి హత్య చేయించాడు. ప్రజలు అతని మరణాన్ని వీరమరణంగా గుర్తించారు. తలోరాయి తెచ్చి రహీం సమాధి కట్టి ప్రతియేటా రహీంపేర ఉరుసు ఉత్సవాన్ని జరుపనారంభించారు.

'మనం ఎప్పటికైనా ఏకం కాకపోతే కష్టాలు పోవు' అని అంటూండేవాడు రహీం. ఆ ప్రయత్నం జరుగుకముందే రహీం చనిపోయాడు. ప్రజలు రహీం శౌర్యాన్ని కీర్తించారు. త్యాగానికి జేజేలు పలికారు. కాని 'దొర' దౌర్జన్యానికి ఎదురు తిరగలేకపోయారు. క్రమంగా తరువాత కాలంలో ప్రజలు పోరాటానికి సిద్ధమయ్యారు. న్యాయంకోసం, తమ హక్కులను రక్షించుకోవడానికి ప్రజలందరూ ఏకమయ్యారు.

*'సంఘం పంతులు'* అనే కథను సురవరం ప్రతాపరెడ్డి రాశాడు. ఇందులో పోలీసుల దౌర్జన్యం చిత్రించబడింది. 'సంఘంపంతులు' రావడంతో గ్రామంలో పోలీసుల అవసరం లేకుండా పోవడం లాంటి అంశాలు చిత్రించారు. రామసాగరం గ్రామంలో పోలీసులు ఊరివాళ్ళపై చాలా దురాగతాలు చేస్తుంటారు. అమీన్ భార్య కట్టెలు తెమ్మని ఓవృద్ధ స్త్రీని ఆదేశిస్తుంది. ఎండుకట్టెలు తేనందుకు ఆమె ఆ ముసలమ్మను కట్టెతో కొడుతుంది. ఆ

దెబ్బలకు ముసలమ్మ చనిపోతుంది. అమీన్ భార్యనే ఇలా ఉంటే అమీన్ చర్యలు ఎంతదారుణంగా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో 'ఆంధ్ర మహాసభ' కార్యకర్తగా 'సంఘంపంతులు' ఆ గ్రామానికి వస్తాడు.

'సంఘం పంతులు' వచ్చినాడంట...... మనకష్టాలు నివారిస్తాడంట' అనుకున్నారంతా.

'జనులకంతా యెన్నడు లేని ధైర్యం, ఉల్లాసం ఇంటింటా అదే ముచ్చట'

సంఘం పంతులు వ్యాపారస్తులను వివిధ వృత్తులవారినీ సమావేశ పరచి చట్టంలో ఉన్న విషయాలు వివరిస్తాడు. అమీన్ అడ్డం పడతాడు.

''ఫర్మానులలో వెట్టి కూడదని వున్నది. కూలీ ఇచ్చి పనిచేయించుకోమని వున్నది. నీవెన్నడైనా కూలీ ఇచ్చినావా? మరి నా బేగం సాహెబాకు ముసలివాండ్ల తన్ని చంపుటకు, పడుచువాండ్ల చెంపలు వాతలు పెట్టుటకు పాయిఖానాలూడ్పించుకొనుటకు ఏ ఫర్మానులో హక్కిచ్చినారు'' అని ప్రజల పక్షాన అమీన్‌ను పంతులు నిలదీస్తాడు. సంఘం పంతులు పై పోలీసులు దౌర్జన్యం చేస్తారు. 'నాకా' కు తీసుకుపోతారు. ఇది ఊహించిన ప్రజలు పంతులను రక్షించుకునేందుకు అప్పటికప్పుడు ఏకమై సాహసంతో పోలీసులపై ఎదురుతిరుగుతారు. 'మొహతామీం వచ్చి ప్రజల సమక్షంలో విచారణ జరిపి విషయాన్ని విని అమీన్ను 'బర్తరఫ్' చేస్తాడు. మిగతా పోలీసులను సస్పెండ్ చేస్తాడు. ఆ ఊళ్ళో 'నాకా' అవసరం లేదని భావించి 'మొహతామీం'ఎత్తి వేయిస్తాడు. ప్రజలు ఉప్పొంగి విజయంతో పండుగ చేసుకుంటారు.

ఈ కథలో 'నాకా' వల్ల ప్రజలకు ఎన్ని ఇబ్బందులు ఉండేవి. పోలీసులు ప్రజలను ఎన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసే వారో తెలుస్తుంది.

ఆ కాలంలో వెలువడిన మరికొన్ని కథలు *'సంఘం చిట్టే'* కథ దీనిని పి.వెంకటేశ్వరరావు రచించాడు. ఇందులో సంఘాలు గ్రామాల్లో చైతన్యాన్ని కలిగించిన తీరు కనిపిస్తుంది. 'వట్టికోట ఆళ్వారు స్వామి' రచించిన *'చిన్నప్పుడే'* అనే కథలో సంఘం పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ, భక్తిభావం చూడవచ్చు. రంగాపురంలో వెంకట్రావుకు సంఘ కార్యకర్తగా మంచిపేరుంది.

90 సంవత్సరాల ముసలి వాళ్ళదగ్గర నుండి 8 సంవత్సరాల బాలుని వరకు వెంకట్రావు ధన, మాన, ప్రాణ రక్షకుడని భావిస్తారు. ఒకరోజు వెంకట్రావు సంఘం నాయకుల్ని గ్రామంలోకి తీసుకు వస్తాడు. పొలిమేర దగ్గర నాయకుల్ని ఆపి ''మనం నేరుగా ఊళ్ళోకి వెళ్ళకూడదు. గ్రామాలకు నిరుత్సాహం కలుగుతుంది. గ్రామీణులు వాయిద్యాలతో ఎదుర్కొని తీసుకవెళ్ళుతా''. (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.65). ఒక రైతు వెంకట్రావు దండం పెడతాడు. ఆ దండం పెట్టుటలోను అగ్రకులాల వారికి, గ్రామపెత్తందార్లకు పెట్టే దండంలో తేడా కనిపిస్తుంది.

సంఘం నాయకుల చుట్టూ వివిధ కులాలకు చెందిన బాలురు పోగవుతారు. సంఘ నాయకులకు, బాలురకు మధ్య జరిగిన సంభాషణవలన ఏర్పడిన సాన్నిహిత్యం వలన పిల్లల దగ్గరనుండి అనేక విషయాలు తెలుస్తాయి వాళ్ళకు. ఒక బాలుడు ''ఒకసారి మావూరి దొర మా బర్రెను బందెలదొడ్లో పెట్టించాడు.''

''మా అన్న కోడెదూడ చేలో బడ్డదని మావూరి పటేలు పదిరూపాయలు వసూలు చేశాడు''.

''మా దున్నపోతు బుస్సుమన్నదట, మోతాడు లేదని ముప్పయి రూపాయలు తీసుకున్నాడు. మాపటేలు''.

''సర్కారి రొక్కం కట్టలేదని మా నాయకునకు బండలెత్తారు ఒకసారి. ఇవేకాక ఇంకా కొన్ని విషయాలు, సంఘటనల్ని గుర్తుకు తెచ్చుకొని నాయకులకు చెబుతారు.

పిల్లలు చెప్పిన విషయాలన్ని విని వాళ్ళు చిన్నప్పుడే కుటుంబ ఇబ్బందులన్నీ తెలుసుకోవలసిన గతి పట్టిందని నాయకులలో ఒకరంటారు. మరొకరు మనం ఇప్పుడు స్వార్థ రహితంగా ధైర్యంగా పట్టుదలతో పనిచేస్తే మన సంతానం హాయిగా బతుకుతారని అంటారు. ఈ కథలో సంఘం పట్ల ప్రజలకు నాయకులకూ పరస్పర ప్రేమాభిమానాలు

వ్యక్తమవుతాయి. సంఘమంటే ప్రజలకు ధైర్యాన్నిచ్చేది, విశ్వాసాన్నిచ్చేది. ప్రజలందర్ని ఏకం చేసి, ఒక తాటిమీదకు తీసుకవచ్చేదని అర్థమవుతుంది.

ఇవేకాక ఆ కాలంలో వెలువడిన మరికొన్ని కథలు: దొరల దోపిడీకి గురైన బ్రాహ్మణ కుటుంబ కథను 'వట్టికోట ఆళ్వారు స్వామి' రచించిన 'అంతా ఏకమైతే'; మతాతీతంగా రైతుల ఐక్యతను చిత్రించిన కథ కాంచనపల్లి చిన వెంకటరామారావు, *'చెరువొడ్డున'*, *'మనవూళ్ళో కూడానా'*, పి.వి.నర్సింహా రావు, *'గొల్లరామవ్వ'* మొదలైన కథలు ఉద్యమ పోరాటం గురించి వెలువడ్డాయి.

ఇంతవరకు ప్రస్తావించిన కథల్లో గ్రామాల్లో సంఘాలు ఏర్పడి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావడం, ప్రజలు సంఘటితం కావడం, ప్రజలు పోరాటానికి సిద్ధం కావడం కనిపిస్తుంది. ప్రజల్లో వస్తున్న మార్పులు రాబోయే పోరాటానికి చిహ్నాలుగా కనిపిస్తున్నాయి.

పోరాటకాలపు కథల్లో గ్రామాల్లో సంఘాలు ఏర్పడినాయి. 'వెట్టి' చాకిరీ, నిర్బంధ 'లెవీ' వసూళ్ళు మొదలైన సమస్యలపై ప్రజలు పోరాడి విజయాలు సాధించారు. తరువాత భూస్వాముల దురాక్రమణకు  వ్యతిరేకంగా, భూమి సమస్యను తీసుకొని పోరాటం ప్రారంభించారు. పోరాటంలో నూతన దశ మొదలైంది. అనేక సమస్యలపై పోరాడుతున్న ప్రజల్ని 'నిజాం ప్రభుత్వం' అరెస్టులు చేయిస్తుంది. మరోవైపు భూస్వాములు గుండాల చేత దాడులు చేయిస్తున్నారు. సంఘ కార్యకర్తలు ఆత్మరక్షణ కొరకు పార్టీవారికి వడిసెళ్ళు, గుతపలు (బారె పొడవున్న కఱ్ఱలు) ఉపయోగించడంలో శిక్షణ ఇస్తున్నారు.

భూసమస్యపై భూస్వాములు దాడులు తీవ్రతరం చేశారు. ఆ సందర్భంలోనే 'కడివెండి' గ్రామంలో 'దొడ్డి కొమరయ్య'ను హత్యచేశారు. ఈ పరిణామక్రమంలోనే 'తెలంగాణా పోరాటం' సాయుధ పోరాటంగా, గెరిల్లా పోరాటంగా మారింది.

దొడ్డి కొమరయ్య హత్యకు ప్రతీకారంగా ప్రజలు విస్నూరు, దేశ్‌ముఖ్, గడిపై దాడి చేశారు. తరువాత ప్రజలందరూ సంఘటితమై 'తుపాకులు' ఆయుధాలు పట్టి శిక్షణ పొంది

దళాలుగా ఏర్పడ్డారు. దాని ఫలితంగా 'మూడవేల' గ్రామాలు నిజాం పాలన నుండి విముక్తి పొందాయి. గ్రామ నాయకత్వంలో భూములు పంచారు.

పై అంశాలు ఆనాడు వెలువడిన కొన్ని కథల్లో చూడవచ్చు. అవి *'ఊరేగింపులు'* అనే కథను 'ఆవులపిచ్చయ్య' రచించాడు. ఈ కథలో రచయిత 'తోటబావి' దగ్గర ఉండి ఎర్రజెండాలు పట్టుకొని గ్రామంలో వస్తున్న జనాల్ని చూసి వారంతా అమరజీవి కొమరయ్య వీరమరణానికి జోహార్లర్పిస్తూ ఊరేగింపుగా వస్తున్నారని తెలుసుకుంటాడు. బావులదగ్గర పొలాలలో ఒక మనిషి కూడాలేడు. తనుకూడా గ్రామంలోకి పరుగుతీస్తాడు. గ్రామ ప్రజలంతా ఎక్కడి పనులు అక్కడే వదిలి 'ఆంధ్ర మహాసభ' ఆఫీసుకు వెళ్ళినట్లు తెలుసుకుంటాడు. కొమరయ్య మరణానికి జోహార్లర్పిస్తూ పాటలూ పాడుతూ, నినాదాలు చేస్తారు.

అప్పుడు రచయిత ఆఫీసు వైపు వెళ్ళుతుండగా గ్రామాధికారి ఎదురవుతాడు. 'గ్రామ ప్రజలు మొత్తం అక్కడ వుంటే మీరు ఎక్కడికి వెళ్ళిపోతున్నారేమిటి' అని అడుగుతాడు. అందుకతను 'నేను ప్రభుత్వం బానిసను' ఆ ఊరేగింపు రాజకీయ ఊరేగింపు. అక్కడ ఉంటే రిపోర్టు రాయవలసివస్తుంది. కొమరయ్య ప్రాణత్యాగాన్ని గుర్తించాను. రిపోర్టు చెయ్యడానికి చెయ్యివణుకుతుంది. నాకలం ఆడదు. ఊరేగింపులో ఉంటే తప్పక రిపోర్టు రాయాలి. లేకుంటే పై అధికారులతో బూతులు తిట్టించుకోవాలి. వీటన్నిటికంటే ఇవాళ గ్రామంలో నుంచి వేరే గ్రామం వెళ్ళటం ఉత్తమమని నిశ్చయించుకొని వెళ్ళిపోవుచున్నాను.' అని చెబుతాడు.

ఈ కథలో తెలంగాణాపోరాటం రాజకీయ పోరాటంగా మారిందని చెప్పవచ్చు. రచయిత ప్రజలను బురదకాళ్లతో ఉండి శరీరం మీద అంగిలేకుండా ఉత్సాహంతో ఎర్రజెండాలు పట్టుకొని నినాదాలు ఇస్తున్న రైతులను చూపించాడు. ఈ ఊరేగింపు కథలో తొంబై ఏండ్ల స్త్రీలు కూడా ఉన్నట్లు చూపించాడు. ఊరేగింపులో సమస్తకులాలు, హరిజనులు, చాకలి, మంగలి, వడ్ల, కమ్మరి, కాపు, రెడ్డి, మహమ్మదీయులు మొదలైన వారు పాల్గొన్నారని రచయిత

మర్రిచెట్టెక్కి చూడగలిగానని చెప్తాడు. గ్రామంలో ఒక కొమరయ్య చనిపోగా ఇంతమంది కొమరయ్యలు సిద్ధమయ్యారు. ఎర్రజెండాలు పట్టుకొని ప్రజలు పోరాటం చేసైనా సరే తమ హక్కులను భూములను, సాధించుకోవాలి అనే విధంగా ముందుకు కదులుతున్నారు అని ఈ కథ తెలుపుతోంది.

ఆనాటి అధికార్లకు 'సంఘం' అంటే ఎంత భయం ఉందో దానికి వారు ఎంతగా భయపడేవారో *'నోటీసు'* అనే కథ ద్వారా సి.వి.కృష్ణారావు వివరించారు. అందులో కథ ఈ విధంగా మొదలవుతుంది. ''ఈ ఫిర్కాలో పటేళ్ళు, పట్వారీలు, దేశ్‌ముఖులు, జాగీర్దార్లు, పోలీసులతో కలసి అపరిమితమైన దుండగాలు చేస్తున్నారు. కాబట్టి నేటినుండి ఏ పోలీసు అధికారి, ప్రభుత్వోద్యోగి ప్రజలపై జులుం చేస్తే తగిన శిక్ష అనుభవిస్తారు. షరా॥ ఈ నోటీసు ఎవరు చించుతారో వాళ్ళపేరు నోటు చేసుకోబడుతుంది జాగ్రత్త!

ఇట్లు

ప్రజారక్షణ సంఘం

'వైరా' అనే గ్రామంలో ఒక గోడమీద ఈ నోటీసు అంటించి ఉంది. ప్రొద్దున ఒక పోలీసు దారిన పోతూ ఈ నోటీసు చూసి చదువుకున్నాడు. నోటీసు అంటించి ఉన్న గోడ తాలూకు షావుకార్ని పిలిచి దాన్ని చించమంటాడు పోలీసు. నీవేచించమంటాడు నాకేం బట్టింది ప్రాణంమీదకు తెచ్చుకోను'' (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.73).

ఇంతలో గ్రామ జనులందరు ఆ నోటీసు దగ్గర పోగవుతారు. పోలీసులు గ్రామంలోని వాళ్ళను ఒక్కొక్కరిని పిలిచి ఆ నోటీసును చింపుమంటే ఎవరు చింపరు ఈ కథలో పోలీసుల పిరికితనం ప్రజల ముందు ఏ విధంగా బహిర్గతం అవుతుందో చిత్రింపబడింది. పరిస్థితి ఈ రకంగా కొనసాగే సమయంలో చివరికి విషయం కలెక్టెర్ దగ్గరికి పోతుంది. అతను కూడా ఏమి చేయలేక, ఆలోచించి కలెక్టర్'' అచ్ఛీబాత్, నేను వరంగల్ నుంచి ఒక రజాకార్‌ను పంపుతాను. అతను హిందువులాగా తలగుడ్డ చుట్టుకొని ధోవతి కట్టుకొని, మీరడగంగానే ముందుకొచ్చి చించేట్టు ఏర్పాటు చేస్తాను. కానీ మీరు ఒక పని చేయాలి.

“చిత్తం ఏంటది”

“వచ్చి చూచే జనంలో ఎవరివద్దా కాగితం కలం లేకుండా చేయండి” (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.75).

ఈ కథలోని విషయాలు చూస్తే సంఘాల వల్ల ప్రభుత్వం ఏ విధంగా భయపడుతున్నదీ, అనే విషయాల్ని చెబుతూనే రజాకార్ల యొక్క పరిస్థితిని గూడా ఇందులో వివరించారు.

'పర్చా దుర్గాప్రసాదరావు' రచించిన *'పన్నులు ఇవ్వం'* అనే కథలో రైతుసంఘాల నిర్ణయం ద్వారా పన్నులు కట్టమని ఖరాఖండిగా ఎదురుతిరుగుతారు. వెంకయ్య అనే వ్యక్తి గిర్దావర్ని, పోలీసులకు ఎదురు నిలబడి ప్రశ్నిస్తాడు. పన్నులు కట్టనందుకు ప్రభుత్వం హింసిస్తుంటే గ్రామస్తులంతా ఏకమై ఎదురుతిరుగుతారు. గిర్దావరు, పోలీసులు వస్తే పూర్వం వంగి వంగి సలాములు పెట్టేవారు. నేడు సంఘాలు పెట్టుకున్న తరువాత మార్పువచ్చింది. రైతు వెంకయ్య రెవెన్యూ అధికారులను లెక్కచేయడు. వాళ్ళ ముందరే ధీమాగా తిరుగుతుంటాడు. ఇవన్నీ సంఘాలు వచ్చాక జరుగుతున్న సంఘటనలు. పోలీసుల అండతో అధికార్లు గ్రామాల్లోకి వచ్చి పన్నుల వసూళ్ళకై రైతులను పిలిపించుకోవాలని ప్రయత్నించారు. వాళ్ళు రాకపోతే వాళ్ళే రైతుల ఇండ్లకు పోతారు.

వెంకయ్య ఇంటికి పోలీసులు వెళ్ళి 'దొర రమ్మన్నాడు' అని అంటే 'దొరనే రమ్మను' అని ఎదురు సమాధానం ఇస్తాడు. ఇలాంటి విషయాలను రచయిత చిత్రించాడు. 'పన్నులు' కట్టమని గిర్దావరు అడిగితే “నేనేకాదు ఊరంతా, దేశమంతా” ఇవ్వరు అని అంటూనే “ఇన్నాళ్ళనుండి ఇచ్చిన పన్నులేమైనై” అని మరో రైతు అడుగుతాడు. గిర్దావరికి కోపం వచ్చి నన్నే ప్రశ్నిస్తారా? అని అంటాడు. అడక్కేం మావూరి మీద యేటా వసూలయ్యే ఎనిమిది వేలకూ లెక్క చూపించు. పోనీ సగానికి చూపించు. చెరువులన్నీ ఒంర్డు పేరుకు పోతే బాగుచేయించేది లేదు. వ్యవసాయం పనిముట్లు సప్లైచేయడంలేదు. ఎరువులు లేవు.

రోగాలకు మందులు లేవు. చస్తున్నాం. ఉన్న గింజంతా మీరే తోడుకుంటారు. మాకు ఈ అధ్వాన్నపు ప్రభుత్వం వద్దుపోండి'' (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.79) అని అంటాడు.

ఈ విషయాల ద్వారా ప్రభుత్వం రైతుల దగ్గరనుండి పన్నులు వసూలు చేస్తుంది. కాని, వారికి కావల్సిన కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ప్రభుత్వం బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నదని తెలుస్తుంది.

పన్నులు కట్టకుంటే ''నరికేస్తాం జాగ్రత్త అని పోలీసులు అంటే ''మమ్మల్ని నరికి నువు పొలం దున్నుతావా! నెత్తురు కక్కిచస్తావ్, తుపాకీ పుచ్చుకు తిరిగితే సరిపోయిందే'' అని ప్రశ్నిస్తాడు వెంకయ్య. అన్ని విషయాలు విన్న పోలీసు వాడు బలంగా లాగి వెంకయ్య చెంపమీద కొట్టాడు. మరో పోలీసు కఱ్ఱతో బుఱ్ఱమీద వేశాడు. వెంకయ్య పడిపోయాడు. ఇంకా కొట్టారు. అంకమ్మ కింద పడింది. అంకమ్మ చీర లాగేశారు. ఈ విధంగా జరుగుతున్న పరిణామాన్ని జనులు చూస్తూ ఊరుకోలేదు. ప్రతిస్పందనగా ప్రజలు రాళ్ళతో కొట్టారు. పోలీసులు కాల్పులు జరిపారు. అందులో పోలీసుల ప్రాణాలు కొందరివి పోయినాయి. చచ్చిన రైతుల నెత్తురుతో జెండాలు అద్ది ఎగరేస్తూ ప్రజలు ఊరేగారు. మరునాడు ఉదయం గ్రామంలోనికి మిలిటరీ వచ్చి ఐదు వందలమందిని అరెస్టు చేశారు. స్త్రీలను అవమాన పరిచారు. ఇళ్ళు తగులబెట్టారు. అయినా చిల్లిగవ్వకూడా పన్ను వసూలు కాలేదు. పైగా వేల డబ్బు ఖర్చుఅయింది. ఇది సంఘం మూలంగా ప్రజలు సాధించిన మరోవిజయంగా చెప్పుకోవచ్చు.

'అట్లూరి పిచ్చేశ్వరరావు' రాసిన 'విముక్తి అనే కథలో సుబ్బమ్మ పాత జ్ఞాపకాలతో కథ మొదలవుతుంది. దొర 'సుబ్బారెడ్డి' సుబ్బమ్మ గెరటయ్యల భూమిని బలవంతంగా లాక్కొన్నాడు. దానితోపాటు కోడెగిత్తలను బలవంతంగా తోలుకపోయాడు. ఇవన్ని సహించలేక గెరటయ్య ఎదురు తిరుగుతాడు. దొర అహంకారానికి గురై హత్యచేయబడతాడు. ఆ రోజునుంచి సుబ్బమ్మ రందితో మంచం పడుతుంది. తరువాత గ్రామంలో ప్రజా ప్రభుత్వం

ఏర్పడుతుంది. చివరికి 'సుబ్బారెడ్డి'ని దొరికిచ్చుకొని పంచాయితీ ఏర్పాటు చేసి సుబ్బమ్మను కూడా పిలుస్తారు. అందరూ దొరను ఉరితీయండని చెబుతారు. కాని, సుబ్బమ్మ మాత్రం ఆ పాపం మనకెందుకని వాణ్ణి పోనీయండని అంటుంది. సుబ్బమ్మ భూమిని, కోడెదూడల్ని కర్రావుని తిరిగి ఆమెకు ఇస్తుంది గ్రామ ప్రభుత్వం. సుబ్బమ్మ కర్రావు మెడను కౌగిలించుకుంటుంది. ఊరంతా ఒక్కసారి సంఘానికి జై అంటుంది.

తమ సంఘం యొక్క శక్తిని కళ్ళారా చూసుకున్న ప్రజలు మరింత సంఘటితమై పోరాడేందుకు ముందుకొచ్చారు. మిలిటరీ రజాకార్ల దుర్మార్గాలకు ఎక్కడ కూడా రాజీ పడలేదు.

*వడిశల* అనే కథను పర్చా దుర్గాప్రసాదరావు రచించాడు. మిలిటరీ దాడిలో మరణించిన ఒక సామాన్య స్త్రీ 'యెంకాం' వారం రోజుల నుంచి ఊరిచుట్టూ ప్రక్క గ్రామాల మీద మిలటరీదాడులు జరుగుతుంటే కొండకొమ్మన మిలటరీ రాకను గమనించడానికి 'యెంకాం' నియమించబడింది. ఆమె దగ్గర ఒక ఎద్దుకొమ్ము, ఒక వడిశల, గంపెడు రాళ్ళు ఉన్నై. ఆమెకు వారం రోజుల నుండి నిద్రలేదు.

'నల్లగా దెయ్యాలకు వలె ఊళ్ళోకి నడుస్తున్న మిలిటరీని గమనించిన 'యెంకాం' కొమ్ము ఊదింది. పంటచేలలో దాక్కున్న వలంటరు దళం మేలుకున్నది. చుట్టు ప్రక్కల గ్రామాల వాలంటర్ల దళాలు వస్తున్నాయి. మిలటరీ వందల సంఖ్యలో ఉన్నది 'యెంకాం' ఒడినిండా రాళ్ళు పోసుకొని చేతిలో 'వడిశల' పట్టుకొని కొండదిగింది. ఆమె రాళ్ళు విసురుతుంది. అవి సోల్జర్ల బుర్రల్లో గింగిర్లెత్తిస్తున్నై. ఆమె ఆగ్రామ కమిటి అధ్యక్షుడు 'రాఘవయ్య'ను కొండదాటిస్తుంది. 'యెంకాం'ను మిలటరీ వాళ్ళు పట్టుకొని 'రాఘవయ్య' ఎక్కడున్నాడో చెప్పమని హింసించారు. ఆమె ఎంతకీ చెప్పదు. అప్పుడు "ఎందుకు వొట్టి పుణ్యానికి చస్తావ్!" చెప్పు అని సార్జంట్ అంటే "మా సంఘం కోసం చస్తాను" అని తిరిగి జవాబిస్తుంది. చివరికి ఆమె మరణిస్తుంది. ఈ కథ ఒక సామాన్య స్త్రీ ఎంతో ఉన్నతంగా

ప్రవర్తించి తనకు అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా చేసి తన ప్రాణాన్ని అడ్డుపెట్టైనా సరే పోరాటంలో పాల్గొంటుంది అన్నదాన్ని వివరిస్తుంది.

*మస్తానయ్య మరణం* అనే కథను 'రాంషా' రాశాడు. ఇందులో 'మస్తాన్'ను ఉరితీయడం కథ ఇతివృత్తం. ''వీరారెడ్డి, రామిరెడ్డి సుభాన్, యల్లమంద, కమలా అంతా సమావేశమయ్యారు. కరపత్రాలు, నినాదాలు రాయటం ఆంధ్ర మహాసభ పోరాట సమాచారాన్ని ప్రచారం చేయడం మొదలైన పనులు కమలవి. గెరిల్లాల శిక్షణ రామిరెడ్డి సుభాన్‌లది. (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.159)

మస్తాన్‌కు ఊళ్ళో అండగా ఉండేందుకు వందమంది రజాకార్లను పంపించాడు. మస్తాన్ ఇంతకు ముందు ఒకసారి 'యల్లమంద' పట్టుకొని దళానికి అప్పగించగా దళం అతన్ని దండించి విడిచిపెట్టింది. మారిన పరిస్థితులకనుగుణంగా మస్తాన్ భయంతో ఉన్నాడు. ఏడుగురు గెరిల్లాలను నిలబెట్టి కత్తితో తలలు నేలకు రాల్చిన మస్తాన్‌ను ప్రస్తుతం తన అసమర్థత వెక్కిరిస్తుంది.

''మస్తానయ్య తెలంగాణా ప్రజలందరి ద్రోహి వాణ్ణి ఉరితీయాల్సిందే. మన ప్రజలంతా వాడి పాపఫలాన్ని చూసి సంతోషించేందుకు అనువైన స్థలంలో చేయాలాపని'' అని పట్టుదలతో దళం ఆలోచిస్తుంది. ఇలా చేయడం వలన మిగతా వాళ్ళకు గుణపాఠం అవుతుంది. ఆ రాత్రి 'మస్తాన్' ని పట్టుకొని ఊరు చివర చెట్టుకి ఉరితీస్తారు. అదే సమయంలో 'రజాకార్లు' మకాం వేసిన గదికి నాలుగువైపుల నుండి మంటలు చుట్టుముట్టినాయి. ఆ అగ్నిలోంచి దూకి పారిపోయే రాక్షసులందరూ గెరిల్లా తుపాకులకు బలైనారు. తెల్లవారేసరికి జనం తండోపతండాలుగా 'మస్తాన్' శవాన్ని చూస్తూ వాడిపీడ వదిలినందుకు దేవతల్ని స్మరించుకున్నారు. ఇందులో ఒకసారి ఒక తప్పును క్షమించి వదిలిపెట్టినా తమ పూర్వ ప్రవర్తనని వదిలిపెట్టని వారిని శిక్షించక తప్పదని రచయిత సందేశం ఇస్తున్నాడు.

*పాగల్ యల్లమంద* అనే కథను 'కిరణ్' రచించాడు. *మత్తానయ్య మరణం*, పాగల్ యల్లమంద అనే ఈ రెండు కథలకు ఓ ప్రత్యేకత ఉంది వీటిల్లోని పాత్రలు సుంకర వాసిరెడ్డి రచించిన ప్రజానాట్య మండలి ద్వారా ప్రజానీక హృదయాలలో నాటుకపోయిన 'మాభూమి' నాటకంలోని పాత్రలే. సీతా, సుభాన్, యల్లమంద, కమల, వీరారెడ్డి, మస్తాన్ . . . ఇలా ఆ నాటకానికి కొనసాగింపే ఈ కథ.

మస్తాన్ పట్ల, పటేల్ పట్ల ప్రజలకుండే క్రోధం వర్ణించనలవికానిది. 'మాభూమి' నాటకంలో ఈ రెండు పాత్రలు ఊరు వదిలి పారిపోయినట్లు చిత్రించారు. అయితే ప్రజలకు వారిపట్ల ప్రతీకారవాంఛ ఉంది. ఆ కోరికకు ప్రతిరూపమే ఈ రెండు కథలు. (నవీన్ వాసిరెడ్డి 2008 పుట.164) అని అంటారు.

ఇదే నేపథ్యంలో మరికొన్ని కథలున్నాయి. అవి తెన్నేటి సూరి రచించిన *సంధిలేదు*. ఇందులో స్త్రీ ప్రతీకారం గురించి వివరించబడింది. శారద రచించిన *కొత్తవార్త గెరిల్లా గోవిందు* కథలు. గెరిల్లాలకు సైన్యం లొంగిపోయిన విధానాన్ని చిత్రించారు. *గెరిల్లా గోవిందు* కథలో యువకుడి పోరాటం చిత్రించడమైంది. *మీరు గెలుస్తారు* అనే కథను తుమ్మల వెంకటరామయ్య రచించారు. స్త్రీ త్యాగాన్ని వివరించారు. *గొల్లరామవ్వ* కథను పి.వి. నరసింహారావు దళ కార్యకర్తను సాహసంతో రక్షించిన స్త్రీకథ ఇందులో చిత్రించబడింది. *బాంబుల భయం* అనే కథను అడ్లూరి అయోధ్య రామకవి రజాకార్లపై లారీలపై బాంబులు విసరడం గురించి వివరించారు.

దాశరథి కృష్ణమాచార్యులు *జైలుగోడలు మధ్య* అనే కథను  నిజామాబాద్ జైల్లో *వందేమాతరం* పాడిన ఖైదీలను *నిజాం* ప్రభుత్వం అదే జైలులోని ముస్లిం ఖైదీలకు ఆయుధాలిచ్చి కొట్టించడం కనిపిస్తుంది.

పోరాట విరమణ కాలపుకథలలో గ్రామకమిటీలు గ్రామ రాజ్యాలను స్థాపించుకున్నాయి. 13.09.1948 పోలీస్ యాక్షన్‌తో 18.09.1948న నిజాం నవాబు లొంగిపోయాడు నిజాం సంస్థానం భారత యూనియన్‌లో కలిసిపోయింది.

ఈ కథలు *'జీవకారుణ్య చర్య'* అనే కథను యం. వెంకటరావు రచించాడు. ఈ కథలో గ్రామంలోకి యూనియన్ సైన్యాలు ప్రవేశించాయి. గ్రామాలు గడీలు వదిలి పట్నాలకు పారిపోయిన దొరలు తిరిగి గ్రామాల్లో ప్రవేశించడం. సంఘంలోనే ఉంటూ సంఘ వ్యతిరేక మనస్తత్వం కలిగిఉన్న వాళ్ల నిజస్వరూపాలు మొదలైన అంశాలతో కూడిన కథ ఇది.

ఈ కథలో రామిరెడ్డి ధనికరైతు. దేశ్‌ముఖ్‌లు గ్రామం వదిలిపోతే తానే అధికారం చెలాయించవచ్చని ఆశపడతాడు. ఆ అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంటాడు రామిరెడ్డి. ''ఆనాడు దేశ్‌ముఖ్ తరువాత తానే గ్రామంలో మోతుబరి. ఈనాడు తను నలుగురు రైతుల్లో ఒకడు. కూలీలు తన పనికి ముందుగానంటూరారు. అందరితోబాటు తనూరేటివ్వాలి. పల్లెత్తు మాట అంటానికి వీల్లేదు. తన పెద్దరికమేముంది. సర్వం పంచాయితీదే'' అని ఆలోచిస్తాడు. ఇలాంటి విషయాలు ఇందులో కనిపిస్తాయి. అవకాశం కోసం ఎదురు చూస్తూ 'నారయ్య' అనే వ్యక్తిని వాడుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. అతను మొదట భయంగానే ఉంటాడు సంఘంపట్ల. తరువాత కొంత రామిరెడ్డి మాట మీద నమ్మకం కలిగి అటువైపుగా మాట్లాడతాడు.

రామిరెడ్డి మాటలు ''ఇదిగో నారయ్య అప్పుడే ఏమయింది. ఇప్పుడు పొలం పంచుకున్నారు. రేపు ఆడాళ్ళను కూడా పంచుకుంటారు'' అని తన జిత్తులమారి ఎత్తులతో నమ్మిస్తాడు. ఇవన్నీ 'నారయ్య'కు కొంత నమ్మకం కలిగిస్తాయి. నిజానిజాలు తెలుసుకోవడానికి గ్రామ పంచాయితి పెడతారు. అందులో నారయ్య, రామిరెడ్డి తనతో అన్న మాటలు పంచాయితీ వాళ్ల ముందు వివరిస్తాడు. దుష్ప్రచారానికంతటికీ మూలం రామిరెడ్డి అని తెలిసి ఆశ్చర్యపోతారు.

రామిరెడ్డి తన భూస్వామ్య మనస్తత్వాన్ని వదులుకోలేదని అవకాశం లేక అణిగి మణిగి ఉన్నాడని, పంచాయితీ అతన్ని విడిచిపెట్టదలుచుకోలేదని, అంతలో విమానంలో నుండి కరపత్రాల కట్ట నేలపై పడింది. ఆ కరపత్రాల్లో "జీవకారుణ్య చర్య", "హైదరాబాద్ ప్రజలను -రజాకార్ల నుండి ఇతర విధంగా అరాచక చర్యలు చేసే వాళ్ళ నుండి రక్షించి శాంతి భద్రతలు నెలకొల్పడానికి 'ఇండియన్ యూనియన్' సైన్యాలు వస్తున్నాయి. హైదరాబాద్ ప్రజల కన్నీరు తుడవడానికి ప్రజాతంత్ర ప్రభుత్వం తీసుకున్నదే జీవకారుణ్య చర్య.

జైహింద్

జనరల్ రాజేంద్రసింగ్"

(నవీన్ వాసిరెడ్డి 2008, పుట.190) ఈ కరపత్రం సారాంశాన్ని గ్రహించిన ప్రజలు ఏం జరుగుతుందో తెలియక రామిరెడ్డి విషయం మరిచిపోయి ప్రజలందరూ చెల్లాచెదురైనారు.

ప్రజలందరు చూస్తుండగానే సైన్యం వచ్చింది. మద్రాస్ పోలీసులు, మనుషులు కొత్త ఖద్దరు దుస్తులు వేసుకొని దేశ్‌ముఖ్, పట్వారీలు, ఆవెనుక మలబారు పోలీసు దళం వచ్చింది. రామిరెడ్డి 'ఎర్రగన్నేరు' పూల దండతో వెళ్ళి దేశ్‌ముఖ్‌ను కౌగిలించుకున్నాడు. ఇదంతా చూసి ప్రజలు ఆశ్చర్య పోయారు. వీరు పంచాయితీ సభ్యులపైనా ప్రజల పైనా ఉసిగొల్పడానికి వారిని తీసుకువచ్చాడని గ్రహించిన పంచాయితీ సభ్యులు అడవికి పారిపోయారు. యూనియన్ సైన్యాల ప్రవేశంతో గ్రామప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నవారు ఆత్మరక్షణకై అడవులను ఆశ్రయించవలసివచ్చింది. పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారినీ ఏదో రూపంగా భాగస్వాములైన వారిని దొరికిన వారిని దొరికినట్లుగా యూనియన్ సైన్యాలు పట్టి చంపడమో క్యాంపుల్లో పెట్టి హింసించడమో చేశాయి.

ఈ కథ యూనియన్ సైన్యాలు తీసుకున్న *జీవకారుణ్య చర్య* ఎవరిమీద అనే ప్రశ్నను లేవదీస్తుంది నైజాం పాలనలో వేషధారణలోనూ ప్రజావ్యతిరేక కార్యకలాపాలలోనూ నైజాంను

అనుకరించిన దొరలు, యూనియన్ సైన్యం ప్రవేశంతో ఖాదీ బట్టలు వేసుకొని ప్రభుత్వ ప్రతినిధులుగా వ్యవహరించడం ప్రారంభించారు. సైనికుల అండచూసుకొని తిరిగి గ్రామాల్లో చేరి తమ పూర్వకాలపు దొరతనాన్ని ప్రదర్శించడం మొదలుపెట్టారు.

లక్ష్మీకాంత మోహన్ రాసిన *మహాశక్తి* అనే కథలో పోలీసుల నిజస్వరూపాన్ని చిత్రించిన కథ. ఇందులో ఒక గుడిసెలో ఓ ముప్పైయేళ్ళ స్త్రీ, కోటమ్మ నివసిస్తుంది. ఈమె రేయింబవళ్ళు చాకిరీ చేస్తుంది. ఈమె అంటే గ్రామస్తులందరికి భయం. ఎందుకంటే ఈమె ఎవర్నీ లెక్కచేయదు. పోలీసులు కోటమ్మ గుడిసె మీద పడి ఆమెను బజారుకు లాక్కొచ్చి 'రామిరెడ్డి' ఆచూకి చెప్పమని హింసిస్తారు. ఆమె ఎంతకినోరు విప్పదు. పైగా నర్సిరెడ్డి చేసిన ద్రోహానికి పోలీసుల ముందే 'నర్సిరెడ్డి' మీద ఉమ్మివేస్తుంది. అది సహించలేని పోలీసులు ఆమెను చాటుకు లాక్కుపోయి చెరిచారు. అయినా ఆమె పెదవి విప్పలేదు. కొరడాలతో కొట్టారు. రక్తం కారుతున్నా, ఆ దెబ్బలనుబాధతో ఓర్చుకున్నదే కాని, ఒక మాటకూడా 'రామిరెడ్డి'కి సంబంధించి చెప్పలేదు. ఆమెను ఎన్ని హింసలు పెట్టినా భరిస్తూ వారితో ద్వేషంగా 'మీ నెత్తురు తాగుతా' అని 'కాళికాశక్తి' వలె అంటుంది.

చివరికి గెరిల్లా దళాలు వస్తున్నాయని తెలుసుకొని పోలీసులు పారిపోతారు. రామిరెడ్డి వచ్చి ఆమెను తన తొడమీద పెట్టుకొని బాధపడతాడు. ఆమెను పలకరిస్తే మెల్లగా కళ్ళుతెరిచి 'వాళ్ళ నెత్తురు తాగుతా' అని అంటుంది కోటమ్మ. అలా అంటూనే మరణిస్తుంది. ఈ కథలో కోటమ్మ వీరత్వం ప్రధానంగా చిత్రించబడింది. 'యూనియన్ సైన్యాలు' వచ్చినా తెలంగాణ ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదు. ఈ సైన్యాల మద్దతుతో 'దొరల' పెత్తనం గ్రామాల్లో చెలాయిస్తున్నారు. వాటిని ఎదుర్కోవడానికి గ్రామాల్లో పిల్ల, పెద్ద, స్త్రీలు అందరూ ఏకమై ఎన్ని హింసలు పెట్టినా తట్టుకొని నిలబడ్డ ఓ స్త్రీమూర్తి కథ 'మహాశక్తి'.

ఉప్పల లక్ష్మణరావు రాసిన *గెరిల్లా* అనే కథలో సాయుధ పోరాట విరమణ జరిగిన *ఇరవై* సంవత్సరాల తరువాత *గెరిల్లా* లో తను ఏవిధంగా పాల్గొన్నదో 'కామ్రేడ్ పార్వతి' తన గతాన్ని స్మరించుకుంటున్న రీతిలో నడుస్తుంది.

పార్వతి భూస్వామ్య కుటుంబంలో పుడుతుంది. ఆమె మరో భూస్వామి సుబ్బయ్యను వివాహమాడుతుంది. అతను 'ఆంధ్రమహాసభ' కార్యకర్తగా రాజకీయ జీవితం కలిగినవాడు. పోరాటం గెరిల్లా పోరాటంగా మారేటప్పటికి పార్వతి ఒక కొడుకుకి జన్మనిస్తుంది. పోలీసులు కాల్పుల్లో సుబ్బయ్య చనిపోతాడు. పార్వతి తన కొడుకును తన బంధువుల ఇంట్లో పెట్టి తనుకూడా దాడుల్లో చురుగ్గా పాల్గొంటుంది. ఒకసారి దాడిలో భుజానికి తూటా తగిలింది. కోలుకోగానే పార్టీ ఆమెను *గెరిల్లా* జీవితానికి స్వస్తి చెప్పమంటే సరేనని దూతగా ఉంటూ ఒక డాక్టరు దగ్గర నర్సుగా పనిచేస్తుంది. ఆ సమయంలోనే నారయ్యతో పరిచయం పెరిగి అది పెండ్లి వరకు వెళ్ళి అతన్ని పెండ్లి చేసుకుంటుంది. పార్వతి గర్భవతి అవుతుంది. పార్టీ ఏర్పాటు చేసిన రహస్య స్థావరంలో ప్రసవిస్తుంది. పుట్టిన బిడ్డను వేరే వారికి ఇచ్చి తన పుట్టింటికివెళ్ళిపోతుంది. ఈ కథలో తను గెరిల్లా దళంలో గెరిల్లాగా మారినందుకు అందులో ఉండి వాళ్ళతో పంచుకున్న బాధ్యతలు, పోరాటాల్లో పోగొట్టుకున్న మొదటి భర్త, ఇద్దరు పిల్లల్ని తలచుకుంటుంది. నమ్మిన సిద్ధాంతాలకు ఆశయాలకు పాటుపడింది. అందుకే తన గుండెను రాయి చేసుకుంది.

ఈ కథలో యూనియన్ సైన్యాల నాటి తెలంగాణ ప్రాంత పరిస్థితులు చూడవచ్చు. అదేవిధంగా తన జీవితంలో తను చూసిన, సమీక్షించిన ఓ వీరవనిత ఆత్మ కథే ఇది అని చెప్పవచ్చు.

యూనియన్ మిలటరీకి వ్యతిరేకంగా పోరాటం చేయలేక ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా పోరాటాన్ని విరమించాయి. దీనితో 'తెలంగాణ సాయుధ పోరాటం' అంతమైంది. దొరలు గ్రామాల్లో భూస్వాములుగా చెలామణి అవుతూనే ఉన్నారు. ఈ సమస్యతెలంగాణలో ఇంకా నడుస్తూనే ఉన్నది.

ఈ సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌లో 1967న నక్సలిజం అనే మరో ఉద్యమం ప్రారంభమై అది తెలంగాణాకు కూడా విస్తరించింది.

### 3.17 నక్సలిజం

1967లో పశ్చిమబెంగాల్ లోని మిడ్నపూరి జిల్లా నక్సల్‌బరి గ్రామంలో పుట్టింది. చారుమజుందర్ దీనికి నాయకుడు. అంతకుముందు ఇతను మొదటి సి.పి.యం. మెంబర్. అయితే సి.పి.యం. నుండి చీలిపోయి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిజం, లెనినిజం) పార్టీగా ఒక వర్గంగా ఏర్పడింది.

వీళ్ళ ప్రధాన తాత్త్విక ప్రేరణ చైనాలోని 'మావో' ఆలోచనా విధానం. వ్యవసాయ విప్లవం వారి లక్ష్యం. వారు ఇండియన్ సొసైటిని అర్ధవ్యవస్థ, అర్ధభూస్వామ్య వ్యవస్థగా గుర్తించారు. కావున వాళ్ళు ఇక్కడ ముందు జరుగువలసింది వ్యవసాయ విప్లవమని గుర్తించారు. గ్రామాల్లో పనిచేయడం వీరి లక్ష్యాలుగా పెట్టుకున్నారు. *వర్గశత్రువు రక్తంలో చేయి ముంచనివాడు విప్లవకారుడు కాదని* ప్రకటించారు. అందువల్ల వర్గశత్రువుని అంటే భూస్వాముల్ని హతం చేయడం వీళ్ళ కార్యక్రమాల్లో ప్రధానంగా ఉంటూ వచ్చింది. అంటే వీళ్ళు చైనా విప్లవం (1949)లో చైనా విప్లవం జరిగిన తీరులోనే భారతదేశంలో విప్లవం నెరవేరాలని ఒక నమూనాను పెట్టుకొని దాన్ని అనుసరించడం మొదలు పెట్టారు. అప్పటి చైనా నాయకుడు మావోను వీళ్ళు తాత్త్వికంగా తమకు మార్గదర్శకుడిగా భావించారు. నక్సల్‌బరిలోని ఈ ఉద్యమం తన విప్లవ కార్యక్రమంలో భాగంగా కొన్నివేల ఎకరాల భూమిని హస్తగతం చేసుకోవడం బెంగాల్‌లోనే కాకుండా దేశంలోని మిగతా ప్రాంతంలోని పీడిత ప్రజలకు గొప్ప ఆశావాదంగా కనిపించింది. బెంగాల్‌లోని ఓ చిన్న గ్రామంలో మొదలైన ఈ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమం అచిరకాలంలోనే అంటే కొన్ని నెలలలోనే శ్రీకాకుళం ఆ తరువాత తెలంగాణ ప్రాంతాలకు ఒక దావానంలా వ్యాపించింది. అప్పటిదాకా తమ జీవితంలో అణిచివేత తప్ప ఎటువంటి ధిక్కారాన్ని చవిచూడనటువంటి భూస్వామ్య వ్యవస్థవల్ల తీవ్ర హింసకు గురి అవుతున్న పేద రైతాంగ భారతదేశం చరిత్రలో మొదటిసారిగా భూస్వాములకు ఎదురునిలబడి ఉద్యమించడమే కాకుండా వాళ్ళ నుంచి కొన్ని వేల ఎకరాల భూమిని హస్తగతం చేసుకొని 'శ్రీకాకుళం నుంచి తెలంగాణ దాకా ఉన్న ప్రాంతాలలో గొప్ప విప్లవ స్ఫూర్తిని కలిగించింది.

సుబ్బారావు పాణిగ్రాహి, ఆదిభట్ల కైలాసం, వెంకటాపు సత్యం లాంటి వాళ్ళు ఈ ఉద్యమానికి శ్రీకాకుళంలో నాయకత్వం వహించారు. గ్రామాల్లో భూస్వాములకు వ్యతిరేకంగా మొదలైన ఈ సాయుధ రైతాంగ పోరాటం క్రమంగా మైదాన ప్రాంతాలకు విస్తరించి అనేక మంది మేధావుల్ని, విద్యార్థుల్ని, యువకుల్ని కదిలించగలిగింది. 1970నాటికి ఈ ఉద్యమం చాలా శక్తివంతమైన ఉద్యమంగా ఎదిగి దేశంలో ఒక ప్రధాన రాజకీయ పార్టీగా ఆవిర్భవించడమే కాకుండా వేలసంఖ్యలో కార్యకర్తలను ఏర్పర్చుకో గలిగింది. మేధావుల నుంచి సామాన్య వ్యక్తుల వరకు ఈ ఉద్యమ ప్రేరణకు గురైనారు. ముఖ్యంగా కళా సాంస్కృతిక రంగాల నుంచి అనేక మంది యువకులు ఈ ఉద్యమం వైపు ఆకర్షితులైనారు. అదే సందర్భంలో సమాజంలో అప్పటికే ప్రముఖ రచయితలుగా, సామాజిక శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందినటువంటి మేధావులు అనేకమంది ఈ ఉద్యమానికి సంఘీభావాన్ని ప్రకటించడమే కాకుండా 1970లలో విప్లవ రచయితలు, కళాకారులు, మేధావులతో కూడిన ఒక రచయితల సంఘం విప్లవ రచయితల సంఘం (విరసం) పేరుతో ఏర్పడి ఈ సాయుధ పోరాట ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తూ రచనలు చేయటమే కాకుండా కళా సంస్కృతుల రంగాలలో ఆ ఉద్యమ రాజకీయాల్ని కీర్తించడం ప్రచారం చేయడం తమ లక్ష్యాలుగా విరసం ప్రకటించుకుంది. అదే సందర్భంలో మార్క్సిజం, లెనినిజం (మావో) ఆలోచన విధానం తమకు తాత్త్విక సిద్ధాంతంగా విప్లవ రచయితలు ప్రకటించు కున్నారు. 1970ల నుంచి ఇప్పటిదాకా (విరసం) అనేక ప్రక్రియలలో తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ విప్లవ భావ ప్రచారానికి ఇతోధికంగా కృషిచేస్తోంది. ఇప్పటి వరకు వెలువడిన విప్లవ కథా సాహిత్యాన్ని ఈపై నేపథ్యంలో నుంచి మాత్రమే అవగాహన చేసుకోవటానికి వీలు ఉంటుంది. ఈ విప్లవోద్యమం నేపథ్యంలో ముందుకు వచ్చిన కథకులుగా రావిశాస్త్రి, భూషణం. అల్లం రాజయ్య, బి.యస్. రాములు, కిరణ్, కాలువమల్లయ్య తుమ్మేటి రఘోత్తమరెడ్డి మొదలైనవారిని చెప్పవచ్చు.

## 3.18 1970 తరువాత తెలంగాణ కథ

ఉప్పల నరసింహం, గోపి రైతాంగ పోరాటకథలు రాశారు. సాహు గిరిజన పోరాట కథలు రాశారు. సాంస్కృతిక రంగంలో పీడిత వర్గాల ధిక్కారాన్ని కాలువ మల్లయ్య తన *వెలి* అనే కథలో రాశారు. పి.చంద్ సింగరేణి కార్మికుల బతుకులను, వారి పోరాటాలను చిత్రించారు. బి.యస్.రాములు రాసిన *అడవిలో వెన్నెల* అడవికాసిన వెన్నెల అనే నానుడిని తిరగేసి చెప్పి గిరిజన పోరాట చైతన్యాన్ని చిత్రించారు. *బద్‌లా* లాంటి కథా సంకలనాలు విప్లవోద్యమ స్ఫూర్తితో వచ్చినవి విప్లవోద్యమ సాహిత్యం స్తబ్దతకు గురైన సందర్భంలో తెలుగులో స్త్రీ, దళిత మైనారిటీ వాదాలు ముందుకు వచ్చినాయి.

1970లో విరసం ఏర్పడిన తరువాత సాహిత్య రచన జరగాలన్న పిలుపుకు స్పందించి తొడిగిరి పోతురాజు *బ్లాక్ అండ్ వైట్* కథను ఉత్తరాంధ్ర నుండి తెలంగాణాకు విస్తరిస్తున్న విప్లవోద్యమంగా చిత్రించారు. ఆ కాలంలోనే కరీంనగర్ రచయితల సంఘం 1973లో *బద్‌లా* అనే కథా సంకలనాన్ని వెల్లడించింది. వినోద్ రాసిన పునాది కథను కూడా ఈ రకమైందిగా చెప్పవచ్చు.

1976-85 దశకం విప్లవకథా దశకంగా చెప్పవచ్చు. ఆ కాలంలో కరీంనగర్, అదిలాబాద్, రైతాంగ పోరాటం, గిరిజన ఉద్యమ చైతన్యాన్ని నమోదు చేసిన కథలు వెలువడినాయి. ఆ కాలపు కథావస్తువులు సంఘబలంతో పెరిగిన పోరాట చైతన్యం, భూస్వాముల ఓటమిని అవమానంగా భావించి శాంతి భద్రతల పరిరక్షణకోసం పోలీసు బలగాలను మోహరించడం వలన ప్రజలు ఎదుర్కొన్న కొత్త సమస్యల ఫలితంగా సాయుధ పోరాటం చేయటం ఆనాటి కాలపు కథా వస్తువులు.

తెలంగాణలో విస్తరించి ఉన్న సింగరేణి బొగ్గుగనులలో కూడా విప్లవ సాహిత్యం విస్తరించింది. ఆ గనులలో పనిచేసే కార్మికుల జీవిత సమస్యలు, వేతన సమస్యలు, గృహ సమస్యలు కథా వస్తువులైనాయి. 1979లో గిరిజన రైతు కూలీ సంఘాల స్థాపనతో అడవులలో నివసిస్తున్న గోండుల జీవితాలపై ప్రభావాన్ని చూపింది.

“సంఘం అనే కథ రాసి ఈ దశకపు విప్లవ కథకు (1978 మార్చి) ఒరవడిదిద్దాడు అల్లం రాజయ్య. అల్లం రాజయ్యతోపాటు ఉప్పల నరసింహం, బి.యస్.రాములు, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, పి.చంద్, కార్మిక, కిరణ్, సాహు, కాలువమల్లయ్య మొదలైన వారెందరో ఈకాలంలో కర్షక కార్మిక గిరిజన జీవితాలలోని పరిణామాలను, చైతన్యాన్ని ప్రతిఫలించే కథలు వ్రాశారు. సున్నితమైన మానవ హృదయ స్పందనలను చిత్రించటంలో ఈ రచయితలు ప్రతిభ కనబరిచారు” (కాత్యాయనీ విద్మహే 2006, పుట.627) అని అంటారు.

అల్లం రాజయ్య రచించిన మొదటి కథ ఎదురు తిరిగితే 1977లో వెలువడింది. అప్పటి నుండి 150కి పైగా వివిధ పేర్లతో కథలు రాశాడు. ఈ కథలలో వస్తువు శిల్పం. కథా నిర్మాణం, భాషా ప్రయోగాలు గ్రామీణ జీవితంతో ముడిపడి ఉన్నట్లు కనిపిస్తాయి. ఇతని కథలోని పాత్రలన్ని గ్రామీణ పాత్రలే. కథలలోని వస్తువు వైవిధ్యమైంది. స్థూలంగా ఆయన కథలన్నీ పోరాటాన్నే ఎక్కువగా ఆశ్రయించాయి. ఇతని కథలలో తెలంగాణ ప్రాంత పల్లె సీమలు, అట్టడుగు వర్గాల జీవితాలను చూడవచ్చు. ఆయన కథలకు ముడిసరుకు తెలంగాణ ప్రాంతమే.

రాజయ్య కథలలో వర్గపోరాటం వర్గపోరాట ప్రతిఫలాలు ప్రజల మధ్య ఉండే హెచ్చుతగ్గులు, వైరుధ్యాల గురించి ప్రస్తావించాడు. నిరుపేద ప్రజల మధ్య జరిగే తగాదాలకు ప్రాధాన్యత ఇచ్చి వారి మధ్య ఐక్యత లేదని విమర్శించాడు.

ఇతని కథల గురించి “స్థూలంగా వస్తువు ఒకటి అయినప్పటికీ కథాంశం, ఇతివృత్తం, వాతావరణం, స్థలకాలాలు, సమస్యలు వైఖరులు వంటి అనేక అంశాలలో ఈ విశాల దృష్టిని చేపట్టడం వల్ల రాజయ్య కథలు అపారమైన వస్తు విస్తృతిని సాధించాయి. దొరల ఆక్రమణలోని బంజరు భూమిని స్వాధీనం చేసుకోవడానికి భూమిలేని నిరుపేద దళితులు జరిపిన పోరాటం నుంచి, ఉద్యమ క్రమంలో చేపట్టిన వేరు వేరు భూ సమస్యల నుంచి, వివిధ నిర్బంధ రూపాల నుంచి, నిర్బంధాన్ని ప్రతిఘటించడానికి ప్రజలు అన్వేషించిన అనేక పోరాట రూపాల నుంచి ఉద్యమ నిర్మాణ నాయకత్వం వేసిన ఎత్తుగడల నుంచి ఆదివాసుల

పోరాటాల నుంచి జీవితం నుంచి, గనికార్మికుల సమరశీలతనుంచి, పోరాట ప్రాంతంలో మధ్యతరగతి మానసికాందోళన నుంచి, వేర్వేరు జీవితాల స్త్రీ ప్రతిస్పందనల నుంచి, అమరుల పోరాట సంస్మరణ నుంచి, ప్రజాశత్రువు మానసిక కల్లోలం దాకా రాజయ్య స్పృశించని జీవిత శకలం లేదంటే అతిశయోక్తికాదు.” (వేణుగోపాల్, ఎన్. 2004. పుట.64) అని అంటారు.

ఇతని కథల్లో దొరకు కూలీకి మధ్య వచ్చే ఘర్షణను అర్థం చేసుకోవడం సులభం కాని ఇద్దరు కూలీల మధ్య జరిగే ఘర్షణను అర్థం చేసుకోవడం కష్టం అనే విధంగా రచనలు చేశాడు. *అతడు* లోని కథలో రాజయ్య ప్రజల మధ్య వైరుధ్యాలను చిత్రించాడు.

మొదటి కథ *ఎదురు తిరిగితే...*లో మాదిగలు, సత్యం, చేపలు, అడవిమనిషి, మార్పు, శత్రువు నేర్పిన పాఠాలు నుంచి గురువులు, తుఫాను, బురదనేల, కమల, మధ్యవర్తుల దాకా దాదాపు ప్రతి కథలోనూ, ఆయా కులాలకు చెందిన పాత్రలు, ఆయా కులాల ప్రత్యేక ఆచార వ్యవహారాలతో సహా, మాట తీరుతో సహా చిత్రణ పొందాయి. అదే విధంగా మహాదేవుని కుల, *కమల, మనిషి లోపలి విధ్వంసం, మధ్యవర్తులు, గురువులు, అతడు* వంటి కథలు పొరలు పొరలుగా అనేక కోణాలను, అనేక ముఖాలను, ఒక సంక్లిష్ట సంకీర్ణ దృశ్యాన్ని ప్రదర్శిస్తాయని చెప్పవచ్చు.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లో తెలంగాణ జీవితాన్ని ప్రజాపోరాటాలను అత్యంత దగ్గరగా దర్శించి తన కథలలో ప్రవేశపెట్టాడు. ఇతని కథల్లో ముఖ్యంగా విప్లవ కథను వస్తు శిల్పాల్లోనే గాక దృక్పథం విషయాల్లోను ఉన్నతీకరించాడు. విప్లవోద్యమం శ్రీకాకుళంలో దెబ్బతిన్నాక, అత్యవసర కాలం నాటికే ఉత్తర తెలంగాణ అంతటా విస్తరించిన రైతాంగ పోరాటాల ప్రేరణతో విప్లవ కథ ప్రాణం పోసుకుంది. విప్లవ సాహిత్యం, విప్లవ కథా వస్తు శిల్పాల సమ్మేళనంలో, దృక్పథంలో శక్తివంతమైనది. విప్లవ కథకు ఇంతటి శక్తిని అందించిన వారిలో రఘోత్తం ఒకరు. ఇతని కథల్లో వస్తు వైవిధ్యాన్ని, కథన పద్ధతిని తెలంగాణలో గత రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న విప్లవోద్యమ నేపథ్యం. ఇతని కథా రచనలోకి ప్రవేశించే

నాటికి తెలంగాణలో విస్తారమైన మూడు సామాజిక సమూహాలు వర్గపోరాటంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నాయి. అత్యవసర పరిస్థితి నాటికి కరీంనగర్, అదిలాబాద్, రైతాంగ పోరాటాలు, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో ప్రత్యామ్నాయ ప్రజాపంథాను ముందుకు తీసుకు వచ్చినాయి. రైతాంగ పోరాటాల విస్తృతిలో ఆదివాసీ ఉద్యమాలు, సింగరేణి కార్మిక ఉద్యమాలు ఇతనికి ఆలోచనా పరుడిగా ప్రేరణనిచ్చాయి.

"రైతాంగ, ఆదివాసీ, కార్మిక పోరాటాల ఉద్రిక్త వాతావరణం నుండి రఘోత్తం కథలు పుట్టుకువచ్చాయి. అందుకే ఆయన కథల్లో మారుమూల పల్లెలోని రైతాంగం, కూలీలు, సింగరేణి బొగ్గుబావుల మీది కార్మికులు - అటవీ ప్రాంతంలోని ఆదివాసీలు పదే పదే తారసపడుతూ ఉంటారు. మరీ ముఖ్యంగా పల్లెల్లో బతుకు భారమై బొగ్గు బాయిల మీదికి పొట్ట చేతబట్టుకుని వచ్చిన కార్మికులు ఆయన కథల్లో పాత్రలయ్యారు. కేవలం పొట్ట చేతబట్టుకుని రావడంవల్లనే. గ్రామీణ మనస్తత్వాన్ని అక్కడి ఉద్యమ ఆలోచనలతో సహా నిలబెట్టుకుని ఉన్నందువల్లనే సింగరేణి బొగ్గుపొరల్లో వాళ్ళెట్లా నిప్పురాజేసిందీ రఘోత్తం దగ్గరిగా చూచి కథల్లోకి ఎక్కించారు" (పినాకపాణి 2004, పుట.140) అని అంటారు.

ఈ కథల్లో వరుస క్రమంలో తెలంగాణ రైతాంగ ఆదివాసీ కార్మికోద్యమాల బహుముఖీన కాల్పనిక వ్యక్తీకరణలుగా ఉన్నాయి. ఇతని కథల్లో మానవ సామాజిక అంశాలు ఎక్కువగా చూడవచ్చు. *నా పాత స్నేహితుడు, చావు విందు జాడ, ఉరి, పనిపిల్ల, హంతకులు* మొదలైన వాటి ఆధారంగా తెలంగాణ విప్లవోద్యమాన్ని మానవ సంబంధాల సంఘర్షణ క్రమంలో చూడవచ్చు.

రఘోత్తం సేకరించిన పోరాట వస్తువులన్నీ కేవలం ఒక పోరాట ఘటనకు, ఉద్యమ శకలానికో పరిమితంగాక విప్లవోద్యమ నేపథ్యంలో మానవ సంబంధాల సంఘర్షణ మీద ప్రధానంగా భిన్న విలువల మధ్య భిన్న నేపథ్యాల మధ్య, భిన్న వ్యక్తిత్వాల మధ్య, రెండుతరాల మధ్య సంఘర్షణలు కనిపిస్తాయి. పైకి ఒక చిన్న పేచిలాగా కనిపించే ఏ అంశమైనా

సారాంశంలో ఎంత భిన్న సంఘర్షణగా ఆవరించి ఉంటుందో *ఉరి, జాడ, పనిపిల్ల* మొదలైన కథల్లో చూడవచ్చు.

*ఉరి* కథలో కార్మికుడి ఆత్మహత్య ద్వారా సామాజిక విషాదాన్ని, అందులోని లోలోతుపొరల నుండి చిత్రించగలిగారు. *చావువిందు* కథలో దొరల వైపు నుంచి కథ నడపడంవల్ల భూస్వామ్య ఆధిపత్యపతనం అనే అంశం లోలోపల దాగి ఉండే విషయాలన్నీ కథల్లోకి వచ్చాయి. *చావువిందు* కథకు వస్తువు భూపోరాటాలు. భూస్వామ్య ఆధిపత్యం కూలుతున్న సన్నివేశం చూడవచ్చు. *సారా* వ్యతిరేక పోరాటాలు, కార్మిక తిరుగుబాట్లు, ఎన్‌కౌంటర్ హత్యలు మొదలైన వాటిని కేంద్రంగా చిత్రించిన కథ *జాడ.*

తెలంగాణ గ్రామంలో ఆదివాసీ, కార్మిక జీవితాలను, వాళ్ళ జీవన్మరణ పోరాటాలను, హత్యలను, ఆత్మహత్యలను కథల్లోకి ఎక్కించే ప్రయత్నాలను వర్గపోరాటం మానవ సంబంధాలన్నింటిలోనూ వివిధ రూపాల్లో ప్రతిఫలించేందుకు అవకాశం ఉన్నదో ఒక సృజన కారుడిగా అన్వేషించి చిత్రించాడు.

తెలంగాణ కథకు తాత్త్విక స్పర్శనద్దిన విలక్షణ కథకుడు బి.యస్. రాములు ఇతని కథలలో సామాజిక ఆర్థిక చరిత్రాంశాలు అందించాడు. బహుజన చైతన్యాన్ని అందించాడు. వందకు పైగా కథలు వందలాది సాహిత్య, సామాజిక, సిద్ధాంత వ్యాసాలు, బతుకుపోరు నవలలవంటి అనేక రకాలైన రచనాలు చేశారు. ఇతని కథల్లో విప్లవవాదం, దళితవాదం, స్త్రీవాదం లాంటి ఏ ఒక్క వాదమో కాకుండా అన్ని వాదాలు ఒక సమగ్రతలో ఒదిగిపోయి మానవేతిహాసంగా రూపుదిద్దుకుంటాయి. అన్ని వాదాల లోతు పాతుల పై పట్టు సాధించిన విషయం ఇతని కథల ద్వారా తెలుస్తుంది.

బి.యస్. రాములు ప్రస్తుతం నడుస్తున్న చరిత్రను తెలిపే కథలు, గ్రామాల్లో వచ్చిన, వస్తున్న మార్పులను సజీవంగా చిత్రించే కథలు, తెలంగాణ గ్రామాల్లోని మధ్య తరగతి అట్టడుగు వర్గాల జీవితాల కథలు, సమకాలీన సామాజిక చిత్రణలు అన్ని ఇతని కథల్లో అత్యంత వాస్తవికంగా కనిపిస్తాయి.

ప్రజల సంస్కృతిలో వచ్చిన మార్పుల్ని వరుసలు, వారసత్వం, ప్రేమికులు, మలుపులు, మమతలు, పంజరం, మార్పు కథలు విశ్లేషిస్తాయి. ప్రేమ, సమాజం, కులం, వర్గం, జీవన ప్రమాణాలు, జీవితాదర్శాలు వాటి తీరుతెన్నులు స్మృతి, బంది, రియల్ ఎస్టేట్ కథల్లో చిత్రించారు. వేపచెట్టు, చేయూత, స్మృతి, ఇల్లాలు దక్షయజ్ఞం, గాడిద, దుస్తులు, పాతచీర, కొత్త చిగురు మొదలైన కథలు సమకాలీన సమాజాన్ని సజీవంగా చిత్రించినవి.

ఇతని గురించి "తన సాహిత్యం ద్వారా బి.యస్. బతుకులో పోరుచూశాడు. అడవిలో వెన్నెల కురిపించాడు. జీవితంలో 'మమకారం' పెంచాడు. వలసబతుకుల వారసత్వం చూపాడు. మనిషి జీవితానికి బంది కావాల్సిన అవసరాన్ని తెలిపాడు. శ్రామిక జనం పాలు కావాల్సిన సంపద దోపిడీ వర్గాల పాలు కావడాన్ని ఎత్తి చూపాడు. చదువు అనే రియల్ ఎస్టేట్‌ను స్వంతం చేసుకోవాల్సిన అవసరం తెలియజేశాడు. బడుగు జీవుల బతుకుసారాన్ని తన కథల్నిండా గుమ్మరించాడు. అడవిలో వెన్నెల నుండి దక్షయజ్ఞం వరకు ఎన్నో ప్రస్థానాలు చేశాడు. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక స్థాపించి తెలుగు నేలపైదళిత సాహిత్య వాతావరణాన్ని కలిగించాడు" అని అంటారు. (మల్లయ్య, కాలువ పుట.199).

ఇతను రాసిన *అడవిలో వెన్నెల* కథ, అడవిని గోండు గిరిజనుల్ని వారి జీవన సంస్కృతి విధానాన్ని సహజంగా చిత్రించాడు. ఇందులో గోండు జీవిత మూలాలను అతిదగ్గరగా పరిశీలించి చిత్రించాడు. వాళ్ళలో కలిసిపోయి, అడవుల్లో అన్నల అవసరం ఎదుకేర్పడిందో. అన్నలు అడవుల్లో వెన్నెలలా ఎలా విస్తరిస్తున్నారో అద్భుతంగా చిత్రించారు. అడవుల్లో నివసించే గిరిజనుల బతుకుల్ని, వారి వెతల్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు.

బి.యస్. కథలు వివిధ పేర్లలో కథా సంపుటాలుగా వచ్చినవి. పాలు అనే కథల సంపుటికి ముందు మాట రాస్తూ "ఈ మూడు కథలు మట్టి రచయిత రాసినవి. మట్టివాసన లేని రచనల గురించి మాత్రమే ఆలోచించే వారు సామాజికత విషయంలో ఉన్నత శిఖరాలనధిరోహించి రచయితల సృజనగా వెలువడ్డ మట్టి కథల విలువను లెక్క కట్టగలరా?" అని అంటారు జయధీర్ తిరుమలరావు. (మల్లయ్య, కాలువ పుట.201)

విప్లవ కథలు, దళితకథలు, గిరిజన కథలు, ప్రపంచీకరణ కథలు, తాత్విక కథలు, రియల్ ఎస్టేట్ కథలు, తెలంగాణ ప్రాంతీయ చిత్రీకరణ కథలు, స్త్రీ కథలు, పార్లమెంటులో బి.సి.లకు రిజర్వేషన్లకు సంబంధించిన వ్యాసాలు వివిధ కోణాల నుంచి ఆలోచించి రచనలు చేసిన కథారచయిత.

కాలువ మల్లయ్య తెలంగాణ మాండలికానికి సాహితీ గౌరవాన్ని తీసుకొచ్చిన కథారచయిత. జన జీవితాల్ని ప్రాంతీయతా ముద్రతో కథకు, జీవితాలకు విశ్వజనీనతను కల్పించిన వ్యక్తి ఎన్నెన్నో కోణాల నుంచి ఆలోచించి కార్మిక కర్షక, విద్యార్థి, మేధావి, స్త్రీ, దళిత, విప్లవవాద, మానవ సంబంధాలు, గ్రామీణ సగటు మనిషి, పరాయీకరణ చెందుతున్న బతుకులు మొదలైన అంశాలు ఇతని కథలో చూడవచ్చు. ఇతని కథల్లో గ్రామమే పుట్టినిల్లు. ఇతని కథలు వివిధ పేర్లతో 10 కథా సంపుటాలుగా వెలువడినాయి అవి - మాట్లాడే బొమ్మలు. సగం సగం, సగటు మనిషి, కార్మికులు, సృష్టికర్తలు, తెలంగాణ గ్రామం మేధావులు, దళిత మానవ సంబంధాలు, విప్లవవాదం మొదలైనవిగా వెలువడినాయి.

ఇతని గురించి "కాలువమల్లయ్య కథల్ని స్థూలంగా నాలుగు విభజనలుగా చేసుకోవచ్చు. మొదటి దశలో దృక్పథం అంటూ ఏర్పడక ముందు రాసిన కథలు రాజు-కోడి సంకలనాలలో రాసిన కథలన్నీ ఇలాంటివే. ఇందులో ఏదో తీవ్రత కనపడుతుంది. రెండవ దశలో తన ప్రాంతంలో జరుగుతున్న వివిధ ఉద్యమాల ప్రభావంతో రాసిన కథలు. వెలి, ఈ భూమినాది, ప్రస్థానం, వక్రమార్గం, భూమి నవ్వింది. భ్రమలు, స్వతంత్రదినంలాంటి మరెన్నో కథలు ఉద్యమ నేపథ్యంతో రాసినవే.

మూడవ దశలో .... తెలంగాణలో పతనమవుతున్న భూస్వామ్య వ్యవస్థ. తుత్తునియలవుతున్న మానవ సంబంధాల గురించి రాసిన కథలు.

నాలుగవ దశలో.... కుల చైతన్యాలకు చెందిన కథలు. ముఖ్యంగా బి.సి.ల గురించి 50, 60 కథల వరకు ఒక్క బహుజన కులాల గురించే రాశారు.

ఏ కథ రాసిన తెలంగాణా మాండలికానికి సాహిత్య గౌరవం తీసుకొచ్చిన రచయితల్లో కాలువ మల్లయ్య ముఖ్యులు" - (నరేందర్ కె.వి., పుట 229). వెనుకబడిన దళిత, బహుజన కులాల గురించి విస్తృతంగా కథలు రాసిన రచయిత కాలువమల్లయ్య. వీరితోపాటు మరి కొంతమంది తెలంగాణకు సంబంధించిన కథలు వ్రాస్తూ తెలంగాణ కథకు ఓ సముచిత స్థానాన్ని కూర్చిన వాళ్ళలో ముదిగంటి సుజాతారెడ్డి బోయ జంగయ్య, వుప్పల నరసింహం, పడాల రాములు, ఇల్లిందల సరస్వతీ దేవి, జాజులగౌరి, గూడ అంజయ్య, బెజ్జారపు రవీందర్, పొల్కంపల్లి శాంతాదేవి, మాదిరెడ్డి సులోచన, షాజహానా మొదలైన వారున్నారని చెప్పవచ్చు.

# 4. తెలంగాణ కథ విభిన్నత - ప్రాంతీయవాద చిత్రణ

## 4.0 ప్రాంతీయత

విభిన్నతను స్థానికతతో సంబంధం లేకుండా చూడటం సాధ్యంకాదు. ఒక ప్రత్యేక భౌగోళిక ప్రాంతంలో, ప్రత్యేకమైన సంస్కృతి, ఆచార వ్యవహారాలు ప్రచలితంగా ఉన్నప్పుడు ఆ ప్రత్యేకత ఇతర ప్రాంతాలతో పోల్చి చూసినప్పుడు తెలుస్తుంది. అయితే ఈ పోలిక సామ్యాలను కాకుండా భేదాంశాలను మాత్రమే పరిశీలన పరిధిలోనికి తీసుకుని సాగవలసి ఉంటుంది. ఈ దృష్ట్యా తెలంగాణా కథలో కనిపించే విభిన్నత ఇక్కడి జీవన విధానానికి, ఆ జీవన విధానంలోని వైవిధ్యతకు సంబంధించినదిగా మారుతుంది. కాబట్టి విభిన్నత అనేది అనివార్యంగా మరొక దానితో సరిపోల్చబడుతున్న ఒక అంశం. అదే సందర్భంలో ఒకే ప్రాంతంలోని భిన్నవర్గాల, భాషల, సంస్కృతుల మధ్య ప్రకటితమయ్యే తేడాలు కూడా విభిన్నతగానే పరిగణనకు తీసుకోవలసి ఉంటుంది. "The writer, as the producer of a text, does not manufacture the materials with which he works."[1] (Macherery Piore - A theory of literary production, 2006, page.47)

తెలంగాణ కథలో వ్యక్తమయ్యే ఈ విభిన్నత ఒక కోణంలో ప్రాంతీయం; మరొక అర్థంలో భాషా సంబంధి; మరొక అర్థస్ఫూర్తిలో అది సాంస్కృతికం అంతే కాదు ఈ విభిన్నత ఆయా ప్రాంత ప్రజల సాంస్కృతిక, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ చైతన్యం, ఆ ప్రాంతంలో వివిధ కాలాల్లో సాగిన సామాజిక, రాజకీయ రాజకీయేతర రంగాల్లోని వివిధ ఉద్యమాల మీద కూడా ఆధారపడి ఉంటుంది. ఏ రచయిత అయినా వాచక ఉత్పత్తి దారుడిగా తాను రచించే లేదా చేసేపనికి సంబంధించిన వస్తువులను ఉత్పత్తి చేయడు. తన కాలం, తన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న నేపథ్యంలోంచి రచనను ఉత్పన్నం చేస్తాడు. తానేమీ కొత్త వస్తు సంచయాన్ని కూడా ఉత్పన్నం చేయడు. ఈ విధంగా చూస్తే తెలంగాణ కథలోని విభిన్నత వాచక నిర్మాతలుగా రచయితల సృష్టికాదు. అది అప్పటికే స్థానిక సమాజంలో అంతర్భాగంగా

ఉన్న అంశం. ఇటువంటి విభిన్నతను గుర్తించకుండా ఒకే తెలుగు కథ అనే గొడుగు క్రింద తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా తెలంగాణ కథను కూడా చూడటం వలన ఈ విభిన్నత చాలా వరకు మరుగున పడిపోయింది. ఇట్లా ఈ ప్రత్యేకతలు, విభిన్నతలు, విశిష్టతలు విస్మరింపుకు గురి కావడాన్ని పరిశీలించిన ఎ.కె. రామానుజన్ వీటిని 'Little traditions' గా వ్యవహరించారు. దీనిని మరికొంత స్థానిక వాదం వెలుగులో పరిశీలించి చూసినప్పుడు ఈ విధంగా భావించవచ్చు "Nativism in its positive and progressive aspects, is a celebration of the pluralism that is at the very core of Indian culture and literature, an interrogation of the existing canons that are most often a continuation of the orientalist notions of 'Indianness' governed by wrong premises like the priveleging of high textuality, the marginalisation of the non-canonical, performative and counter-hegemonic texts and trends...." (Satchidanandan, K. Defining the premises: Nativism and Its Ambivalences (essay) Nativism essays in criticism, 1997, page.14.) ఈ నిర్వచనం విస్తృతార్థంలో భారతీయ సాహిత్యాన్ని, పాశ్చాత్య సాహిత్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేసినదే అయినప్పటికీ భారతీయ సాహిత్యంలో స్థానికవాదం అనే మాట సానుకూల అభ్యుదయార్థంలో వాడబడింది. భారతీయ సాహిత్య లక్షణం బహుళవాదానికి ఒక వేడుకగా వేదిక నివ్వటం ఇది భారతీయ సంస్కృతిలోనే ఉంది. దీన్లో అంతకు ముందు ప్రామాణిక రచనలుగా ప్రాచుర్యం పొందిన వాటిని విచారించటం ఉంటుంది. వర్తమాన ప్రామాణిక రచనలనుకూడా అది ప్రశ్నిస్తుంది. ప్రాచ్యవాద దృక్పథంలోని తప్పుడు ఆలోచనల ఫలితంగా ఎక్కువ గౌరవాన్ని, తక్కువ గౌరవాన్ని పొందుతూ ఉన్న వాచకాలు, మినహాయింపుకు గురవుతున్న వాచకాలు, సప్రామాణికం కానివాచకాలు, ప్రతి ఆధిపత్యవాచకాలు, ధోరణులు అంటూ ఒక కృత్రిమమైన విభజన సాహిత్య విమర్శలో కొనసాగి కొన్ని ప్రాంతాల సాహిత్యం ప్రామాణికమైనదిగా గుర్తింపు పొందింది. తెలుగుకథ, తెలంగాణ కథా విషయంలో కూడా ఇదే జరిగింది.

తెలుగు కథ గురించి ఎవరు మాట్లాడినా 1910 ప్రస్తావన గురజాడ అప్పారావు మొదలుకొని చివరిపేరుదాకా ఒక పరంపర అవిచ్ఛిన్నంగా సాగిపోతుంది. అయితే మొత్తం

ఆంధ్రదేశం భౌగోళికంగా, రాజకీయంగా ఒకే పేరులో లేకపోయినప్పటికీ వీటి ప్రత్యేకతలను పరిహరించి, విస్మరించి ఒక సాహిత్య చరిత్రను సృష్టించుకుని చదువుకోవడానికి అలవాటు పడిన వారు ఆయా ప్రాంతాల ఉనికిని, అక్కడి సాహిత్య ప్రక్రియల ఆవిర్భావ వికాసాదులను సాహిత్య చరిత్ర రచనలో ఏమాత్రం గుర్తించలేదు. పేర్కొన లేదు. దీనికి కారణం విశాలాంధ్ర వాదం. అందువల్ల తెలంగాణ కథలోని విభిన్నతలను చర్చించే అవకాశం మృగ్యమై పోయింది. తెలంగాణ కథ తన ప్రత్యేక అస్తిత్వాన్ని విభిన్నతలోని ప్రత్యేకతను కోల్పోవడానికి కూడా చాలా కారణాలు నిర్హేతుకమైనవి ఉన్నాయి. "విశాలాంధ్ర వాదం వల్ల తన అస్తిత్వాన్ని, తన ప్రత్యేకతను, తన ప్రాతినిధ్యాన్ని తెలంగాణ కోల్పోవలసివచ్చింది. విశాలాంధ్ర వల్ల రెండు ప్రాంతాల మధ్య జరిగిన రాజకీయ ఏకీకరణ సమాన ప్రాతిపదిక మీద జరగలేదు. బ్రిటీష్ వారు పాలించిన ఆంధ్ర ప్రాంతం రాజకీయంగా, సాంస్కృతికంగా, సామాజికంగా కూడా తనను తాను ఉన్నత మైనదిగా పరిగణించుకుని, ఆధిక్య హోదాలో విశాలాంధ్రలో భాగమైంది. అందుకు కావలసిన భావ వాతావరణం అంతకుముందు నూరు నూట యాభై సంవత్సరాలుగా రూపొందుతూ ఉండింది. నిజాంలకు కప్పం చెల్లించే సామంతులుగా, కౌలుదారులుగా, ఏజెంట్లుగా ఉండిన ఇంగ్లీషు వారు క్రమంగా హైదరాబాద్ రాజ్య స్వాతంత్ర్యాన్ని అపహరించి కొంత ప్రాంతాన్ని ప్రత్యక్ష పాలనకు తమ అధీనంలోకి తీసుకోవడంతో రెండు ప్రాంతాల మధ్య ఒక అసమానతకు బీజం పడింది. రెండు ప్రాంతాల పాలకుల మధ్య ఉన్న అంతరం, రెండు ప్రాంతాల పాలితుల మధ్య కూడా మరొక స్థాయిలో ఏర్పడింది." (శ్రీనివాస్, కె. 2002, పుట.11) ఈ అంతరం అవిచ్ఛిన్నంగా కొనసాగి తెలంగాణ ప్రాంత అన్ని రంగాల విభిన్నతను కానరాకుండా చేసింది. అందులో సాహిత్యం కూడా ఒకటి.

## 4.1 విభిన్నత

నిజానికి సాహిత్య అభివృద్ధిని బ్రిటీష్ పాలకుల ద్వారా వచ్చిన అభివృద్ధితో బేరీజు వేయడంవల్ల ఒక్క తెలంగాణ ప్రాంతమే కాకుండా తెలంగాణేతర ప్రాంతాల సాహిత్య వికాసం గురించి కూడా ఏకొంచెం ప్రాముఖ్యం లేని అంశాలుగా మారిపోయాయి. పైగా నైజాం

రాష్ట్రంలో బ్రిటీష్ ఇండియా నమూనా అభివృద్ధికి ఏ అవకాశం లేకపోవటమే ఈ ప్రాంతం విభిన్నమైనదిగా పరిగణించబడింది. ఈ ప్రాంతం విద్యావికాసాలకు ఏ భాషను ఏ మాధ్యమాన్ని వాడుకున్నదనే అంశంపై ఆధారపడే సాహిత్య ప్రభావాలు ఉన్నాయి. "ఇంగ్లీషు భాషా సాహిత్యాల ప్రభావాన్ని బ్రిటీష్ ఆంధ్ర సమాజం మీద విధిస్తే, హైదరాబాద్ రాజ్యంలోని పరిణామాలు మరో రకంగా ఉన్నాయి." (శ్రీనివాస్, కె. 2002, పుట.ii) "కాల్పనిక వచన సాహిత్యంలో ఉర్దూ భాషలో ముఖ్యంగా ఉత్తరాది ఉర్దూలో విరివిగా రానారంభించింది. హైదరాబాద్ ఉర్దూ విద్యావంతులు సహజంగానే ఉర్దూ వచన సాహిత్య ప్రభావంలో పడ్డారు" (శ్రీనివాస్, కె. 2002, పుట.ii) ఫలితంగా ప్రేమ్‌చంద్ లాంటి వారి రచనల ప్రభావంలో పడ్డారు. తెలుగు కథకు ఆద్యుడిగా పరిగణింపబడుతున్న గురజాడ అప్పారావుగారికి దరిదాపుగా సమకాలంలో మాడపాటి హనుమంతరావు రాసిన కథలు ప్రేమ్‌చంద్ కథలకు అనువాదాలు అటు బ్రిటీష్ పాలనలో ఉన్న ఆంధ్ర ప్రాంత కథకులు ఆంగ్ల సాహిత్యం ద్వారా ప్రభావితులై వచన సాహిత్యంలో కథానికలు రాస్తుంటే తెలంగాణ కథకులు ఉర్దూ సాహిత్య ప్రభావంలో ఉన్నారు. ఇది ఒక రకమైన విభిన్నత.

1913-14లో మహబూబ్ నగర్ నుంచి వెలువడిన 'హితబోధిని' పత్రికలో తెలంగాణ నుంచి వెలువడిన మొట్టమొదటి స్వతంత్ర మాసపత్రికలో ఒక కథ ప్రచురితమైంది. ఆ కథ గ్రాంథికంలో ఉన్నప్పటికీ ఇతివృత్తం, కథనం కొత్తగా ఉన్నాయి' తెలుగు భాషకు ఏమాత్రం అవకాశం, ప్రాధాన్యంలేని నిజాం పాలనలో గ్రాంథికమైన తెలుగులో కథ వెలువడింది.

### 4.2 సుజాత పత్రిక - చలం కథ

తెలంగాణ కథా సాహిత్యం సుజాత పత్రిక ఆవిర్భావంతో ఒక మలుపు తిరిగిందని పరిశోధకులు భావిస్తున్నారు. 1927లో సుజాత పత్రిక ఆవిర్భవించింది. "తెలంగాణా కథకు ఆ పత్రిక చేసినంత సేవ మరే పత్రిక చేయలేదు. నడిచింది మూడు సంవత్సరాలే అయినప్పటికీ, అప్పుడప్పుడే ఏర్పడుతున్న తెలంగాణా ఆధునిక సాహిత్యాభిమానులకు ఒక

ఆధారాన్ని, ఒక స్ఫూర్తిని 'సుజాత' ఇచ్చింది'' (శ్రీనివాస్, కె. 2002, పుట.iii) తొలితరం తెలుగు సైన్స్ ఫిక్షన్ అనదగ్గ సిరుగూరి జయరావు కథలను ప్రచురించడం ఒక ఎత్తు అయితే, బ్రిటీష్ ఆంధ్ర సమాజం పత్రికలు బహిష్కరించిన గుడిపాటి వెంకటచలం కథలను, ఆయన ఉద్ధృతి ఉచ్ఛదశలో ఉన్న కాలంలో సుజాత ప్రచురించింది. (శ్రీనివాస్, కె. 2002, పుట.iii) చలంగారి కథలను ప్రచురించిన సుజాత పత్రిక తెలంగాణేతర ప్రాంత పత్రికలనుంచి, విమర్శకుల నుంచి కూడా ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నది.

సుజాత పత్రిక స్థానికంగా ఉత్సాహవంతులైన రచయితలకు ఒక కొత్త సాహిత్య ప్రపంచాన్ని చూపించింది. ఈ పత్రిక ''ఆధునిక రచనా శైలులతో పరిచయం ఏర్పరచింది. స్త్రీ పురుష సంబంధాల విలువల చర్చగానీ, గ్రాంథిక వ్యావహారిక భాషా వివాదాలు కానీ లేకుండా యథాతథంగా అన్నిటినీ స్వీకరించగలగడం సుజాత గొప్పదనం'' (శ్రీనివాస్, కె. 2002, పుట.iii) కేవలం మూడు సంవత్సరాల కాలవ్యవధిలో సుజాత కలిగించిన సంచలనం, ఇచ్చిన ప్రోత్సాహం వలన కొత్తతరం కథకుల ఆవిర్భావానికి బలమైన పునాదులు వేసింది.

తెలంగాణ కథకు సంబంధించిన విభిన్నతను పేర్కొనవలసివస్తే మొట్టమొదట అది ఉద్యమంలో మమేకమైన కథగా చెప్పాలి. ఏ ఉద్యమ నేపథ్యం లేకుండా తెలంగాణ కథ ముందుకు సాగలేదు. ''తనను తాను పురోగమింపజేసుకోవడానికి, ముందడుగు వేయడానికి తెలంగాణా తెలుగు సమాజం చేసిన ప్రయత్నమే తొలినాటి గ్రంథాలయోద్యమం'' (శ్రీనివాస్, కె. 2002, పుట.iii) ఈ విభిన్నత ఎటువంటి దంటే ఉద్యమం ద్వారా ఉద్యమించటం తెలంగాణ కథ జీవలక్షణం. ఈ గ్రంథాలయోద్యమం అనివార్యమైన రాజకీయ అవసరం దృష్ట్యా మొదలైంది. ఆంధ్ర మహా సభ మొదటి సమావేశానికి అధ్యక్షత వహించిన సురవరం ప్రతాపరెడ్డి, తొలి సత్యాగ్రహంలో పాలు పంచుకున్న వారిలో చాలామంది కథకులు కావటం గమనించదగ్గ విషయం. వీరందరి ప్రయత్నం ఉద్యమనేపథ్యంలోనే 'కథ' సాగడానికి దోహదపడింది.

1935లో కాళోజీ నారాయణరావు ఏర్పరిచిన వైతాళిక సమితి బృందంతో కలిసి 'ఆర్య సమాజీయ' కథను రాయడం గమనిస్తే 'కథ'ను విడిగా ఒక రచయితగా ఏకాంతంలో రాసే ప్రక్రియగా కంటే సంయుక్త సామూహిక కర్తృత్వాన్ని అభిలషించినట్లుగా భావించవచ్చు. కథ నెరవేర్చవలసిన ప్రయోజనం జన చైతన్యం లేదా సామాజిక చైతన్యం అనేది ప్రధానంగా ఈ కథకులు గుర్తించినట్లు కనిపిస్తుంది. ఇది ఒక రకంగా విభిన్నతగానే పరిగణించదగింది.

## 4.3 ఆంధ్రకేసరి సంఘం

కాళోజీ నారాయణరావు తరువాత అదే కాలంలో గుండవరపు హనుమంతరావు, కె.సి. గుప్త మరి కొంతమందితో కలిసి ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి సంఘం ఈ విభిన్నతను మరింత స్పష్టంగా పట్టి చూపుతుంది. "వేర్వేరు జిల్లాలకు చెందిన ఆంధ్రకేసరి సభ్యులు తమ తమ స్థానిక మాండలికంలో కథలు రాయాలని ప్రయత్నించారు" (శ్రీనివాస్, కె. 2002, పుట.iv) ఈ ప్రయత్నం కొంత విశ్లేషించి చూడదగింది. తెలంగాణ కథ ఉద్యమ నేపథ్యంలోంచి పుట్టడం ఒక విభిన్నత అయితే, ఉమ్మడి ప్రయత్నంగా సాగడం మరొకటి. అయితే ఆనాటికే 'మాండలికం'లో రాయాలనే ప్రయత్నం సాగడమంటే స్థానికతకు వారు ఇచ్చిన ప్రాధాన్యాన్ని గుర్తించినట్లు. తెలుగు కథ ఎక్కడ పుట్టిందైనా పెరిగింది బౌద్ధికవాతావరణంలో, ఆంగ్ల సాహిత్య ప్రభావంతో అందునా ఆనాటి విద్యావంతులైన వారి సృజన సంకల్పంలోంచి అది ఎదిగింది. వారికి 'స్థానికత' అన్న స్పృహ కానీ, భావన కానీ అంతగా ఉన్నట్లు కన్పించదు. రచయిత తన సామాజిక పరిసరం నుండి వైదొలగి బౌద్ధిక మైన ప్రేరణలలో ఒక ఊహాజనిత జీవితం, జీవిత సమస్యల చిత్రణ చేయటంలో ఎదిగి వచ్చిన కథకు, స్థానికంగా పుట్టి, స్థానిక వాసనను విస్మరించకుండా స్థానిక జీవన చిత్రణ, స్థానిక భాషలోనే జరగాలన్న ఆకాంక్షకు చాలా తేడా ఉంది. తొలుత లిఖిత పత్రికగా వెలువడిన ఆంధ్రకేసరి కథలను స్థానిక భాషలోనే రాయడాన్ని ప్రోత్సహించింది. "తరువాత తరువాత ముద్రిత పత్రికగా వెలువడిన ఆంధ్ర కేసరిలో తెలంగాణా భాషలో రాసిన కథలకు ప్రత్యేక పరిగణన ఉంటుందన్ని ప్రోత్సహించడం ఆసక్తికరం" (శ్రీనివాస్, కె. 2002, పుట.iv) ఆ తరువాత ఏర్పడ్డ అణా గ్రంథమాల

ప్రచురించినకథలు, దేశోద్ధారక గ్రంథమాల స్థాపన ద్వారా సాగిన వట్టికోట ఆళ్వారుస్వామి సాహిత్య ప్రచారం, బూర్గుల రంగనాథరావు, ఎం.ఎస్. రాజలింగంలు స్థాపించిన సాధన సమితి ఒకటొకటిగా సాగించిన ప్రయత్నాలన్నీ తెలంగాణ కథకున్న విభిన్నతలోని బహుపార్శ్వాలను ప్రదర్శించేవే కావటం గమనార్హం. క్రమేణా సాహిత్య సంస్థలు పెరగటం, రచయితల బృందాలు అధికం కావటం వీటికి తోడు పత్రికలు కూడా వృద్ధి పొందటంతో కథారచన వేగం పుంజుకుంది. ఈ ప్రభావం వల్ల దాశరథిలాంటి కవులు, పి.వి.నరసింహారావు లాంటి రాజకీయ నేతలు కూడా కథలు రాయడం జరిగింది.

## 4.4 స్థానికత

తెలంగాణ కథకు సంబంధించిన విభిన్నతను గురించి చర్చించేటప్పుడు విధిగా గుర్తించాల్సిన అంశం ఒకటి ఉంది. స్థానిక అవసరాల వత్తిడి, ప్రభావం వల్ల ఎంతమంది కథకులు తెలంగాణా తొలితరం కథ కథనపరంగా, నిర్మాణ పరంగా ఆరితేరిందని చెప్పలేము. ‘‘కోస్తాంధ్ర ప్రాంత తెలుగు సాహిత్యానికి వర్తింపజేసే ప్రమాణాలను ఇక్కడ అనువర్తింప జేయకూడదనేది నిజమే. కానీ, తెలంగాణాలో పాఠకుల సంఖ్య పరిమితం కావడం, పాఠకులు రచయితల మధ్య సంబంధాలకు తగినన్ని వేదికలు లేకపోవడం, కథాసాహిత్యంలో ఎన్నో ప్రయోగాలు జరుగుతున్న ఆంగ్లో యూరోపియన్ సాహిత్యంతో తెలంగాణా రచయితలకు పరిచయం లేకపోవడం వంటి లోట్లు తెలంగాణా కథకు బలహీనతగా మారాయి’’ (శ్రీనివాస్, కె. 2002, పుట.iv) విమర్శకులు పేర్కొనడంవల్ల విభిన్నతను గుర్తించకుండా చేసినట్లయ్యింది. ఒకరకంగా ఇటువంటి అభిప్రాయాలు విభిన్నతను గురించి, అంగీకరించడానికి ఆటంకంగా కూడా పరిణమిస్తాయి. ఇట్లాంటి దృష్టికోణం వల్లనే తెలంగాణ కథలోని ప్రత్యేకతలు తగు విధమైన పరిశీలనకు, పరిశోధనకు గురికాకుండానే మరుగున ఉండిపోతున్నాయి.

తెలంగాణా కథావిర్భావ వికాసాన్ని తెలంగాణ సమాజ అవసరాలలోంచి చూడకుండా ఇతర ప్రాంతాలలో అభివృద్ధి చెందిన ప్రక్రియతో సరిపోల్చి చూడటం అక్కడి, ఇక్కడి పరిస్థితులను తారతమ్యాలతో నిరూపించవలసిన అవసరం లేదు. తెలంగాణా కథకు కథనం,

కథానిర్మాణం అంతగా అవసరం లేని విషయాలు. ఎందుకంటే తెలంగాణ కథ పాఠకుడు ఒంటరిగా చదువుకునేందుకు రాసిన కథ కాదు. కథకుడే వివిధ ప్రాంతాలలో తిరిగి జనబాహుళ్యానికి వినిపించవలసిన కథ. పదుగురు వినాల్సిన కథ. చదువుకునే కథకు, సమూహం వినేకథకు మౌలికంగానే ఎన్నో తేడాలు ఉంటాయి. విమర్శకులు పేర్కొన్నట్లుగా తెలంగాణాలో కథకు పాఠకుల సంఖ్య పరిమితమే. అయితే కథను వినే శ్రోతలు ఉన్నారు. అట్లాగే పాఠకుడు-రచయిత వారిని కలిపేవేదిక ఇవన్నీ లిఖిత సాహిత్య సంప్రదాయ భావనలోనివి. తెలంగాణ కథకు వీటి అవసరం లేదు. తెలంగాణ కథకుడు వీటి అసరాన్ని గుర్తించలేదు. తెలంగాణ కథా రచయితది రాసే దృష్టికాదు. వినిపించే దృష్టి. మిగిలిన ప్రాంతాల కథ ఇట్లాంటిది కాదు. పాఠకులు, ముఖ్యంగా కథను చదువుకోగల పాఠకులు అసంఖ్యాకంగా ఉన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా రెండు ప్రాంతాల కథలను పోలిస్తే తెలంగాణ కథ వికాసం పొందలేదనే భావన కలుగుతుంది. ఆ భావనలోంచే శ్రీనివాస్ ఆలోచించటం వల్ల స్పష్టంగా కనిపించే 'విభిన్నత'ను బలహీనతగా అభిప్రాయ పడ్డారు. అంతే కాకుండా కథా సాహిత్యంలో జరుగుతున్న ప్రయోగాలు తెలంగాణ కథలో జరగడం లేదని దీనికి కారణం యూరోపియన్ సాహిత్యంతో తెలంగాణ రచయితలను పరిచయం లేకపోవడం ఒకలోటుగా గుర్తించారు. తెలంగాణ కథకు ప్రయోగంతో పనిలేదు. ప్రయోజనంతోనే పని. తెలంగాణ కథకుడికి ఏ సాహిత్యంతోటి అవసరానికి మించిన పరిచయం కూడా అవసరం లేదు. తన సమాజంతో ఎంత పరిచయం ఉంటే అంత మంచిది. ఒక విధంగా ఇది తనదైన ముద్రను కలిగిఉండటం విభిన్నతను ఈ కోణంలోంచి గుర్తించకపోవడం వల్లనే కె. శ్రీనివాస్ ఈ విధంగా పేర్కొనవలసివచ్చింది. సురవరం ప్రతాపరెడ్డి తన కథలలో మొగలాయితనం ప్రతిబింబించాలని చూశారు. కాళోజీ నారాయణరావు, జి. రాములు వంటి కథకులు పరమస్థానిక రాజకీయ, సాంస్కృతిక అభినివేశంతో కథలను నింపారు "కానీ, నందగిరి వెంకటరావు, ఇందిరాదేవి, ఎల్లాప్రగడ సీతాకుమారి, బూర్గుల రంగనాథరావు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి ఆధునికులు, ప్రగతిశీలురు బ్రిటిష్ ఆంధ్ర

సాహిత్య ప్రభావంతో రచనలు చేయడానికి ప్రయత్నించారు.'' (శ్రీనివాస్, కె. 2002 పుట.ii) అని అంటారు.

### 4.5 తెలంగాణ కథ - విశ్లేషణ

తెలంగాణ కథ ప్రారంభవికాసాలను విశ్లేషించిన విమర్శకులు రాజకీయ ఆకాంక్షతో తెలంగాణ వెనకబాటు తనాన్ని రాజకీయార్థంలో నిరూపించడానికి అనేక రకాలుగా ఆంధ్ర ప్రాంతంతో సరిపోల్చిచూపడానికి ప్రయత్నించగా సామాజిక అభివృద్ధి విషయంగా ఈ దృక్కోణం సరైనదే కావచ్చేమోకాని, సంస్కృతి, సాహిత్య వికాసాల పరంగా తెలంగాణ సాహిత్య విశిష్టతల్ని అర్థంచేసుకోవడానికి పెద్దగా ఉపకరించదు. ''తెలంగాణా కథావికాసానికి అవరోధంగా నిలిచిన ప్రతికూల వాస్తవికతలో మరొక ముఖ్యమైన అంశం - తెలంగాణాలో మధ్యతరగతి అవతరించకపోవడం. సామాజిక విలువల ఘర్షణకు, పరిణామాల స్పందనకు మధ్యతరగతి ఒక అద్భుత వేదిక, వాహిక కూడా. జీవిత వాస్తవికత సాపేక్షంగా నిశ్చల స్థితిలో ఉన్న నాటి ఉన్నత తరగతులజీవితం కానీ, అట్టడుగు జీవితాలు కానీ కథనానికి గొప్ప వస్తువులను ఇవ్వలేవు. కథా సాహిత్యానికి ఇతివృత్తాలను పాఠకులను కూడా మధ్య తరగతే అందించాలి. బ్రిటిష్ ఆంధ్రతో పోలిస్తే, తెలంగాణా ఇప్పటికీ మధ్య తరగతిని తగినంత ఏర్పరచుకోలేక పోయింది'' (శ్రీనివాస్, కె. 2002 పుట.ii) అని అంచనా వేశారు. తెలంగాణ కథ విభిన్నతకు ఇది కూడా ఒక నిదర్శనమే. ఎందుకంటే వచనసాహిత్యం, అందులో కథ అభివృద్ధి చెందిన ప్రాంత విద్యావంతుల మధ్యతరగతి సాహిత్య పాఠకుల, రచయితల ప్రక్రియ అటువంటి ప్రక్రియను ఇక్కడి కథకులు తమదే అయిన విభిన్నతతో రాశారు. శ్రీనివాస్ పరిశీలనలో ఒక ఫిర్యాదు కూడా ఉంది. ఉన్నత, అట్టడుగు జీవితాలు కథకు వస్తువునుకానీ, ఇతివృత్తాలను కానీ, కథనానికి కావలసిన ముడి సరుకును గానీ అందించలేవు అన్నది సత్యమే అయినప్పటికీ తెలంగాణ ప్రాంత సాహిత్య విమర్శకులు కూడా తెలంగాణ ప్రాంత కథను విభిన్నమైన పద్ధతిలో పరివర్ధితమైన ప్రక్రియగా చూడక పోవటం గమనార్హం. అయితే ఇదే సందర్భంలో శ్రీనివాస్ ''తెలంగాణా కథా దీపం చిన్నదే కానీ, ఆ చిన్న దాన్ని అయినా మనం పూర్తిగా

కనుగొనలేక పోయాము'' (శ్రీనివాస్, కె. 2002 పుట.ii) అని అంగీకరించారు. అందులో ఈ విభిన్నత కూడా ఒకటి."Indian culture is no monolith and Indian literature is not a monologue; they have many tongues and many voices, many hues and many world views. The dominant and the Subaltern, the high text and the popular text, the great tradition and the little tradition, the margi and the desi, the written and oral/performative have co-existed in the Indian literary landscape for centuries, giving and taking teaching and bearing from and another". (Satchidanandan, K. Defining the premises: Nativism and its (essays) ambivalences Nativism essays in criticism Ed by. Makarand Paranjpe, 1997, page.15.) భారతీయ సంస్కృతి సాహిత్యాల స్వభావాన్ని, లక్షణాన్ని ఇక్కడ అన్వయించి చూసినప్పుడు ఎందుకు తెలంగాణ కథ అంత విభిన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. భారతీయ సంస్కృతి ఏకశిలా సదృశం కాదు. అలాగే భారతీయ సాహిత్యం స్వగతం కాదు. దీనిలో భిన్న గొంతులు, విభిన్న స్వరాలు, వివిధ ప్రాపంచిక దృక్పథాలు ఉన్నాయి. అలాగే ఆధిక్య వాచకాలు, ఉపశ్రేణి వాచకాలు ఉన్నాయి. అధివాచకం, జనామోద వాచకం మహా సంస్కృతి, అల్ప సంస్కృతి, మార్గ, దేశి భేదాలు లిఖిత, మౌఖిక, ప్రదర్శన పద్ధతులు శతాబ్దాలుగా సహజీవనం చేశాయి. కాబట్టే తెలంగాణ ప్రాంత సాహిత్య కారులు భారతీయ సాహిత్య, సాంస్కృతిక వారసత్వ లక్షణాన్ని పుణికి పుచ్చుకున్నారు. కాని బ్రిటిష్ ఆంధ్ర రచయితలలాగా, తమది కానీ సాంస్కృతిక, సాహిత్య ప్రక్రియకు ప్రభావితులు కాలేదు. తమని తాము తమలాగా నిలుపుకోటం మీద దృష్టి పెట్టారు. కాబట్టే తొలిదశలో అయినా మలిదశలో అయినా కథకులు మహాప్రయోగాల పట్ల మోజు చూపలేదు. ఈ స్థానిక భూమికను వారు ఎన్నడూ విస్మరించలేదు. కానీ, సాహిత్య విమర్శకులు ముఖ్యంగా అస్తిత్వ ప్రాంతీయ ఉద్యమాల ప్రభావంలో ఉన్నవారు ఈ మౌలికతను పరిగణనలోకి తీసుకోకుండా అభివృద్ధి చెందిన ప్రాంత సాహిత్యం, అభివృద్ధి చెందని ప్రాంత సాహిత్యం అంటూ ఒక వింగడింపు చేసి తమ ఆలోచనను కొనసాగించారు. అంతేకాకుండా రాజకీయ ఆకాంక్ష చేత బలమైన ప్రభావానికి గురై ఇతర ప్రాంతంలోని సాహిత్యాభివృద్ధికి, తెలంగాణ సాహిత్య అభివృద్ధికి

ఒక అవసరంలేని అంకెను బిగించి చూపారు. పర్యవసానంగా ఒక ప్రత్యేక అస్తిత్వం కలిగిన ప్రాంతీయ కథ అక్కరలేని పోలికకు, అధ్యయనానికి గురై చిన్నబోయినదిగా మారింది.

అసలు తాము రాస్తున్న కథ ఏవస్తువు పైన ఎట్లా ఉండాలనే విషయంపై కూడా తెలంగాణా కథకులకు విస్పష్టమైన దృక్పథం ఉంది. 1912లో తెలంగాణా ప్రాంతం నుంచి వచ్చిన కథ మాడపాటి హనుమంతరావుగారు రాసిన 'హృదయ శల్యము' అని పేర్కొనబడుతుంది. ఈ కథ చారిత్రక నేపథ్యం కలిగిన ఇతివృత్తంతో సాగింది. అయితే సారాంశం మాత్రం సార్వకాలీన సంబంధి. దిద్దుబాటు సమస్యపై ఆధారపడిన కథ. ఒక వర్గ సంబంధకథ. ఆ సమస్యకు బాధితులు అవుతున్న వారు పరిష్కారం వెతుకుతున్న యుక్తికి, నేర్పుకు, చతురతకు, సంబంధించిన కథ. ఇతి వృత్తం సార్వజనీనం కానట్లే దాని సారాంశం సార్వకాలికం కాదు. 'హృదయశల్యము కథ' భార్య పై సందేహము పెంచుకున్న ఒక భర్త కథ. ''దిద్దుబాటు''లో వ్యసనలోలుడై భార్యను ఉపేక్షించటం, భర్త చెడును పరిహరించి చక్కదిద్దుకోవటం ప్రధానాంశం. దిద్దుబాటు కథలో 'కోమలి'కి 'హృదయశల్యము' కథలో 'యమున' పాత్రలకు ఏ విధమైన సంబంధం లేదు. భార్యభర్తల మధ్య ఏర్పడ్డ ఒక అంతరం 'రాజు' వల్ల తొలగింపబడి ఆ దంపతులను అన్యోన్య దాంపత్యం వైపు నడిపింది. అనుమాన నివృత్తి ఇందులో ప్రధానం. వ్యసన నివారణ ఆ కథలో ప్రధానం. ఇట్లా ఈ కథ వ్యక్తుల వ్యక్తిగత జీవితంలో ఏర్పడ్డ చిక్కులు సామాజికంగా పరిష్కరింపబడటం, వ్యక్తిగత జీవితంలో ఎదురైన చేదు అనుభవం నుంచి ఒక పాఠం. మూడవ వ్యక్తి ప్రమేయంతో నేర్చుకోవటం అనేదిగా మారింది. దిద్దుబాటు కథలో భర్తలోని చెడుగును 'భార్య' మాత్రమే తొలిగించుకునే ప్రయత్నంలో భార్యకు సమాజం ఇచ్చే భద్రత ఏమీలేదు. 'హృదయశల్యము' కథ ఆ భద్రతను కల్పించేదిగా చిత్రితమైంది. యమునకు దొంగలబారినుండి కాపాడినది పురుషవేషములో ఉన్న 'రుద్రమ దేవి' కావటం గమనార్హం. రాజ్య ప్రమేయం యమున జీవితాన్ని సుఖమయం చేసింది. సమాజ ప్రమేయ రాహిత్యం కోమలి జీవితం కోమలి మాత్రమే చక్కదిద్దుకోవాల్సిన

బాధ్యతను ముందుంచింది. ఇట్లా వస్తు, కథనాల్లో విభిన్నమైన కథగా 'హృదయశల్యము' నిలుస్తుంది.

1912లో మాడపాటి హనుమంతరావు రాసిన కథ హృదయశల్యం తరువాత 1914లో రాజయ్య సోమయాజులు అనే కథ వచ్చింది. 1921లో *బాలికా విలాపం*, 1923లో *అడవి గాచిన వెన్నెల*, 1925లో *నీవేనా* 1926లలో *న్యాయవాదం* అనే కథలు వెలువడినాయి. 1927తరువా ఇంచుమించు పదిహేనేళ్ళ పాటు తెలంగాణ ప్రాంతంలో కథ వచ్చినట్లు కనిపించదు. 1927లో ఒద్దిరాజు రాఘవరంగారావు 'లండన్ విద్యార్థి' పేరిట కథ రాసినట్లు తెలుస్తున్నది. హృదయశల్యం కథ ఇతివృత్త చారిత్రకం కాగా సారాంశం సార్వజనీన సందేశమైతే, 'లండన్ విద్యార్థి కథ' సామాజిక ఇతివృత్తం సందేశం. విద్యను అభ్యసించడానికి దేశాంతరం వెళ్ళిన యువకుడు పడిన పాట్లు కాదు. పరాయి దేశానికి వెళ్లి తన మూలాల్ని, తన వారిని విస్మరించిన ఒక యువకుడి తీరు, వైఖరిపై అధిక్షేపం. ఈ కథ మూలాలను విస్మరించకూడదనే సందేశాన్ని అధిక్షేపం చాటున అందిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో చదువుల కోసం పరాయి ప్రాంతాలకు, దూర సంస్కృతులను కాపాడుకునే క్రమాన్ని ఈ కథ చూపిస్తూనే పర్యవసానాలను చిత్రించింది. తొలి దశల్లో వచ్చిన కథల్లో అత్యధికంగా ''ఒక కొత్త విషయాన్ని చెప్పాలి. ఒక మంచిని చెప్పాలన్న తపన రచయితల్లో ఉంది. కథను కథగా కాకుండా ఒక మంచి ముచ్చటగా చెప్పే ధోరణి ఎక్కువమంది కథల్లో చూస్తాం'' (గుడిపాటి - ఈ నేల పరిమాణానికి తొలి ఆనవాళ్ళు , తెలంగాణా తొలి తరం కథలు- పుట.5) అంటే కథను రాయడమనే దృష్టితో కాకుండా చెప్పడమనే దృష్టినే తెలంగాణా కథకులు కలిగి ఉన్నారు. ఈ చెప్పే గుణం మానవ జీవితంలో ఉంది. "we tell stories to ourselves; of our journey from birth to death, friends, families, who we are and who we want to be or public stories about history and politics, about our country, our race or our religion. At each moment of our lives their stories place us in space and time" (Cobley, Paul (quoted) - Narrative, Routledge, London, 2001, page.1)కథ కథనం గురించిన ఈ వివరణను చూస్తే కథలు మనకు మనం చెప్పుకునేవే

తప్ప రాసుకునేవి కావని అర్థం అవుతుంది. పుట్టుక నుంచి మరణందాకా స్నేహితులతో, బంధువులతో మనం ఎవరం, ఏమవుతాం ఎట్లా రూపొందుతాం అని చెప్పుకునే ముచ్చట లాంటిది కథ. అంతేకాదు చరిత్ర గురించి, రాజకీయాల గురించి, దేశం, జాతి, మతం ఇట్లా ప్రతిసందర్భంలోనూ మన జీవన సందర్భాలను ఈ కథల్లో చెప్పుకుంటూనే ఉండటం జరుగుతుంది. చెప్పటంలో స్థల, కాల నిర్దిష్టత ఉంటుంది. రాయటంలో ఊహ ఆధారంగా స్థల, కాల నైరూప్యత స్థానం పొందుతుంది. ఈ విధంగా చూస్తే తెలంగాణా కథకుల విభిన్నత ఒక అర్థం, ప్రయోజనం ఉన్నట్లు స్పష్టంగానే తెలుస్తుంది.

## 4.6 తెలంగాణ - గ్రామీణ జీవితం

ఇదిట్లా ఉంటే తెలంగాణ కథలు ముప్పాతిక మువ్వీసం గ్రామీణ జీవితం నేపథ్యంగానే వచ్చాయి. ఈ కథల్లో అగ్రకుల జీవిత చిత్రణ ఎంత కనిపిస్తుందో సామాజికంగా వెనుకబడిన వర్గాల వారి జీవిత చిత్రణ ఉంది. ఆయా కాలాల్లో వర్ధిల్లిన ఉద్యమం ఎట్లాగూ ఉంది. కులాల వెనుకబాటుతనం వారి చైతన్యం, సామాజిక సంఘర్షణ, స్త్రీ పురుషుల జీవన చిత్రణ, ఆయా జీవితాల హైన్యదైన్యాలు ఒకవైపు చిత్రిస్తూనే, మరో ప్రక్క నైజాం పాలకుల పీడన, రజాకార్ల దురాగతాల చిత్రణ ఉంది. ఇది ఒకరకంగా తెలంగాణ ప్రాంతం రాజకీయంగా విభిన్నమైన పరిస్థితులలో ఉండటం వల్ల కూడా జరిగింది. దీనితో పాటుగా "నిజాం ప్రభువు భారత సైన్యానికి లొంగిపోయే పరిస్థితుల్లో అప్పటివరకు ఒక వెలుగు వెలిగిన వారి కుటుంబాల్లో నెలకొన్న సంక్షోభాన్ని, ఘర్షణల్ని కూడా రచయితలు రికార్డు చేశారు. ఇలా భిన్న రకాల ఇతివృత్తాలు కనిపిస్తాయి." (గుడిపాటి 2002 పుట.vii)

కాగా ఈ తొలి తరం కథకుల కథల్లో పరిశీలించాల్సింది. శిల్పం "కథాకథనం, శైలీ శిల్పాల్ని గమనిస్తే తొలి తరం కథకులు ప్రయోగాల జోలికి వెళ్లలేదని అర్థమవుతుంది. వీరిలో ఆంగ్ల భాషా సాహిత్యాలతో పరిచయం ఉన్నవారు తక్కువ, ఇక్కడ విద్యాబోధన ఉర్దూలో ఉండటంవల్ల సాహిత్యంపై ఆసక్తి ఉన్న వారికి ఉర్దూ భాషా సాహిత్యాలతో మాత్రమే ఎక్కువ పరిచయం ఉంది. దీనికి సంబంధించిన విస్తృతమైన అధ్యయనానికి నాడు ఆస్కారం

లేదు. తమకు తోచిన పద్ధతిలో రాయడానికి రచయితలు ప్రయత్నించారు. కథలన్ని దాదాపుగా వాస్తవిక శిల్ప పరిధిలోనే నడిచాయి. అలాగే ముఖ్యంగా తొలి తరం తెలంగాణ కథల్లోని భాషని చూస్తే కొందరు సరళ గ్రాంథికంలో రాశారు కొందరు నాటి తెలంగాణా వ్యావహారికంలో రాశారు.

## 4.7. తెలంగాణ కథ - ప్రాంతీయ వాద చిత్రీకరణ

ఒక్కో చారిత్రక కాలానికి ఒక్కో సామాజిక అవసరం ఉంటుంది. వాటికి అనుగుణంగానే సాహిత్యంలో కొత్త కొత్త భావజాలాలు వాదాలుగా, ఉద్యమాలుగా పుట్టుకొస్తుంటాయి. అలా ఆధునిక తెలుగు సాహిత్యంలో మొదట సంస్కరణోద్యమ సాహిత్యం, దేశభక్తి సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం మొదలైనవి ఉద్యమాలుగా వచ్చాయి. నేడు అస్తిత్వవాద సాహిత్యంలో దళితవాదం, స్త్రీవాదం, మైనార్టీ వాదాలను అనుసరించి, వీటితో సమాంతరంగా కొన్ని సమాన లక్షణాలను మౌలికంగా, ప్రాథమికంగా కలిగి ఉండి ప్రాంతీయవాదం ఎంతో బలంగా వస్తుంది. ఈ అస్తిత్వవాద సాహిత్యాన్నే పోస్ట్‌మోడర్న్ సాహిత్యంగా కొంతమంది విమర్శకులు పేర్కొంటున్నారు. దీనిలోని స్థానికతను ప్రతి చిన్న అంశాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని, వాటికి ప్రధాన స్రవంతిలో తగిన సమ ప్రాధాన్యత ఇవ్వాలనే అంశంతో కూడిన అభిప్రాయం సమగ్రత, సమైక్యతలనుంచి ప్రాంతీయత, అనే అంశం వైపు తీసుకొని పోతోంది. ఇలా ప్రాంతీయవాదం తెలంగాణ కథలో ఏ చిత్రీకరించడం ప్రారంభమయింది.

ప్రాంతీయవాదం ప్రధానంగా అంతర్గతంగా వలసవాదం వలన వస్తుందని 'మైఖేల్ హెచ్చర్' పేర్కొంటారు. స్థానికంగా వేరే ప్రాంతం, వేరే భాష, వేరే మతం, వేరే సంస్కృతి ఇలా పరాయి శక్తుల ఆధిపత్యంవల్ల స్థానికుల్లో అసంతృప్తి పెల్లుబికి ప్రాంతీయ తత్వానికి దారితీస్తుంది.

ప్రాంతీయత అనేది ఆధిపత్యం, అణచివేత, వివక్షతలతో ముడిపడి ఉన్న భావన. ఇది అభివృద్ధి ఆకాంక్షతో సామాజిక మార్పుకు ప్రయత్నిస్తుంది. ఈ సామాజిక మార్పు రావడానికి

కావల్సిన అన్ని రంగాలను ఇది స్పృశిస్తుంది. అందుకే ప్రాంతీయ వాదానికి స్థిరమైన, శాశ్వత హద్దులుండవు, ఇది ఒక బహుముఖవ్యక్తీకరణ. ఒక ప్రాంతపు చారిత్రక వారసత్వం, సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలు, ఆ ప్రాంత ప్రజల వైఖరులు, దృక్పథాలు తీర్చిదిద్దుకుంటూ సాహిత్యంలో వ్యక్తీకరించబడతాయి. అయితే ఇది కేవలం సాహిత్య ప్రక్రియగానే సమాజంలోకి వెళితే దీనికి కావల్సిన గుర్తింపు, ప్రాచుర్యం లభించదు. అంతే కాకుండా ఈ సాహిత్యానికి ఉన్న ప్రధాన ఉద్దేశం, లక్ష్యాలు కూడా నెరవేరవు కాబట్టే రాజకీయ పార్టీల జోక్యం, వాటి నాయకత్వం అవసరమై పోరాటం సాహిత్యపరంగా, సామాజికంగా, రాజకీయంగా, కల్పిచేయాల్సిన అవసరం కూడా కలుగుతూ ఉంటుంది. అలాంటప్పుడే ప్రత్యేక రాష్ట్రాలను ఈ ప్రాంతీయ వాదం తీసుకురాగలుగుతుంది, సాధించుకో గలుగుతుంది.

ప్రాదేశికత ప్రదేశానికి మాత్రమే కాక, వస్తు, స్వరూప, స్వభావాదులకు సంబంధించినదిగా చూడాలి. ఎందుకంటే ఒక్కో ప్రాంతం ఒక్కో చారిత్రక నేపథ్యంలో, భిన్న భిన్న సంస్కృతుల, సాహిత్య ప్రభావాలతో వ్యక్తీకరించబడుతుంది. అంతేకాకుండా ఆయా ప్రాంతాల ఆర్థిక, రాజకీయ, సాహిత్య రంగాలలోని ఆధిపత్య ధోరణి, వివక్షలు వస్తు రూపాల అభివ్యక్తి మీద వ్యాఖ్యానాలుగా మారి వాటిని అంగీకరించకుండా తక్కువ స్థాయిలో ఉన్నాయని, ఎదగాలని చెప్పేటట్లుగా చేస్తుంటాయి.

ఒక సాహిత్య ప్రక్రియ, ప్రాంతీయ వాదాన్ని కల్గి ఉందో లేదో చెప్పటానికి ముందుగా ప్రాంతీయ వాద లక్షణాలను తెల్సుకొని అవి ఆ సాహిత్యంలో ఎంతవరకు ప్రతిబింబించాయో చూడాల్సిన అవసరం ఉంది.

## 4.7.1 ప్రాంతీయ వాద లక్షణాలు

1. రచనకు ఆ ప్రాంత స్వరూప స్వభావాలపై స్పష్టమైన అవగాహన కల్గిఉండాలి.
2. వస్తు, రూపాలలో ఏదైనా ఒకటి ఆ ప్రాంతానికి మాత్రమే చెందినదై ఉండాలి. సార్వత్రిక లక్షణాలు, అంశాలకు కాకుండా ప్రత్యేక అంశాలకు ప్రాధాన్యతయివ్వాలి.

3. మిగిలిన ప్రాంతాలలో కూడా ఆ వస్తు రూపాలు ఉన్నప్పటికీ, చెప్పుకుంటున్న ప్రాంతంలో ఆ సాహిత్య నేపథ్యానికి కావల్సిన వనరులు, పరిస్థితులు, మిగిలిన ప్రాంతంతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉండాలి. అంటే ప్రస్తుతం చెప్పబడుతున్న ప్రాంతానిదే అని చెప్పబడాలి. అంటే OWN (సొంతం) కావడం లాంటిది.

4. ఆ ప్రాంత మాండలిక భాష వాడబడాలి.

5. తనదైన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు చిత్రీకరించబడాలి.

6. ఇతర ప్రాంతాలతో ఆ ప్రాంతానికిగల అభివృద్ధి తారతమ్యాలను అంచనా వేయగల్గాలి.

7. ప్రకృతి వైపరీత్యాల వలన జరిగే నష్టాలను చిత్రించటం, వాటికి ప్రభుత్వం ఆ ప్రాంతాల్లో సరిగా స్పందించకపోవడాన్ని కూడా చిత్రించాలి. వాటి వలన వచ్చిన అభివృద్ధి ఫలితాలను వ్యాఖ్యానించాలి.

8. వలసలు, కరువు, నిరుద్యోగం మొదలైన సామాజిక సమస్యలను చిత్రీకరించాలి.

9. రాజకీయాలను ఏమైనా వ్యాఖ్యానిస్తున్నాయో? లేదో? ఒక వేళ వ్యాఖ్యానిస్తే ఎలా వ్యాఖ్యానిస్తున్నాయో చూడాలి.

10. వివక్ష అనేది ప్రాంతం పేరుతో ఏమైనా చెప్పబడిందేమో చూడాలి.

11. వనరుల దోపిడి (బొగ్గు గనులు, నదీజలాలు) చిత్రీకరించబడిందేమో చూడాలి.

12. వస్తువేకాదు ఒక్కోసారి అభివ్యక్తి కూడా ప్రాంత లక్షణంగా కన్పించవచ్చు. కాబట్టి అభివ్యక్తిని కూడా చూడాలి.

13. సాహిత్య ఉద్దేశ్యం, ప్రయోజనం, లక్ష్యం, ప్రాంతీయ చైతన్యాన్ని తీసుకొని రావాలనుకున్నదేమో చూడాలి.

వీటిలో మొదటి ఐదు లక్షణాలు ఆ రచన ఫలానా ప్రాంతం నుంచి వచ్చిందని మాత్రమే చెప్పగల్గుతాయి. తర్వాత చెప్పబడిన లక్షణాలు ఎంత బలంగా చిత్రీకరించబడితే ఆ రచన అంత బలమైన, గొప్ప ప్రాంతీయవాద రచనగా చెప్పవచ్చు.

ఇలా ప్రాదేశికత, భాష, ఆధిపత్య వర్గాలు - బలహీన వర్గాలు, సమైక్యత - ప్రాంతీయత, పరాయీకరణ-అణచివేత, ప్రాంతీయవాదం - ఉప ప్రాంతీయవాదం, అస్తిత్వవాదం, ఆత్మగౌరవం, రాష్ట్రాల పునర్విభజన - స్వయం ప్రతిపత్తి మొదలైన అనేక అంశాలను ప్రస్తావించాల్సిఉంటుంది. ఈ అంశాలను ఆర్థిక, రాజకీయ, పరిపాలన, భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, మానసిక, కోణాలనుంచి విశ్లేషించాల్సి ఉంది. అటువంటప్పుడే ప్రాంతీయవాదం మీద సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.

తెలంగాణ కథలో తెలంగాణ భాష పలుకుబడులు, ఉర్దూతో కూడిన మిశ్రవ్యవహారం, ప్రత్యేకమైన ముస్లిం సంస్కృతి, సాహిత్యం, ఇక్కడి శూద్రకులాల ప్రత్యేక సాంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలు ఎన్నో ప్రత్యేకంగా కన్పిస్తాయి. దీని భౌగోళిక పరిస్థితులు మరొక చెప్పుకోదగ్గ అంశం. అందుకే 'తెలంగాణ కథ' ప్రత్యేకమైంది, బ్రిటిషాంధ్ర కథకు - తెలంగాణ కథకు మధ్యనున్న వస్తు శిల్పాల భేదాన్ని చాటిచెప్తుంది.

## 4.8 నిబద్ధత - నిమగ్నత

తెలంగాణ కథ - ఉద్యమాలతో ముడిపడి ఉన్నది. అనుభవంలోంచి వచ్చినవి, నిబద్ధత కన్న నిమగ్నతకు పెద్ద పీట. పాశ్చాత్య సాహిత్యం కాక హిందీ, ఉర్దూ సాహిత్యాల ప్రభావం, శూద్ర కులాలకు చెందిన కథకులతోపాటు, బ్రాహ్మణ రచయితలు కూడా శూద్రకులాల భాషానుడికారాలను, పలుకుబళ్ళను సమర్థవంతంగా వాడటం కన్పిస్తుంది.

తెలంగాణ కథారచయితలు అన్ని సమస్యలను తమ కథలలో చిత్రిస్తున్నారు. విప్లవ కథ, గ్రామాలలోని దొరల భూములకు సంబంధించిన కథ, గ్రామీణ జీవన పరిణామ దశ, సింగరేణి కార్మికులు, అర్బనైజేషన్, యూనివర్సిటీ జీవితాలు, పాలకుల విధానాలు, రియల్ ఎస్టేట్ (పట్టణ భూముల బాగోతాలు), ప్రపంచీకరణ, దళిత కథ, దళిత స్త్రీ కథ, ముస్లిం

కథ, ముస్లింస్త్రీల కథ, రైతుల సంక్షోభాలు మొదలైన కథలతో తెలంగాణ కథ ప్రాంతీయ కథలకు ప్రత్యేకస్థానం ఏర్పడింది. అందుకే ఇలా మారిన తెలంగాణ కథలలో భిన్న ధోరణులు కన్పిస్తుంటాయి. ఆ ధోరణులతో పరిపుష్టాన్ని పొందుతున్నాయి.

తెలంగాణ కథ-ను వస్తుదృష్ట్యా చూసినప్పుడు, ఆ వస్తువును ప్రాంతీయ వాద దృష్టికోణంలోంచి చూడాల్సివుంటుంది. అలా చూస్తున్నప్పుడు *'తెలంగాణ కథ 2006'* లో నాలుగు రకాలుగా వస్తువును వింగడించుకోవచ్చు.

1. ఏ మాత్రం ప్రాంతీయతను కల్గిఉండకుండా, ఆ వస్తువు సార్వత్రికంగా అన్ని ప్రాంతాలకు చెందేటట్లుగా ఉన్న కథలు. అవి 1. వ్యాధి-కుళ్ళిన సామాజిక వ్యవస్థను తెల్పేది. 2. బొగ్గులు - అవినీతి, లంచగొండి తనాలవల్ల వచ్చే కష్టనష్టాలను తెల్పేది. 3. ఫైలుశ్వాస - కోర్టు పెండింగ్ కేసులు, ప్లే సేఫ్ ను తెల్పేది. 4. మా ఊరికి చారెడు నేల కావాలి - అస్పృశ్యత, అంటరానితనం గూర్చి తెల్పేది. 5. డప్పు - కుటుంబ సంబంధాలు, సాధుజంతువుల మీద ప్రేమను గురించి తెల్పేది.
2. ఇక్కడ వస్తువు అన్ని ప్రాంతాలకు చెంది ఉన్నప్పటికీ, తెలంగాణకు ఎక్కువగా సంబంధం కల్గి ఉంది. కాబట్టి ఒక రకంగా తెలంగాణా కథలు అనవచ్చు. 1. తోఫా - ముస్లీం మతం పేరిట, సంప్రదాయం పేరిట జరుగుతున్న స్త్రీల అణచివేతను, అమానవీయ విలువలను గూర్చి తెల్పేది. 2. సొంత ఇల్లు - హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకోవటానికి పడే బాధలు, అవసరం లేకున్నా, అప్పులిస్తామనే బ్యాంకులు, వాటి రూల్స్ ... వసూళ్ళు. 3. మాయి ముంత - ఓ మాతృమూర్తి గాంగి బార్రెకు ప్రసవం చేయటం, ఆ ప్రసవ వేదనను ఒక స్త్రీగా అర్థం చేసుకోవడం కన్పిస్తుంది. 4. మాన్యం - ఇది మాదిగ ఉపకులాల్లోని 'డక్కలి' కులానికి చెందిన ఒక ఆచారాన్ని దాని ద్వారా వచ్చే సమస్యలను చిత్రిస్తుంది.

3. వస్తువు తెలంగాణ ప్రాంతానికే పరిమితమైంది. కాకుంటే దీనిలో తెలంగాణ వాదం చిత్రీకరించబడలేదు. 1. 'ది ఎండ్' నిజాం జమానాలోని షాయిరీ, షికారీలను గుర్తు తెచ్చుకోవటం, ఆ ఆనందాలనే నెమరు వేసుకోవడాన్ని చెప్తుంది.

4. వస్తువు తెలంగాణా ప్రాంతానికి సంబంధించినదే కాకుండా తెలంగాణా వాదాన్ని కూడా బలంగా చాటిచెప్పేవి. 1. పాలమూరు నుంచి కాశ్మీరు దాకా - దీనిలో లక్ష్మయ్య, గౌరమ్మ, నీనానాయక్, చాందినిలు భార్యాభర్తలు, లక్ష్మయ్య - గౌరమ్మల, సంతానం గోదావరి. లక్ష్మయ్య పిన్ని యాదమ్మ వీళ్ళు ఆరుగురు కూలీకోసం భోపాల్‌కు వెళ్ళాలని ఒక ఆంధ్ర నుంచి వచ్చిన మేస్త్రీ మాయ మాటలలోపడి కాశ్మీర్ చేరుకుంటారు. అక్కడి నుంచి తప్పించుకోవటానికి వీళ్ళు పారిపోయి ఏదో రైలు ఎక్కుతారు. ఆ తర్వాత రైల్లో టిక్కెట్లు లేనందుకు ఆడవాళ్ళమీద ఉన్న సొమ్ముల్ని టి.సి.కి ఇచ్చి ఎలాంటి ఆధారం లేకుండా కొంత దూరం ప్రయాణిస్తారు. ఆతర్వాత వేరొక రైల్వేస్టేషన్‌లో బానోతు లచ్మణ్ అనే వ్యక్తికూడా కలుస్తాడు. వీరందరికి తిండిలేక చివరికి చిన్నపిల్ల గోదావరిని అమ్మివేయాలి అని అనుకుంటుంటారు. యాదమ్మ, గౌరమ్మను పట్టుకొని "పో లంజా ఏవాళ్తానన్న పంపి పైసలు తీసుకరావే" అని తిడ్తూ బాధపడ్తుంగా రిజర్వేషన్ల మీద పనిచేసిన ఒక లంబాడాయనా వీళ్ళకు తిండి, పైసలు ఇచ్చి వాళ్ళను విజయవాడ దాకా పంపిస్తాడు. వాళ్ళు విజయవాడలో దిగి అంతకు ముందు తెలిసిన ఒక ఆంధ్ర మేస్త్రీ దగ్గరికి పోయి విజయవాడలో పని కుదిరించుకుంటారు. అపుడే "దసరా", 'బతుకమ్మ పండుగలు రావటం 'బతుకమ్మ' పాటల్లో వీళ్ళ బాధలను కృష్ణమ్మకు చెప్పుకోవటం, కృష్ణమ్మను సొంత తల్లిగా లక్ష్మమ్మ భావించి తన బాల్యంలో జరిగిన ఒక అన్యాయాన్ని తలపోసుకోవడం కన్పిస్తుంది. ఇక్కడ కృష్ణానదికీ కన్నతల్లికి చేసిన పోలిక తెలుగు సాహిత్యంలోనే ఒక గొప్ప పోలిక. 2. జీవచ్ఛవాలు - రమేష్ - రేణుక భార్యభర్తలు. నల్లగొండలో ఉన్న ఫ్లోరోసిస్ కారణంగా వీరి దాంపత్యంలో చిన్న కల్లోలం ఏర్పడింది. అది చివరకు విడిపోయేదాకా

దారితీస్తుంది. కాని చివరకి విడిపోకుండానే కల్సుకుంటారు. ఈ పంచాయితీ కారణంగా రచయిత పాత్రల ద్వారా అక్కడక్కడ - ఫ్లోరోసిస్ బారిన పడటంవల్ల పుట్టబోయే పిల్లలకు కాళ్ళు చేతులు సరిగా లేకపోవడం, ముఖం పెద్దగా ఉండటం, 2-3 నెలలకే అబార్షన్ కావడం వంటి సమస్యలను వర్ణిస్తాడు. రేణుక రమేష్‌ను తన పుట్టింటికే రమ్మని అట్లయితేనే సంసారం చేస్తానని పంచాయితీ పెడ్తుంది. చివరకు రమేష్ విషయాన్ని అర్థంచేసుకుని వాళ్ళ ఊరికే పోవడానికి నిర్ణయించుకోవడంతో పంచాయితీ ముగుస్తుంది. అయినా రచయిత ఈ సమస్యకు కారణమైన ఫ్లోరోసిస్‌ను, నీటి బాధలను వాటి వల్ల వచ్చే వ్యాధులను, లక్షణాలను సూక్ష్మంగా వ్యాఖ్యాన రూపంలో తెలియజేస్తారు. అంతేకాకుండా రాజకీయ పార్టీల ప్రస్తావన కూడా ఉంది.

## 4.9 భాషాదృష్టి

భాష దృష్ట్యా తెలంగాణ కథలను చూస్తున్నప్పుడు మనకు 5 రకాల కథలు కన్పిస్తాయి.

1. కథన భాష, పాత్రోచిత భాషలు రెండూ ప్రామాణిక భాషలో ఉన్నాయి. 1. వ్యాధి - పైలు శ్వాస.

2. కథనం ప్రామాణిక భాషలో ఉండి, పాత్రోచిత భాషకూడ ప్రామాణికంలో ఉండి అప్పుడప్పుడు కావాలని తెలంగాణ మాండలికాన్ని వాడటం, 1. తోఫా, కిక్కిరిసిండు, తెచ్చావు, మొదలెట్టారా. సైన్మ పోగ్రాం వేసుకొని వచ్చిన.

3. కథనం ప్రామాణిక భాషలో ఉండి, పాత్రోచిత భాషలో తెలంగాణా, ఆంధ్ర భాషలు రెండూ ఉండటం. అయితే ఈ పాత్రోచిత భాషలో తక్కువ చదువు, చదువుకు దూరంగా ఉండే వారికి తెలంగాణ భాషను ఇవ్వడం. ఉద్యోగస్థులకు, ఉన్నత స్థాయిలోని వారికి ప్రామాణిక భాషనివ్వడం కన్పిస్తుంది. అయినా 'సొంతఇల్లు'లో అక్కడక్కడ తెలంగాణ పదాలు కన్పిస్తుంటాయి. 1. సొంత ఇల్లు, 2. ది ఎండ్.

4. కథనం ప్రామాణిక భాషలో ఉండి, పాత్రోచిత భాష తెలంగాణాలో ఉండటం. ఇక్కడ అన్ని పాత్రలు తెలంగాణాలోనే మాట్లాడతాయి. 1. డప్పు.

5. కథనం, పాత్రోచిత భాషలు రెండూ తెలంగాణ భాషలోనే ఉండటం. 1. బొగ్గులు, 2. మాయి ముంత. 3. పాలమూరు నుంచి కాశ్మీరు దాకా 4. మా ఊరికి చారెడు నేల కావాలి. 5. మన్యెం 6. జీవచ్ఛవాలు.

అయితే భాష విషయంలో మనకు ప్రాంతీయ వాద కథలకు సంబంధించి భిన్న స్వరాలు విన్పిస్తున్నాయి. అవి కొందరు కథనం ప్రామాణిక భాషలోనే ఉండాలనే వారు. మాండలిక భాషలోనే అంటే ఆ ప్రాంత భాషలోనే ఉండాలనే వారు కొందరు వాదిస్తుండటం వలన భాష విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేక పోవడం వలన జరిగిన పొరబాటుగా చెప్పవచ్చు. అయితే దీని మీద ఒక శాస్త్రీయమైన చర్చ జరగాల్సి ఉంది. అయితే ఈ చర్చ కథనంలో కూడా మాండలిక భాషను వాడేటట్లు చేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్రాంతీయ వాద చిత్రీకరణ జరిగిందని చెప్పే అవకాశం ఉంటుంది.

కథనం ప్రామాణిక భాషలో పాత్రలు మాండలికంలో ఉండాలనడం అనే అంశాన్ని చారిత్రకంగా పరిశీలించి నేటి ప్రస్తుత పరిస్థితులలో దాని ప్రభావం ఏవిధమైన సమస్యను సృష్టిస్తుందో విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

(1) ఈ విధంగా కథనం, ఉన్నత పాత్రలు ప్రామాణిక భాషలో ఉండాలి, నిమ్న పాత్రలు ఆయా మాండలికాలలో ఉండాలనడం నాట్యశాస్త్రంలోని సాంప్రదాయక దృష్టితో వివక్ష చూపడమే (2) గ్రాంథిక, వ్యావహారిక భాషోద్యమాలు జరిగినప్పుడు వ్యావహారిక భాషలో వచ్చిన సాహిత్యంలో కథనం, పాత్రోచిత భాషలు రెండూ వ్యావహారిక భాషలోనే ఉన్నాయి కదా? కథనం గ్రాంథికంలోనే, సరళ గ్రాంథికంలోనో ఎందుకు లేదు. (3) భాష ఒక్కో సందర్భంలో ఒక్కో రకమైన రూపాన్ని వాక్య నిర్మాణాన్ని, పదజాలాన్ని తెచ్చుకుంటుంది. అందుకే లిఖిత భాష - మాట్లాడే భాషలకు, వర్ణనాత్మక భాష - సంభాషణాత్మక భాషలకు గల భేదాల్ని గుర్తించగల్గుతున్నాం. అలాగే స్వతహాగానే కథనంలో వాడే భాషకు, పాత్రోచిత భాషకు మధ్యగల తేడాలను గుర్తించవచ్చు. కాబట్టి కథనాన్ని కావాలని ప్రామాణిక భాషలో రాయాల్సిన అవసరం లేదు. (4) ఒకే కథని రెండు రకాల భాషలలో - మాండలికం పాత్రోచిత

భాషలో ఉన్నప్పుడు అర్థమవుతుందని, అదే మాండలిక భాష కథనంలో ఉన్నప్పుడు అర్థం చేసుకోలేక పోతున్నాం అని అనడం చాలా విచారించాల్సిన, ఆలోచించాల్సిన అంశం. ఒక రకంగా చెప్పాలంటే పాత్రోచిత భాషలో వాడే మాండలికమే చదువుతున్నవారికి కొంచెం దూరంగా ఉంటుంది. కాని, కథనంలో వాడే మాండలిక భాష అంత దూరంగా, అర్థం కాకుండా ఉండదు. దీనికి కారణం కథనంలో ఉండే వర్ణనాత్మకత, విశ్లేషణాత్మకత లాంటి అంశాలు. కాబట్టి పాఠకుడు పాత్రోచిత భాషలో వాడే మాండలికం కంటే కథనంలో వాడే మాండలిక భాషనే సులభంగా అర్థం చేసుకోగలుగుతాడు. (5) పాత్రల అచ్చమైన మాండలికాన్ని వాడి తర్వాత వెంటనే కథనంలో తనను తాను విశ్లేషించుకోవడంలోనో, రచయిత విశ్లేషించడంలోనో ఒక్కసారిగా ప్రామాణికం రావడం పాఠకుణ్ణి చాలా ఇబ్బంది పెట్టి, గందరగోళంలో పడేసి, అర్థం కాకుండా చేసి ఓ రకమైన చిక్కును కల్గించవచ్చు.

ఇలా ఎన్నో అంశాలు కథనాల్ని కూడా మిళితం చేసి తీరుతాయి. దోహదం చేస్తున్న రాయలేకపోవడం భావదాస్యంతో కూడిన భాషాదాస్యం అని చెప్పుకోవచ్చు. దీని నుంచి బయటపడినప్పుడే ఆ కథలలో ప్రాంతీయవాదం బలంగా చిత్రీకరించబడుతుంది.

ఇలా సాహిత్యం మాండలికంలోనే రావడం వలన భాషలో ఎన్నో కొత్త పదాలు, అభివ్యక్తులు, సామెతలు మొదలైన భాషాంశాలు లిఖిత సమాజానికి తెలుస్తాయి.

ఈ తెలంగాణ కథ 2006లో గుర్తించదగిన భాషాంశాలు - తెలంగాణ కథకు ఇతర ప్రాంతాల ఆంధ్ర సాహిత్యానికి భాషా విషయకంగా చాలా మార్పులున్నాయి. అవి రచయితల అవగాహనవల్లా, అవగాహనలోపం వల్లా ఏర్పడ్డాయి. ఉదా-

### 4.9.1 సామెతలు

(1) ఇంత చేస్తే గొర్రె తోక బతుకేనా (23)

(2) తల్లికంటె బిడ్డె దొర్సానట. బిడ్డకంటె తల్లి బాంచెదట (39)

(3) బోరెమోలె మొగుడు కోరగ బొంత శింపులకు ఏడ్చినట్టు (44)

(4) అవ్వేడ్వంగ బిడ్డేడ్చినట్టు (68)....

### 4.9.2 తెలంగాణ మాండలిక పదాలు -

సంది (71), సత్తెనాస్ (72), సావిండ్లే (72), మిడిమాలపు (78), మిడసరపు (78), మొస (81), గాయి పెట్టాల్నా (86), బైలెల్లింద్రు (88), యిస్సు (89).

### 4.9.3 బూతులు, తిట్లు, మోటు పదాలు -

ఇవి కావాలని వాడిన పదాలు కావు. ఆవేశాలకు లోనై వచ్చినవి కాదు. దుర్భర జీవితంలో తట్టుకోలేని ఆకలి, బాధ, కోపంలోంచి వచ్చినవి.

ఎద్దు ముడ్డి పొడ్సుకుంట (76), లంమిడి కొడుకులు (78), దీనింట్ల పీనిగెల్ల (92), నాలిముచ్చోడ, నల్లి కుట్లోడ (93), మిట్ట నొసల్దాన (94), థూ దొంగ కొడుకు (22), పాసువలగలేని (43), దెంకపోండి (51), లంజెదాన నీళ్ళకు గతిలేదు (53), లంజెకడలు (53).

కొన్ని బూతులు, తిట్లు వాళ్ళ జీవిత దౌర్భాగ్యాన్ని సూచిస్తాయి. 'ఆకలే... ఆకలైతాందీ... పోలంజె, పోయి ఎవల్తానన్న పండి పైసలు దీస్కరా.. లేకపోతే... ఇగో గే గోదావరిని అమ్మి పైసలు దీస్కరావె లంజెదాన (55).

### 4.9.4 ప్రామాణికం

కొన్నిచోట్ల మాండలికంలోనే పూర్తిగా రాసినా అక్కడక్కడ ప్రామాణిక ఆంధ్ర భాష రావడం కన్పిస్తుంది. దీనికి కారణం ఇంకా తెలంగాణ రచయితలు ప్రామాణిక భాష నుంచి బయటపడలేక పోవడమే. ఇది అభ్యాసం మీద, మళ్ళీ ఒకసారి తను రాసిన దాన్ని సరిచూసుకోవడం ద్వారా నియంత్రించవచ్చు.

పేడ (72), వెంటి (73), భలేగ చెప్పింద్రా (75), కళ్ళాపి (76), పెండ్లి చేశారు (79), వెతికింది (108), బయమేస్తుంది (116).....

### 4.9.5 పొరపాట్లు

కొన్నిసార్లు తెలంగాణ వ్యవహారంలో లేకపోయినా ఉంటుందో ఏమోనన్న భ్రమలో లేని రూపాన్ని తీసుకొచ్చే ఆభాస ప్రామాణిక రూపాలు కూడా కన్పిస్తుంటాయి. ఇది రచయిత ప్రామాణిక ఆంధ్ర భాషనుంచి తెలంగాణ భాషను చూసినప్పుడు జరిగే పొరబాటు దీని ద్వారా తెలంగాణ రచయితలు తమ సొంత భాషను వేరే వాళ్ళ భాషా లక్షణాలలోంచి చూస్తున్న పరిస్థితిని గమనించవచ్చు.

గెట్లామరి (81) - 'ఎట్లామరి' అని ఉండాలి 'గ' ఆగమంగా 'ఆ, ఈ'ల మీదనే చేరుతుంది కాని 'ఎ' మీద చేరదు.

### 4.9.6 భావార్థకం

రావుడే గదా (102) - 'రావడమే గదా/వచ్చుడేగదా' అని ఉండాలి. ఈ రెండింటిలో మొదటిది ప్రామాణిక రూపం రెండోది తెలంగాణ రూపం. క్రియను నామవాచకంగా మార్చే ప్రక్రియ తెలంగాణలో ఓ రకంగా ఆంధ్రలో ఓ రకంగా ఉంటుంది. భావార్థక క్రియలు తెలంగాణకు, ఆంధ్రకు వేర్వేరు లక్షణాలతో, రూపాలతో ఉంటాయి.

### 4.9.7 ఉచ్చారణలో మార్పు

కొన్ని సార్లు ప్రామాణిక భాషా వ్యవహర్తలు వాడిన వారి మాండలికపు లేఖన/లిఖిత రూపాలలోనే, యథా రూపంగానే తెలంగాణ మాండలిక రూపాలుగా తీసుకోవటం జరిగింది. దీనికి కారణం వారి ఉచ్చారణకు, తెలంగాణ ఉచ్చారణకు గల భేదాన్ని గుర్తించకపోవడమే. ఇది ధ్వని, వర్ణస్థాయిలలో గుర్తించవల్సిన అవసరం.

సైయి బట్టుకొని (88), నడిస్తే (88), సెప్పిండు, సెత్త (90), సానా (51), సిద్దర్లు (50), వసవడక (50)... ఈ పదాలన్నింటిలోనూ 'స' కారమున్న చోట 'శ' కారం ఉండాలి. పై సందర్భంలో ఆంధ్రలో 'స'కారంగా ఉచ్చరిస్తే, తెలంగాణలో 'శ'కారంగా ఉచ్చరిస్తారు. అంతేగాకుండా కొన్ని పదాలు అసలు ఆంధ్రలో వాడుకపోయినా వాటిలో ఆంధ్రవాళ్ళ ఉచ్చారణ రూపమైనా 'స'కారాన్ని గుర్తించవచ్చు.

## 4.10 శిల్పవైవిధ్యం

శిల్ప దృష్ట్యా తెలంగాణ కథ - 2006ను పరిశీలించినప్పుడు మనకు 5 రకాల శిల్పాలు కన్పిస్తాయి.

**4.10.1** మొదటిది, సుదీర్ఘ కాలానికి సంబంధించినది. కాబట్టి కథలో ఆయా కాలాలను సరిగ్గా చిత్రించలేకపోవడం వలన కథలోని అంతర్గత అవయవాలకు సరైన సమన్వయం లేకుండా పోయింది. ముగింపులో కూడా చెప్పుకోవాల్సిన అంశాలు అంతగా ఏమీలేవు. ఉదా - తోఫా, డప్పు.

**4.10.2** రెండోది, వ్యాఖ్యాన రూపంలో ఉండి జ్ఞాపకాలను, అనుభవాలను తెలుపుకుంటూ అప్పుడప్పుడు పాత్రలతో మాట్లాడిస్తూ ఉంటుంది. అంతర్గత అవయవాల మధ్య తగిన సమన్వయాన్ని గుర్తించవచ్చు. ముగింపుకూడా బాగానే ఉంటుంది. ఉదా- ఫైలు శ్వాస, ది ఎండ్, ఫైలు శ్వాసలో చివరకు ఫైలుకు ప్రాణత్వాన్ని కల్పించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**4.10.3** మూడోది, తీసుకొన్న వస్తువు, సందర్భాల చిత్రీకరణ, సన్నివేశకల్పనలు అన్నీ బాగానే ఉంటాయి. కాని ముగింపులో పాఠకుడు కోరుకున్న విశ్లేషణ కరువయినట్లు కన్పిస్తుంది. అది ఉండకూడదు అనుకుంటే కనీసం దాని సూచన కూడా కనబడదు. 'ముగింపు' పాఠకుణ్ణి ఆలోచింపజేసేదిగానూ లేదు, అతనికి 'ముగింపు'ను పొందిన తృప్తికూడా కల్గే అవకాశం కూడా తక్కువ అని చెప్పవచ్చు. ఉదా మా ఊరికి చారెడు నేల కావాలి.

**4.10.4** నాల్గోది, తీసుకొన్న వస్తువులకు కావల్సిన సన్నివేశ కల్పనలు, సందర్భాల చిత్రీకరణలు - అన్నీ బాగానే ఉంటాయి. ముగింపుకూడా కథకుతగినట్లుగానే ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే బ్రిటిషాంధ్ర కథలకు పోటిని ఇవ్వగల శిల్పాన్ని కల్గిఉన్నాయి అని చెప్పవచ్చు. ఉదా- బొగ్గులు, మాయిముంత, మాన్యెం, సొంతయిల్లు శిల్పపరంగా రెండోసారి చెప్పబడిన కథలు కూడా బ్రిటిషాంధ్ర కథలకు దీటుగా నిలబడగలవు.

**4.10.5** అయిదోది, తీసుకొన్న వస్తువు 'సమస్య'లను చిత్రీకరించేది కాబట్టి ఆ సమస్య ఒకటో, రెండో సన్నివేశాలతో పూర్తిగా చిత్రీకరించబడకపోవడంతో పాఠకునికి కథ

అయిపోయింది అనే అనుభూతి కల్గిన తర్వాత కూడా కొనసాగుతూనే ఉంటుంది. అంతర్గత అవయవాల మధ్య సమన్వయం మొదటి నుంచి చివరి వరకు బాగానే ఉంటుంది. కాని ముగింపులో కాస్త ఇబ్బందిగా ఉంటుంది. ఉదా - *పాలమూరు నుంచి కాశ్మీరు దాకా, జీవచ్ఛవాలు.* అయితే ఈ సంకలనంలో తెలంగాణ ప్రాంతీయ వాదాన్ని ఎంతో బలంగా చూపెట్టిన కథలు ఈ రెండే. కాబట్టి మనం ఈ రెండు కథల విషయంలో కొత్త సూత్రాలతో శిల్పాన్ని అంచనా వేయాలి. వీటికి కావల్సిన కొలతలను బ్రిటీషాంధ్ర నుంచి తేకూడదు. స్వతంత్రంగా, వేటితో సంబంధం లేకుండా తయారు చేసుకోవాల్సి ఉంటుంది.

తెలంగాణ కథ 'భావోద్వేగా'లను చిత్రీకరించడంతో 'ముగింపు'ను పొందకుండా అంటే కథ ఓ కంటిన్యూస్ రీడింగ్ ను ఇవ్వకుండా, సమస్యలను చిత్రీకరించేటప్పుడు వాటి చుట్టూ ఉన్న ఇతరత్రా అంశాలను ఆలోచించేవిధంగా చిత్రీకరిస్తున్నారు. ముగింపు ఆలోచనాత్మకంగా ఉండాలి అనే ఉద్దేశం ఇలా చేస్తుంది. అయితే సమస్యలోని భిన్న అంశాల విస్తృతి కథ పరిమితుల కంటే ఎక్కువగా ఉండటం వలన ఇలా జరుగుతుంది.

ఒక సన్నివేశాన్నో, సంఘటననో, సందర్భాన్నో ఎంచుకోకుండా తెలంగాణ కథకు తను జీవితంలో భయంకరంగా అనుభవిస్తున్న ఓ సమస్యను ఎంచుకుంటున్నాడు. ఆ సమస్యలో నుంచి తను పడే బాధలు ఒకే సన్నివేశంలో చెప్పడానికి వీలుపడకపోవడం వలన కథకుడు కథను రచించే ఓ భావావేశంలో ఉండటం వలన అతడు ఆ కథను ఇంకా కొనసాగించాల్సి వస్తుంది. ఇలా రాయడం ఓ బలవంతమైన ప్రక్రియ కథకుడు నిస్సహాయ స్థితిలో తాను ఎంచుకున్న సమస్య తీవ్రతలో నుంచి బయటపడలేక దానిని చిత్రీకరించాలి అని చేసే ప్రయత్నమే మిగిలిన బ్రిటిషాంధ్ర కథకు శిల్ప దృష్ట్యా తేడాను తీసుకొస్తుంది.

అందుకే నిజమైన తెలంగాణ కథ, బ్రిటిషాంధ్ర కథకు శిల్పంలో భేదిస్తుంది. ఇదే దీని ప్రత్యేకత. అయితే ఈ శిల్పం ఎదుటివారు అంటే పాఠకులు సమస్యలకు స్పందించగలిగే సహృదయత ఉంటేనే అంగీకరించబడుతుంది.

ఇలా తెలంగాణ కథ వస్తువు, భాష, శిల్ప పరంగానే కాకుండా ఇంకా కొన్ని అంశాలతో ప్రాంతీయవాదాన్ని చిత్రీకరిస్తుంది.

# 5. తెలంగాణ కథాశిల్పం

## 5.0 పరిచయం

భారతదేశంలో కథ ఈ నాటిది కాదు. పగలంతా పనిచేసి అలసి సొలసిన మానవుడు తనచుట్టూ ఉన్న జంతుజాలాన్ని పాత్రలుగా మార్చుకొని పేదరాసి పెద్దమ్మ కథలు మొదలెట్టినప్పుడే భారత సాహితి కథా సారాన్ని చవిచూసింది. తెలుగు సాహిత్యం ఇందుకు విరుద్ధమేమికాదు. జానపద గేయంలోనే కథకు ప్రాముఖ్యం ఉందని హాలుని గాథాసప్తశతి సాక్ష్యం ఇస్తుంది. తిక్కన తన శిష్యుల చేత సృష్టింపించిన కథాకావ్యాలు తెలుగువారి కథాశక్తికి ప్రతీకలనవచ్చు. కానీ తెలుగులో ఇతర భారతీయ భాషల్లో లాగే వచన రచన కథలు లేదా ప్రస్తుతం మనకు అందుబాటులోఉన్న కథా సాహిత్యం, పాశ్చాత్య ప్రభావంతోనే ప్రారంభమైంది.

## 5.1 లక్షణాలు

కథ రచయిత ఊహల్లోంచి, ఉద్దేశంలో నుండి పుడుతుంది. కథాలక్షణాలలో అత్యంత ప్రధానమైంది క్లుప్తత. ఏ ఒక్క వాక్యం గూడా అనవసరం అనిపించకపోవడమే కథ వైశిష్ట్యం. రచయిత ఉద్దేశ్యం ఊహ కొన్ని సంఘటనలుగా రూపు దిద్దుకొంటుంది ఆ సంఘటనల మధ్య ఉండే అనుబంధాన్ని తీర్చిదిద్దటంలోనే కథా వస్తువు శిల్పంగా పరిణమిస్తుంది. ఏ రెండు సంఘటనల మధ్యనైనా ఉండే ఉద్దేశ్యాన్ని కళగా తీర్చి దిద్దటం కథా శిల్పం అవుతుంది. అంటే సంఘటనాత్మక భావ నిరూపణ శిల్పం. సంఘటనల సంబంధాన్ని వివరించేదే సంవిధానం. కథా సంవిధానం అర్థస్ఫూర్తిని కలుగచేస్తుంది. సంవిధానం దెబ్బ తింటే కథకు శరీరం లేనట్టే! పాత్రలు కాని, సంఘటనలు కాని రచయిత ఉద్దేశ్యంలో నించే రూపుదిద్దుకొనేవే అయినా వాటిలో అర్థ స్పష్టత కొరవడితే శిల్పం దెబ్బతింటుంది. పాత్రల అనుభవాలే కథకు ఊపిరిపోస్తాయి.

అనుభూతి ఏకోన్ముఖం అయినా కావచ్చు సంఘర్షణాత్మకమైనా కావచ్చు. ఏదైనా వివిధ పాత్రల విభిన్న సందర్భాల అనుభూతిలో మాత్రం ఐక్యత గోచరించాలి. ఆ అనుభూతి పాఠకుడి

మనస్సు తలుపు తట్టి రచనలలోని పాత్రలో సహృదయుడు మమేకం చెందేలా రూపొందించబడాలి. పాత్రల మానసిక వైవిధ్యం, సంఘటనల విభిన్నత సంఘర్షణకు దారితీస్తుంది. సంఘర్షణ సృష్టించటంలోనే కథారచయిత చేయి తిరిగిన వాడోకాదో తెలుస్తుంది. మానవ జీవితం ఎంతో వైవిధ్య భరితమైంది. సంఘర్షణాత్మకమైంది. ఏ ఇద్దరి మానసిక స్థితి మాత్రమే కాదు. ఒకే వ్యక్తి మనస్సు కూడా అన్నిటిపట్ల ఒకేలా స్పందించదు. అంతేకాదు ఒకే విషయం పట్ల కూడా మనస్సు ద్వైధీ భావాన్ని ప్రదర్శిస్తుంది. ఈ మానసిక సంఘర్షణ కథ శిల్పానికి వన్నె చేకూరుస్తుంది. ప్రపంచ సాహిత్యంలో ఇటువంటి రచనలే ఎక్కువ ఉత్తమ రచనల స్థానాన్ని పొందటం గమనించవచ్చు. ఈ లక్షణాలన్ని పొందు పరచినట్లుగా ఉండే రచనలు ఉత్తమ నిర్మాణ సౌష్టవం కలిగి ఉన్నట్లు చెప్పవచ్చు. కథా నిర్మాణం పాత్రల చిత్రీకరణలోను, మానసిక వైవిధ్యాన్ని ప్రదర్శించడంలోను, సంఘటనల విభిన్నతలోను, సంఘటనల సంఘర్షణలోనూ ఇమిడి ఉంటుంది.

కథా సాహిత్యంలో వివిధ రచనా రీతులు కనిపిస్తాయి. కథకు వస్తువు శిల్పం రెండూ ప్రధానమైనవే. తెలంగాణ కథల్లో కనిపించే లక్షణాలను వస్తు శిల్ప వైవిధ్యాన్ని చూడటమే ఈ అధ్యాయం ముఖ్య ఉద్దేశ్యం.

## 5.2 లక్షణ సమన్వయం

### 5.2.1 క్లుప్తత

కథానిక క్లుప్తత మీద ఆధారపడి ఉంటుంది. సురవరం ప్రతాపరెడ్డి రాసిన *'గ్యారా కద్దు బారాకోత్వాల్'* కథ క్లుప్తతకు చక్కని ఉదాహరణ. అమాయకుడైన కాపువాడొకడు పదుగురి స్వార్థం వల్ల తన ప్రమేయం లేకుండా కష్టం చేయకుండా లక్షాధికారి అయిన కథే ఇది. సొరకాయల్ని అమ్ముకోవడానికి బయలుదేరినవాడు నీటి సుంకాధికారిగా మారడం ఆ విషయం తెలిసిన నవాబు వివరాలు తెలుసుకొని అతని తెలివిని మెచ్చుకొని దేవిడిలో గంటలు కొట్టే ఉద్యోగం ఇస్తాడు. గంటలు కొట్టడంలోని రహస్యాన్ని తెలుసుకున్న కాపువాడు అక్కడ గొప్ప సంపాదకుడైనాడు.

ఈ కథలో కాపువాడు ఎంతో అమాయకంగా కనిపించిన బ్రతుకనేర్చినవాడని అర్థం అవుతుంది. తాను అమ్ముకోవడానికి తెచ్చుకున్న కాయల విషయంలోనే ఏమరి రాబడి పోగొట్టుకున్న కాపువాడు సుంకాధికారిగా లక్షాధికారిగా పరివర్తన చెందటంలోని విశేషాన్ని చాలా క్లుప్తంగా చాలా సూటిగా చెప్తాడు రచయిత. పరిపాలనలోని ఒక చిన్న లోపాన్ని తనకు సానుకూలంగా మార్చుకొని లక్షాధికారిగా మారగలిగే నైపుణ్యాన్ని చేకూర్చుకున్న ఒక అమాయకుడి తెలివికి నిదర్శనం ఈ కథ. తొలితరం రచనల్లో భాగమైన *గ్యారా కద్దు బారాకోత్వాల్.* క్లుప్తత విషయంలో చక్కటి నిదర్శనంగా నిలుస్తుంది.

### 5.2.2 సంఘటన సంవిధానం

సంఘటనలు కథానికకు అంగాలు, అటువంటి సంఘటనలు కూర్చటంలో రచయిత నైపుణ్యం ఉట్టి పడుతుంది. భాస్కర భట్ల కృష్ణారావు రచన *ఇజ్జత్* నమ్మకం, అపనమ్మకాల మధ్య విలువైన మానవ జీవితం బలి అవ్వటాన్ని చిత్రించిన కథ.

రంగారావు తన కూతురి పెళ్ళికోసం పొలం అమ్ముతానని అంటాడు. కరణం రామ చంద్రయ్యతో మంతనాలు జరుపుతాడు. రంగారావు పొలం కౌలు చేసే మల్లయ్య, ఆ పొలాన్ని అమ్మడం అయిష్టతని చూపిస్తాడు. కౌలు బాకీ చెల్లించకపోతే భూమిని వదిలేయమని నిర్భయంగా నిలదీసినపుడు వంగుమని వీపుమీద బండపెట్టినప్పుడు శారీరక బాధకన్న పోయిన పరువును తల్చుకొని ప్రాణం తీసుకున్నాడు మల్లయ్య. ఆ కేసు మాఫీచేయించుకోవడానికి రంగారావు, రామచంద్రయ్యలు చాలా కష్టపడ్డారు. ఇంత జరిగినా పొలం అమ్మకం జరుగలేదు. రంగారావు కూతురు పెళ్ళి జరుగలేదు.

వానాధార భూములు ఎదురుచూసినంత సేద్య ఫలాన్ని ఇవ్వవని తెలిసిన భూమి స్వంతదారు కౌలు బకాయి కోసం నిర్దయగా ప్రవర్తించడం, కరణం ఇచ్చిన దండన, ప్రాణంకన్న మానం గొప్పదని ప్రాణమిచ్చిన కౌలుదారుడు. ఈ కథలో కనిపించే మూడు విభిన్న సంఘటనల సంవిధానమే ఈ కథను ఉత్తమ కథగా తీర్చిదిద్దింది. కూతురు పెళ్ళికోసం డబ్బు ముందు మానవత్వాన్ని మరుగున పెట్టిన రంగారావు రామచంద్రయ్య విధి నిర్వహణలె

ప్రధానస్థానాన్ని పొందిన సంఘటన - మానం కోసం ప్రాణాన్ని ఇచ్చెయ్యాలి అని నిశ్చయించుకొన్నా తన మానసిక సంఘర్షణను బయట పడనీయకుండా ఉత్సాహంగా భార్యను లాలించి పాలించిన మల్లయ్య మరణం మధ్యఉన్న సంఘటన ఈ కథలో ప్రధానం. రెండు విభిన్న సంఘటనలు రెండు సంఘటనల మధ్య సంవిధానం కుదర్చడానికి రచయిత ''రంగారావును చూచి చూడటంతోనే దండాలు పంతులుగారు అన్నాడు మల్లయ్య. ఎందుకో రంగారావు దీర్ఘాయుష్యమస్తు అనలేకపోయాడు''. (పుట 183). అంటూ ఆ సంఘటనలలోని విభిన్నతనే కాకుండా జరగబోయేదాన్ని సూచిస్తున్నట్లుగా ఈ వాక్యంతో పూర్తి భిన్నమైన రెండు సంఘటనల మధ్య సంవిధానాన్ని రచయిత కూర్చాడు.

### 5.2.3 అనుభూతి

కథారచనలో అనుభవాల గాఢత చోటుచేసుకొని పాత్రల అనుభూతిగా వ్యక్తమవుతుంది. అందువల్ల కథా రచయిత పాత్రల అనుభవాన్ని అత్యంత ఏకాగ్రతతో కథాంశం అనే తీగమీద నడిపిస్తాడు. అనుభూతిలో ఐక్యత చాలా ప్రధానం. దీన్ని సాధించటానికి రెండు మార్గాలున్నాయి. పాత్రను ఒకే సంఘటనకు పరిమితం చేస్తూ మిగిలిన సంఘటనలు పాత్రలు కూడా దాన్ని బలోపేతం చేయడానికి వాడుకోవడం. ఆ సంఘటన కథకు ప్రధాన అంశంగా ఉండాలి. రచయిత సృష్టించే తదితర పాత్రలుగాని, సంఘటనలుగాని, ఆ ప్రధానాంశం చుట్టూ అల్లుకొని ఉండాలి. ఇది పాత్రల్లోని ఏదో ఒక మార్పుకు, సంఘటనలలోని మలుపుకు కారణభూతమయ్యేలాగ ఉండాలి.

సుందరి రాజా అనుకూలమైన దంపతులు. రాజా తండ్రి పత్రిక మీద ఆసక్తితో జీవితాన్ని చిన్న వయస్సులోనే చాలించినవాడు. ఆ కష్టసుఖాలు ఎరిగిన సుందరికి భర్త పత్రిక పట్ల ఆసక్తి చూపడం ఇష్టం లేదు. పత్రిక పెట్టాలనుకోవడం నచ్చలేదు. రాజా మేనమామ సహాయం చేయాలనుకొని ఆమె పత్రిక స్థాపించడానికి వ్యతిరేకే కాని, భర్త మానసిక ఆవేదన గ్రహించాక తానే అతనికోసం ఆ ప్రయత్నం చేస్తుంది. అతనికి మాత్రం ఇవ్వన్ని ఉన్నా లేకపోయినా ఆమె మాత్రం ప్రాణప్రియే.

కందుకూరి లింగరాజు రచించిన ఆరూఢం కథ అతిప్రాచీనమైన భారతీయ సంస్కృతి మూలానికి సంబంధించిన కుటుంబ జీవితం భార్యాభర్తల మధ్య ఉన్న విషయాల్లోను ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు, అది సహజమే.

కథలోని రాజాకు పత్రిక పెట్టాలని కోరిక ఎంత ఉందో సుందరికి అంత వ్యతిరేకత ఉంది. అయితే ఇరువురి అనురాగానికి కొదవలేదు. ఆమె భర్తకు తెలియకుండా అతడికి వచ్చిన ఉత్తరాన్ని చింపడంలో ఆమె స్వార్థం కన్న భర్త పట్ల అభిమానం అధికంగా ఉంటుంది. ఎక్కడ ఆ పత్రికా మోజులో తనను తానే నిర్లక్ష్యం చేసుకుంటాడో అన్న భయం లేక మామగారిలా పత్రిక రంగంకోసం ప్రాణాన్ని తుచ్ఛంగా భావిస్తాడేమో అనే బెంగ స్పష్టంగా కనిపిస్తాయి. ఆర్థికపరమైన భయం మాత్రమే ఆమెను అడ్డుకోలేదు. ఏ కారణం చేతనైనా భర్త దూరమవుతాడేమో అన్న బెంగ ఆమెచేత ఆ పని చేయించింది. కాని, తాను ఎదురు చూసిన ఉత్తరం రాలేదని సహాయం అందలేదని భర్త బెంగపడుతూ తనలోతానే కుమిలి పోతున్నప్పుడు ఆమెకు తన తప్పు పదిరెట్లు ఎక్కువగా కనిపించింది. అందుకే అతని మేనమామను వ్యక్తిగతంగా కలిసి బ్రతిమిలాడుతుంది. వారి కలయిక కథకు ముగింపే కాదు. వారి ప్రేమానుభూతి గాఢతకు స్పష్టమైన నిదర్శనం కూడా. ఎక్కడ అతన్ని పోగొట్టుకుంటానో అని బెంగ ఆమెది. ఆమె అతనికి అన్నీ. పత్రిక ప్రారంభించలేదనే బెంగ కంటె ఆమె కొద్ది రోజుల వియోగం అతన్ని ఎక్కువ బాధించింది. "అవన్నీ మర్చిపో! నువ్వు వచ్చేవు. అంతే చాలు హృదయానికి హత్తుకున్నాడు. కరిగిపోయే అతనికి చెప్పింది." (తెలంగాణకథలు 2005 పుట 92). ఈ వాక్యంతో రచయిత ఆ భార్యాభర్తల అనుభూతి గాఢతను వ్యక్తం చేస్తాడు. కథలో సన్నివేశాలు మూడే అయినా ప్రతి ఒక్కటి ఈ అనుభూతి గాఢతను పటిష్టం చేసేవిగానే సృష్టించబడ్డాయి.

### 5.2.4 సంఘర్షణ

సంఘర్షణ రచనలో రెండు విధాలుగా ఉండవచ్చు. ఒకే పాత్రలోని మానసిక సంఘర్షణ లేదా విభిన్న సంఘటనల మధ్య సంఘర్షణ.

సౌందర్యం వ్యక్తికి వ్యక్తిత్వానికి కూర్చదు. గ్రహణం తొర్రితో ఉన్న భర్తను అంగీకరించలేని కస్తూరి. చదువుకునే రోజుల్లో తనపై జరిగిన అత్యాచారాలను మరిచిపోలేదు. ఆ విషయం బయట పడకుండా వెంటనే పెళ్ళి చేసి పంపిన స్నేహితురాలి తల్లిదండ్రులకు విషయం తెలిసిందేమోనన్న భయం తన తల్లిదండ్రులకు కాలేజీ గోడల మీద రాతల వల్ల తెలిసిన నిజం. ఆ కారణంగా అంగీకరించవలసిన కురూపి భర్త -కస్తూరిలోని మానసిక సంఘర్షణను రూపిస్తుంది. పెళ్ళి అయి ఎన్ని నెలలు గడిచిన తన ముఖం చూడని భార్యను విడిచి వెళ్ళిన పుండరి తన స్నేహితుడి సలహా మేరకు ప్లాస్టిక్ సర్జరి చేయించుకొని సంవత్సరం తరువాత తిరిగి వస్తాడు. అతని రూపంలో మార్పు ఏర్పడి ఉండవచ్చు కాని, అతని మనస్సులో మాత్రం కాదు. తన రూపాన్ని మార్చుకొని వచ్చిన భర్తకు దగ్గరవ్వాలో లేక తన గతాన్ని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించి ఏదో తెలుసుకున్నాడేమో అన్న భయంతో దూరం అవ్వాలో అర్థంకాని పరిస్థితిలో కస్తూరి ఇల్లు విడిచి వెళ్ళిపోవడానికి నిర్ణయించుకుంది. ఆమెను ఏ ప్రశ్న లేకుండా వెనక్కు రమ్మని తీసుకపోతున్న భర్త ''రాపోదాం జీవితం ప్రతి నిమిషం అమూల్యమైంది'' (తెలంగాణ కథలు 2005, పుట 203). జీవితం అంటే సౌందర్య కాంక్షో జరిగిన తప్పుకు లేదా బాధ్యతలేని కార్యానికి చింతించడమో కాదని ప్రతి సమస్యకు ఒక పరిష్కారం వెతుక్కోవటమేనని చెబుతుంది.

సంఘటనల్లో భిన్నత్వమే కాదు. సంఘర్షణాత్మకమైనది కూడా ఉండవచ్చు. సంఘర్షణల్లో సంఘటనల్లో సంఘర్షణ అంటే కథా సంవిధానానికి తోడ్పడేది. అలాగే విభిన్న మానవ ప్రకృతులను చాటి చెప్పేవి కావచ్చు.

పడాల రాములు రాసిన *చీకటి మంట* కథలో ప్రధానమైన సన్నివేశాలు రెండు. మొదటిది భర్త ద్వారా తీరని కామవాంఛను పాలేరు ద్వారా తీర్చుకోవాలని ప్రయత్నించి ఈడేరని కోర్కెతో రగిలిపోయిన దొరసాని ప్రయత్నం భంగమైనది ఒకటి - రెండోది దొర దొరసాని మాటలు, ఆమె పనిపిల్ల రత్తి మాటలు నమ్మి పాలేరు నారిగాణ్ణి బంగారు ఉంగరం కోసం కొట్టి హింసించి, ప్రాణాలతో తగలబెట్టటం మరొకటి. ఈ రెండు సంఘటనల వైవిధ్య భరితమైన

కలయికే ఈ కథ. మానవత్వాన్ని కాముకత్వం కాటేసిన కథ ఇది. స్త్రీ అభిమానం అనురాగం ఎంత ఔన్నత్యానికి దారితీసి వ్యక్తిని కొన్నిసార్లు దైవంగా మలుస్తాయో అవమానం అహంకారం అంతకు భిన్నంగా మానవత్వాన్ని రాక్షసత్వంగా మారుస్తామని నిరూపించే కథ ఇది. నారిగాడు చేసిన తప్పల్లా తానొక పాలేరునని, దొర భార్యను కోరతగనని అనటం మాత్రమే! అలవిలేని కామం అహంకారపు నైజం ఏకమై చేయని దొంగతనాన్ని అంటగట్టి సజీవ దహనానికి కారణాలైనాయి. విరోధాభాసశృంగారం, వికృతమైన రాక్షసత్వం ఈ కథలోని భిన్న సంఘటనల నిజరూపాలు. అందువల్లే రచయిత ఆ రెండింటికి మధ్య భేదాన్ని చూపించడమే కాకుండా రచనా శైలిలో కూడా భిన్నత్వాన్ని చూపించాడు.

## 5.3.0 శిల్పం

ఒక శిలను చెక్కి ఆకృతిని కలుగచేస్తే అది శిల్పం. సాధారణ జనవ్యవహారంలో నిజానికి బొమ్మ మాత్రమే! రాతితోనో కర్రతో మరే ఇతర పదార్థాలతో కూడా శిల్పాన్ని తయారు చేయవచ్చు. సాహిత్య విమర్శలో శిల్పం అనే పదం Technique కు సమానార్థకంగా వాడుతున్నాం. కథానికకు శిల్పం ప్రాణం. ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య మాటల్లో ''ఉన్నత స్థాయిలో కథానికకు కావ్యానికి భేదం చాలకొద్దేననిపిస్తుంది. (కొద్ది మినహా యింపులతో) అభివ్యక్తి భేదమే కాని ఇతివృత్త నిర్వహణలో రెండింటికి ఉన్న సామ్యాలే అధికం'' (వీరభద్రయ్య ముదిగొండ 1998 పుట 121) కథలో వస్తువుకన్నా శిల్పానికి ప్రాముఖ్యత ఎక్కువ. కథను చెప్పే తీరు శిల్పం. వస్తువైవిధ్యం ఎలా ఉన్నా, శిల్ప వైవిధ్యం వల్లే కథ రాణిస్తుంది. కథ చెప్పే తీరు శిల్పం అనవచ్చు. రచయిత స్వీకరించిన వస్తువును కథగా మలచటంలో చూపేనేర్పే శిల్పం. కథానిక ప్రక్రియను త్రిముఖాత్మకంగా విశ్లేషించిన పోరంకి దక్షిణామూర్తిగారు కథానిక ప్రక్రియలో అభివ్యక్తమయ్యే రచనాశిల్పాన్ని ఎనిమిది రకాలుగా వర్గీకరించారు.

1)వస్తు విన్యాస శిల్పం, 2)పాత్రచిత్రణ శిల్పం, 3)కథనశిల్పం, 4) సంఘటన శిల్పం, 5)సంఘర్షణోత్పాదకశిల్పం, 6)సన్నివేశ కల్పనా శిల్పం, 7) వర్ణనా శిల్పం, 8) శీర్షికా శిల్పం.

### 5.3.1 వస్తువిన్యాస శిల్పం

వస్తువు రచయిత ఊహాజనితం కావచ్చు. ఏదైనా సంఘటనల మీద ఆధార పడ్డది కావచ్చు సామాజిక మత రాజకీయ పరమైన ఏదైనా ఒక ఉద్యమ స్ఫూర్తితో వచ్చినది కావచ్చు. ఏదైనా ఒక బలమైన సంఘటనకు లేదా ఒక వ్యక్తిత్వానికి ఆకర్షితుడైన కథకుడు ఆధారంగా దాన్ని స్వీకరించి తన కల్పనాశక్తితో చిత్రించిందైనా కావచ్చు. ఇన్ని రకాల వస్తువులు కథకుడు స్వీకరించి ఎలా మలుచుతున్నడా అనేది వస్తు విన్యాస శిల్పం మీద ఆధారపడి ఉంటుంది.

### 5.3.2 పాత్ర చిత్రణ శిల్పం

రచయిత వస్తువుకనుగుణంగానే పాత్రలు సృష్టిస్తాడు. కాని, పాత్రల్లో కనిపించే వైవిధ్యం లేదా ఏకపాత్రలో ఉండే మానసిక ఘర్షణ పాత్ర చిత్రణలోని వైవిధ్యానికి కారణమవుతుంది. *గ్యారాకద్దు బారాకోత్వాల్* కాపువాడు, *గొల్ల రామవ్వ ఆరూఢం*లో సుందరి రాజా, గాలిపటంలో మల్లేశం, ఆమె, నేను, నాభార్య, *తలఎత్తని కస్తూరి*లో కస్తూరి, పుండరి, *ఇజ్జత్*లో రంగారావు, రామచంద్రయ్య, మల్లయ్య, *నిత్యగాయాల నది*లో ఆమె వంటి వివిధ పాత్రలు పాత్రచిత్రణకి శిల్పానికి ప్రత్యక్షసాక్ష్యాలు. పై పాత్రల్లో 'నేను', 'నాభార్య', 'ఆమె' వంటి పేరులేని పాత్రలుచాలా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. రచయిత ఈ పాత్రల ప్రాముఖ్యతను వాటి మానసిక సంఘర్షణ చిత్రించడంలో చూపించిన నేర్పు పాత్రల ద్వారా కథను నడపడం అనే శిల్ప వైశిష్ట్యాన్ని ప్రతిఫలింప చేస్తుంది. *గ్యారాకద్దు బారాకోత్వాల్*లో కాపువాడు అమాయకంగా కనిపిస్తూ బ్రతకనేర్చిన వాడు. ఎదుటివాళ్ళ బలహీనతల్ని తనకు బలంగా మార్చుకోవడం ఇతనికి బాగా తెలుసు. ఏమరుపాటులో ఒక గంట కొట్టడం మరిచిపోయి నవాబుగారి బేగం ఆ గంటకు నెలకు యాభై రూపాయలు ఇస్తాననడంతో ఆ గంటలో ఏదో కిటుకుందని ఊహించి రోజుకొక గంట తప్పించి అందరు బేగంల దగ్గరి నుంచి నెలకు యాభై రూపాయల చొప్పున పుచ్చుకోగలిగాడు. తన సొరకాయల్ని అధికారానికి లోబడి కోల్పోయిన కాపువాడు గంటల కిటుకుతో లక్షాధికారి కావడం ప్రతాపరెడ్డి గారు ఆ పాత్రను చిత్రించడంలో చూపిన నేర్పు.

గొల్ల రామవ్వ దేశభక్తికి ప్రతీక అప్పుడప్పుడే నైజాం పోలీసులకు, దొరలకు ఎదురు తిరుగుతున్న యువతను కాపాడటం కోసం రామవ్వ చూపిన నేర్పు, తెగువ, త్యాగ నిరతి పి.వి. నర్సింహారావు చేతిలో ఉన్నత పాత్రగా మలచబడింది. వట్టికోట ఆళ్వారు స్వామి *గాలిపటం*లో కథనమైన స్త్రీ జీవితానికి మల్లేశం చేత ఒక కొత్త బ్రతుకుదారి చూపించిన పాత్రలుగా పేరు లేకుండా కేవలం ఉత్తమ పురుషలో ఉన్న 'నేను', 'నా భార్య' విశేషమైన పాత్రలు చూపించాడు.

ఇల్లందుల సరస్వతిదేవి చిత్రించిన కస్తూరి చిత్రించిన కస్తూరి పాత్ర స్త్రీలోని మానసిక సంఘర్షణకు రూపమైతే, పడాల రాములు చిత్రించిన చీకటి మంటలోని దొరసాని అహంకారపు ప్రతినిధి. *నిత్యగాయల నది*లోని 'ఆమె' బెజ్జారపు రవిందర్ చేసిన ఒక ప్రతీకాత్మకమైన భారత భూమిని గుర్తుచేస్తుంది.

### 5.3.3 కథన శిల్పం

కథకుడు కథ చెప్పే తీరు కథన శిల్పం. కథ చెప్పటంలో పలు రకాలున్నాయి. రచయత తానే కథను నడుపవచ్చు. ప్రధాన పాత్ర ద్వారా నడుపవచ్చు. పాత్రల సంభాషణల మూలంగా నడుపవచ్చు. ఎవరో చెబుతున్నట్లు నడుపవచ్చు. ఏ తీరు తీసుకున్న కథా రచన సాగే తీరులోను కథను తిప్పే మలుపులోను శిల్పం దాగి ఉంటుంది.

#### 5.3.3.1 సామాన్య కథనం

రచయిత తన కోణం నుంచి కథను నడుపుతూపోవడం సామాన్య కథనం. దీనినే కొంత మంది సర్వసాక్షి దృష్టికోణం అనికూడా అంటున్నారు. కాసుల ప్రతాపరెడ్డి రాసిన *ఎల్లమ్మ శిథిలం* కథ. ఈ సామాన్య కథనం స్థాయికి చెందింది. ఇందులో రచయిత తానే కథను నడిపిస్తాడు. మధ్య మధ్యలో పాత్రల సంభాషణలు చోటుచేసుకున్న కథంతా కథకుడే నడుపుతాడు. రచయిత తన చుట్టూ ఉన్న రైతు సమాజాన్ని చూసి వారి జీవనాన్ని కథనం చేసే తీరు ఇది ఉదాహరణకు "ఈ ఊళ్లు ఇలా చితికిపోవాల్సిందేనా అనే బాధ అతడ్ని కలచివేయసాగింది. మొదట్లో ఉన్న చిరాకుపోయింది. మిగలిందొకటే గుండెను పిండేస్తున్న

బాధ. రాష్ట్రంలో రైతులు ఒక్కొక్కరే వరుసగా కూలిపోతున్న దృశ్యం. ఊళ్లు రైతులను కోల్పోతున్నాయి. రైతులు లేని ఊళ్లు ఉండడం సాధ్యమేనా? రైతులు లేని భారత దేశం ఎలా వుంటుంది?'' (ప్రతాపరెడ్డి, కాసుల 2006, పుట 5).

### 5.3.3.2 పాత్రల కథనం

రచయిత పాత్రల చేత కథను నడపడం, కథను నడిపించడం పాత్రల కథనం. దీనికి మరోపేరు నాటకీయ కోణం. ఇది చాలా ప్రాచీన శైలిలో ఒకటి. తిక్కన కాలం నుంచి దీనికి ప్రాముఖ్యత ఉంది. సాధారణంగా ఈ కథన విధానంలో రచయిత కనిపించడు. పాత్రలే తమ గుణగణాలను ప్రదర్శించుకుంటూ కథను నడుపుతాయి. రచయిత తాను ఎక్కడ కనబడకుండా పూర్తిగా పాత్రల కోణం పాత్రలలోనే కథను నడపడం ఇందులో కనిపిస్తుంది. ఈ రకం కథలకు ఎన్నోఉదాహరణలు చూపించవచ్చు. పెద్దింటి అశోక్ కుమార్ *సావుదప్పు, జిద్దు*. కాసుల ప్రతాపరెడ్డి పెనుగులాట. *లవ్ ట్వంటి ట్వంటి*. ఇల్లందుల సరస్వతి దేవి *తలఎత్తని కస్తూరి, జిద్దు* కథలో ''అక్కడి నుంచి ఇంటికి రాకముందే ఇంకొకడు తొవ్వలో కలసి ఎటుపోయినవురా. . . పొద్దటి నుంచి దొరుకుతనే లెవ్వు. సుట్టా లచ్చింద్రు. ఇంటి దగ్గర కోడిగొయ్యాలె నడువు''అంటారు. తిండిలేదు తిప్పల్లేదు. అక్కడి నుంచి ఇంటికొస్తినో లేదో . . . ఇంకొకలు కావలుంటారు. ఒక్కొక్కనాడైతే రాత్రంతా నిద్ర ఉండదు.

ఇంటున్నవా పటేలా . . . . . నాకత. మీకల్లం దగ్గరికచ్చి దోసెడు వడ్లు పెట్టమంటే ఈ చేనుకాడగాదు ఆ చేనుకాడంటారు. అక్కడికిపోతే ఇంకోచేను కాడంటారు. కొందరైతే వాడు ఏంకట్టం చేసిండని వడ్లు పెట్టాలె అంటారు. (అశోక్ కుమార్, పెద్దింటి కథలు 2007, పుట.3).

### 5.3.3.3 ఉత్తమ పురుష కథనం

కథ కథకుడి ద్వారా జరుగదు. ఒకపాత్ర ముఖంగా కథ జరుగుతుంది. సాధారణంగా కథలోని ప్రధాన పాత్ర జరుగుతున్న సంఘటనల్ని, ఇతర పాత్రల మనోగత భావవివరణ ఇస్తూ పోతుంది. ఈ రచన రీతిలో ఏకోన్ముఖ భావవ్యక్తీకరణ ఉంటుంది. కథ నడిపే పాత్ర

తనకోణం నుంచి కథనం నడిపిస్తుంది. కొన్నిసార్లు కథనడిపే పాత్ర తటస్థంగా ఉండి 'నేను చూశాను' అంటు తను చూసిన విషయాలన్నిటిని చెప్పటం కూడా కనిపిస్తుంది. ఈ రకం కథలు ఎక్కువగానే కనిపిస్తాయి. ఈ కథన పద్ధతి కథకుడికి సులభ సాధ్యమవుతుంది. ఉదాహరణకు కాసుల ప్రతాపరెడ్డి *పక్షులు ఎగిరిపోయిన తోట*, వట్టికోట ఆశ్వారుస్వామి, *గాలిపటం*, దాశరథి రంగాచార్య *తామరపూలు* నిఖిలేశ్వర్ *గడ్డం మనిషి* పడాల రాములు *చీకటి మంట*. కె.రాంమోహనరాజు *గొల్లకథ*, బెజ్జారపు రవీందర్ *నిత్యగాయాలనది,* పులిపాటి గురుస్వామి *ఐటీకప్ప*. *తామరపూలు* కథలో "అది మా ఊరి చెరువు. దానిపేరు ముత్యాలమ్మ కుంట. చెరువు పక్కన పెద్దరాతి పరుపు. దాని మధ్యన ఒక్క ముద్దు వచ్చే మర్రిగున్న. దానికి ఆవల ముత్యాలమ్మ గుడి. చెరువు కట్ట దిగువన గుబురు నాగ జముడ్లు! వాటిని ఆనుకొని పచ్చని పొలాలు! చెరువు కట్టమీద అక్కడక్కడా మోదుగు చెట్లు. మేము చెరువు కట్ట ఎక్కి చూస్తే చెరువులో నీళ్ళు కనిపించేవి కావు. చెరువు నిండా పరుచుకున్న పచ్చని తామర ఆకులు. వాటి మీద ముత్యాల్లా మెరిసి ఆటలాడే నీటి బిందువులు - రెండాకులకు ఒక పూవు చొప్పున విచ్చుకున్న తామరలు. వాటిమీద ఎగిరే నల్లని తుమ్మెదలు అబ్బో! అదొక మహాద్భుత దృశ్యం" (దాశరథి రంగాచార్య 2005 పుట 221).

### 5.3.3.4 ప్రథమ పురుష కథనం

కథకుడు తటస్థంగా ఉండి పాత్రలతోనూ సంఘటనలతోనూ ఏ మాత్రం సంబంధ కుండా చూస్తున్న వాటిని యథాతథంగా వర్ణించే రీతి ఇది. ఈ రీతి రచనలో కథారచయిత తాను ఎప్పటి నుంచో చూస్తు కథను వర్ణిస్తున్నట్లుగా రాస్తాడు. ఇది ఉత్తమ పురుష రచన రీతికి పూర్తిగా భిన్నమైంది. కథ నడిపే పాత్రకు ఇతర పాత్రల మానసిక సన్నివేశ సంఘర్షణలు తటస్థప్రాయంగానే తప్ప తనవిగా అనిపించవు. ఇటీవల కాలంలో ఈ రచనా రీతి కథకుల్లో ఆసక్తిని కలుగుచేస్తుందనే చెప్పాలి. కాసుల ప్రతాపరెడ్డి *పారేసిన కథ, యాక్సిడెంట్,* సి.హెచ్. మధు *చర్చల కథలు*, కర్రాఎల్లారెడ్డి *లాకప్‌డెత్*, మొదలైనవి చెప్పవచ్చు. బి.వి.ఎన్ స్వామి *నెలపాడుపు*. కథలో "అచేతనురాలయ్యింది. దిక్కుతోచడం లేదు. తనుతల్లిగారు దగ్గరలేరు.

కాళ్ళల్లో బలం సన్నగిల్లింది. ఒక్కసారిగా తన నిలుచున్న చోట మోరి మీద గద్దెపై కూలబడింది. అలా క్షణాలు, నిమిషాలుగా, నిమిషాల్ని గంటలుగా, భయంగా కాలం గడిపింది. ఇంట్లో పిల్లలు గాఢ నిద్రలో, బయట భర్త శాశ్వత నిద్రలో, తాను మాత్రం నడుమకడపపై నిరాశగాగడిపింది'' (బి.వి.ఎన్.స్వామి 2005, పుట 70).

### 5.3.4 సంఘర్షణ

కథనంలో కథకుడు చూపించే శిల్ప వైవిధ్యం పాత్రల లేదా సంఘటనల సంఘర్షణలో కనిపిస్తుంది. ఎదురుచూడని మలుపు కథకు ఒక కొత్త సొగసును కూరుస్తుంది.

#### 5.3.4.1 పాత్రల మానసిక సంఘర్షణ

భాస్కరభట్ల కృష్ణారావు రాసిన *ఇజ్జత్* కథలో మల్లయ్య పాత్ర, ఇల్లిందల సరస్వతి దేవి *తలఎత్తని కస్తూరిలో* కస్తూరి, సంఘర్షణాత్మక పాత్రలకు ప్రతీకలని చెప్పవచ్చు. కౌలు బాకీ కోసం నిలదీసినప్పుడు మల్లయ్య తన దగ్గర డబ్బుకాని కనీసం గొడ్డుగోదకాని లేవని అందువల్ల ఏమి ఇవ్వలేక పోతున్నానని ఎంతో బతిమాలుకొన్నాడు. ''నీ కాలు మొక్కుత (కాళ్ళకు మొక్కుతూ) నా ఇజ్జత్ (పరువు) తీయకుదొరా, నా ఇజ్జత్ తీయకు దొరా'' అని కంట నీరు పెట్టాడు మల్లయ్య. ఇద్దరు కావలివాళ్ళు మల్లయ్యని పట్టుకొని, అతన్ని వంగబెట్టి, వీపుమీద ఒక బండ పెట్టారు. మల్లయ్య వాళ్ళని ఏమి ఎదిరించలేదు యజమానికి మచ్చికపడ్డ గొడ్డుకుమల్లె లొంగిపోయాడు ఆ యిద్దరికినీ - ఆ తరువాత మల్లయ్య అవమానంతో ఇటూ, అటూ ఎవ్వరినీ చూడలేదు. నేలకేసి చూస్తున్న అతని మొహం నేలకేసి చూస్తూనే ఉండిపోయింది. భూమిపైన ఏకధారగా అశ్రువులు రాలడం మొదలెట్టాయి'' (భాస్కరభట్ల కృష్ణారావు 2005 పుట 185). తన గౌరవంకోసం ఎంతో బ్రతిమాలుకున్నా ఏం జరుగక ఏ మాత్రం తనకి గౌరవం దక్కకపోవడం బండ భారాన్ని భరించిన అవమాన భారాన్ని భరించలేక మైకంతో పడిపోయిన భర్తను లేపిన మల్లి ''ఇజ్జత్ పోయింది పిల్లా'' అన్న మాటతో బాధను గ్రహించినా అంతరంగాన్ని గుర్తించలేకపోయింది. ఆ రాత్రి పెళ్ళికి కొన్న చీరతో భార్యను చూసుకోవాలనుకున్న మల్లయ్య కోరిక తన వైవాహిక జీవితాన్ని ఆ రోజుతో అంతం చేస్తుందని

తెలియని మల్లి భర్తతో అనందాన్ని పంచుకుంది. తన గౌరవం కోసం ప్రాణాన్ని త్యజించాలను కున్న మల్లయ భార్య పిల్లల మీద ఉన్న ప్రేమని చంపుకోలేక వాళ్ళ నుంచి విడివడడానికి పడిన మానసిక సంఘర్షణని రచయిత తాగుడు మైకంతో తనను తన మనస్సును మభ్యపెట్టాలనుకున్నాడు అని సూచిస్తాడు. "మల్లయ్య లోపల దూలానికి వ్రేలాడుతూ ఉన్నాడు." అన్న మాటతో రచయిత పాత్ర మానసిక సంఘర్షణకు తెరదించాడు.

కస్తూరి తనపై జరగిన అత్యాచారాన్ని ఎవరికి చెప్పకుండా దాచినా ఆమె మనస్సులో మాత్రం అది ఆమెను సలుపుతూనే ఉంది. విషయం బైటపడి మరి ఇక వివాహం జరగదేమోననే భయంతో తండ్రి తెచ్చిన సంబంధం కస్తూరి కన్నె మనస్సుకు రుచించలేదు. భర్త వికారరూపాన్ని భరించలేక కస్తూరి కన్నెత్తి చూడటం పన్నెత్తి పలకడం చేయలేదు. భర్త ఇల్లు ఒదిలిపెట్టిపోవడానికి తానే కారణం అన్న బాధ ఆమెని తొలిచివేసింది. ఏడాది తరువాత తిరిగివచ్చిన భర్త కురూపితో మారిపోవడాన్ని గుర్తించిన కస్తూరి అతనిలో మార్పుకు సంతోషించిన తాను చేసిన తప్పుకు బాధతో పశ్చాత్తాపంతో ఇల్లు విడిచిపెట్టి పోవడం కథలో ఒక మలుపు కాని ఆమెలోని మానసిక సంఘర్షణను గుర్తించిన భర్త ఆమెను ఇంటికి తీసుకపోతాడు. ఇక్కడ రచయిత "రాపోదాం మనకో కుటీరం ఉంది. చిలకా గోరింకల్లా కబుర్లు - ఇన్నాళ్ళ కబుర్లు చెప్పుకోవచ్చు. పెట్టె తీసుకున్నాడు చేతిలోకి అతడి కంతా తెలుసా? తెలిసే ఆహ్వానిస్తున్నాడా?

కస్తూరికి అగమ్యగోచరంగా ఉంది.

రాపోదాం జీవితంలో ప్రతి నిమిషమూ అమూల్యమైంది. లాక్కుని పోతున్నాడు." (సరస్వతీ దేవి, ఇల్లిందల 1968 పుట 203). అంటూ పాత్రల మానసిక సంఘర్షణకు చక్కటి నిదర్శనాన్ని ఇచ్చింది. స్త్రీలోని మానసిక సంఘర్షణ చాలా వరకు వైవాహిక జీవితానికి సంబంధించిదిగానే కనిపిస్తుంది.

### 5.3.5 శీర్షిక

రచయిత కథకు శీర్షికను పెట్టడంలో చూపే నేర్పు కథన శిల్పంలో ప్రధానమైంది.

### 5.3.5.1 చీకటి మంట

పడాల రాములు సృష్టించిన *చీకటి మంట* రచయితకు కథన శిల్పంలో ఉన్న నేర్పును సూచిస్తుంది. చీకటి కామానికి ప్రతీక. మంట, విలువలేని మానవజీవితానికి ప్రతీకగా తీసుకున్నాడు. అతిరేకమైన కామంతో అవమానం అనే మంటతో రగిలిపోయిన దొరసాని పన్నాగంతో బంగారు ఉంగరాన్ని మాయం చేసి, నర్సిగాడు దహనం అవ్వడానికి కారణమైంది. "నా తలని ఏదో అదృశ్య హస్తం హాయిగా నిమిరినట్లైంది" నర్సిగాడి ప్రాణం అనంత వాయువుల్లో లీనమైపోయాయన్న మాట ఓ . . . .ఆనందం ఒక్క ఉప్పెనల ముంచేసిందన్న" (రాములు పడాల 2005 పు.292) రచయిత కథలో కాముకత్వంతో మానవత్వాన్ని నశింపచేసిన దొరసాని అహంకారంతో బలిమితో తాను ఇవ్వలేని ప్రాణాన్ని తీసిన దొరను చిత్రించి అణగారిన బ్రతుకుల్లో చీకటి మంటల్ని చూపించాడు.

### 5.3.5.2 సావుదప్పు

పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన *సావుదప్పు*. పెద్దింటి చావు ఘనంగా జరిగినా పేదోడి ప్రాణం పైసా విలువచేయదని నిరూపించే కథ. ఆర్థిక అసమానతలు సామాజిక అసమానతలు మనిషి ప్రాణానికి విలువలేదని చాటిన కథ ఇది. చావుకి డప్పు వాయిస్తూ పైసలేరే నర్సింహ ప్రాణం పావలా కాసుల పై చేరిన ధూళిలోనే కలిసిపోయింది. అతడి నుదిటిరాత పైసలేరిన మట్టిలోనే కలిసి పోయింది. చావుకు డప్పు వాయించడం తరతరాలుగా కులవృత్తిగా కలిగిన పేదల బడుగు బతుకుల్ని కథకుడు చిత్రించి చూపిస్తున్నాడు. చావుకు డప్పు కొట్టడానికి వెళ్ళిన నర్సింహకు డప్పే చావును తెచ్చిపెట్టింది. అతను కాదనుకొని అందుకున్న సావుదప్పు అతని పట్ల చావే అయ్యింది. ఆర్థిక వర్గ అసమానతల వల్ల మానవ ప్రాణానికి విలువలేకుండ పోవటాన్ని కథకుడు ఇందులో చూపిస్తున్నాడు.


### 5.3.5.3 నిత్యగాయాలనది

బెజ్జారపు రవీందర్ పేరు పెట్టడంలోనే శిల్ప విన్యాసాన్ని చూపించాడు. ప్రధాన పాత్ర 'ఆమె' ఆమెకు పేరు లేదు. అందమైంది కాదు. మార్క్సిజాన్ని, భాగవతాన్ని కలబోసుకోగల్గిన

ఆమె ఖాళీ పేజీల మానవ సమూహాలుగా మారే అక్షరాల్ని వెతుకుంటుంది. "రేణుక ఎల్లమ్మ తల్లిలాగ నిండుగ గంభీరంగా ఉండే ఆమె, బదబదలైన దేహంతో రక్తసిక్తమై జాలి గొలిపేటట్లు కనిపించింది" (రవీందర్, బెజ్జారపు 2005 పు.793). "ఈ లొల్లి అంతా వింటున్న పోలీసు ఒకడు వచ్చి కొమరం భీము గురించి చెబుతున్నవెందే .. . . నక్సలైట్లతో మిలాఖత్ అయినవా? అంటూ ఎటుపడితే అటు గుద్దిండు. గవ్వేగి దెబ్బలు (అదే 94) తెలంగాణ విముక్తికోసం పోరాడిన వ్యక్తుల గురించి మాట్లాడటమే నేరంగా ఆమెను చిత్ర హింసలు పెట్టిన పోలీసు దురాక్రమణ భారాన్ని రచయిత సూచిస్తున్నాడు. ఆమె కోరుకుంటున్నదల్లా తన నిజమైన చరిత్ర తరతరాలకి తెలియాలని ఈ భూమ్మీద భక్తికి నెలవైన భాగవతానికి సమాజచైతన్యాన్ని తెచ్చే కాపిటల్‌కు సమాన గౌరవాన్ని ఇవ్వాలనే ఆలోచన ఎవరకి కొరుకుడు పడలేదు. కథకుడి దృష్టి కోణంలో ఆమె "ఇంకా ఏం పోల్చుకోవాలనిచూస్తావు...నేనురా.. తీగలు తెగిన నా కోటి రతనాల వీణను... కరువులో వచ్చిన బతుకమ్మ పండుగను.... ప్రసవంలోనే బిడ్డల్ని పోగొట్టుకున్న పచ్చిబాలెంతరొమ్మును" (అదే. 794) ఆమె ఎవరో కాదు భౌగోళిక సంపద తరగని భూమి తల్లి అందుకే కథకుడు పెట్టిన శీర్షిక సత్యసుందరమై ప్రకాశించింది.

### 5.4.0 వస్తువు

కథకు శిల్పం ప్రాణమైతే వస్తువు రూపం. ప్రాచీన సాహిత్యానికి సంబంధించి నంతవరకు వస్తువును కథ, ఇతివృత్తం, అనే పేర్లతో పిలవటం కనిపిస్తుంది. కాని ఆ సాహిత్యంలో వస్తువు మూడు రకాలుగా ఉండేది. కాల్పనికం, పురాణ ఇతిహాస సంబంధం. కథా సూత్రాన్ని తీసుకొని కవి కల్పనతో పెంచడం. కాని, ఆధునిక సాహిత్యంలో వస్తువు ప్రాంతీయం, సాంఘికం ఆర్థికం, రాజకీయం, అనే ప్రధాన విభాగాలుగా విభజించవచ్చు, దీన్ని ఇలా చూపించవచ్చు. (చూ. పటం)




UNIVERSITY OF HYDERABAD
सा विद्या या विमुक्तये

## 5.4.0 సాంఘికం

సమాజం ఏకథకుడికైన ఉత్తమమైన కథా వస్తువు. ఇందులో లభించని విశేషాలంటూ ఏమి ఉండవు. సాధారణంగా ఏ కథనైన ఈ విభాగంలో చెప్పవచ్చు. అయితే స్త్రీ మైనారిటీ, దళితవాదాలు సాంఘిక కథావస్తువులుగా ఈ సిద్ధాంత వ్యాసంలో చూపిస్తున్నాం.

## 5.4.1 స్త్రీవాదం

కాసుల ప్రతాపరెడ్డి *పెనుగులాట* కథలో పద్మజ ప్రశాంత్ ప్రేమించి పెళ్ళి చేసుకున్న దంపతులు అయితే చదువుకున్న రోజుల్లో ఉన్న అభిప్రాయాలు, పెళ్ళి అయిన తరువాత మారి అభిప్రాయ భేదాలు రావటం కనిపిస్తుంది. ప్రశాంత్‌కు తన ఉద్యోగం కాలంలో చదువుకునే రోజులనాటి ఆశయాలు కనిపించలేదు. వాటికోసం భార్య పనిచేయడం నచ్చలేదు. పద్మజకు తన వ్యక్తిత్వం ముఖ్యమనిపించింది. ఇద్దరు విడిపోవడం చివరకు కలుసుకోవడం కథ. ఇల్లిందల సరస్వతి దేవి *తలఎత్తని కస్తూరి* తనపై జరిగిన అత్యాచారానికి చేసుకోవలసివచ్చిన సర్దుబాటు తనానికి మధ్య నలిగిపోయిన కథ. రెండూ స్త్రీ జీవితంలోని విభిన్న కోణాలను ఆవిష్కరించే కథలే. ఒక దాంట్లో ఆశయ సాధన కోసం స్త్రీ పడిన ఆరాటం, ఆశయాలపట్ల ఆసక్తి. అందుకోసం రాజీపడలేని మనస్తత్వం ఎలాగైనా ఆశయ సాధనను వైవాహిక జీవితాన్ని నిలుపుకోవాలన్న తాపత్రయం అందుకోసం ఆమె పడ్డ సంఘర్షణ ఆమె ఇల్లు వదిలి వెళ్ళిపోవడానికి కారణమైన చివరకు వైవాహిక జీవనాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భార్యాభర్తలు రాజీపడిన ఆమె తన ఆశయాలను విడనాడుకోకపోవటమే ఆ పెనుగులాటకు కారణం. కాని రెండవ కథలో అత్యాచారానికి బలైన స్త్రీగా కుంగిపోతూనే మరో పక్క తగిన భర్త లభించలేదన్న భావనను సర్దుకోవలసి రావటాన్ని అంగీకరించని మనస్సును మభ్యపెట్టలేక భర్త కురూపి తనాన్ని అంగికరించలేక అతన్ని నిర్లక్ష్యం చేసి అతడు ప్లాస్టిక్ సర్జరీ చేసుకొని వచ్చిన తరువాత అతడు వెళ్ళిపోవడానికి కారణమై తానే అతని అనుమానానికి పాత్రురాలు కావాల్సివస్తుందేమోనన్న భయంతో ఇల్లు వదలిపోవడం ఒక రకం మానసిక సంఘర్షణకు ఉదాహరణ. నిజం చెప్పాలంటే ఆ స్త్రీ మానసిక సంఘర్షణే ఆ కథకు అలాంటి శీర్షిక

రావటానికి కారణమైంది. ఈ రచనలో రచయిత్రి ఆమె అవమానం వల్ల తలెత్తలేదో. భర్తను అంగీకరించలేకో లేక తన తప్పువల్లో జరిగిన అత్యాచారం తెలిసిందేమో అన్న భయంతోనే ఎందువల్ల ఆమె తలఎత్తలేదు అన్న ప్రశ్నను పాఠకుడి ఊహకు రచయిత వదిలిపెట్టారు.

### 5.4.1.2 దళితవాదం

పెద్దింటి అశోక్‌కుమార్ *వర్గ మూలాలు* కథ, కథకుడు ప్రశ్నించే "కనిపించే మనిషిని కాదని కనిపించని కులాన్ని గుర్తుకు తెచ్చే బలమైన అంశం ఏంటది? తనను కులంతో వేరుచేసే ఆలోచన వీళ్లకు ఎక్కడ మొదలవుతుంది.. . .?" (అశోక్ కుమార్ 2009 పు.41). కథకుడు ప్రశ్నించే కథలోనే ఈ సామాజిక అసమానతలు మూలాలను వెతుకుతుంది. నిజం చెప్పాలంటే గంగకు ఒకటే ప్రశ్న. తాను ఇచ్చే మందులకు, చేసే సేవలకు సామాజిక తోడ్పాటుకు అడ్డురాని తన కులం అందరికి ఒకటే అయిన దైవం విషయంలో ఎలా వచ్చిందన్నదే? రాజకీయంగా పనికివచ్చే మాదిగలు, రాజకీయపు పొత్తులకు కావాల్సివచ్చే కొన్ని వర్గాలు సాంఘికమైన సంబంధాలకు పనికిరావు. గంగ ఇచ్చే మందు, ఆమె చేసే సహాయం, అది ఆపరేషన్ క్యాంపులైనా కావచ్చు. బాంకులోనైనా కావచ్చు. ఆసుపత్రికి తోడు వెళ్లడం కావచ్చు. ఆడపిల్లలకు సైకిలు, గ్యాస్ సిలండర్లు ఇప్పించడం కావచ్చు. అన్నింటికి పనికివచ్చిన గంగ బతుకమ్మ పండుగలో అందరితో సమానంగా బతుకమ్మను పెట్టి పూజించడానికి పనికిరాలేదు. మన్ను అయినా రాయి అయినా రప్పైనా ఎప్పుడు దైవంగా మలచి పేరు పెడతాడో మనిషి అప్పుడు ఆ బొమ్మ పూజనీయమవుతుంది. అటువంటి బతుకమ్మను సైతం మాదిగ స్త్రీ పేర్చిన కారణంగా "పైన కట్టిన గొడుగు ఎక్కడనో ఎగిరిపోయింది. కాగితం పూల బతుకమ్మ బోర్ల పడ్డది. బతుకమ్మ ఇచ్చుకపోయింది. గంగ నోరు తెరిచింది. గంగ బతుకమ్మ మట్టిలో కలిసి కాళ్లకింద నలుగుతుంది. దుమ్ములో దుమ్మయి లేస్తుంది." (అశోక్ కుమార్ 2007, పు.52). దళిత వాదమంటే మొత్తానికి ఆర్థిక అసమానతే కాదు. అది ప్రధానంగా సామాజిక మానసిక అసమానత, రాజకీయంలో పడి ఆర్థికంగా ముందుకు వచ్చిన కుటుంబమే అయిన ఐదుగురికి తోడ్పడిన గంగకు ఎదురైన

చేదు అనుభవం వాళ్ళ అవసరాల కోసం 'అక్క' అని తిరిగిన వాళ్ళే ఆమె బతుకమ్మను ఆమెను ఎడం చేసి అవమానించడం చివరికి బతుకమ్మను కూడ దుమ్ములో కలిపేయటం చట్టాలు కాని, ప్రభుత్వాలు కాని, ఆర్థిక సామాజిక పురోగతి కాని ఇటువంటి స్థితిని మార్చుకోలేక పోతున్నాయనడానికి సాక్ష్యమై నిలుస్తుంది. కథకుడు మారని సామాజిక చింతనను ఒక వర్గం అనుభవిస్తున్న మానసిక సంఘర్షణను చక్కగా చిత్రించిన కథ.

### 5.4.1.3 మైనారిటీ వాదం

పెద్దింటి అశోక్ కుమార్ *జిద్దు* కథ మైనారిటీ వాద కథకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

### 5.4.2 ఆర్థికం

విప్లవాత్మక రచనలకైనా అభ్యుదయ వాదరచనలకైనా, ఆధారభూతమైంది ఆర్థక వ్యవస్థే. ఆర్థిక వ్యవస్థలోని హెచ్చు తగ్గులు ఎన్నో హెచ్చు తగ్గులను సృష్టిస్తాయి. వర్గ వైషమ్యాది విషయాలు ఎలా ఉన్నా ఆర్థిక అసమానతలు మాత్రం అధికారాన్ని, బలాన్ని-ధనం ఉన్నచోట అందిస్తూనే ఉన్నాయి ధన మూలం ఇదం జగత్ అన్న నానుడిని నిజం చేస్తూ ఎన్నో

J ‹ ™ ¶ # ` Ç ° ‹ $+ ₹ ¶ ëz = i H ÷= ¶ # = ` ŒÞx H ÷= ¶ # ã‡ □} ìx H ÷q □ °= … â ½O _ ¨ K í ª k .

= °x + ² ‹ $+ ₹ ë ß ^ Ê O = °x + x U □ °` ËO k . D ª □= ¶ I H › < Œ¼ † ₵ x ß K Œ> è H ^ Õ °

J _ È □ ^ Î Ȩ ¬H # „ ¬ È` ₵ < Í L < Œß~ ò .

H ê‹ ª□ ã„ ¬ Œ„ ¬ _ Û~ Œ‹ # *'పక్షులెగిరిపోయిన తోట'* - కడుపు చేత పట్టుకొని ఉద్యోగం కోసం గ్రామాలు విడిచి పట్టణాలకు వెళ్ళే లక్షలాది మంది వ్యవసాయ దారుల జీవితాలకు ప్రతీక. కథలో రచయిత సృష్టించిన, ప్రధాన పాత్ర ఉత్తమ పురుషలో అనామకంగా మిగిలి పోయింది. మేనత్త మరణం వల్ల స్వగ్రామం చేరిన వ్యక్తికి "ఒక్కసారిగా విషాదం గుండెల్లో గూడుకట్టింది. వెంకటరెడ్డి చనిపోయాడు. ఆ తోటకు నీరందించే బావి ఎండిపోయింది. వర్షాలు లేక దున్ని పంట వేసేవారులేక మా పెరడు పాడుబడి పోయింది. పక్షులు లేవు వాటిని ఎగురగొట్టడానికి మనుషులూ లేరు. అంతా నాప్రేమ లాగే అయిపోయిందని అనిపించింది." (ప్రతాపరెడ్డి కాసుల 2006 పు.7) - ఈ వాక్యాలు కథకుడి కథనంతో

సూత్రీకరించే వాక్యాలు. ఈ కథలో ఎండిపోయిన పంటచేను కరువువల్ల పంటలెండిపోయి సన్నకారు రైతుల ఆత్మహత్యకు దారితీస్తే ఒకే కులంలో ఉన్న విభేదాలు ఆర్థికపరమైన అసమానతలవల్ల ప్రేమ ఎండిపోయింది అన్న నిజాన్ని చాటిచెప్తాయి.

### 5.4.1 బాల కార్మికులు

యువత, భావితరం చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని పలురకాలుగా చెప్పుకుంటున్న ఈనాటికి అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందని దేశాల్లో పసిపిల్లలు పనుల్లోకి వెళ్లటం శారీరక మానసిక హింసలకు గురికావటం అక్కడకూడా కనిపిస్తూనే ఉన్నది. ''ఆకూ-పచ్చదనం లాగా ఏరూ-మట్టిలాగా, పువ్వూ-పరిమళంలాగ వాళ్ళ అనుబంధం విడదీయరానిది. ఇప్పుడీ కరువొచ్చి, వలసలొచ్చి, తల్లీబిడ్డలు వేరయ్యే ఒక సంకటకాలమొచ్చె .. . .. (ఉదయమిత్ర కథలు 2006 పు.76) - కరువువల్ల తల్లిబిడ్డ వేరయి ఆకు పచ్చదనాన్ని కోల్పోయినట్టు అంతటితో నిలువలేక నేలరాలినట్టు బిడ్డతో వియోగాన్ని సహించలేని తల్లి మరణం ఈ కథావస్తువు. హోటల్‌లో రెండు వేలకు పనికి కుదిరిన మల్లన్నకు మూడు నెలలు అయ్యేసరికి తల్లిమీద బెంగపట్టుకుంది. దెబ్బలు తిని అనారోగ్యంతో నానాకష్టాలు పడి తల్లిని చూడాలని వచ్చిన మల్లన్నకు దక్కిన సుఖం తల్లికి కొరివి పెట్టడానికి వొచ్చాడన్న చుట్టుపక్కల వారి ఆనందం మాత్రమే. బెంగుళూరికి పోయి ఎలాగైనా సంపాదించి బ్రతకాలని ప్రయత్నించిన మల్లన్న తల్లి ఎలా చనిపోయిందని కథకుడు చెప్పకపోయిన, ఆ మరణం ఆ పనివాడి పాదాల క్రింద నెలను పగిల్చివేసిందని మాత్రం కథకుడు అమ్మను జూడాలె కథలో సూచిస్తాడు. అంటే కూటికోసం దారులు వేరు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడి ఇద్దరు వేరు వేరు చోట్లకు వెళ్ళిన ఇద్దరికి విడిగా ఉండలేక పోయిన తపన మాత్రం తనను విడిచి వెళ్లిపోయిన తల్లిముందు కూలపడిపోయిన పసివాడిలో నిరూపించాడు రచయిత. ఆర్థిక సమస్యవల్ల ఒక పసివాడు మానసిక, శారీరక హింసకు కారణమైన విధానాన్ని చక్కగా నిరూపించాడు ఈ కథలో కథారచయిత.

### 5.4.3.0 రాజకీయం

దేశాన్ని పాలనకు సులువుగా ఉండేలా వివిధ రాష్ట్రాలుగా జిల్లాలుగా, మండలాలుగా, గ్రామాలుగా ఏర్పాటు చేశారు. అయితే ఈవిభజన పాలన సౌలభ్యం అన్నమాట పోయి స్వార్థపూరిత రాజకీయాలు తలఎత్తి విషబీజాలై ఊడలు దిగాయి. రాజకీయంలో ప్రధానంగా రాజకీయపు ఎత్తులు కనిపించిన కుల రాజకీయాలు కొన్ని దశాబ్దాలుగా ఎక్కువ అయ్యాయి.

### 5.4.3.1 కులరాజకీయాలు

పడాల రాములు *చీకటి మంట* పెద్దింటి అశోక్ కుమార్ *వర్గమూలాలు* రెండు కులరాజకీయ వ్యవస్థకు ఉదాహరణలు. తొలి కథలో అలవిలేని కామం, మానవత్వపు ఎల్లల్ని మరచి, ''ఆ పాలేరు వెధవ . . .ఆ అంటరాని గాడిద...'' (రాములు పడాల 2005 పు.288). అన్న ఆగ్రహంతో అతని మరణానికే కారణమైంది. దొర కూడ ఆ ప్రాణాన్ని తన దగ్గర పనిచేసే అంటరాని పాలేరుగా తప్ప వ్యక్తిగా చూడలేదు. నిజానిజాలు ఆలోచించలేదు. పాలకులకు, పాలితులు తేలికన్న భావాన్ని దొరగారి కుల అహంకారాన్ని కథకుడు కళ్ళ ముందు చిత్రించాడు.

పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన వర్గమూలాలు లో 'గంగ' సమాజ సేవిక తన చుట్టూ ఉండే స్త్రీలకు ఆర్థికంగా, సామాజికంగా ఆరోగ్య పరంగా అభివృద్ధి సాధించడానికి ఎంతో సహాయపడుతున్న ఒక పండగ వాతావరణం వచ్చేసరికి తమతో కలవడానికి ఆస్త్రీలే అంగీకరించలేకపోయారు. భర్త వెక్కిరించిన తోటి స్త్రీలకు సహాయం చేయడానికి పరుగెత్తే మనస్సున్న వ్యక్తి గంగ. కాని, ఆ స్త్రీలకు ఆమెతో కలవటం అవమాన చిహ్నమే కారణం. ఆమె కులం ఆమె భర్త రాజకీయంగా పేరున్నవాడే. రాజకీయాలు మాట్లాడేటప్పుడు అతని ఇంట్లో భోజనం చేయడానికి ఎవరికి అభ్యంతరం లేదు. కాని అతని భార్య చేతి వంటకురాజకీయానికి తప్పు లేకపోయినా పూజ అంటూ వచ్చేసరికి వాళ్ళ కులం అడ్డు వచ్చింది. కనిపించే మనిషి కన్న కనిపించని కుల రాజకీయాలు మిన్న అంటూ రచయిత కుల రాజకీయ తత్వాన్ని ఈసడిస్తాడు.

### 5.4.3.2 రాజకీయాలు

"స్కూల్లోనేమో పచ్చదనం - పరిశుభ్రత' గురించి నొక్కి చెబుతారు. చెట్లను నాటిస్తారు. శ్రమదానం చేయిస్తారు. మురికి కాల్వలు శుభ్రం చేయిస్తారు. మరి తమ గూడేనికి వస్తే అంతా ఉల్టా ఉంది. ఈ దరిద్రపు ఫ్యాక్టరీ వల్ల పంటలు నాశనమవుతున్నాయి. పచ్చదనం కరువవుతోంది. ఈ దరిద్రపు ఫ్యాక్టరీతో గాలి, నేలా, నీరు కలుషితమై మనుష్యులు, గొడ్లు రోగాల పాలయి చస్తున్నారు. అదే సర్కారు ఒక వైపు 'పచ్చదనం- పరిశుభ్రత' పెంచ మంటోంది. మరోవైపు ఇట్లాంటి ఫ్యాక్టరీలకు అనుమతిచ్చి తమ బతుకుల్లో 'పచ్చదనం-పరిశుభ్రత' లేకుండా చేస్తోంది. ఈ తిరకాసేమిటో వాడికి అర్థంగావటం లేదు. (ఉదయమిత్ర కథలు 2006 పు.33-34).

పసిపిల్లలకు నేర్పటానికే పాఠాలుకాని, నెరవేర్చటానికి కాదు ఆదర్శాలు. ఎదుటివారికి చెప్పడానికే నీతులు కాని ఆచరించడానికి కాదు. చేయటానికే వాగ్దానాలు కాని నెరవేర్చటానికి కాదు - ఎన్నెన్ని పథకాలు ఏర్పరచిన ప్రజల బాగోగులకోసం ఎంత ఆలోచనల పరిధిని పెంచిన ఆచరణకు వచ్చే సరికి ఏమి లేకుండా స్వార్థం మాత్రమే లేదా స్వప్రయోజనాలు మాత్రమే ప్రాధాన్యతను పొందుతాయన్న విషయం సుస్పష్టంగా కనిపిస్తుంది ఈ కథలో.

పసిపిల్లవాడికి అర్థం కానిదల్లా బడిలో పాఠానికీ తమ గూడెంలో జీవితానికీ పొంతన లేకపోవటం పర్యావరణ రక్షణ గురించి పాఠాలు పథకాలు ఎలా ఉన్నా ఫ్యాక్టరీల పేర్లతో వాటినుంచి వెలువడే వ్యర్థాలతో నీరు గాలి, నేల ఎంత కలుషితమవుతున్న పట్టించుకోని ప్రభుత్వవైఖరి ఈ కథలో పిల్లవాడికే కాదు నిజానికి ఎవరికి అర్థంకాని విషయం

### 5.4.4 ప్రాంతీయం

ఇటీవల కాలంలో వెలువడ్డ అతినూతనవాదం ప్రాంతీయవాదం ఒక ప్రాంతానికి సంబంధించిన జీవితం భాష, ఆచార వ్యవహారాలు ఇత్యాదులెన్నో ప్రాంతీయంగా పేరుపొందుతాయి. ప్రాంతీయత అన్న పదానికి ఆంగ్లంలో సమానార్థకం Nativism/ Regionalism - "This is known as Regionalism in English "an area of land or division of

the earth surface having, definable boundaries or characteristics" (Oxford Dictionary 2003 page 691) ప్రాంతీయత "ఒక ప్రాంతం పై ప్రత్యేక దృష్టితో ప్రాంతాన్ని, ఆ ప్రాంత ప్రజల్ని తమ కథల్లో (రచనల) ప్రధానంగా చూపించడం, ఉపయోగించుకోవటం సాధారణంగా ఇలాంటి ప్రాంతాలు పల్లె ప్రాంతాలై ఉంటాయి అయితే, 'పట్టణ' పారిశ్రామిక ప్రాంతాలు కూడా ఒక్కోసారి ఇలాంటి నవలల్లో చోటు చేసుకుంటాయి." (నళిని, ఎస్.ఎస్. 2009, పు.124-125).

ప్రతి ప్రాంతానికి ఇదమిత్థంగా ఒక లక్షణం అంటూ ఉంటుంది. ఆ ప్రాంతానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, అలవాట్లు వేషభాషలు, పండుగలు, జాతర్లు, నమ్మకాలు, పంటలు, ఫలసాయం, పశుపక్ష్యాదులు, వంటి ఎన్నో ఒక ప్రాంతీయతని నిలపటానికి కారణాలవుతాయి.

### 5.4.4.1 ప్రాంతీయ లక్షణం

సాహిత్యంలో రచనలు అవి ఏ ప్రాంతానికి సంబంధించి ఉంటాయో, ఆ ప్రాంతం అలవాట్లనూ, వేష భాషలనూ, చరిత్రను, నమ్మకాలనూ ప్రతిబింబించేలా ఉంటే దాన్ని ప్రాంతీయ లక్షణం అంటారు. "ప్రాంతీయ లక్షణాలున్న సాహిత్యాన్ని మరో ప్రాంతంలోని ప్రజలకు చేరాలంటే అనేక మార్పులు చేయాల్సి ఉంటుందని విమర్శకుల అభిప్రాయం" (నళని, ఎస్.ఎస్. 2009 పు.125).

పై లక్షణాల్ని కథలలోనో, నవలలోనో ఏ రచనల్లోనైనా సరే ప్రయోగించినప్పుడు అవి ఆ ప్రాంతీయ భావజాలాన్ని ప్రతిబింబిస్తాయి.

తెలంగాణ ప్రాంతం మీద మరో ప్రాంతం ప్రజలు సామ్రాజ్య వాద పెత్తనాన్ని చెలాయిస్తున్నారని తెలంగాణ కవులు, రచయితలు, మేధావులు తీవ్ర నిరసనను వ్యక్తం చేయడం ప్రారంభించారు. ఈ నిరసన స్పందన రెండు కలసి కాలక్రమేణ తెలంగాణ ప్రాంతీయ వాదం ప్రబలటానికి, ఎన్నో రాజకీయ, ఆర్థిక చారిత్రక, సామాజిక కారణాలున్నాయి. తెలంగాణ ప్రాంతీయవాదం కథలో, కవిత్వంలో నూతన అభివ్యక్తీకరణను ప్రవేశపెట్టింది.

### 5.4.4.2 గొల్లరామవ్వ

అప్పుడపుడే ప్రారంభమవుతున్న కాంగ్రెస్ పోరాటాన్ని దాన్ని ఆదరిస్తున్న యువతను అప్పుడే, కొత్తగా రాజాకార్ల పైన, నిజాం పోలీసులపైన, దొరలపైన వ్యతిరేకత ఎక్కువవుతూ అదొక ఉద్యమంగా మారుతున్న రోజులవి. ఇందులో రచయిత విద్యాగంధంలేని పోరాటాల ఉద్యమాల సంపర్కంలేని గొల్లరామవ్వనే ప్రధాన పాత్రగా చిత్రించాడు. రామవ్వ నైజాం పోలీసులన్న, దొరలన్న చాల భయపడే వ్యక్తి, స్త్రీలకు పరిపూర్ణంగా రక్షణ పోరాట ఆవశ్యకతను తెలియజేసే ఐతిహ్యం తాను తన మనుమరాలితో ఒంటరిగా ఉండటం దీనికి ప్రధాన కారణం. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన ఆగంతకుడి వల్ల మాన ప్రాణాలకు ఏ భంగం వాటిల్లు తుందోనని భయంతో అతని కాళ్ళు పట్టుకోవాలని ప్రయత్నించిన రామవ్వ అతడి శారీరక స్థితినీ, దెబ్బనీ ముళ్ళు చూసి అతన్ని రక్షించాలని ప్రయత్నించడమే కాక 'బిడ్డ' అని సంబోధిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో నైజాం పోలీసులను ఎదురిస్తూ ఉద్యమంలో ఉన్న ఆయువకుడి ప్రాణాల్ని కాపాడటానికి రామవ్వ తన మనుమరాలి భర్త అని అబద్ధం చెప్పడం. ఒకే పక్కమీద ఇద్దర్ని పడుకోమని గొంగలి కప్పడం ఆమె త్యాగ నిరతకి నిదర్శనాలు. ఏ మాత్రం నిజం బయటపడ్డా ముసలిదాని ప్రాణాలకే కాదు ఆమె మనుమరాలి మాన ప్రాణాలు కూడా ముప్పుతిప్పలు అయిన ఆ ఉద్యమస్ఫూర్తిని గౌరవించి ఆయువకుడ్ని కాపాడాలి అని ప్రయత్నించి సఫలం కావటం రామవ్వను ఒక సాదారణ స్త్రీ కాక కథకుడు తెలంగాణ భూమిగా, భూమికి ప్రతీకగా స్వీకరించడానికి ప్రతీకగా చెప్పవచ్చు.

### 5.4.4.3 ఊరుమ్మడి బతుకులు

“గంతేపటు కమ్మరికొలిమి, కల్లుమండువా ఊరుమ్మడి స్థలాల సొంటివి. ఊరోల్లందరికి పనికి మన బతుకులను ఊరుమ్మడి బతుకులు చయ్యాలనె చూస్తారు పెద్దోళ్ళు. మన ఆడోళ్ళ మానాలు కాపాడటానికి మనమెంతో కష్టపడాలె. మన పిల్లలు చదువుకుంటుంద్రు. ఆర్థికంగా తీరుగనే ఉన్నాం. మనతోటె గిట్ల ప్రవర్తిస్తుండంటే ఇగ పూర్తిగ పేదోనితో ఎట్లుంటారో ఆలోచించు. గిప్పుడే గిట్లుంటే యాభైయేండ్ల కింద ఎట్లుండెనో నీకెరుక కూటికి లేకున్నా

దొరతనం చెయ్యాలని చూస్తున్నారు. కొందరు వాళ్ళు బాగా బతికి నప్పుడింకెట్ల ఉండేవారో ఆలోచించు'' (మల్లయ్య కాలువ, 2005 పు.553). తరతరాలుగా మారని బతుకులు చదువు ఉద్యోగం పేరిట ఒక తరంలో మార్పు సంతరించుకుంటే మలితరం ఉన్నతస్థానానికి అధిరోహించడానికి అవకాశం ఏర్పడుతుంది. మూడు తరాల గురించి కాలువ మల్లయ్య రాసిన కథ ఇది. మధ్య తరమైన బాలగౌడ్ పాత్ర మాత్రం పేరు కల్గి ఉంది. అతని తండ్రికి కొడుకు పేరులేదు. కేవలం కల్లు గీసుకుంటూ బతికిన తమ బతుకుల్ని తలుచుకొని బాలగౌడ్ తండ్రి బాధ పడతాడు. ఎంత నిజాయితీగా ఉన్నా తమ నిజాయితికి గుర్తింపు లేదు. తమతో సరిగా మాట్లాడడం కూడా అవమానంగా భావించే వాళ్ళు అందరు అతడికి బాలగౌడ్ మీద చదువుకొంటున్న తన కొడుకు మీద నమ్మకం తప్పుగా తన బతుకులు బాగుపడతాయని కాని బాలగౌడ్‌కుమాత్రం తమతరం కాని రాబోయె తన కొడుకుతరం మీదనే నమ్మకం ఎక్కువ. అందుకే అతన్ని ప్రైవేటు బడిలో చదివిస్తున్నానని అంటాడు.

ఉత్తర తెలంగాణలోని గౌడుల జీవితాల్లో ఏర్పడుతున్న మార్పుల్ని అప్పుడప్పుడే తొంగి చూస్తున్న విద్యాసక్తిని మరింత ఎదగాలన్న కోరికను వెలిబుచ్చుతూ ప్రాంతీయవాద ధోరణిలో కాలువ మల్లయ్య రచించిన ఈ కథ పేర్కోదగింది.

### 5.4.4.4 దొరమల్లా వచ్చిండు

కె.వి. నరేందర్ రాసిన *దొర మల్లా వచ్చిండు* కథలో పరమేశ్వరరావు 17 ఏళ్ళ తర్వాత మళ్లీ ఊర్లోకి రావటం ఊరి వారందరికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. వచ్చీరాగానే అందరినీ పలకరించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. వచ్చిన వెంటనే బడికి గడీనివ్వటం, పశువుల దొడ్డిని కమ్యూనిటిహాలుగా మార్చివ్వటం, అందరిని ప్రేమగా చూడటంతో అందరూ అతన్ని నమ్ముతారు. అతడు పేరు పేరునా పలకరించి, కావాల్సిన సహాయాలు చేస్తాడు. తన్ను చిన్నప్పుడు ఎత్తుకుని పెంచిన మొగిలయ్యను దగ్గరగా తీసుకుని పలకరిస్తాడు. అతడి కొడుకు నక్సలైట్స్‌లో చేరి తన్ను చంపడానికి ప్రయత్నించడం వల్లే తాను పట్నం వెళ్ళిబాగా సంపాదించానని చెప్పి అతడి కళ్ళకు ఆపరేషన్ చేయించి కళ్ళజోడు పెట్టిస్తాడు. చివరగా

బయలుదేరే ముందు మొగిలయ్య మనవడికి తాతగురించి జాగ్రత్తలు చెప్పి, తాను ఎమ్మెల్యేగా నిలబడుతున్నానని, తన్ను గెలిపించమనీ కోరుతాడు. మొగిలయ్య మనవడుకూడా చూడకుండా కళ్ళజోడు విసిరేస్తాడు.

ధనమదంతో, అధికారంతో చేసిన అత్యాచారాలు, హత్యలు, పంచాయితీలు ఎన్నెన్నో చూసిన మొగిలయ్య కొడుకు అయిష్టంతో బాధపడి, తర్వాత ఎదిరించి, చివరకు అన్నల్లో కలిసిపోయి, దొరను చంపాలని రెండుసార్లు ప్రయత్నిస్తాడు. రెండోసారి పట్నం పారిపోయిన దొర 17 ఏళ్ళతర్వాత వచ్చి, తన ఊరి ప్రజలతోప్రేమగా, అభిమానంగా మాట్లాడ్డానికి వెనుక నున్న రహస్యం ఊరి ఎమ్మెల్యే అవ్వాలన్న కోరికతోనే, తప్ప దొరలో మార్పు వచ్చి కాదన్న నగ్న సత్యం బోధపడిన తర్వాత మొగిలయ్యకు ఆపనిమీద కానీ, ఆ దొరను గెలిపించడం మీదకానీ మాత్రమే కాదు, చివరకు ఆ దొర దయతో వచ్చిన కంటి వెలుగుమీద కూడా అయిష్టమే! అంటే ఆ దొర అభిప్రాయం ఇప్పుడు దొరగా కాకపోతే ఎమ్మెల్యేగా, కుదిరితే అవకాశం ఉంటే మంత్రిగా ఎలాగైనా ఏ రూపంతో, ఏ పేరుతో అయినా సరే అధికారం దొర దగ్గరే ఉండాలి. ఆ పిచ్చి కోరికకు, ఆ అధికార దాహానికి బలవటం ఇష్టం లేక, వచ్చిన చూపును కూడా కాదనుకుంటాడు. అధికార దాహానికి బలవటం ఇష్టంలేని ఆ గుణం ఈ చూపుకన్నా ఆ గుడ్డితనమే బాగుందని అనుకుని మనవడితో చెప్పటం అలాగే కళ్ళజోడు విసిరేయడం ఆ అధికారానికి స్వస్తి పలుకుతూ, దాన్ని కాదంటున్నందుకు ప్రతీక. ఆ ప్రాంతంలోని ఈ అధికార దాహాన్ని ప్రజల అజ్ఞానాన్ని, ఎప్పుడో మేల్కొంటే జరిగేదేంటి అని కథకుడు వివరించాడు.

### 5.4.4.5 నిత్యగాయాల నది

నేను అంటూ ఉత్తమ పురుషలో నడుస్తుంది కథ. కథ నడిపే ప్రధాన పాత్ర 'ఆమె' అంటూ ఒక స్త్రీ గురించి ప్రత్యేకించి మాట్లాడటం చూస్తే అది కేవలం ఒక పాత్రను పరిచయం చేస్తున్నట్లనిపించదు. ఆమె దాస్ కాపిటల్, భాగవతం రెండూ చదవగలదు. ఎవరినీ పట్టించుకోదు. ఒక్కోసారి అందరితోనూ మాట్లాడుతుంది. బడిలో చదువుకునే పిల్లల్ని 'కొమరం

భీము' గురించి అడుగుతుంది. అల్లూరి సీతారామరాజు గురించి పిల్లలు తెలుసుకోవచ్చుకానీ, 'కొమరం భీము' గురించి తెలుసుకోకూడదా అని ప్రశ్నిస్తుంది. అలా తెలుసుకుంటే, లేదా, తెలియ చెప్పడానికి ప్రయత్నిస్తే అది తప్పేనా? అది నక్సలిజమేనా అని ప్రశ్నిస్తుందామె. తమ జీవితాలకు వెలుగిచ్చిందెవరు? తమ బ్రతుకుల్లో వెలుగు కోసం ప్రాణాలొడ్డిందెవరు? ఇవేవీ తెలుసుకోవాల్సిన అవసరం తర్వాతి తరానికి లేదా? తెలపాల్సిన అవసరం మనకు లేదా? అలా చెప్తే, అది తప్పనీ, అధికారం ఉందికదాని ఎవరినైనా సరే ఎదుటివాళ్ళను హింసిస్తే, దాన్ని అలాగే స్వీకరించ నక్కర్లేదు. అదే పరిస్థితుల్లో తమ కష్టాల్ని, ఇతరులకు చూపించుకోవాల్సిన అవసరం లేదు. ఇదంతా ఆమె తెలంగాణ భూమికి ప్రతీక అని కథకుడు సూచించడం కాదు, వాచ్యం చేయించడంతో మారిపోయింది. ఆమె కోటి రతనాల వీణకు ప్రతీక.

### 5.4.4.6 ఎల్లమ్మ

సత్య పెద్దగా చదువుకొన్నది కాదు. కానీ, వివేచన గలది. పెద్ద అందగత్తె కాదు వ్యవహార దక్షత కలది. బాలమ్మ కొడుకు ఎల్లారెడ్డిని వివాహం చేసుకోవద్దని ఎన్నో ఆకాశరామన్న ఉత్తరాలు వచ్చినా ఆమె అతడినే చేసుకుంది. పెద్దగా డబ్బుల్లేని కుటుంబమే అయినా తల్లితండ్రులు పెళ్ళికిచ్చిన డబ్బులతో ఒక కిరాణాకొట్టు పెట్టించింది. అత్తింటి అయిదు ఎకరాల నేల సాగుకు బోరువేయించింది. రెండూ పనిచేయటం వల్ల చేతిలో డబ్బులు ఆడుతున్నాయి. ఇంటికి లక్ష్మి వచ్చిందని భర్త, అత్త ఆమెను చాలా ప్రేమగా చూసుకుంటున్నారు. ఆమె అత్త బాలమ్మకు ఎల్లమ్మ పూనటం చూచి, సత్య దడుచు కుంటుంది. అందరూ అన్నది ఆమెకు అర్థం అయింది. హేతువాద దృష్టితో ఆలోచించి గోడకు పట్టిన పుట్టను తీయించి, అప్పుడప్పుడు శుభ్రం చేయిస్తుంది. అత్తకు పూనిన ఎల్లమ్మతో మాటలాడి ఆమెను తమ ఇల్లు విడిచి మరెక్కడికైనా పొమ్మంటుంది. అందువల్ల ఏదైనా చెడు జరిగేటట్లుంటే అది తనకే జరగాలి తప్ప సత్యకు కాదని ఆమె పసితనాన్ని మన్నించమని వేడుకొంటుంది. ఒంటరిగా పొలం వెళ్తున్న సత్యకు నల్లటి స్త్రీరూపం ఎదురయింది. నుదుట

పెద్ద బొట్టు, పచ్చటి చీర, పచ్చటి రవికకు జాజురంగు అంచు తానే ఎల్లమ్మనని చెప్పుకుంది. హేతువాదంతో ఆలోచించి, ప్రవర్తించినా ఎదుట నిలిచిన రూపాన్ని ఆమె కాదన లేదు. మాట్లాడిన వెంటనే చుట్టూ పొలాలే అయినా ఆమె మాయమవటం కాదనలేని సత్యం. పినతండ్రితో ఆమె ఈ విషయాలన్నీ ముచ్చటిస్తుంది. నమ్మలేని నిజం అని చెప్తుంది. అది భ్రాంతి అని కొట్టి పారేస్తారు అందరూ కానీ, అది నమ్మక తప్పని నిజం అన్నది ఆమె అభిప్రాయం.

''తెలంగాణలో బాణామతి ప్రయోగాలు దేవతల పూనకాలు వంటివీ సామాజిక సమస్యలే వీటికి రెండుకోణాలున్నాయి. సమాజంలో కొన్ని వర్గాల వారే వాటి బారిన పడటం, మరొక కోణంలో మరొక వర్గం వాటిని పెంచిపోషించి, తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవటం - వ్యక్తులు, వ్యవస్థలు సమిష్టిగా కృషి చేయకపోతే ప్రజల్లో శాస్త్రీయ దృష్టి పెరగదు'' (వెంకటేశ్వరరావు, దార్ల ఎల్లమ్మకథలు, జూన్ 2006 పుట ).

తెలంగాణలో ఉన్న ఒక సామాజిక సమస్యను ఆధారం చేసుకొని అటువంటి దాని గురించి ఒక కొత్త కోణాన్ని చూపిన కథ. కాసుల ప్రతాప రెడ్డిగారికి తెలంగాణాలోని ఈ సామాజిక సమస్యల పట్ల ఉన్న అవగాహనకు ఈ కథ ఉదాహరణ. కథకుడు హేతువాద దృష్టితో ఇంట్లో పుట్ట పెట్టటం అనేది తేమవల్ల వచ్చే ఒక రకమైన అనారోగ్యకర కారణంగా భావించి దాన్ని నివారించే చర్యలన్నీ చేయిస్తాడు ముఖ్యపాత్ర సత్యచేత. అక్కడితో ఆగలేదు. తర్వాత జాగ్రత్తలూ తీసుకుంటుంది. బాలమ్మపై పూనిన ఎల్లమ్మకూ సత్యకూ మధ్యన జరిగిన సంభాషణ అలాంటిదే ఎల్లమ్మను తన ఇంటి నుంచి వెళ్ళిపొమ్మంటుంది సత్య. ప్రపంచంలో ఎంతో చోటుంది. కనుక ఎక్కడికేనా వెళ్ళమంటుంది. అలా వెళ్ళిపోయిన ఎల్లమ్మ పొలం వెళ్తూ వాగులో అడుగువేసినపుడు ఎదురయింది.

''బిడ్డా! తల్లికి బిడ్డల మీద కోపం ఉంటదా? ఉండదు. తల్లి పిల్లలనుంచి కోరికలు కోరలేదా? కోరది. తన బిడ్డలు ఎల్లకాలం చల్లగా ఉండాలని దీవిస్తది'' (ప్రతాపరెడ్డి, కాసుల 2006 పు.113). అని అన్నది. ఆ మాటలు అంటూ అంటూనే మాయమైంది. సత్యవాదనను

ఆమెకే అప్పచెప్పినట్లయింది. తల్లికి బిడ్డల మీద కోపం రాదన్న ఆమె వాదం సత్యదూరం కాదు. నిజానికి ఆమెలో హేతువాద ధోరణి ఆమెకు సహాయం చేసిన ఆమెకు ఎదురైన అనుభవం విచిత్రమైంది ఇక్కడ రచయిత వాగులో అడుగుపెట్టిన సత్య కళ్ళ ముందర ఎల్లమ్మను నిలిపాడు. అది ఆమె భ్రాంతేనా అంటే అక్కడ చుట్టు ఉన్నది ఖాళీస్థలం మాయమైన ఎల్లమ్మ ఎటుపోయినట్టు! మానసిక భ్రాంతే కాకుండ ప్రపంచంలో ఉన్న మానవాతీత శక్తిని ఊహించుకోగల నేర్పు కూడా మనిషికుంటున్న దానిని కథకుడు సూచిస్తున్నాడు. ఆమె చూసింది ఎల్లమ్మనో కాదో, చూసింది నిజమో కాదో ఆలోచించ వలసిన అవసరం ఉన్నా ఆమె మాత్రం చాలా రోజులు దాన్ని గురించి మాట్లాడలేదు. కాని, హేతువాదం గురించిన చర్చ వచ్చినపుడు పూనకం వంటివన్ని కేవలం కల్పితాలు, కల్పనలని కొట్టిపారేసినపుడు ఆమె మాట్లాడక తప్పలేదు. పుట్టపెట్టడం అయితే పరిశుభ్రతా లోపం వల్ల కావచ్చు ఏమోకాని పూనకం మానసిక రుగ్మత అయి ఉండవచ్చునేమో కాని పట్టపగలు బట్ట బయలులో కనిపించిన ఎల్లమ్మ మానసిక భ్రాంతి మాత్రమే కాదు అని కథకుడు సూచించిన విషయం కథకుడు నాస్తిక వాదాన్ని పెంపొందిచడానికి ఏ ప్రయత్నం చేయలేదు. అయితే ఒక వర్గం మరొక వర్గాన్ని అజ్ఞానంలో ఉంచుతూ ఆ అజ్ఞానాన్ని తమకు సాధనంగా మార్చుకుంటూ అధికారం చెలాయించటాన్ని ఖండిస్తున్నాడు.


ఇది కథలో సామాజిక విశ్లేషణకి అయితే, రచయిత కథాశిల్పంలో ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు. భారతీయ భాష 'కొసమలుపు' అని చెప్పే ఒక శైలికోణాన్ని కథకుడు ఇందులో మార్చి చూపించాడు. మామూలుగానైతే ఎల్లమ్మ కనిపించటం కథకు కొసమలుపు అయ్యేది. కాని హేతువాద దృష్టితో ఆలోచించి వ్యవహరించిన సత్యకు ఎల్లమ్మ కనిపించడం, పినతల్లి భర్త అటువంటి నమ్మకాలు అన్ని భ్రాంతులే అనడం, అతని కొడుక్కే ఆకాశంలో కాగడ కనిపించడం కథలో కథకుడు చూపించిన శైలీ విన్యాసం. సాధారణంగా కథలో ఒక అనుకోని మలుపు ఆ కథకు గుర్తింపు తెస్తుంది. ఈ కథలో అటువంటి మలుపు తిరిగాక, కనిపించే మరో సంఘటనలో రెండు మలుపుల్ని ఒక దానితో ఒకటి పెనవేసి కథకుడు ఒక కొత్త శిల్ప ఆవిష్కరణ చేశాడనవచ్చు.

## 5.5.0 తెలంగాణ భాష

భాష భావానికి వాహకం సాహిత్యంలో భాష ఒక మాధ్యమమే అయినా ఆ మధ్యమానికి ప్రాముఖ్యత చాలా గొప్పది. భాష భావ వ్యక్తీకరణకు సాధనం. వ్యక్తి తన మనోగత భావాలను భాష ద్వారానే బయలు పరుస్తాడు. ఏ ఇద్దరు వ్యక్తులు మాట్లాడే భాష ఒకటి కాదన్నది ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త ఛామ్‌స్కీ అభిప్రాయం, జన్యుపరంగా సంక్రమించే భాషను ప్రతి వ్యక్తి పరిసర ప్రభావం వల్ల, అనుకరణ వల్ల పెంపొందించుకుంటాడు. భాషాశాస్త్ర పరంగా చూస్తే మాండలికం భాషకు సూక్ష్మరూపం తెలుగు భాషకు ప్రధానంగా నాలుగు మాండలికలున్నాయి. అవి కళింగ మాండలికం, మధ్య మాండలికం, తెలంగాణ మాండలికం, దక్షిణ మాండలికం వీటిలో తెలంగాణ మాండలికం ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నది. ఆ భాషలో ఉర్దూ, పారశీక, అరబ్బి భాషా పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. స్వాతంత్ర్యానంతరం ఏడాదికి పైగా నైజాం పాలనలో ఉండిపోయిన ఈ ప్రాంతంలో పాలన ఆ విషయాలకు సంబంధించిన భాష అంతా ఇలాంటి ప్రత్యేక మాండలికానికి సంబంధించింది. తెలంగాణ ప్రాంతంలో వెలువడిన మొట్టమొదటి పత్రిక 'సేద్య చంద్రిక' తరువాతి కాలంనాటి 'హితబోధిని' 'ఆంధ్ర మాత', 'సుజాత' వంటి పత్రికలన్ని తెలుగుకు మాతృభాషగా స్థానం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించినవే, తెలుగు భాషకు ప్రోత్సాహం ఇచ్చినవే. 1950 ప్రాంతంలో కాళోజీ, దాశరథి, పి.వి. నర్సింహరావుతో సహా చాలామంది ప్రముఖులు సహా తెలంగాణ కథకులుగా పేరు పొందారు.

## 5.5.1 తెలంగాణ భాషాభేదాలు

తెలంగాణ కథల్లో కనిపించే భాషను ముఖ్యంగా నాలుగు విధాలుగా విభజించారు. తొలితరం కథకులు వాడిన గ్రాంథిక భాష, తరువాతి తరంవారు రాసిన వ్యావహారిక భాష, ఆధునిక రచయితలు కూడా వాడుతున్న మాండలిక భాష, గ్రాంథిక వ్యావహారిక, మాండలికాలు మిశ్రమంగా కనిపిస్తున్న మిశ్రభాష. ఈ మిశ్రమ భాషలో మళ్ళీ మూడు రకాలుగా విభజించవచ్చు. గ్రాంథికం వ్యావహారికం కలిసినది. ప్రామాణిక భాష మాండలిక భాష కలసినవి. గ్రాంథిక మాండలికం కలిసినవి (పట్టిక చూడు...)


భాష
గ్రాంథికం
వ్యావహారికం
మాండలికం
మిశ్రమం
గ్రాంథికం + వ్యావహారికం
వ్యావహారికం + మాండలికం
గ్రాంథికం+ మాండలికం

### 5.5.2 గ్రాంథికం

గ్రంథస్థమైన భాష గ్రాంథికం అనేది సాధారణ నిర్వచనం. కాని ప్రాచీన సంప్రదాయ వ్యాకరణ రీతికి ఏ మాత్రం మార్పు చెందని భాష గ్రాంథికం ఇటువంటి రచనారీతి తొలితరం కథకులందరిలోను దాదాపుగా కనిపిస్తుంది. సిరుగూరి జయరావు రాసిన *పరమాణువులో మేజువాణి* అనే కథ పూర్తిగా గ్రాంథిక భాషలో రచింపబడ్డది ఐన్‌స్టీన్ వంటి విజ్ఞాన వేత్త పేరునుకూడా సంధితో యడాగమం చూపించనంతటి గ్రాంథికం.

"నేను కరిగిపోతిని కనుక, సచ్చిదానంద రూపినై యా మార్పులను గనుకొంటిని లేనిచో నేను గూడా నా మార్పులనే వానితో గూడ జెంది, యా మార్పులు కలుగుచున్నట్లు గ్రహించుకొనలేక పోయియుండును. దీనినే భూలోకములో యైన్‌స్టీన్ తన రిలేటివిటి - తారతమ్య సిద్ధాంతములో సూచించినాడు" (సుజాతారెడ్డి ముదిగంటి 2002, పు.19)

*ఎవరికి?* మాడపాటి హనుమంతరావు రాసిన కథ ఒక జమీన్ దారు అతని గుమస్తాలకు మధ్య జరిగిన సంభాషణ. ఈ కథలోని భాషా వైశిష్ట్యం చివరకు రైతులు మాట్లాడే భాష కూడా గ్రాంథికమే కావడం "దొరగారూ? ఆయనను మీరు ఏమీ అనకూడదు. అతడు మనుష్యుడు కాదు. దేవత. అతడు మాకు మాటిమాటికి 'యజమానునితో పోరాటము వలదు జాగ్రత్త' అని హెచ్చరించుచుండువాడు. మా దగ్గర పంచపాత్రుడు మంచి నీళ్ళయినను త్రాగిన పాపమున పోలేదు! పోవునపుడు మాతో గట్టిగా, యజమానికి మీరు యెంతెంత బాకీయున్నారో అది పైసా పైసా లెక్కచేసి పంపించండి! అని చెప్పిపోయెను. తమరు మాకు అన్నము పెట్టే దొరలు. మేము మీ నీడలో ఉన్నాము. ఈ శరీరములు మీకు పెట్టిన ఆహారము వలన పెరిగినవి. కనుక మా మనవి యేమనగా, మా లెక్క పత్రము జూచుకొని మేము ఎంత బాకీ యున్నామో చెప్పండి. సొంతము చెల్లించిగాని మంచి నీళ్ళు తాగము" (హనుమంతరావు మాడపాటి 2005 పు.9)

తొలితరం కథకుల్లో చాలామంది గ్రాంథికానికి పెద్దపీట వేశారు. అప్పుడప్పుడే వెలుగు చూస్తున్న పత్రికలు కూడా కథలను గ్రాంథికంలోనే ఎంపిక చేశాయి సురవరం ప్రతాపరెడ్డి,

ఒద్దిరాజు రాఘవరావు, నందగిరి వెంకట్రావు, భాగ్యరెడ్డి వర్మ మొదలైన రచయితలు ఈ శైలికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ కథల్లో మరో విశేషం ప్రతి సంఘటనను విడిగా అంకెలతోటే లేదా నాటకంలో లాగ జరుగుతున్న చోటును మాండలికంలోనో చూపించటం.

### 5.5.3 వ్యావహారికం

గిడుగు వారితో బలం పుంజుకున్న వ్యావహారిక భాష సాహిత్యంలోని ప్రతి విభాగంలోనికి చొచ్చుక పోయింది. అయినా తొలితరంలో గ్రాంథిక వ్యావహారికాల మిశ్రమం కొద్దోగొప్పో కనిపిస్తుంది. ప్రామాణిక భాష పూర్తిగ సంపూర్ణత్వాన్ని సంతరించుకొని ఆ కాలంలో గ్రాంథిక భాషకు దగ్గరగా ఉండే వ్యావహారిక భాషే కథల్లో కూడ చోటు చేసుకొంది. ఉదాహరణకు కాళోజి 'తెలియక ప్రేమ తెలిసి ద్వేషం' తో - ''ఇంకే భాష మాట్లాడమంటారు మమ్మల్ని మేము మాట్లాడేది అచ్చం తెలుగే మహాప్రభో ఏమి! ఏమి! తెలుగే అట్లయితే నీవు నిజాం రాష్ట్రాంధ్ర సోదరుడవేనా తండ్రీ? అందుకే నిన్ను చూడడంతోనే ఒక విధమైన సోదర ప్రేమ కలిగింది. నాయినా అయితే ఇక్కడికెలా రావడమైంది బాబూ?'' (సుజాతారెడ్డి ముదిగంటి 2002 పు.74)

తరువాతి కాలంలో భాషలో మార్పు చక్కగా కనిపించడం ప్రారంభించింది. వట్టికోట ఆళ్వారుస్వామి - *పరిగె* ''కొద్ది సమయంలో ఇతర కూలిపని చేసుకోవడం కూడా ఒక్కొక్కప్పుడు సాధ్యం కాకపోయేది. మల్లయ్య ఒక్కొక్కప్పుడు ప్రభుత్వాధికారుల బరువులకనీ పోవడం చెల్లెలు గ్రామ బేగారి పనిచేస్తే తండ్రిని చూసుకోవడం జరుగుతుండేది'' (సుజాతారెడ్డి ముదిగంటి 2002 పు.123).

పై రెండు ఉదాహరణలలో వ్యావహారిక భాష ప్రయోగింపబడ్డది రెండింటిలోను వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అందులో పూర్తిగా గ్రాంథికం వాసన తొలిగిపోలేదు. దాదాపు ఒక తరం మారిన తరువాత అంటే 1960 తరువాత కథల్లో భాష వ్యావహారికమే. అయితే ఇక్కడ భాషలో ఇంతకు ముందు ఉన్న గ్రాంథిక భాష వాసన తొలిగిపోయింది. ఉదాహరణకి ఊటుకూరు రంగారావు రాసిన *ఆశాభంగం* కథలో ''ఇంతకీ, ఎక్కడో ఎర్రని

కాషాయ వస్త్రాలు ధరించి, హాయిగా ముక్కు మూసుకోక ఈయనకీ నా పెళ్ళి గొడవెందుకు చెప్పండీ! ప్రపంచంలో కొన్ని విరుచకపడతారేం కర్మో తెలియక చావోస్తోంది నాకు'' (రంగారావు ఊటుకూరు 2005 పు.173)

గ్రాంథిక భాషకు అతి దగ్గరగా వినిపించిన తొలి నాటి భాషకు, 1940-50ల మధ్య బలం పుంజుకుంటున్న వ్యావహారిక భాష వాదానికి సమంగా అనిపించే భాష గ్రాంథికానికి పెద్ద తేడాలేని తెలుగు రచనల్లో చోటుచేసుకుంది. 1960ల తరువాత భాష పూర్తిగా వ్యావహారిక రూపాన్ని సంతరించుకొంది.

### 5.5.4 మాండలికం

తెలంగాణ వాదం ప్రబలుతున్న కాలంలో వ్యావహారిక భాష మీద ముఖ్యంగా ప్రామాణిక భాష మీద తెలంగాణ కవులకు, రచయితలకు అనాసక్తత ఏర్పడ్డది. తమ భావ జాలాన్నంతా, తమ జీవన చిత్రణంతా తమది కాని భాషలో రాస్తున్న అసంతృప్తి తెలంగాణ రచయితల్ని ఆవరించింది. తమదైన భాషలోనే రచనలు చేయాలని వాళ్ళు నిశ్చయించుకున్నారు. దానికి విద్యా అర్హతలు ఏవి అడ్డురాలేదు. తమ మాండలికాన్ని రచనల్లో చొప్పించడం మొదలు పెట్టారు. నిజం చెప్పాలంటే తెలంగాణ మాండలికంలో వెలువడ్డ కథల్లో ఒక్కొక్కసారి ప్రాంతీయ మాండలికమే కాకుండ వర్గ మాండలికం కూడా కనిపిస్తుంది.

### 5.5.4.1 ప్రాంతీయ మాండలికం

''మా బావమరిది గాడెందుకు సంఘంలో కలువాలె? కలుస్తే దొరలు చేతులు ముడగబెట్టుకొని చూసుకుంటూ కూర్చుంటారా? వాళ్ళు చేసేది వాళ్ళు చేశారు. అధాలతంటే మాటలా? అధాలత్ అంటేనే అధాహోలత్ ఖతమన్నమాట. కోర్టుల్లో కేసునామనేశుని కాదు. . . . కేసుతెగది ఇల్లు మిగలదు. నేను మా గౌరితో గిదే మాటంటే గిదె నిలవెడెత్తు లేసింది. దానికేం తెలుసు వ్యవహారమంటే తొక్కు నూరడమను కుంటున్నదేమో?'' (రాజయ్యఅల్లం 2005 పు.294).

''నువ్వు వూర్లెకు బోయినంక ఇప్పట్నించి నా గురించి చెప్పాలె. ఊరంత ఒకటి చెయ్యాలె. ఇంక ఏడెనిమిది నెలల్లో ఎలక్షన్లు వస్తున్నాయ్. ఈ సారి ఎమ్మెల్యే టికెట్ నాకే వచ్చేటట్టుంది. మనూర్లో నుంచి ఒక్క ఓటు కూడా వేరోటోనికి పోవద్దు. నువ్వు కాపాడాలె అన్నాడు దగ్గర తీసుకుంటూ''. (నరేందర్, కె.వి. 2005 పు.694).

పై రెండు ఉదాహరణల్లో తెలంగాణ మాండలిక భాష ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ భాషలో ఉర్దూ భాషా పదాలే కాకుండ 'గాడు', 'గది', 'గిదె' వంటి పదాలు 'తెగది', 'కలువాలె', 'నిలవడెత్తు', వంటి క్రియలు 'చేతులో ముంగ బెట్టుకొని' వంటి మాండలిక పదాలు కనిపిస్తున్నాయి.

'పోయినంక', 'చెప్పాలె', 'చెయ్యాలె', 'పోవద్దు', 'కాపాడలె', వంటిక్రియలు, 'వూర్లెకు', 'ఊరంత', 'నెల్లల్ల', 'మానూర్లె', 'వేరోటోనికి', వంటి విభక్తి ప్రత్యయంతో కలిసిన నామవాచకాలు తెలంగాణ ప్రాంతీయ మాండలికానికి విస్పష్టమైన ఉదాహరణలనవచ్చు.

### 5.5.4.2 వర్గమాండలికాలు

(అ) ''సౌందర్య వాళ్లు మోటాటి రెడ్లు, మేం పాకనాటి, మామేనత్త వాళ్లు గూడాటి రెడ్లు, రెడ్లలో ఎనిమిది రకాల రెడ్లు ఉన్నారు. వీరి మధ్యకూడా అంటరాని తనమేదో ఉన్నట్లు నా కనిపించింది''. .. . ''నువ్వు గనక వాడిని కాదనక పోతే వాడి ప్రాణాలుండవు. మీ నాయన వాడ్ని చంపేస్తాడు''.

వ్యవసాయం చేసే రెడ్లల్లో కొన్ని తెగలున్నాయి. ఆ తెగల్లో పెద్దగా భాషలో భేదం లేకపోయినా ఆ వర్గానికంటూ ఒక రకమైన భాష ఉంటుంది. అలాంటి భాష బోలెడన్ని కథల్లో కన్పిస్తుంది.

(ఆ) పెద్దింటి అశోక్‌కుమార్ 'సావుదప్పు' కథలో చావుకు డప్పుకొట్టే వాళ్ళ జీవితాల్ని వర్ణిస్తాడు. వాళ్ళభాషలో విశేషాల్ని కూడా వర్ణిస్తాడు.

''మా గ్రూపుల అందరూ చెయ్యి తిరిగిన డప్పువాల్లే. కొట్టి కొట్టి రగుదుమాలినోళ్ళు.

ఎటొచ్చీ నేనే పిల్లగాన్ని, నాకున్న ఆయాసం వాళ్లకు లేదు. కొద్దిసేపు డప్పును ఆపి పక్కకు జరిగిన. నా ఆయాసం చూసిన అందరూ నన్ను విడిచి దూరం కట్టింండ్రు'' (పు.19)

''నాయినైతే దీక్షగా గాజు పెంకుతో కోలను నున్నగా గీకుతున్నాడు''

''తొవ్వ సాగాలని బదలముందుకు నడిచిన నాలుగు అడుగులు ముందుకు వెయ్యనే లేదు. ఎవరో అడ్డువచ్చి 'మెల్లగ పోనీ' అన్నాడు (పు.19) అశోక్ కుమార్, పెద్దింటి 2007)

జూకంటి జగన్నాథం రాసిన *కళేబరం* కథలో ఒక రైతు బర్రె చనిపోతే దాన్ని తీసిపారేయాలని మాట్లాడేటప్పుడు ఏర్పడ్డ పంచాయితీలో వాడిన పద జాలమంతా ఆ వర్గమాండలికమే. . . ఉదా.

''అంతవరకూ వేపపుల్లను పట్టి గట్టిగా తోముతున్న కనుకయ్యలేచిపోయి పక్కకు ఊంచి వచ్చి సరాయించే సరికి అందరూ కనుకయ్యదిక్కు ఏమి చెప్పుతాడోనని తిరిగారు'' మన పెద్దమనిషి మంచిగనే చెప్పు కచ్చిండు. గనిగీకాలంలో ఎవ్వరూ ఆపని సేత్తలేదవీ. సచ్చిన పసరాల తోల్లను నానబెట్టే 'లందలు' మన ఇండ్లల్ల నుండి ఎప్పుడో మాయమై పోయినయి. సెప్పులు, జోళ్ళు కుడుతున్నామా? పగ్గాలు, శాంతి పేనుతున్నామా? ఈతబరిగె తీసుకత్తున్నామా? వరికోత్తుంటే పరిగె ఏరుకుంటున్నామా? వడ్లు తూర్పార పడుతుంటె గొంగడి కొప్పెర కప్పుకొని పాల్లు కొడుతున్నవమా? పొల్లు తోపాటు వడ్లు కొడుతున్నామని ఎవసందారులతో తిట్లు తింటున్నామా? రైతులకు మాదుగులకు నడుమనున్న కట్టు ఆల్లకూ తెలవకుంట మనకూ ఎరుక లేకుంట ఎప్పుడో తెగిపోయె. (తెలంగాణ కథలు 2005 పుట 507).

పై ఉదాహరణల్లో కనిపిస్తున్న వర్గమాండలిక పదాలుగా ఆయా వృత్తులకు సంబంధించిన పనిముట్లను వాడుకను చెప్పవచ్చు. 1) జంబుదుకం కట్టింండ్రు. 2) పెంకుతో కొలనునున్నగ గీకుతున్నాడు, 3) లందలు - తాళ్ళను నానపెట్టి ఒక రకం తొట్టె 4) పగ్గాలు, శాంతాలు - జంతువులను కట్టె పగ్గపు తాళ్ళు చాంతాడు. 5) ఈత బరిగె - ఈత మట్టనుంచి

తీసే పీచు 6) గొంగడి కొప్పెర కప్పుకొని పొల్లుకొడుతున్నాయా? వ్యవసాయ కూలీలు వడ్లు తూర్పార పట్టెటప్పుడు మీద ఏమి పడకుండా గొంగళి కప్పుకొని రాశిపోసిన తరువాత వడ్లను చేటతో విసరడం ఇలా చేయడం వల్ల ధాన్యంగింజ మిగిలి ఒట్టి తాలు ఎగిరిపోతుంది.

(ఇ) పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన *జిద్దు* కథ మాంసం అమ్మే కటికవాళ్ళకథ. ఆ వర్గ ప్రజలు వాడే భాష ఈ కథలో చక్కగా విన్పిస్తుంది.

"ఎన్నో పంచాదులు పుట్టినయి ఇద్దరిని నేనే సదురుకస్తున్న కల్లాల దగ్గర అడుక్కచ్చిన వడ్లు దొంగతనంగా అమ్ముకుంటున్నాడని మా అన్న పిరాదు. అలాల్ చేసినప్పుడు రైతుల దగ్గర పైసలు అడుగుతున్నడని అందుకే కల్లాల దగ్గర వడ్లు పెడుతలేరని మా తమ్ముని పిరాదు" (పు.2)

"గొర్రె పెండ్లాం ముండవొయ్యి ఒక్కటే మంకుల లేచినిలవడ్డది" (పు.4)

"అట్లనో ఇట్లనో గార్లను అలాల్ జేసిన" (పు.4) అలాలే - మాంసం కోసం జంతువును కోసేటప్పుడు చేసే ప్రార్థన.

(ఈ) దొడ్డిరామ్మూర్తి రాసిన *తిత్తి* కల్లుగీచేవాళ్ళవర్గమాండలికాన్ని ప్రతిబింబిస్తుంది.

"ఏమని సెప్పకొడ్క, ఉన్నవొక్కగానొక్క పోరడు గర్వంగ సాదుక్కన్న మొన్నీ మజ్జల్నే బీమారొచ్చి ఆల్లమ్మకాలంజేసింది. ఆడీడ అప్పుసప్పు దెచ్చిపెట్నా దక్కదాయె. యేదన్నా కూల్నాలి జేద్దామంటే మదిమసూలల్నాప్పాయె. యెట్ట జెయ్యాల అప్పిచ్చినోన్కి కట్టాలని పోరన్ని వకయ్యతాన జీతముంచ్న. ఆడుమునాస్టకాపోడు. యెప్పుడుముక్కుమీన్నే కోపం. (పు.554-5)

1) గర్వంగ - గారాబంగ, 2) సాదుక్కన్న - పెంచుకున్న, 3) తెచ్చిపెట్నా-తెచ్చిపెట్టాను, 4) అయ్యతాన - అయ్యవద్ద/దగ్గర, 5) ఉంచ్న - ఉంచాను, 6) మునాస్టకాపోడు - ముదనష్టపు కాపువాడు - వంటి రూపాలున్నాయి.

"తాటిచెట్టు మొగదలలో నిలబడి, కావడి బద్దదించి, ఓ ప్రక్కగా ఉంచాడు. లొట్టిని ముస్తాడుకున్న కొక్కానికి తగిలించాడు. కత్తుల్ని చేత్తో తడిమి చూసుకొన్నాడు. పంచెకట్టులో

దోపిన చిరత బద్దని తీసి క్రింద పడేసి, మోకందుకొని బుజాల క్రిందుగా, నడుం మీదుగా తాటి చెట్టు చుట్టూ తిప్పిరొక్కంతగిలించాడు. . . .కాళ్ళు గుది అందుకొని, కుడిపాదానికి తగిలించి చేతి పట్టుతో నాలుగైదు బారలు చెట్టెక్కి, కాళ్ళగుదిలో ఎడమ పాదాన్ని కూడా మార్చి రెండు పాదాల్ని చెట్టుకు దొప్పలా మోపి, కాళ్ళ బిగువుతో మోకును పైకి నెట్టుకుంటూ, ఉబుకుతూ ఎక్కసాగాడు.'' (జాతశ్రీ, *అంతర్ముఖం* - 731)

1) మొగదల - మొదలు, 2) కావడిబద్ద, 3) లొట్టి - మట్టికుండ (కల్లుకుండ), 4) ముస్తాదు. నడుముకు కట్టుకునే తోలుపట్టా 5) చిరతబద్ద 6) మోకు-నారతోపేనిన తాడు 7) గుది - నారతోపేనిన మడమలకు తలిగించుకునే తాడు.

(ఉ) మైనారిటీ వాదరచనల్లో భాష మిగిలిన భాషలకన్నా వేరుగా ఉంది.

''నాకు అప్పటి దాకా పీర్ల చావడిలో హడావుడి వొక్కటే తెలుసు. అక్కడికి వెళ్ళాక ఆడవాళ్ళ మొహర్రం ఇంకా సందడిగా ఇంకా ఉద్వేగంగా జరుపుకుంటారని తెలిసింది. . క్యాహువాగోరియా? అని అడిగాడు. అలా అడిగేసరికి వొక్కసారిగా గోరియా ఏడిచేసింది. నన్ను తనలోకి లాక్కుంది. ''మేరా ఘర్ పైతాన్ కాపాలె హువాబా' అంటూ ఏడుస్తోంది. (గోరిమా, అఫ్సర్ పు.679)

''బిడ్డాగరీబోల్లం గాదు. నువ్వు గంతదూరం నుంచొత్తే ఏంకానీ ఈలే లేకపాయె! . .. గీలొల్లు ఎప్పట్కీనే సచ్చిందాంక ఉండేటియేగని నువ్వు మన్సులో ఉంచుకోకూ బిడ్డా! సలాం చెప్పు మున్నీ! మర్సిపోకు అందరు పెండ్లికి రావాల్నని చెప్పు ఇగనేనుంటున్నా...'' (సిల్‌సిలా - షాజహానా - 598)

పై రచనల్లో కన్పించే ఉర్దూ పదాలు మైనారిటీ వాద రచనల్లోని విశేషమనవచ్చు. పీర్ల చావడి, మొహర్రం, క్యాహువా, మేరాఘర్ సైతాన్, హువాబా..... గరీబోల్లం, - ఆపాకు, బాయికి, సలాం, మున్నీ....

### 5.5.5 మిశ్రమం

భాషలో మిశ్రమ భాష తప్పక కన్పిస్తుంది. వ్యావహారికం చోటు చేసుకుంటున్న రోజుల్లో గ్రాంథికంతో వ్యావహారికం కలిసిన భాష, కొందరి రచనల్లో గ్రాంథికంతో మాండలికం కలిసి ఉండటం, తర్వాతి విడతలో వ్యావహారికంతో ప్రాంతీయవాద ధోరణి ప్రబలటం, తమవాడుక భాషనే వాడటంవల్ల ఆ భాషా ధోరణి ప్రబలింది. మచ్చుకి ఒక్కో ఉదాహరణ.

#### 5.5.5.1 గ్రాంథికం + వ్యావహారికం

గ్రాంథికం రచనలోనూ వ్యావహారికం సంభాషణల్లోనూ కన్పిస్తుంది.

"ఓపికపట్టు అంతా జరిగినట్టు చూడు. అదే తెలుస్తుంది. నాకు మాత్రం ఏమి తెలుస్తుంది." అనెను.

ఆరోజు ఎస్‌పిసిఏ (జంతువుల యెడ జరుగు అన్యాయ నిరోధక సంఘం) స్థానిక శాఖ కార్యకర్తలు తమ సంస్థ యొక్క వార్షికోత్సవం జరుపదలచిరి. వారు నాడు పుర ప్రముఖులతో బాటు పురములోని కొన్ని ఆవులను, గుఱ్ఱాలను, ఎడ్లను బాగాబలసిన వానిని వెతికి వెతికి ఊరేగింపుకు ఏర్పాటు చేసిరి" (నారాయణరావు, కాళోజీ - పు.32)

#### 5.5.5.2 గ్రాంథికం + మాండలికం

ఇది ప్రత్యేక భాషాశైలిగా చెప్పవచ్చు. వర్ణనలు వివరణలు గ్రాంథికంలో ఉన్నా సంభాషణలు మాండలికంలో ఉంటాయి.

"ఇంత అలజడి చెలరేగినా బజార్లు మాత్రం నిర్మానుష్యంగానే ఉన్నవి. లోపలి నుండి వేసుకున్న తలుపుల గొళ్ళాలు తీసి బయటకు తొంగి చూతామనుకొన్న వారి చేతులు కూడా గొళ్ళాల మీదికి పోగానే ఎక్కడి వక్కడ జలదరించి నిలిచిపోయినవి".

"అవ్వాగిప్పుడిదేం చప్పుడే" అని మెల్లగా ప్రశ్నించిందా బాలిక. "నీకెందుకే మొద్దు ముండా, గదేంది, గిదేంది - ఎప్పటికి అడుగుడే! ఏదో మునిగిపోయినట్లు అన్నీ నీకే కావాలె - " (నరసింహారావు, పి.వి పు.66-67).

### 5.5.5.3 వ్యావహారికం +మాండలికం

రచన వ్యావహారికంలోనూ సంభాషణలు మాండలికంలోనూ కన్పిస్తున్నాయి.

.. . .. నీ పాపం నేన్జెయ్యలేదు దొర్సానీ!. . . . నాకు కూడు పెట్టే దొరకు దోఖా (తప్పు) సెయ్యనీకి నామనసొప్తలేదు. నీకాల్మొక్కుత. నన్ను బల్మి (బలవంతం) సెయ్యవాకు బాంచెన్" అన్నాడు.

ఎంత మొండి ముండాకొడుకు వీడు! "అనుకుని కసిగా పళ్ళు కొరుక్కున్నాను. రోషం, అసహనం, తహతహ, ఆర్తి అంతకంతకూ పెరిగి పోతున్నాయి నాలో" (రాములు, పడాల 2005 పు.288).

పత్రికలు, రచనా వ్యాసంగంలో స్థిరపడి ఏ మాండలిక ప్రజలకైనా, ఏ ప్రాంతీయులకైనా అర్థమయ్యే విధంగా ఉండే భాష ప్రామాణిక భాష. దాంతోపాటు, మాండలిక భాషను సంభాషణల్లో వాడుతూ రాసేది మరోరకం భాషా శైలి.

"అంతఉధృతంగా వచ్చిన గాడ్పుదు మారం అంతా దుబ్బమయం చేసి ఐదు నిమిషాల్లో మాయమైంది. వాతావరణమంతా ప్రశాంతంగా మారింది. ఒక్క కొమ్మ కూడా ఊగటంలేదు.

నీయవ్వ! ఏంగాడ్పు దుమారం. . . ఎట్లచ్చిందో అట్లనే పోయింది. ఆయుటివూనే కాలంగద . . . రాల్లవానత్తదనుకున్న . . . . ఎంతెల్లమీ ఎట్లయిందే సూడు. . . ఎప్పుడో మైతదే తెలువకుంటుంది. అంత చిత్రంగున్నది." అన్నాడు నర్సయ్య (మల్లయ్య, కాలువ, 2005- పుట 543).

సన్నివేశకల్పనలో, వాతావరణ చిత్రణలో, అందుకు తగిన భాషను ఉపయోగించడంలో తెలంగాణ ప్రాంత కథకులు అద్భుత శిల్పవైవిధ్యాన్ని ప్రదర్శించడంలో కాలక్రమంలో ఉత్థానస్థితిని గమనించగలం.

# 6. ఉపసంహారం

కాలానుగుణంగా ఒక భావ ప్రేరణ ఏర్పడి అది స్ఫూర్తిగా పరిణమిస్తుంది. మరొక సామాజిక ఆవశ్యకత తలెత్తేదాక ఆ భావజాలం జాతి సమస్తాన్ని ఒక మార్పుకు లోను చేస్తుంది. జాతి చరిత్రలో దాగి ఉండే వేదనల గాధలు కనపడీ కనపడకుండా ఉంటూనే ఉంటాయి. ఓ చరిత్ర వేదన ప్రసవం ఉద్యమంగా రూపుదాలుస్తుంది. ప్రతి చారిత్రక ఘటన ఉద్యమం కాదు. కాని ప్రతి ఉద్యమం జాతి సమస్తంలో ఒక మార్పును తెస్తుంది. ఆ మార్పు వివిధ దశల్లో వివిధ మార్గాలలో ఉండవచ్చు. విభిన్న రంగాల్లో కూడా ఉద్యమ ఫలితంగా మార్పు చోటు చేసుకుంటుంది. ప్రతి ఉద్యమం భాషలోను భావంలోను మార్పు తీసుకురావడం తప్పని పరిస్థితి. ఆ మార్పు వల్ల ఆనాటి సాహిత్యం ఆ ఉద్యమ మార్పును తనలో లీనం చేసుకుంటుంది. అందువల్ల ప్రక్రియ, ఛందస్సు, అనుకరణ స్వతంత్ర రచనలు ఉద్యమ స్ఫూర్తితో కొత్తరూపు దాలుస్తాయి.

తెలుగు సాహిత్యం ఆరంభకాలం నుంచి వివిధ ఉద్యమాల్ని తనలో ఇముడ్చుకుంది. నిజానికి కొన్నిసార్లు సామాజికఉద్యమం సాహిత్యాన్ని ప్రేరేపిస్తే, కొన్నిసార్లు సాహిత్యం సమాజానికి ఉద్యమ స్ఫూర్తిని ఇస్తుంది.. తెలుగు తొలికావ్యం ఆంధ్ర మహాభారతం వైదిక మత పునరుద్ధరణకు ఉద్దేశించబడిందే. ఏ ఇతర భాషా సాహిత్యాలలోను కనిపించని విశిష్టయుగ తెలుగులోని శివకవియుగం. శివకవియుగం దాక వెలువడ్డ తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే కాలానుగుణంగా ఏర్పడ్డమార్పులే కాకుండ దక్షిణ భారతదేశంలో పుట్టి పెరిగిన భక్తి ఉద్యమ పోకడలు, శైవమత శాఖసాహిత్యాన్ని, సమాజాన్ని ఎన్ని రకాల మార్పులకు గురి చేసిందో స్పష్టమవుతుంది.

జైన బౌద్ధాల కారణంగా ఏర్పడ్డ మార్పుల్ని క్రీ.శ. 7వ శతాబ్దం నాటి తమిళ సాహిత్యం శైవ వైష్ణవ శాఖల్తో భక్తి ఉద్యమాన్ని సృష్టించింది. మానవ హృదయంలోని భక్తి సామాజిక ఉద్యమంగా మారింది ఈ కాలంలోనే. పంపాది కన్నడ కవులు తమ రాజుతో కావ్య

నాయకుడికి అభేదం పాటిస్తే బసవన్న కాలంలో చిత్రం మారిపోయింది. కుల, స్థాయి రహితమైన శైవసమాజ స్థాపన బసవన్న వీరశైవం సాధించింది. వైదిక పునరుద్ధరణకే లక్ష్యంగా వెలువడ్డ తొలితెలుగు సాహిత్యం మలివిడతలో వీరశైవ ప్రభావంతో దేశి రూపు దాల్చింది.

మరోపక్క ప్రాచీన భారత సమాజం నుంచి చెందిన మార్పుల్ని సాహిత్యం నమోదు చేసింది. నన్నయలో కనిపించే బ్రాహ్మణుల సాత్విక ఆహారం, యాదవ రాజ్యస్థాపన వీటికి ఉదాహరణలు. మాతృస్వామ్యం, పితృస్వామ్యంగా మార్పు చెందిన వ్యవస్థను భారతంలో చూడవచ్చు. తిక్కనలోని హరిహరాద్వైతం. తిక్కన శిష్యుల చేత ప్రారంభింపచేసిన కథాకావ్య పరంపర మొదలైనవన్ని ఆనాటి సామాజిక, మత, రాజకీయ పరిస్థితులకనుగుణంగా చోటుచేసుకున్నాయి. భక్తి ఉద్యమం మొత్తం భారతీయ సాహిత్యంలో చాలా మార్పుల్ని తీసుకువచ్చింది. రచనా రీతి, వస్తువు, భాష, ఎన్నిట్లోనో ఈ మార్పు ప్రస్ఫుటమవుతుంది. భక్తకవులు సాహిత్యంలో ఎన్నో మార్పుల్ని తేవడమే కాదు, సమాజాన్ని ప్రశ్నించిన వారు కూడ. తెలుగు సాహిత్యంలో దీనికి ఉదాహరణ అన్నమయ్యలాంటి వారు. సామాజిక అసమానతల్ని ప్రశ్నించటంలోనైతేనేమి బౌద్ధిక సంపదల్ని పంచటంలోనైతేనేమి, వేదాంగాల రహస్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడంలో అయితేనేమి మానవ జీవితంలోని ఆధ్యాత్మిక రహస్యాలను పదుగురిలోకి చొప్పించడం లోనైతేనేం వాగ్గేయకారులు కృతకృత్యులైనారు. ఈ బాటలోనే నడచిన శతక కర్తలు స్థలపురాణ కర్తలు దేశానికి, సమాజానికి తమవంతు ఉద్యమ స్ఫూర్తిని అందించారు.

ప్రాచీన సాహిత్యంలో ప్రాంతీయాభిమానం అక్కడక్కడ తొంగిచూస్తూనే ఉంది. సహదేవుని దక్షిణ దేశ జైత్ర యాత్రలో ఆంధ్రులు, వేంగీదేశం లేకపోవడానికి నన్నయగారి దేశాభిమానం మరొక రకంగా చెప్పాలంటే ప్రాంతీయాభిమానం కారణం. శతక కర్తల్లో ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలో కాళహస్తి వర్ణన కూడ ఒక రకంగా ప్రాంతీయాభిమాన చిహ్నమే. వేమనలో కడప జిల్లా మాండలికం కనబడుతున్న దంటే, అన్నమయ్యలో రాయలసీమ పదబంధాలు అగుపడుతుంటాయంటే అది ప్రాంతీయ/మాండలిక అభిమానం మాత్రమే.

ఆధునిక సాహిత్యంలో వివిధ ధోరణులు పాశ్చాత్యభాషా సాహిత్యాల సంపర్కంవల్ల కల్గిన భారతీయ సాహిత్య మూలాలైన భక్తి, కుటుంబ జీవనాలతో పాటు దేశభక్తి, ప్రాంతీయాభిమానం కూడా చోటు చేసుకున్నాయి. వివిధ ధోరణులతోపాటు స్త్రీ, దళిత మైనారిటి వాదాలు తెలుగు సాహిత్యంలోను ప్రసిద్ధికెక్కాయి.

ఆంధ్రదేశంలో వెలువడ్డ కథలలో వివిధ ప్రాంతాలకు, ఉద్యమాలకు చెందిన కథలున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా కథల్లో కూడా ప్రాంతీయతా వాదం ఎక్కువగా తొంగిచూస్తుంది. తెలుగు కథ ఆవిర్భావం నుంచి అంటే సుమారు ఒక వంద సంవత్సరాల కాలం నుంచి వెలువడ్డ కథా సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే విషయం చాలా సులభంగానే అవగతం అవుతుంది. గత వంద సంవత్సరాలలో నిర్దిష్టంగా చెప్పుకుంటే గురజాడ నుంచి వెలువడ్డ తెలుగు కథాసాహిత్యంలో ప్రతిఫలించింది కోస్తా ఆంధ్ర జీవితమే. రచయితలు కోస్తా ఆంధ్ర, వెలుపల ఉండి కూడా తాము రాస్తున్న, ఉత్పత్తి చేస్తున్న సృజనాత్మక రచనలకు ముడిసరుకుని దాని వ్యక్తీకరణకు అవసరమైన భాషని ఎక్కువ సందర్భాలలో కోస్తా ఆంధ్ర నుంచే తీసుకున్నారు. కాని ఈ జిల్లాలకు వెలుపల బ్రతికే ప్రజల భావాలు ఆ భాషలో ఒదగటం లేదు. అన్న నిజాన్ని రాయలసీమ, తెలంగాణ కథకులు, కవులు గుర్తించారు. అందులోనించి పుట్టుకు వచ్చిందే తెలంగాణ ప్రాంతంలో జీవిస్తున్న కథకుల కథలు అక్కడి జీవితాన్ని సమస్యల్ని తమదైన నిత్య వ్యవహారిక భాషలో చిత్రించడం మొదలు పెట్టారు. ఒక రకంగా తెలంగాణ రచయితల్లో తొలితరం వారు గ్రాంథిక, సరళ గ్రాంథికాలను వాడినా అక్కడక్కడ వాళ్ళ రచనల్లో ప్రాంతీయ భాష తొంగిచూస్తూనే ఉంది. తరువాత తరం నుంచి భాషే కాకుండా జీవనకోణాల విషయంలో కూడా తెలంగాణ కథకుల్లో కనిపించిన మార్పు 'తెలంగాణ కథ'ను ఇతర కథలకన్న భిన్నమైనదిగా తీర్చిదిద్దింది. తెలంగాణ సమస్యే కథావస్తువుగా వెలువడ్డ కథలు ఎంత ప్రాముఖ్యాన్ని వహించాయో తెలంగాణ సాహిత్యాన్ని కాపాడ్డంలో కొన్ని సాహిత్య సంస్థలు అంతే ప్రాముఖ్యతను వహించాయి. అవి 1) సాధన సమితి, 2) నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్ 3) తెలంగాణ రచయితల సంఘం. మొట్టమొదటి తెలంగాణ కథ 1910లో వెలువడితే తొలి కథల సంపుటి 1915లో వెలువడింది.

భారతదేశ స్వాతంత్ర్య పూర్వం వివిధ ప్రాంతాలు, వివిధ రాజుల పరిపాలనలో ఉండేవి. అలా ఉన్న కాలంలో తెలంగాణ నైజాం ప్రభువుల పరిపాలనలో ఉండిపోయింది. తెలంగాణ ప్రాంతంలోని భూములను 16వ శతాబ్దం నాటికే ఆంధ్ర ప్రాంతం నుంచి వలసవచ్చిన ధనికులు ఉత్తరం నుంచి వచ్చిన ముస్లింలు దక్షిణాది నుంచి వచ్చిన బ్రాహ్మణులు స్వాధీనం చేసుకోవడం మొదలు పెట్టారు. కాని, వారికి భూమి దున్నడానికి సేద్యం చేయడానికి స్థానిక ప్రజలైన కోయలు, కొండరెడ్లు, చెంచులు, లంబాడీలు, ఎరుకలు, వడ్డెరలు, ఆదివాసులు, సంచార తెగలు, తెలుగు కాపులు, ముత్రాసి, మున్నూరు కాపు, తెలగకులాలు కావల్సివచ్చాయి. భూమి లోబర్చుకున్న ధనికులదైన తరువాత ఈ స్థానిక ప్రజలందరు 'వెట్టి'కి కుదురుకోవలసి వచ్చింది. అటు నైజాం ప్రభుత్వం నుంచి ఇటు భూస్వాములనుంచి తమను రక్షించు కోవడానికి తెలంగాణ ప్రజలు గెరిల్లా దళాలను, గ్రామ దళాలను ఏర్పర్చుకోవడం ప్రారంభమైంది. ఈ దళాల వల్ల తెలంగాణ ఉద్యమం బలపడింది. తెలంగాణ ప్రజా ఉద్యమం ప్రారంభమైన కాలంలోనే దేశంలో మరోపక్క తీవ్రమైన మత సంఘర్షణలు తలఎత్తాయి. కాని, తెలంగాణ ప్రజా ఉద్యమం ఆ మతపరమైన సమస్యల్లో ఇరుక్కోలేదు. దానివల్ల ప్రభావితం కాలేదు. తెలంగాణ ప్రజల గ్రామదళాలు చైతన్య వంతమవుతున్న కాలంలో వాళ్ళను అణగతొక్కడానికి, నిజాం ప్రభుత్వానికి చేయూతనందిస్తున్న భూస్వాములు గ్రామాలపై తమకున్న అధికారం చేజారిపోకుండ ఉండటం కోసం వాడుకున్నారు.

తెలంగాణలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమంలో ప్రధాన అంశం సాంస్కృతిక జీవనం లక్ష్మణరావు ప్రేరణగా మాతృభాషలో విద్యాబోధన కావలన్న నినాదం ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించి మహాసభ ఏర్పాటుకు కారణమైంది. పురుషులతో సమానంగా స్త్రీలు పాల్గొవటం ఈ ఉద్యమ విశేషం. అక్షరాస్యతకు నిదర్శనంగా గ్రంథాలయోద్యమం ప్రారంభమైంది. తెలంగాణ తెలుగు సమాజం పురోగమ మార్గం వేసిన మొదటి అడుగే గ్రంథాలయోద్యమం. 1912లో మహర్షికార్వే అధ్యక్షతన నిజాం రాష్ట్ర సంస్కార మహాసభలు జరిగాయి. ఈ సభలు జరిపిన కార్వేగారు మహిళ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు

కావడం విశేషం. నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం మాడపాటి హనుమంతరావు కార్యదర్శకత్వంలో ప్రారంభమైంది. అది నిజాం రాష్ట్ర ఆంధ్రుల సాంఘిక, సామాజిక, ఆర్థిక సాంస్కృతిక చైతన్యానికి వారధి అయ్యింది.

నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించడం కోసం పోరాటానికి ఆంధ్ర మహాసభ కమ్యూనిష్టు పార్టీ పిలుపునిచ్చింది. నిజాం ప్రభుత్వ కార్యాక్రమాలను స్థంభింప చేయడం, ప్రభుత్వ రికార్డులను ధ్వంసం చేయడం వీళ్ళ ముఖ్య ఉద్దేశాలు అయ్యాయి.

తెలంగాణ పోరాటం గురించిన విషయసేకరణకు నియమితుడైన ప్రభుత్వ అధికారి కె.యమ్. మున్షీ. తెలంగాణాలోని ప్రతి సంఘటనను గూర్చి ఆనాటి ప్రధాని 'జవహర్‌లాల్ నెహ్రూ'కు హోంమంత్రి 'సర్దార్ వల్లభాయ్ పటేల్'కు నివేదకను సమర్పించేవాడు. నైజాం ప్రభుత్వ పాలనలో ప్రజల పరిస్థితి నానాటికి దిగజారుతోందని గుర్తించిన భారత ప్రభుత్వం 07.09.1948న నైజాం రాష్ట్రం భారత రాజ్యాంగంలో భాగమేనని పార్లమెంట్‌లో ప్రకటించింది. హోంమంత్రి సైనిక చర్య ఫలంగా 17.09.1948న నిజాం ప్రభువు సైనికులకు లొంగిపోయాడు. రజాకార్ల నాయకుడు కూడా ప్రభుత్వానికి అప్పచెప్పబడ్డాడు. ఈ సాయుధ పోరాటం 4 దశలుగా సాగింది అవి 1) ప్రారంభదశ (1921-30), 2) భూస్వామ్య నిరసన దశ (1932-46), 3) నిజాం ప్రభుత్వం పై వ్యతిరేకత (1946-48), 4) సాయుధ పోరాటం (1948-51).

తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా పలు సాహిత్య ప్రక్రియలు ఆ పోరాటాన్ని తమలో ఇముడ్చుకొని ఉద్యమ చైతన్యస్ఫూర్తిని ప్రజలలోకి తీసుకవెళ్ళాయి. బుర్రకథలు, బగ్గుకథలు, గొల్లసుద్దుల కథలు, తెలంగాణ పోరాట స్ఫూర్తిని ప్రజలకు పంచిపెట్టాయి. ప్రజల్లో పుట్టిన చైతన్యం ఈ కళాకారులకు లాటి దెబ్బలను, తూటాలను తెచ్చిపెట్టింది. ఈ కళా రూపాలు మరింత ఎక్కువ ప్రచారణకు పాలుగొన్నాయి. పోరాట గీతాలు ప్రజల నోళ్ళల్లో నానాయి. ఈ పోరాటం మేధావులను, కథకుల్ని కూడా ఎంతగానో ఆకర్షించింది. వారి బాధ్యత పట్ల అప్రమత్తత చేకూర్చింది. ఈ పోరాట ఇతివృత్తంగా *కుందుర్తి 'తెలంగాణ', గంగినేని 'ఉదయని' ఆరుద్ర 'త్వమేవాహం'* వెలువడ్డాయి. పోరాట కాలంలో *'మృత్యుంజయుడు',*

*'సింహగర్జన'* నవలలు వెలువడితే పోరాట విరమణ తరువాత *'ప్రజలమనిషి', 'ఓనమాలు', 'గంగు', 'మృత్యువునీడల్లో'* మొదలైన నవలలు వెలువడ్డాయి.

తెలంగాణ కథ నాటి ప్రజా జీవితానికి, సంఘటనలకు స్పందన మాత్రమే కాదు, ప్రతీకకూడా. పోరాట విరమణ తరువాత పోరాట ప్రాంతంలో సంచరించి పోరాటంలో పాల్గొన్న వ్యక్తులను కలసి వారి నుండి సేకరించి పొందుపరుస్తూ రాసిన కథలు కొన్ని సంపుటాలుగా వెలువడ్డాయి. ఈ కథలను తెలంగాణ పోరాటపు పూర్వకథలు, పోరాట కాలపు కథలు, పోరాట అనంతర కథలు అని విభజించవచ్చు. అందులో మొదటి విభాగానికి *'మనమేనయం', 'పాడిఆవు',* రెండవ విభాగానికి *'దౌరా', 'మీటింగు ముగిసింది',* భూసమస్యపై రాయబడ్డ కథల్లో *మన ఊళ్ళో కూడినా?* తెలంగాణ పోరాటం సాయుధ పోరాటంగా మార్పు చెందిన పరిణామాన్ని నిరూపించే *తోటబావి*, మూడవ భాగానికి సంబంధించిన *'జీవకారుణ్య చర్య', 'గెరిల్లా'* ఉదాహరణలు.

తెలంగాణ సాయుధ పోరాటమే కాకుండా నక్సలిజం కూడా తెలంగాణ కథను ప్రభావితం చేసింది. 1970 తరువాత రైతాంగ పోరాటం ప్రధాన పాత్ర వహించింది. గిరిజన పోరాటం, కార్మికుల జీవన పోరాటం స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలు తెలంగాణ కథల్లో చోటుచేసుకున్నాయి. ఇందులో ప్రధాన కథకులు అల్లం రాజయ్య తుమ్మేటి రఘోత్తం రెడ్డి, బి.యస్. రాములు బోయ జంగయ్య, ఇల్లిందుల సరస్వతీ దేవి, జాజుల గౌరి, షాజహానా మొదలైన వారు.

తెలంగాణ కథలో పోరాట కారణంగా వివిధ కాలాలలో వెలువడ్డకథ ఇతర ప్రాంతాల్లో వెలువడ్డ కథకు భిన్నంగా ఉంది. తెలంగాణ కథలో వ్యక్తమయ్యే ఈ విభిన్నత ఒక కోణంలో ప్రాంతీయం మరొక అర్థంలో భాషా సంబంధి, మరొక అర్థస్ఫూర్తితో అది సాంస్కృతికం. అంతే కాదు. ఈ విభిన్నత ఆయా ప్రాంత ప్రజల సాంస్కృతిక ఆర్థిక అభివృద్ధి, రాజకీయ చైతన్యం, ఆ ప్రాంతంలో వివిధ కాలాల్లో సాగిన సామాజిక, రాజకీయ రాజకీయేతర రంగాల్లోని వివిధ ఉద్యమాల మీద కూడా ఆధారపడి ఉంటుంది.'' (అధ్యాయం నాలుగు పుట.108)

చిన్నదైన తెలంగాణ కథ దీపం స్థాయిలో మిన్నదే. తెలంగాణ కథలో దాదాపు 75% గ్రామీణ జీవితాన్నే ఆధారం చేసుకున్నవే.

శ్రీ కె.సచ్చిదానందంగారు స్థానిక వాద్యాన్ని పాశ్చాత్య సాహిత్య దృష్టితో నిర్వచించినా భారతీయ సాహిత్యానికి సానుకూలమైన ఒక సాహిత్యవాదాన్ని అభ్యుదయ అర్థంలో నేటివిజం-స్థానికవాదంలేదా ప్రాంతీయవాదం చేకూర్చింది. భారతీయ సాహిత్య లక్షణం బహుళవాదానికి సంబంధించినదే. ఆధిపత్యవాదం అప్రాణి వాచకాలతో కూడుకున్న ఈ సాహిత్య ధోరణి విశాలాంధ్ర వాదం వల్ల తన అస్తిత్వాన్ని కోల్పోవలసివస్తుందన్న భయం తెలంగాణ ప్రజలనే కాదు సంస్కృతిని తాకింది. ఒక అసమానత ఈ రెండు ప్రాంతాల మధ్య కొనసాగుతూవచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ కథకు కొత్తతరం కథకులకు ఊపునిచ్చింది, సుజాత పత్రిక. కానీ కథా వస్తువులను, ఏ మార్పులకు కానీ భేదాన్ని చూపలేదు. ఉదాహరణకు ఇతర ఆంధ్ర పత్రికలు కథకులు సాహిత్యం విమర్శిస్తున్న స్త్రీ, పురుష సంబంధాలకు స్వేచ్ఛ పేరుతో కొత్త అర్థాలను కల్పిస్తున్న చలం కథలకు మంచి వేదిక అయ్యింది. ముచ్చటగా మూడే సంవత్సరాలు నడిచిన ఈ పత్రిక అప్పుడు ప్రారంభమైన గ్రాంథిక, వ్యావహారిక భాషావాదులకు స్త్రీ, పురుష సంబంధాల్ని ఎక్కువగా చిత్రించిన చలం కథలకు కొత్తగా కలంపట్టిన కొత్తతరం రచయితలకు ఒక వేదిక అయ్యి తన ప్రాముఖ్యతను చాటుకుంది.

తెలంగాణ కథలో సుప్రసిద్ధుడు కాళోజి 1935లోనే ఆర్యసమాజీయ కథను రాయటం ద్వారా కథారచయిత యొక్క ఏకాంత ప్రక్రియగా కాక సంయుక్త సామూహిక కర్తృత్వాన్ని అభిలషించేదిగా ఏర్పడిందని జనచైతన్యం లేదా సామాజిక చైతన్యం కథ నెరవేర్చవలసిన ప్రయత్నంగా మార్పు చెందిందని చెప్పవచ్చు. తెలంగాణ కథలోని విభిన్నత ఇదే. (పు.113)

తెలంగాణ కథకు సంబంధించిన విభిన్నతలలో ప్రత్యేకమైనది స్థానికత. స్థానిక అవసరాల ఒత్తిడి, ప్రభావాల వల్ల తెలంగాణ కథ నిర్మాణ పరంగాను కథల పరంగాను అత్యంత విశిష్టతను సంపాదించుకుందని చెప్పలేము. తెలంగాణ కథకు కథనం, కథా నిర్మాణం

అంతగా అవసరంలేని విషయాలు ఎందుకంటే తెలంగాణ కథ పాఠకుడు ఒంటరిగా చదువుకునేందుకు రాసిన కథకాదు. కథకుడే వివిధ ప్రాంతాలలో తిరిగి జన బాహుళ్యానికి వినిపించవలసిన కథ. పదుగురు వినాల్సిన కథ. చదువుకునే కథకు, సమూహం వినేకథకు మౌలికంగానే ఎన్నో తేడాలు ఉంటాయి. విమర్శకులు పేర్కొన్నట్లుగా తెలంగాణాలో కథకు పాఠకుల సంఖ్య పరిమితమే అయితే కథను వినే శ్రోతలు ఉన్నారు. (పుటలు 114-115)

తెలంగాణ కథ రాజకీయ ఆకాంక్షతో తెలంగాణ వెనుకబాటుతనాన్ని నిరూపించ డానికి ఆంధ్ర ప్రాంతంతో సరిపోల్చడానికి సామాజిక దృక్కోణం సరిపోతుంది. కాని, తెలంగాణ కథ వికాసానికి పెద్ద అవరోధం తెలంగాణలో మధ్య తరగతి అవతరించకపోవడం. ఎప్పుడూ ఏ సంఘంలోనూ అత్యున్నతస్థాయి వర్గంకాని, క్రింది స్థాయి వర్గంకాని, ఏ సాహిత్య ప్రక్రియకు చక్కని ఊత కాజాలవు. మధ్య తరగతి కుటుంబ జీవితం, మధ్య తరగతి పాఠకులే. ఏ కథకు ప్రధానమైన వస్తువు పోషకులు కూడ. అందుకే మధ్యతరగతి అభివృద్ధిచెందని తెలంగాణలో కథకూడ వెనుకబడింది.

''పాంతీయత అనేది ఆధిపత్యం అణచివేత, వివక్షతలతో ముడిపడి ఉన్న భావన. ఇది అభివృద్ధి ఆకాంక్షలో సామాజిక మార్పుకు ప్రయత్నిస్తుంది. ఈ సామాజిక మార్పు రావడానికి కావాల్సిన అన్ని రంగాలను ఇది స్పృశిస్తుంది. ప్రాంతీయత తనదైన భాష, సంస్కృతి సంప్రదాయాలను చిత్రించగలగాలి. ప్రకృతి వైపరీత్యాలు, వాటివల్ల జరిగే నష్టం, ప్రభుత్వ స్పందన, సామాజిక సమస్యలు రాజకీయ వ్యాఖ్యలు, వివక్ష, వనరుల దోపిడి, వస్తువేకాదు ప్రాంతీయత, అభివ్యక్తిలోకూడ గోచరించాలి.''(పుటలు 121-122) తెలంగాణ కథా రచయితలు అన్ని సమస్యలను తమ కథలలో చిత్రిస్తున్నారు. విప్లవ కథ, గ్రామాలలోని దొరల భూములకు సంబంధించిన కథ, గ్రామీణ జీవన పరిణామ దశ, సింగరేణి కార్మికులు, అర్బ నైజేషన్, యూనివర్సిటీ జీవితాలు, పాలకుల విధానాలు, రియల్ ఎస్టేట్ (పట్టణ భూముల భాగోతాలు), ప్రపంచీకరణ, దళిత కథ, దళిత స్త్రీ కథ, ముస్లిం కథ, ముస్లింల స్త్రీలకథ, రైతుల సంక్షోబాలు మొదలైన కథలతో తెలంగాణ కథ ప్రాంతీయ కథలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. కనిపిస్తుంటాయి. ఆ ధోరణులతో పరిపుష్టిని పొందుతున్నాయి.''

ప్రాంతీయతలో ప్రధానమైంది భాషా దృష్టి. తెలంగాణ కథకు ఇతర ప్రాంతాల ఆంధ్ర సాహిత్యానికి భాష దృష్ట్యా చాలా మార్పులు అగుపడతాయి. రచయితల అవగాహనలోపంవల్ల భాషలోని విభిన్నత ద్యోతకమవుతుంది. ఉదాహరణకు

**సామెతలు**

తల్లికంటె బిడ్డె దొర్సానట, బిడ్డ కంటె తల్లి బాంబెదట. (పుట 129)

**మాండలికపదాలు** - సత్తెనాస్, బైలెల్లింద్రు, యిస్సు, (పుట 130)

బూతులు, తిట్లు, మోటు పదాలు - ఎద్దుముడ్డి పొడ్సుకుంట, లంమిడి కొడుకులు, నాలిముచ్చోడ, నల్లికుట్లోడ, పాసువలగిలేని దెంకపోండి, లంజెదాని నీళ్ళకు గతిలేదు, లంజెకడలు, పోలంజె, పోయి ఎవల్తానన్న పండి పైసలు దీస్కరా. . . . లేక పోతే. .. ఇగో గే గోదావరిని అమ్మి పైసలు దీస్కరావెలంజెదాన. (పుట 130)

పొరపాట్లు - గెట్లామరి

**ఉచ్చారణలో మార్పు** - సైజి బట్టుకొని, సెప్పిండు, సెత్త, (పుట 131)

"రచయిత ఉద్దేశం ఊహ కొన్ని సంఘటనలుగా రూపుదిద్దుకొంటుంది. ఆ సంఘటనల మధ్య ఉండే అనుబంధాన్ని తీర్చి దిద్దటంలోనే కథా వస్తువు శిల్పంగా పరిణమిస్తుంది. ఏ రెండూ సంఘటనల మధ్య నైనా ఉండే ఉద్దేశాన్ని కళగా తీర్చి దిద్దటం కథా శిల్పం అవుతుంది. అంటే సంఘటనాత్మక భావ నిరూపణ శిల్పం" (పుట 134).

కథానిక లక్షణాల్లో క్లుప్తత ప్రధానమైంది. పరిపాలనలోని ఒక చిన్న లోపాన్ని తనకు సానుకూలంగా మార్చుకొని లక్షాధికారిగా మారగలిగే నైపుణ్యాన్ని చేకూర్చుకున్న ఒక అమాయకుడి తెలివికి నిదర్శనంగా రచియింపబడ్డ కథ *గ్యారాకద్దు బారాకోత్వాల్.* క్లుప్తతకు చక్కటి నిదర్శనం.

భాస్కర భట్ల కృష్ణారావు *'ఇజ్జత్'* నమ్మకం, అపనమ్మకాల మధ్య విలువైన మానవజీవితం బలిఅవ్వటానికి చిత్రించిన కథ. ఈ కథలో కనిపించే మూడు సంఘటనల సంవిధానమే

ఉత్తమ కథగా తీర్చిదిద్దింది. (పుట 136) కథానిక లక్షణాల్లో ప్రధానమైంది సంఘటనల సంవిధానం.

''అనుభవాల గాఢత పాత్రల అనుభూతిగా కథలో వ్యక్తమయ్యేటప్పుడు అనుభూతి స్పష్టత రచనలో చోటు చేసుకుంటుంది. కందుకూరి లింగరాజు రచించిన *'ఆరూఢం'* కథ అతి ప్రాచీనమైన భారతీయ సంస్కృతి మూలానికి సంబంధించిన కుటుంబ జీవితం. భార్యాభర్తల మధ్య ఉన్న విషయాల్లోను ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. అది సహజమే'' (పుట 138).

సంఘర్షణ కథలో ప్రధానంగా రెండు విధాలు పాత్రల్లోని మానసిక సంఘర్షణ మరొకటి భిన్న సంఘటనల సంఘర్షణ. ''జీవితం అంటే సౌందర్యకాంక్షతో జరిగిన తప్పుకు లేదా బాధ్యతలేని కార్యానికి చింతించడమో కాదని ప్రతి సమస్యకు ఒక పరిష్కారం వెతుక్కోవటమేనని చెబుతుంది'' (పుటలు 138-140).

పాత్రల మానసిక సంఘర్షణకు తల ఎత్తని కస్తూరి ఉదాహరణ అయితే సన్నివేశాల సంఘర్షణకు *చీకటి మంట* ఉదాహరణ. విరోధాబాస శృంగారం, వికృతమై రాక్షసత్వం పడాలరాములు సృష్టించిన భిన్న సంఘటనల్లో సంఘర్షణలకు ఉదాహరణ.

కథలో వస్తువు కన్న శిల్పానికి ప్రాధాన్యత ఎక్కువ. శిల్పవైవిధ్యంవల్ల కథ రాణిస్తుంది. శిల్పవైవిధ్యం 8 రకాలుగా గోచరిస్తుంది. వస్తువిన్యాస శిల్పం- ఒక బలమైన సంఘటనకీ వ్యక్తిత్వానికీ ఆకర్షితుడైన కథకుడు దాన్ని ఆధారంగా చేసుకొని ఏ సామాజిక మత, రాజకీయపరమైన ఉద్యమస్ఫూర్తితోనైనా కథను మలచవచ్చు. (పుట 140)

పాత్ర చిత్రణ శిల్పం - పాత్రల్లో కనిపించే వైవిధ్యం లేదా ఏక పాత్రలోని మానసిక ఘర్షణ, పాత్ర చిత్రణలో వైవిధ్యానికి కారణమవుతుంది. (పుట 141)

కథన శిల్పం ''కథకుడు కథ చెప్పే తీరు కథన శిల్పం. కథ చెప్పటంలో పలురకాలున్నాయి. రచయిత తానే కథనం నడుపవచ్చు. ప్రధాన పాత్ర ద్వారా నడుపవచ్చు.

పాత్రల సంభాషణల మూలంగా నడుపవచ్చు. ఎవరో చెబుతున్నట్లు నడువపచ్చు. ఏ తీరు తీసుకున్న కథా రచన సాగే తీరులోను కథను తిప్పే మలుపులోను శిల్పం దాగి ఉంటుంది.'' (పుట 142) రచయిత తన కోణం నుంచి కథను నడుపుతూ పోవడం సామాన్య కథనం. ఇదే సర్వ దృష్టికోణం. కాసుల ప్రతాపరెడ్డి రాసిన *ఎల్మమ్మ*, శిథిలం కథ రచయిత పాత్ర చేత కథను నడపడం పాత్రల కథనం. ఇది ప్రసిద్ధమైన నాటకీయ కోణం. పెద్దింటి అశోక్ కుమార్ *సావుదప్పు*, *జిద్దు*, కాసుల ప్రతాపరెడ్డి, *పెనుగులాట* ఈ కోవలోవే. కథ కథకుడి ద్వారా జరుగకుండా ప్రధాన పాత్ర ఉత్తమ పురుషలో ఉంటే అది ఉత్తమ పురుష కథనం. ఉదా. బెజ్జాపు రవీందర్ *నిత్యగాయాలనది*, దాశరథి రంగాచార్య *తామరపూలు* ఉదాహరణలు. కథకుడు తటస్థంగా ఉండి పాత్రలతోను సంఘటనలతోను సంబంధ పడకుండా చూస్తున్న వాటిని యధాతథంగా వర్ణించే రీతి జి.వి.ఎస్. స్వామి నెలపొడుపు, కర్రా ఎల్లారెడ్డి లాకప్‌డెత్‌లలో కనిపిస్తుంది (పుటలు 144-145).

కథనంలో కథకుడు చూపించే శిల్పవైవిధ్యం పాత్రల లేదా సంఘటనల సంఘర్షణలో కనిపిస్తుంది. పాత్రల మానసిక సంఘర్షణకు ఇజ్జత్‌లో మల్లేశ్, తలఎత్తని కస్తూరిలో కస్తూరి ఉదాహరణలు (పుట 145).

శీర్షికపెట్టడంలో రచయిత నేర్పు శిల్పంలో ప్రధానమైంది.

చీకటి మంట - చీకటి కామానికి మంట విలువలేని మానవజీవితానికి ప్రతీకలు (పుట 147).

సావుదప్పు - పెద్దింటి చావు ఘనంగా జరిగినా పేదోడి ప్రాణంపైన విలువ చేయదని నిరూపించే కథ (పుట 147).

నిత్యగాయలనది - పేరులోనే గొప్ప శిల్పవిన్యాసాన్ని చూపించాడు రచయిత. భౌగోళిక సంపద తరగని భూమితల్లికి ప్రతీక ఈ శీర్షిక (పుట 147).

కథకు శిల్పం ప్రాణమైతే వస్తువు రూపం (పుట 148) వస్తువులో సాంఘికం - స్త్రీవాదం,

దళితవాదం, మైనారిటీ వాదం, ఆర్థికం, రాజకీయం కుల, రాచరిక, ప్రాంతీయం - తెలంగాణ, రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర (పుట 149).

ఒక ప్రాంతానికి సంబంధించి జీవితం, భాష, ఆచార వ్యవహారాలుఅన్ని కలిసి ప్రాంతీయంగా రూపొందుతాయి. ఒక ప్రాంతపు అలవాట్లు వేషభాషలు చరిత్ర నమ్మకాలను ప్రతిబింబించే గుణం ప్రాంతీయలక్షణం (పుట 156). ''తెలంగాణ ప్రాంతం మీద మరో ప్రాంతం ప్రజలు సామ్రాజ్యవాద పెత్తనాన్ని చెలాయిస్తున్నారని తెలంగాణ కవులు, రచయితలు, మేధావులు తీవ్ర నిరసనను వ్యక్తం చేయడం ప్రారంభించారు. ఈ నిరసన స్పందన రెండు కలసి కాలక్రమేణ తెలంగాణ ప్రాంతీయ వాదం ప్రబలటానికి, ఎన్నో రాజకీయ, ఆర్థిక, చారిత్రక, సామాజిక కారణాలున్నాయి. తెలంగాణ ప్రాంతీయవాదం కథలో, కవిత్వంలో నూతన అభివ్యక్తీకరణను ప్రవేశపెట్టింది'' (పుట 156)

గొల్లరామవ్వ (పుట 157) ఊరుమ్మడి బతుకులు (పుట-157) దొరమల్లావచ్చిండు (పుట 158) నిత్యగాయాలనది (పుట 159), ఎల్లమ్మ (పుటలు 160-163).

తెలంగాణ భాషాభేదాలు - గ్రాంథికం, వ్యవహారికం, మాండలికం, మిశ్రమం, గ్రాంథికం, వ్యవహారికం, వ్యవహారికం - మాండలికం - గ్రాంథికం మాండలికం (పుట 165).

''తొలితరం కథకుల్లో చాలామంది గ్రాంథికానికి పెద్ద పీట వేశారు. అప్పుడప్పుడే వెలుగు చూస్తున్న పత్రికలు కూడా కథలను గ్రాంథికంలో ఎంపిక చేశాయి. సురవరం ప్రతాపరెడ్డి, బద్దిరాజు రాఘవరావు, నందగిరి వెంకట్రావు, అజ్ఞాత వాసి భాగ్యరెడ్డి వర్మ మొదలైన రచయితలు ఈ శైలికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ కథల్లో మరోవిశేషం ప్రతి సంఘటనను విడిగా అంకెలతోటే లేదా నాటకంలో లాగ జరుగుతున్న చోటును మాండలికంలోనే చూపించటం'' (పుట 166).

''గ్రాంథిక భాషకు అతి దగ్గరగా వినిపించిన తొలినాటి భాషకు, 1940 - 50 మధ్య బలం పుంజుకుంటున్న వ్యావహారిక భాషా వాదానికి సమంగా అనిపించే భాష గ్రాంథికానికి

పెద్దగా తేడా లేని తెలుగు రచనల్లో చోటు చేసుకుంది. 1960 తరువాత భాష పూర్తిగా వ్యావహారిక రూపాన్ని సంతరించుకుంది'' (పుట 167).

''తమ భావ జాలాన్నంతా, తమ జీవన చిత్రణంతా తమది కాని భాషలో రాస్తున్న అసంతృప్తి తెలంగాణ రచయితల్ని ఆవరించింది. తమదైన భాషలోనే రచనలు చేయాలని వాళ్ళు నిశ్చయించుకున్నారు'' (పుట 167) ప్రాంతీయ మాండలికం, వర్గమాండలికం, రెడ్లమాండలికాలు, (పుట 168) డప్పుకొట్టేవాళ్ళ భాష (పుట 168), రైతుల భాష (పుట 169) కటికవాళ్ళ భాష (పుటలు 170), కల్లుగీసే వాళ్ళభాష (పుట 170) మైనారిటీ భాష (పుట 171)

మిశ్రమంగా గ్రాంథికం + వ్యవహారికం (పుట 172) గ్రాంథికం+ మాండలికం (పుట 172) వ్యావహారికం + మాండలికం (పుట 173).

ప్రాంతీయతావాదం ఉద్యమ కారణంగా కథల్లో చోటు చేసుకున్న భాషా సాంస్కృతిక విశేషాల కారణంగా తెలంగాణ కథ తనదే అయిన ఒక విభిన్నతను సంతరించుకొంది. కాలక్రమేణ తెలంగాణ కథ ఇతర అస్తిత్వ వాదాలను తనలో లీనంచేసుకొంది.

# పరిశీలించిన కథా సంపుటాలు

1) అశోక్‌కుమార్ పెద్దింటి (2002) ఊటబాయి. నయనం ప్రచురణలు, సిరిసిల్ల.

2) అశోక్‌కుమార్ పెద్దింటి (2007) మాయిముంత ఇతర కథలు, తెలంగాణ సాహితి.

3) ఉదయమిత్ర (2006). అమ్మను జూడాలె కథలు. పాలమూరు ప్రచురణలు, మహబూబ్‌నగర్.

4) కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర (సంపాదకత్వం) (2005) తెలంగాణ కథలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

5) గౌరి జాజుల (2004) మన్ను బువ్వ, విశాల సాహిత్య అకాడమి, హైదరాబాద్.

6) జనార్దన్, అంబల్ల (2004). అంబల్ల జనార్దన్ కథలు, విశాల సాహిత్య అకాడమి, హైదరాబాద్.

7) నవీన్, వాసిరెడ్డి (సంపాదకత్వం) (2008), తెలంగాణ విముక్తి పోరాట కథలు. డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ బ్లూమ్‌ఫీల్డ్ హిల్స్, మిషిగన్.

8) ప్రతాపరెడ్డి కాసుల (2006) ఎల్లమ్మ ఇతర కథలు, శైలి పబ్లికేషన్స్, హైదరాబాద్.

9) రాములు, బి. ఎస్. (2003). వేపచెట్టు. విశాల సాహిత్య అకాడమి, కరీంనగర్.

10) రాములు, బి.ఎస్. చంద్రశేఖర్ వనమాల (సంపాదకత్వం) (2003). కరీంనగర్ జిల్లా కథలు (రెండవ సంపుటం) విశాల సాహిత్య అకాడమి, హైదరాబాద్.

11) వేణుగోపాల్, ఎన్. (సంపాదకత్వం) (2006). తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు. విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్.

12) శంకర్‌రావు ఎలికట్టె. ఉనికిపాట్లు కతలు. అమృత ప్రచురణలు నల్లగొండ.

13) సుజాతారెడ్డి ముదిగంటి (సంకలనం) (2002). తెలంగాణా తొలి తరం కథలు రోహణమ్ పబ్లికేషన్స్, హైదరాబాద్.

14) సుజాతా రెడ్డి ముదిగంటి, శ్రీనివాస్ సంగిశెట్టి (2005) తొలినాటి కతలు (తెలంగాణా తొలితరం కథలు - రెండో భాగం), నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

15) శ్రీనివాస్ పులుగు (2001) సంకర విత్తులు కథలు. చేతన పబ్లికేషన్స్ హైదరాబాద్.

16) ఎల్లారెడ్డి కర్ర (సంపాదకుడు) (2003). తెలంగాణ కథ. తెలంగాణ సాహితి ప్రచురణ, హన్మకొండ- హైదరాబాద్.

17) ఎల్లారెడ్డి కర్ర (సంపాదకుడు) (2004). తెలంగాణ కథ. తెలంగాణ సాహితి ప్రచురణ, హన్మకొండ- హైదరాబాద్.

18) ఎల్లారెడ్డి కర్ర (సంపాదకుడు) (2005). తెలంగాణ కథ. తెలంగాణ సాహితి ప్రచురణ, హన్మకొండ- హైదరాబాద్.

19) ఎల్లారెడ్డి కర్ర (సంపాదకుడు) (2006). తెలంగాణ కథ. తెలంగాణ సాహితి ప్రచురణ, హన్మకొండ- హైదరాబాద్.

20) తిరుమలరావు, జయధీర్ (సంపాదకుడు) (2000). తెలుగు కథ-1997. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

21) తిరుమలరావు, జయధీర్ (సంపాదకుడు) (2000). తెలుగు కథ-1998. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

22) తిరుమలరావు, జయధీర్ (సంపాదకుడు) (2000). తెలుగు కథ-1999. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

23) తిరుమలరావు, జయధీర్ (సంపాదకుడు) (2000). తెలుగు కథ-2000. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

24) నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సంపాదకులు) (1999) కథ-1998 కథా సాహితి ప్రచురణ, సికింద్రాబాద్.

25) నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సంపాదకులు) (1999) కథ-1999 కథా సాహితి ప్రచురణ, సికింద్రాబాద్.

26) నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సంపాదకులు) (1999) కథ-2000 కథా సాహితి ప్రచురణ, సికింద్రాబాద్.

27) నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సంపాదకులు) (1999) కథ-2001 కథా సాహితి ప్రచురణ, సికింద్రాబాద్.

28) నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సంపాదకులు) (1999) కథ-2002 కథా సాహితి ప్రచురణ, సికింద్రాబాద్.

29) నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సంపాదకులు) (1999) కథ-2003 కథా సాహితి ప్రచురణ, సికింద్రాబాద్.

30) రాసాని, వి.ఆర్. నరేంద్ర మధురాంతకం (సంపాదకులు) (2001) కథావార్షిక -2001. మధురాంతకం రాజారాం సాహితి సంస్థ, తిరుపతి.

31) రాసాని, వి.ఆర్. నరేంద్ర మధురాంతకం (సంపాదకులు) (2001) కథావార్షిక -2002. మధురాంతకం రాజారాం సాహితి సంస్థ, తిరుపతి.

# పరిశీలించిన త్రైమాసిక పత్రికలు


1) ఎల్లారెడ్డి కర్ర జూన్ (2005) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

2) ఎల్లారెడ్డి కర్ర జులై-సెప్టెంబర్ (2005) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

3) ఎల్లారెడ్డి కర్ర అక్టోబర్-డిసెంబర్ (2005) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

4) ఎల్లారెడ్డి కర్ర జనవరి-మార్చి (2006) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

5) ఎల్లారెడ్డి కర్ర అక్టోబర్-డిసెంబర్ (2006) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

6) ఎల్లారెడ్డి కర్ర జనవరి-మార్చి (2007) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

7) ఎల్లారెడ్డి కర్ర ఏప్రిల్-జూన్ (2007) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

8) ఎల్లారెడ్డి కర్ర జులై-సెప్టెంబర్ (2007) మన తెలంగాణ త్రైమాసిక పత్రిక, తెలంగాణ సాహితి, హన్మకొండ.

# English


1) Anthony. H. Birch 2002: Concepts and theories of modern democracy. 2nd edition. London and New York: Routledge.

2) Cuddon, J.A. 1977: A Dictionary of Literary terms. London wc Andre Deutsch Limited.

3) Desai, A.R. Rural Sociology in India 1997. Bombay (PopularPrakashan).

4) Eagleton Terry. 1992: Criticism and Ideology New York. VERSO.

5) Hawkes David. Ideology, 1996: London and New York.

6) Majeed, Akhtar.Regionalism 1984. Developmental Tensions in India. Cosmo Publications, New Delhi. India.

7) Peter Brooker. A Concise Glossary of cultural theory 1999. Arnold - New York.

8) Rama Chandran, R. Urbanization and Urban Systems in India 1998. Delhi: Oxford University Press.

9) Regional Analysis of population structure concept publishing co. 1984. New Delhi.

10) Roland Pennock, J. 1979. Democratic political theory Princeton, New Jersy Princeton University Press.

11) Singh, B.P. India's culture 1998. Delhi: Oxford University Press.

12) Srinivas, M.N. (ed.) 1977. Dimension of Social Change in India Allied Publishing Pvt. Ltd. New Delhi.

# ఉపయుక్త గ్రంథాలు


1) ఆర్వియార్ (1997) *సాహిత్యతత్వం* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

2) *ఆంధ్ర మహాభారతం* తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

3) ఆరుద్ర (2007) *సమగ్రాంధ్ర సాహిత్యం.* తెలుగు అకాడమి, హైదరాబాద్.

4) ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవాలు (2003) *వజ్రోత్సవ సంచిక ఆంధ్రసారస్వత పరిషత్తు*, హైదరాబాద్.

5) కృష్ణశాస్త్రి *కృష్ణపక్షము* (2005) విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్.

6) కాత్యాయనీ విద్మహే (2006) ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీవాద భూమిక.

7) గుడిపాటి (2002) ఫాయిదా తెలంగాణ సాహిత్య వ్యాసాలు. మొలక ప్రచురణ, హైదరాబాద్.

8) గుడిపాటి (2008) *సంవిధాన కథా సాహిత్య వ్యాసాలు.* పాలపిట్ట బుక్స్.

9) గోపాలకృష్ణరావు (1976) *ఆంధ్రశతక సాహిత్య వికాసము.* ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

10) గౌరీశంకర్ జూలూరి (2002) *పొక్కిలి* (తెలంగాణ కవిత్వం) స్పృహ సాహితీ సంస్థ, కోదాడ.

11) ఛాయాదేవి అబ్బూరి (2002) *20వ శతాబ్దంలో తెలుగు రచయిత్రుల రచనలు* - సాహిత్య అకాడెమి, న్యూఢిల్లీ.

12) జాషువా (1999) గబ్బిలం. హేమలలవణం, విజయవాడ.

13) తిరుపతిరావు, బి. (1999) *పోస్ట్ మోడర్నిజం*, హైదరాబాద్ బుక్ ట్రస్టు, హైదరాబాద్.10) తిరుపతి, ఇనుకొండ (2008) *తిరగబడ్డ తెలంగాణ*, హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

14) *తెలుగులో కవిత్వోద్యమాలు* (2004) తెలుగు అకాడమి, హైదరాబాద్.

15) *తెలుగు పసిడి* (2006) విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ.

16) దక్షిణామూర్తి పోరంకి (1975). *కథానిక వాఙ్మయం.* ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్.

17) దక్షిణామూర్తి పోరంకి (1998) *కథానిక స్వరూప స్వభావాలు.* నవోదయ పబ్లిషర్స్, విజయవాడ.

18) నన్నెచోడుడు (1968) *కుమార సంభవం.* ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్.

19) నళిని, ఎస్.ఎస్. (2009) సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

20) నాగయ్య, జి. (2003) తెలుగు సాహిత్య సమీక్ష రెండు సంపుటాలు.

21) నారాయణరెడ్డి, సి.(1977) *ఆధునికాంధ్ర కవిత్వం- సంప్రదాయములు, ప్రయోగములు* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

22) నారాయణ సింగమనేని (2004) *తెలుగు కథకులు - కథన రీతులు* 4. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

23) ప్రతాపరెడ్డి, కాసుల (2002) *తెలంగాణ కథ దేవులాట.* హైదరాబాద్.

24) బాపూజి, బి.ఆర్. (2002) *రాజకీయ పదాల డిక్షనరి*, హైదరాబాద్ నవ్య పబ్లిషర్స్.

25) మధుసూదనరావు, *త్రిపురనేని సాహిత్యంలో వస్తు శిల్పాలు*, పర్స్పెక్టివ్స్, హైదరాబాద్.

26) మల్లయ్య (2007) *స్వాతంత్ర్య సమరంలో తెలంగాణ ఆణిముత్యాలు* అనుప్రచురణలు, కరీంనగర్.

27) ముద్దుకృష్ణ (సం) *వైతాళికులు.* ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

28) యాకూబ్ (2008) *తెలంగాణ సాహిత్య విమర్శ మాధ్యమం* ప్రచురణలు, హైదరాబాద్.

29) రామకృష్ణశాస్త్రి, శిష్టా (1976) ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము. మద్రాసు విశ్వకళాపరిషత్తు, మద్రాస్.

30) రామకృష్ణుడు, తెనాలి. *పాండురంగమహాత్మ్యం.* రామకృష్ణశాస్త్రి.

31) రామచంద్రారెడ్డి, రాచమల్లు (1990) *రారాలేఖలు* రారాస్మారక సమితి, ప్రొద్దుటూరు.

32) రామ నరసింహం, పరిమి (1990) *ఆంధ్ర మహాభారత శైలీ పరిశీలనం*, ఎరివాక్ ప్రచురణలు, హైదరాబాద్.

33) రాములు, పిల్లలమర్రి (1999) *తెలుగులో భక్తికవిత్వం సామాజిక విశ్లేషణ*. స్వీయ ప్రచురణలు, హైదరాబాద్.

34) రాములు, బి.యస్. (1998) కథలబడి, *కథా సాహిత్య అలంకార శాస్త్రం*. విశాల సాహిత్య అకాడమి, జగిత్యాల, కరీంనగర్.

35) రాములు, బి.ఎస్. (2003) *50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు* - విశాల కరీంనగర్ సాహిత్య అకాడమి.

36) రాములు, బి.యస్. (2008). *తెలంగాణ కథకులు కథనరీతులు* సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

37) రాములు, బి.యస్. తెలంగాణ ఉద్యమంలో నక్సలైట్ల పాత్ర తెలంగాణ రాష్ట్ర కళాకారుల రచయితల మేధావుల ఐఖ్యవేదిక, హైదరాబాద్.

38) లక్ష్మీకాంతం, పింగళి (1986) సాహిత్య శిల్ప సమీక్ష - విజయవాడ గంగాధర్ పబ్లికేషన్స్.

39) లక్ష్మీనారాయణ గంగిశెట్టి (2002). *పర్వ*, సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ.

40) లక్ష్మీరంజనం, ఖండవల్లి *ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి*. బాలసరస్వతీ బుక్ డిపో. మద్రాసు.

41) వరవరరావు (2007) *తెలంగాణ వ్యాసాలు*, స్వేచ్ఛా సాహితి, హైదరాబాద్.

42) వరవరరావు (2007) *తెలంగాణ విమోచనోద్యమం, తెలుగు నవల. సమాజ సాహిత్య సంబంధాలు - ఒక విశ్లేషణ* - స్వేచ్ఛా సాహితి, హైదరాబాద్.

43) వీరభద్రయ్య, ముదిగొండ (1998) *సాహిత్య విమర్శ సూత్రం అన్వయం*, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ.

44) వీరభద్రయ్య, ముదిగొండ (2000) *నవల నవలా విమర్శకులు*, మూసీ ప్రచురణలు, హైదరాబాద్.

45) వెంకటేశ్వరరెడ్డి, అన్నపరెడ్డి (2000) *అస్తిత్వవాదం* - పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ.

46) వెంకటసుబ్బయ్య వల్లంపాటి (2000) *కథాశిల్పం*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

47) శివశంకర్, పాపినేని (1996) *సాహిత్యం మౌలిక భావనలు*, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ.

48) శిలాలోలిత 2006. *కవయిత్రుల కవితామార్గం. కవయిత్రుల కవిత్వం* పరిశీలన సిద్ధాంత గ్రంథం (1980-90) సాహితీ స్రవంతి, హైదరాబాద్.

49) శ్రీనివాస్ సంగిశెట్టి (2004) *దస్త్రమ్ తొలి తరం తెలంగాణ కథల సూచి* 1910-1956 కవిలె, పబ్లికేషన్స్.

50) శ్రీనివాసరావు, శ్రీరంగం. (2001) *మహాప్రస్థానం.* విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

51) శ్రీరంగస్వామి, టి. (2006) తెలంగాణ సాహిత్య స్వరూపాలు ప్రజాహిత ప్రచురణలు, వరంగల్.

52) శ్రీరామమూర్తి కోడాలి (2008) మామంచి తెలుగు కథ కథా పరిచయ వ్యాసాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

53) షమీఉల్లా (2005) *మైనారిటీ కవిత్వం - తాత్త్విక నేపథ్యం* మొహరున్నిసా ప్రచురణలు, హిందూపురం.

54) సంపత్కుమారాచార్య, కోవెల (1981) *ఆధునిక సాహిత్య విమర్శ సాంప్రదాయక రీతి.* దక్షిణ భారత ప్రెస్. హైదరాబాద్.

55) సత్యనారాయణ, ఎస్వీ (2000) *దళితవాద వివాదాలు*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

56) సరోజినీ రేగాని, (2002) *నిజాం- బ్రిటిష్ సంబంధాలు* (1724-1857). మీడియా హౌస్ పబ్లికేషన్స్ హైదరాబాద్.

57) సదాశివ, ఎస్. (2005) *యాది*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

58) సత్యనారాయణ ఎస్వీ (2008) *తెలంగాణ విమోచనోద్యమం సాహిత్యం* - అరసం, హైదరాబాద్.

59) సత్యవాణి, జె.వి. (2009). *తెలుగు-తమిళ కదంబం.* తెలుగు భాషా మండలి, విజయవాడ.

60) సీతారాం (2007) *అదే పుట*, ప్లస్ వే పబ్లికేషన్స్, ఖమ్మం.

61) సుజాతారెడ్డి ముదిగంటి (2005) *ముద్దెర తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ వాద సాహిత్య విమర్శ వ్యాసాలు*, రోహణమ్ పబ్లికేషన్స్, హైదరాబాద్.

62) సుబ్రహ్మణ్యం, జి.వి. (2005) సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.

63) సుందరయ్య పుచ్చలపల్లి (2006) *వీర తెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు* సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్.

64) సోమన, పాల్కురికి (1969). *బసవపురాణం* (సం.) సుబ్రహ్మణ్యం. జి.వి. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

65) సోమన, పాల్కురికి (1990). *పండితారాధ్య చరిత్ర* (సం.) నారాయణరావు, చిలుకూరి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

66) హనుమంతరావు, బి.యస్. (2000). ఆంధ్రుల చరిత్ర విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

सा विद्या या विमुक्तये